# శ్రీ వేంకటేశ్వర వైభవము

(శ్రుతి స్మృతి పురాణేతిహాసాది సిద్ధము)

కీ.శే. పణ్డిత వేదాన్తం జగన్నాథాచార్యులు



తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# శ్రీ వేంకటేశ్వర వైభవము

(శ్రుతి స్మృతి పురాణేతిహాసాది సిద్ధము)


రచయిత

న్యాయరత్నాకరాద్యనేక బిరుదభూషితులు
తిరుమల తిరుపతి దేవస్థానముల పూర్వ ఆస్థాన పణ్డితులు
తర్కవేదాన్త మహావిద్వాన్

**కీ.శే. పణ్డిత వేదాన్తం జగన్నాథాచార్యులు**



ప్రచురణ

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

**2008**

# SRI VENKATESWARA VAIBHAVAM

*By*

**PANDITHA VEDANTAM JAGANNATHACHARYULU**

*T.T.D. Religious Publications Series No : 229*
© *All Rights Reserved*

Second Edition : 1999

Reprint : 2008

Copies : 3000

Price: Rs.40.00

Published by:
K.V. Ramanachary, I.A.S.
Executive Officer
Tirumala Tirupathi Devasthanams,
Tirupathi.

Printed at : Students Offset Printers
Tirupati



శ్రీ పద్మావతీ దేవి అమ్మవారు



శ్రీ పద్మావతీ దేవి అమ్మవారు

# ముందుమాట

కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వరుడు కోరిన వారికె కొంగు బంగారమై విలసిల్లుతున్న భక్తవత్సలుడు. కొండంత స్వామిని కొండంత పత్రితో మనం ఆరాధించలేక పోవచ్చును కాని, యథాశక్తితో ఆ ఆనంద నిలయుని అర్చించి తరించగలుగుతున్నాము. స్వామివారి దివ్య సౌందర్యాన్ని తనివితీర అనుభవిస్తున్న భక్తులకు, తిరుమల ఆలయంలోపల స్వామి వారికి జరుగుతున్న నిత్య నైమిత్తిక ఆరాధనావిశేషాలు కూడ సమగ్రంగా తెలియ వలసి ఉంది. అంతే కాకుండ ఆ కొండలరాయుని పాదాలకు నిత్యాభిషేకం చేస్తున్నట్లు తిరుమలలో ప్రవహిస్తూవున్న పునీత పుణ్య తీర్థాల్ని గురించి కూడా యాత్రికులందరూ తెలుసుకోవలసి ఉంది.

ఈ సత్సంకల్పంతోనే తిరుమల తిరుపతి దేవస్థానముల యాజమాన్యం వారు శ్రీ వేంకటేశ్వరుని నిత్యారాధనా విధానాన్ని, ఉత్సవ విశేషాల్ని, పరిసర పుణ్య తీర్థాల వివరాల్ని పుస్తక రూపంలో అందరికీ అందుబాటులోకి తేవాలని కార్యోన్ముఖులయినారు. దాదాపు రెండు దశాబ్దాల క్రిందటే ఈ బృహత్తర కార్యక్రమాన్ని శ్రీ పణ్డిత వేదాన్తం జగన్నాథాచార్యులవారికి అప్పగించారు. శ్రియఃపతి అర్చా విభవాదుల్ని అత్యంత భక్తి శ్రద్ధలతో సేకరించిన వారి కృషి ఫలితంగానే, తిరుమల తిరుపతి దేవస్థానంవారు 1977వ సంవత్సరంలో "శ్రీ వేంకటేశ్వర వైభవము" అనే గ్రంథాన్ని ప్రచురించారు.

తిరుమల నిలయుని నిత్యారాధనలు, ఉత్సవ విశేషాలు, పురాణ ప్రసిద్ధాలైన పుణ్యతీర్థాల వివరాలు, ఉత్సవాది సమయాలు, ప్రతిదిన సేవా కార్యక్రమాలు, ఆర్జిత సేవా సమాచారాలు - ఇలా ఈ పుస్తకం ఆరు అంశాలుగా విభజింపబడి 1977లో ప్రథమ ముద్రణగా వెలువడింది.

**1999 వ సంవత్సరము ముద్రణలో విషయ సారూప్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఐదవ అంశం అయిన సేవా**

సమయానుక్రమణికలోని ముఖ్యమైనవాటిని -- ఆరవ అంశమైన ఆర్జిత విషయానుక్రమణికతో కలిపి ముద్రించటం జరిగింది. శ్రుతి, స్మృతి పురాణేతిహాసాల ఆధారంతో శాస్త్ర సమ్మతంగా, ఆచార సంప్రదాయ సమన్వితంగా రూపొందిన ఈ అర్చనలు, సేవలు, ఉత్సవాలు మన ఆర్ష సంస్కృతికి పట్టుగొమ్మలు!

తిరుమల క్షేత్రంలో ఎన్నో పుణ్య తీర్థాలున్నాయి. ఆయా పర్వదినాలలో ఆ తీర్థాల తీరాలలో జరుపబడే పర్వోత్సవాలు యాత్రికులకు భక్తిప్రదాలు, ముక్తిదాయకాలు అనడంలో అతిశయోక్తి లేదు.

దేశం నలుమూలలనుండి వచ్చి స్వామివారిని సేవించే భక్తులకు, ఆ అర్చనలలో, ఉత్సవాలలో, తమతమ ఆచారాలు కూడా ప్రతిఫలిస్తూ స్వామి సేవక సంబంధి ఆనందాన్ని ప్రసాదించడం విశేషం. కీర్తిశేషులు జగన్నాథాచార్యుల వారి ఈ కృషి ప్రశంసనీయం.

ధార్మిక గ్రంథప్రచురణను ఒక ఉద్యమంగా చేపట్టిన తిరుమల తిరుపతి దేవస్థానములవారు వెలువరించిన ఈ గ్రంథం సప్తగిరీశుని వైభవాన్ని, తిరుమల క్షేత్ర మాహాత్మ్యాన్ని, పుణ్యతీర్థాల ప్రాశస్త్యాన్ని పఠితలకు విశద పరచడంలో ఒక మార్గదర్శి (టూరిస్ట్ గైడ్) గా కూడా సహకరిస్తుందనడం సమంజసం 1999 లో ప్రచురించిన ప్రతులు చెల్లిపోయిన కారణంగా తిరిగి యధాతధంగా ఇప్పుడు, ఈ గ్రంథన్ని పునర్ముద్రిస్తున్నం. ఈ గ్రంథం ఆర్ష సంస్కృతీ సంపన్న హృదయుల మన్ననలకు పాత్రము కాగలదని ఆశిస్తున్నాను.

కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

**K. Purushotham Naidu, I.A.S.**
COMMISSIONER
ENDOWMENTS DEPARTMENT

UMABAGH, NAMPALLY
HYDERABAD - 500 001
A.P. (INDIA)

Camp: TIRUMALA
Date: 1-7-1977

*Appikatla Sriman Pandita Vedantam Jagannathacharyulu has written a great devotional book ""Sri Venkateswara Vaibhavam."" It contains details of Aradhana, Utsavam and other details of the pujas and festivals of Tirumala Devasthanam. It deserves a place in all libraries and in the hands of every devotee of Lord Venkateswara. Temple libraries should praticularly possess this book both for information and guidance.*

*Appikatla Sriman Panditha Vedantam Jagannatha charyulu is a great scholar in Vedanta, Tarka, Agama, Alankara, Jyothisha Sastras. He has been the Asthana Pandit of T.T.D. Temple of Lord Venkateswara from 1955 upto date. He is an authority on all religious matters and the department refers to him all matters for guidance and enlightenment.*

**(Sd.) K. PURUSHOTHAM NAIDU.**

# అభిప్రాయము

శ్రీ వేంకటేశ్వర వైభవమును పణ్డిత శ్రీ వేదాన్తం జగన్నాథాచార్యుల వారు ఐదంశములతో రచించినారు. వీరు 1955 సంవత్సరము నుంచి తిరుమల తిరుపతి దేవస్థానముల ఆస్థాన పణ్డితులుగా యుంటున్నారు.

చతుశ్శాస్త్ర మహావిద్వాంసులగు వీరిని శ్రీ కల్లూరి చంద్రమౌళిగారు హిందూమత దేవాదాయ ధర్మాదాయశాఖామంత్రిగా యున్నప్పుడు వారి సలహామీదట శ్రీస్వామివారి ఆస్థాన పణ్డితులుగా నియమించడమైనది. అప్పటి నుండి ఇప్పటివరకు వారి సలహాలతో దేవస్థాన పూజాక్రమము, ఇతర శాస్త్రబద్ధమైన కైంకర్యములు అన్నియు జరుపబడుచున్నవి.

వీరు వైఖానసులగుటచే శ్రీస్వామివారి ఆరాధనాక్రమము చక్కగా తెలిసినవారు. వీరి శాస్త్రానుభవము శ్రీస్వామివారి కైంకర్య పరిపూర్ణానుభవము క్రోడీకరించి ఈ వార్ధక్యములో ఈ గ్రంథమును శ్రమయను కొనక రచించినారు.

ఆనాడు శ్రీస్వామివారి సన్నిధిలో ఆస్థాన పణ్డిత పదవీస్వీకారమును చేయించి శేషవస్త్రబహుమానమును చేయు అవకాశము నాకు కలిగినది. ఈనాడు శ్రీ వేంకటేశ్వరవైభవమునకు అభిప్రాయమును వ్రాయు అవకాశము నాకు కలిగినందులకు ఎంతో సంతోషించుచున్నాను.

ఈ పుస్తకములోని అంశములు:

1. నిత్యారాధనము - ఆరాధనకాలము, సర్వదర్శనకాలమగు అతిరిక్తకాలము అని యున్న వివిధకాలములలో శ్రీ వేంకటేశ్వరస్వామివారికి జరుగు ఆరాధనాది వివరణములీ మొదటి అంశమున కలవు.

2. ఉత్సవములు - భక్తుల సౌకర్యార్థమై శ్రీ స్వామివారి ఉత్సవములు అనేక విధములుగా దేవస్థానం వారు జరిపించుచున్నారు. వాటి వివరములు రెండవ అంశమున కలవు.

3. పుణ్యతీర్థవములు - తిరుమలలో ఎన్ని పుణ్యతీర్థవములు కలవో అందు ముఖ్యములగు పుణ్యతీర్థములు మూడవ యంశమున వ్రాయబడినవి.

4. ఉత్సవాది సమయములు - తిరుపతి ద్రావిడులకు, ఆంధ్రులకు సరిహద్దున యుండుటచే ఈ దేవాలయములో ద్రావిడ దేశాచారములు, ఆంధ్రదేశాచారములు కూడా కలవు. ఉత్సవములు, పండుగలు కొన్ని సౌరమానప్రకారము, కొన్ని చాంద్రమానప్రకారము, కొన్ని పూర్వాచార ప్రకారము జరుగుచున్నవి. ఆ విషయములన్నియు ఎంతో శ్రమించి శాస్త్రాధారములతో నాలుగవ యంశమునందు వ్రాసినారు. ఇందులోని విషయములు ఇతర దేవాలయములలో కూడా ప్రామాణ్యముగా తీసుకొనదగియున్నవి.

5. ఆర్జితములు - లక్ష్మీపతియగు శ్రీ స్వామివారికి యాత్రికులు - ప్రార్థనలను, కానుకలను పత్రపుష్పాది న్యాయముగా వారి వారి

శక్తిననుసరించి సమర్పించుటకు దేవస్థానం వారు ఏర్పాటు చేసిన సౌకర్యములు ఐదవ అంశములో వ్రాయబడియున్నవి.

ఈ గ్రంథకర్తలగు శ్రీ ఆచార్యులవారు ఇంకా చిరకాలము శ్రీస్వామివారి కైంకర్యములను చేయవలయునని ఆశిస్తున్నాను.

తిరుపతి
29-3-1977

డా॥ చెలికాని అన్నారావు
తి.తి. దేవస్థాన పరిపాలక సంఘ అధ్యక్షులు

# ఆవిష్కరణము

''వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తికించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి॥''

అండ పిండ బ్రహ్మాండాది రూపమైన ఈ సమస్త చరాచర జగత్తులో వేంకటాచలపతిని మించిన దైవము కానీ, వేంకటనగమును మించిన పుణ్య క్షేత్రము కానీ లేదని పురాణ ప్రశస్తి. భృగుమునివలని అవమానము, కమలాలయతో కలహము కారణములుగ, స్వామి పుష్కరిణీ తీరమున నవతరించి కలిలోని జనులను కావ సమకట్టిన ఆ ఆదినారాయణుని నిత్యకల్యాణ నిలయమునకు ఈ ప్రశస్తి వచ్చుట వింత కాదు.

తిరుమలను గురించి, తిరువేంకటాధీశుని గురించి విన్న వారెందరో వుండవచ్చును కానీ, ఆలయపు ఆచార వ్యవహారములుగాని, ఆలయ మున కావలనున్న అపూర్వ రమణీయములు, అతి ప్రశాంత గంభీర ములు, పరమ పావనములైన తీర్థములను గురించిగాని పూర్తిగా తెలిసిన వారు ఈనాడు ఏ కొందరో.

అడుగడుగుకు దండవములు పెట్టి, కొండకొమ్మున నున్న కోనేటిరాయని దర్శనముకై, తీరని తమకంతో మూలమూలల నుండి

వచ్చు వేలాది భక్తులకు, ఆలయ సంప్రదాయములు, ఆ శ్రీనివాసుని సేవలు, పూత పుణ్యక్షేత్ర వివరములు తెలియజెప్పే ప్రయత్నమే యిది.

మా అభ్యర్థనపై, వయోవృద్ధులైనను ఈ పవిత్ర కార్యక్రమమును చేపట్టి విజయవంతముగ నిర్వహించినవారు తిరుమలేశుని ఆస్థాన పండితులు శ్రీమాన్ పణ్డిత వేదాన్తం జగన్నాథాచార్యులవారు. సంస్కృతాంధ్ర భాషలలోనేగాక, వివిధములగు శాస్త్రములలోను, ఆగమములలోను కడుంగడు నిష్ణాతులైన వీరు దీర్ఘకాల పరిశోధనా ఫలితంగా సమర్పించిన భక్తి కుసుమాంజలియే ఈ ''శ్రీ వేంకటేశ్వర వైభవము''

వర్ణనలేగాక చిత్రవివరములుకూడ కల ఈ గ్రంథమును ఎందరెంత ఎక్కువగా ఆదరించగల్గిన మా కంతటి అదృష్టము.

పి. యస్. రాజగోపాలరాజు
ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు
తి.తి. దేవస్థానములు, తిరుపతి

తిరుపతి
28-4-1977



గ్రంథకర్త:

న్యాయరత్నాకరాద్యనేక బిరుదభూషితులగు తర్కవేదాన్త మహావిద్వాన్

శ్రీ పణ్డిత వేదాన్తం జగన్నాథాచార్యులవారు

తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన పణ్డితులు

# గ్రంథకర్త పరిచయము

పండిత శ్రీ వేదాన్తం జగన్నాథాచార్యులవారు 1955 సం॥ నుండి తిరుమల తిరుపతి దేవస్థాన ఆస్థానపండితులుగా ఉన్నారు. వీరి స్వగ్రామం గుంటూరు జిల్లాలోని అప్పికట్ల. జననం: 21-6-1894. వీరు బాల్యముననే కావ్యనాటకాలంకార సాహిత్యములను చదివి, తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర సంస్కృత కళాశాలలో ఆగమ, ధర్మ, పూర్వమీమాంసా శాస్త్రములను అభ్యసించి ఉత్తీర్ణులైనారు. ఇంతేగాక పిఠాపురం మహారాజావారి శాస్త్రకళాశాలలో తర్కవేదాంత శాస్త్రములను పూర్ణముగా చదివి మహావిద్వత్పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై సన్మానములను పొందినారు. సుమారు 20 సంవత్సరములు అక్కడ సంస్థాన పండితులుగా సన్మానములందినారు. తుని మొదలగు మహారాజ సంస్థానములందును పండిత సభలలోను పెక్కు సన్మానములు, యోగ్యతాపత్రములు, సువర్ణపతకములు పొందినవారు.

శ్రీ వైఖానస కల్పసూత్రమును పరిష్కరించుటయేగాక, కొన్ని వేదాంత గ్రంథములను గూడ రచించినారు.

శ్రీ జగన్నాథాచార్యులవారు నిరాడంబర జీవులు. శాస్త్ర ప్రామాణ్యమును నిర్భయముగా, నిర్దుష్టముగా చెప్పగల ధీశాలి. తిరుమల తిరుపతి దేవస్థానముల పరిపాలనాధికారులకు వైదిక

విషయములలో శాస్త్రానుసారము సలహాలనిచ్చుచూ, దేవాలయ పురోభివృద్ధికి తోడ్పడుచున్నారు.

ఇంతేగాక, వీరు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మతసలహా సంఘంలో సభ్యులుగాను, అర్చకపరీక్షా సంఘసభ్యులుగా నున్నారు.

1924వ సంవత్సరము నందు మచిలీపట్టణమున విద్యాభివృద్ధికై యేర్పరచిన శ్రీ వైఖానస విద్యాపీఠమునకు అధ్యక్షులుగా నున్నారు.

1928వ సంవత్సరములో వైఖానస సంఘాభ్యుదయమున్కై ఏలూరు పట్టణమునందు జరిగిన శ్రీ వైఖానస దివ్యసిద్ధాంత వివర్ధినీసభకు అధ్యక్షత వహించారు.

1929 సంవత్సరంలో పండిత మదనమోహనమాలవ్యా అభినంద నలతో, పిఠాపురం మహారాజావారిచే తమ సంస్థానమునందు ఏర్పాటు చేయబడిన వేదాంత మహాసభలో విశిష్టాద్వైత వేదాంతపండితులుగా పాల్గొని ప్రశంసలందినారు.

వీరికిగల వివిధ విద్యాయోగ్యతలను పురస్కరించుకొని గోవర్ధన పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకరాచార్యస్వామివారు 1950 సంవత్సరంలో ''విద్యాభూషణ'' బిరుదుతో సత్కరించారు.

కంచి కామకోటి పీఠాధి పతి జగద్గురు శ్రీశ్రీశ్రీ శంకరాచార్య స్వామి వారిచే 1966లో తిరుపతిలో జరిగిన పండితపరిషత్తులో ''న్యాయ రత్నాకర'' బిరుదును, అష్టలక్ష్మియుత స్వర్ణకంకణమును పొందినారు.

వీరు సంస్కృతాంధ్రభాషలలో అనర్గళ పాండిత్యమేగాక వ్యాకరణ, జ్యోతిషాది వివిధశాస్త్రాలలో గూడ అపారవైదుష్యాన్ని సంపాదించు

కొన్నారు. శ్రీస్వామివారి దేవస్థానములోని వివిధ వైష్ణవ దేవాలయములలో వివిధ ఉత్సవములు, వివిధ ప్రతిష్ఠాకార్యక్రమాదులు అన్నియు వీరి సలహా ననుసరించియే జరుగుచున్నవి.

అమెరికాలోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయము మొదలగు దేవాలయములకు కూడా అవసరమగు సలహాలను అధికారుల ద్వారా అందచేయుచున్నారు.

1955 నుండి 1986 వరకు మూడు దశాబ్దాలపాటు తిరుమల తిరుపతి దేవస్థానముల వైఖానస ఆగమశాస్త్ర ఆస్థాన పండితులుగా తిరుమల తిరుపతి దేవస్థానముల పంచాంగ పరిష్కర్తలుగా వ్యవహరించారు. పలు సందర్భాలలో తిరుమల తిరుపతి దేవస్థానం వీరిని ఘనంగా సత్కరించింది. వీరు 19-4-1986వ తేదీన స్వర్గస్థులయ్యారు.



శ్రీ వేంకటేశ్వరస్వామి వారి పవిత్రోత్సవః



శ్రీ వేంకటేశ్వరస్వామి ద్వజారోహణం

ఓమ్

శ్రియై నమః

శ్రీ శ్రీనివాసాయ నమః

# శ్రీ వేంకటేశ్వర వైభవ

## పీఠిక

ఓమ్॥ వేదాన్తనిలయ శ్రీమాన్ కల్యాణగుణసాగరః।
భక్తప్రియో జగన్నాథ శ్రీనివాసోఽస్తు మే హృది॥

అఖిల చరాచర సృష్టి స్థితి లయ కర్తయై ముముక్షూపాస్యుడై మోక్ష ప్రదుడై శ్రియఃపతియైన శ్రీమన్నారాయణుడు త్రిపాద్విభూతి యనంబడు నిత్యవిభూతియందుగల శ్రీ వైకుంఠమునందు శేషతల్పమున శయనించి అచ్చుట నిత్య ముక్త చేతనులను అవాఙ్మానస గోచరమగు నిత్యానంద పరీవాహమున ముంచివైచుచుండెను.

దయాసముద్రుడగుటచేత ఏకపాద్విభూతి యనంబడు ఈ లీలావిభూతియందుగల సంసారబద్ధచేతనులను గూడా నుద్ధరింప సంకల్పించెను.

అందుచే కర్మభూమియగు నీ భారతదేశమునందు అంజనాద్రి, నీలాద్రి, వృషాద్రి, వృషభాద్రి, శేషాద్రి, గరుడాద్రి, వరాహాద్రి, శ్రీనివాసాద్రి, తీర్థాద్రి, కనకాద్రి, పుష్కరాద్రి, సుమేరుశిఖరాద్రి, వేదాద్రి, జ్ఞానాద్రి, ఆనన్దాద్రి, ఇత్యాద్యనేక సార్థక నామములచే పురాణ ప్రఖ్యాతికాంచిన వేంకటాద్రియందు ఇరువది యెనిమిదవ ద్వాపరయుగాన్తమునందలి ఈ కలియుగమునందు

''ప్రవః పాన్త మన్ధసో ధియాయతే।
మహే శూరాయ విష్ణవే చార్చత॥''

(ఋ.10 మండలం, 155వ సూక్తము, 1-వ మంత్రము).

అను ఋగ్వేదమంత్రముచే ప్రతిపాదింపబడు విష్ణ్వర్చావతారముగా నవతరించెను.

''విష్ణుః పర్వతానా మధిపతిః'' ఇత్యాది

శ్రుతివచనముచే పర్వతసామాన్యమున కాధిపత్యమును పొందిన విష్ణువు ఈ వేంకటాద్రికి విశేషాధిపత్యమును కూడా పొందుటచేత ''శ్రీ వేంకటేశ్వరస్వామి'' అనియు, వక్షస్థలమున లక్ష్మి ప్రకాశించు చుండుటచేత ''శ్రీనివాసస్వామి'' అనియు, మహర్ష్యాదులచేత కీర్తింప బడుచు ప్రకాశించుచున్నాడు.

శ్రీ వేంకటాద్రిని గూర్చియు, శ్రీనివాసస్వామివారిని గూర్చియు, ఋగ్వేదము ఇట్లు చెప్పుచున్నది.

★ అరాయి కాణే వికటే గిరిం గచ్ఛ సదాన్వే।

---

★ అస్యమంత్రస్యాఽయమర్థః॥ అవతారికా – వేదపురుషః పురుషార్థకాముక ముద్దిశ్య హిత ముపదిశతి॥

హే పురుషార్థకాముక అత్ర సందర్భానురోధేన త్వయి ఇత్యధ్యాహారః। తథా చత్వయి। అరాయిసతి = రైశబ్దో ఐశ్వర్యవాచీ ఐహికైశ్వర్యరహితే వా। ఆముష్మికైశ్వర్య రహితే వా సతి। కాణే = బాహ్యదృష్టి శూన్యే వా, అంతరదృష్టి శూన్యేవా సతి। వికటే = విశిష్ట తాపత్రయశాలిని సతి॥ ''సర్వపాపాని వేం ప్రాహుః కటస్తద్దాహ ఉచ్యతే'' ఇతి వేంక టపదనిర్వచనానురోధేన కటశబ్దస్య దాహపరత్వాదయమేవార్థః॥ సదాన్వే = దానవ శబ్దస్య దాన్వే ఇతి వ్యత్యయ శ్ఛాందసః। ఐహిక పురుషార్థవిరోధి భిర్వా, ఆముష్మికపురుషార్థ విరోధి భిర్వా, సహితే సతి। శిరింబిఠస్య = శ్రీ పీఠస్య శ్రీనివాసస్యేతి యావత్, వ్యత్యయ శ్ఛాందసః। గిరిం = వేంకటాచలం। గచ్ఛ = ఉక్తసర్వానర్థపరిహారాయగచ్ఛేత్యర్థః॥

తత్ర గమనమాత్రేణ కథం తత్పరిహారః ఇత్యాంశంకాయా మాహ॥

శిరింబిఠస్య = శ్రీనివాసస్య। సత్వభిః = పురుషైః సర్వోపచారక్రియానిరతైః సదా సన్నిధా నవర్తిభి రేకాన్తిభి రంతరంగపురుషైరితి యావత్। శిరింబిఠ స్యేత్యుభయత్రాన్వయః। సత్వభి రితివ్యత్యయశ్ఛాందసః। తేభిః = తైః తథా త్వేన లోకశాస్త్రయోః ప్రసిద్ధైరిత్యర్థః। అత్రాపి వ్యత్యయశ్ఛాందసః। త్వా = త్వాం। చాతయామసి = అనిష్టనివారణం యాచన్తం కారయా మః। భగవతశ్శ్రీనివాసస్యసన్నిధౌ సర్వోపచారక్రియానిరతైస్సదాసన్నిధానవర్తిభి రేకాన్తిభి రంతరంగపురుషైస్తదీయైరనిష్ట నివారణప్రార్థనాం కారయితుమిచ్ఛామ ఇతియావత్॥

''శిరింబిఠస్య సత్వభి స్తేభిష్ట్వా చాతయామసి॥''

(ఋగ్వేదము 10 మండలము, 15 సూక్తము, 1-వ మంత్రము)

తా॥ ఓ పురుషార్థకాముకుడా! నీవు ఐహికమగు ఐశ్వర్యములేని వాడవైనా, ఆముష్మికమగు ఐశ్వర్యములేనివాడవైనా, బాహ్య దృష్టిలేని వాడవైనా, అంతరదృష్టిలేనివాడవైనా, ఆధ్యాత్మికములు, అధిభౌతిక ములు, అధి దైవికములు అగు తాపములు కలవాడవైనా, ఐహిక పురు షార్థవిరోధులు కలవాడవైనా, ఆముష్మికపురుషార్థవిరోధులు కలవాడవైనా, శ్రీనివాసస్వామివారు నివసించియున్న పర్వతమునకు వెళ్ళి అచ్చట శ్రీని వాసస్వామి వారియొక్క సన్నిధానమునందు సర్వోపచార క్రియానిరతులై

---

అత్ర సాంసారిక ప్రవాహసమాపతితాऽనిష్ట నివారణకాముకాః పురుషాః శ్రీ వేంక టాచలం గత్వా తన్నివాసరసికస్య భగవత శ్రీనివాసస్య సన్నిధౌ సర్వోపచారక్రియానిర తాన్ సదా సన్నిధానవర్తిన శ్చైకాన్తినోऽన్తరంగపురుషాన్ తదీయాన్ ''భగవత శ్రీనివాసస్య సన్నిధౌ మదీయాऽనిష్టనివారణప్రార్థనాం శ్రావయత'' ఇతి ప్రార్థయన్తే। తే చ మహా భాగాః తథా తస్య భగవత శ్రీనివాసస్య సన్నిధౌ ఏకాన్త సేవాద్యవసరే త్వాపన్నానామా పత్తి నివారణ ప్రార్థనాం శ్రావయన్తే॥ స చ పరమదయాళు ర్భగవాన్ అంతరంగ పురుష ముఖాత్తాం శ్రుత్వా అనిష్టనివారణం భక్తానామనుపదమేవ కరోతీతి సంప్రదాయః॥

అత్ర త్వం వేంకటాచలం గత్వా భగవన్తం తదీయానారాధకమహాభాగాన్ ద్వారీ కృత్య అనిష్ట నివారణం యాచేతి విధి ర్వివక్షితః। చతే చదే = యాచనే ఇతి ధాతుః.

అత్ర - అరాయి కాణే వికటే గిరిం గచ్ఛేతి తం విదుః।

ఏవం వేదమయ స్సాక్షాద్గిరీంద్రః - వన్నగాచలః॥

ఇతి భవిష్యోత్తరపురాణాన్తర్గత వేంకటాచలమాహాత్మ్య ప్రతిపాదనపరో భాగః।

''అయం మంత్రః వేంకటాచలపరః'' ఇత్యుపబృంహయతి॥

శ్లో॥ ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్।

బిభేత్యల్పశ్రుతా ద్వేదో మామయం ప్రతరిష్యతి॥

ఇతి మనుశాసనా న్మాత్రార్గళ గ్రంథః॥

అత స్తన్నివాసరసికస్య భగవత శ్రీనివాసస్య అర్చావతారం ప్రాప్తస్య॥ మహిమ ప్రతి పాదనపర ఏవాయం మంత్ర ఇతి సుస్పష్ట మవసీయతే॥

యున్న తదీయులద్వారా శ్రీ స్వామివారిని నీ అనిష్ట నివారణమును గూర్చి యాచించవలసినది.

వెంటనే ఆ వేంకటాద్రిపతియగు శ్రీనివాసస్వామివారు నీ అనిష్టము లను తొలగించి నీ అభీష్టములను సమకూర్చెదరు.

ఇంతియేకాక వేదోపబృంహణమగు భవిష్యోత్తరపురాణమువలన ఈ వేంకటాచలమునకు, శ్రీనివాసాద్రి, వేదాద్రి, శేషాద్రి అను నామములు కూడా తెలియవచ్చుచున్నవి. అనుభూయమానమైన శ్రీ స్వామివారియొక్క ప్రభూతమైన మహత్త్వమున్నూ తెలియవచ్చుచున్నది. ఇందువలననే బ్రహ్మాండపురాణము, స్కాందపురాణము,

''వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి॥''

తా॥ బ్రహ్మాండమునందు వేంకట్రాదితో సమానమైన స్థానము లేదు. వేంకటేశ్వరునితో సమానమైన దేవుడు (అవతారము) పూర్వకాలము నందులేడు. రాగల కాలమునందును ఉండబోడు అని చెప్పుచున్నవి.

కనుకనే అర్చావతారమునన్ను శ్రీస్వామి వారు పూర్వయుగముల యందలి రామకృష్ణావతారములవలె, ధర్మాచరణమును తత్త్వప్రబోధము మొదలగు కార్యములను చేయక మౌనము నాశ్రయించి దక్షిణహస్తముచేత తమ పాదాబ్జములను శ్రీకృష్ణావతార చరమసందేశంలోని శరణవరణ స్థాన మునుగా చూపుచూ, కటియందుగల మరియొక హస్తముచేత నిజ పాదాబ్జగాములగు వారలకు సంసార సముద్రము కటిదఘ్నము (కటి లోతు) అగునని చూపుచూ, వారు

''సోఽధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః పరమం పదం''

(కఠోపనిషత్ 3వల్లీ 7 మంత్రం)

అను శ్రుత్యుక్తమైన సంసారపదవీపారమగు శ్రీ వైష్ణవపదమును బడయగలరు అని సూచించుచున్నారు.

మరియు సర్వమును చూచుచు చూడనివారివలెయుండి నిగ్రహాను గ్రహములను చేయుచున్నారు. ఆశ్రితప్రార్థనానుసారముగా త్రివర్గరూపము లగు ధర్మ, అర్థ, కామములను వరములుగా నిచ్చుచున్నారు. సంసార బద్ధజీవులను అతిసౌలభ్యముగా తన సన్నిధానమునకు రప్పించుకొను చున్నారు. ఇష్టార్థసిద్ధియగుటచేత సంతృప్తులగు నా యాశ్రితులర్పించు కానుకలను స్వీకరించుచున్నారు. వారలకు మాయావిమోచకములగు తీర్థ ప్రసాదములను తమ యంతరంగపురుషులచేత నందచేయుచు వారలను చరమపురుషార్థకాంక్షావశులనుగా చేయుచున్నారు.

ఇటుల సర్వశక్తులను ప్రత్యక్షముగా చూపుచూ సూచించుచూ శ్రీ వేంకటాద్రియందు వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారు స్వయం వ్యక్తమగు అర్చావతారముగ తెలియవలసియున్నది.

అర్చావతారము అనగా:- పరమేశ్వరుడు లోకానుగ్రహార్థమై ఐదు ప్రకారములుగా నున్నాడు. 1. పరస్వరూపము, 2. వ్యూహస్వరూపము, 3. విభవస్వరూపము, 4. అన్తర్యామిస్వరూపము, 5. అర్చాస్వరూపము అని శాస్త్రములు చెప్పుచున్నవి.

1. పరస్వరూపము: అనగా నిత్యవిభూతి యందుగల శ్రీ వైకుంఠ మునందు మహామణిమండపమున విశాలజ్ఞానముగల అనంత గరుడ విష్వక్సేనాది నిత్యసూరులచేతను, లీలావిభూతినుండి భక్తి ప్రపత్త్యాద్యుపాయములచేత బ్రహ్మపథమున నిత్యవిభూతిని ప్రవేశించిన ముక్త పురుషులచేతను, అనుభవింపబడుచు శేషపర్యంకమునందు దివ్య మంగళ విగ్రహవిశిష్టుడై శ్రీ భూదేవులతో వేంచేసియుండు స్వరూపము.

2. వ్యూహస్వరూపము:- అనగా లీలావిభూతికి సంబంధించిన సృష్టిస్థితి సంహారములను నిర్వహించుటకును, ముముక్షువులగు ఉపాసక జీవకోటి ననుగ్రహించుటకును వేంచేసియుండు స్వరూపము. ఈ వ్యూహస్వరూపము విష్ణు, పురుష, సత్య, అచ్యుత, అనిరుద్ధరూపములచే అయిదు విధములుగా నున్నదని వైఖానసశాస్త్రము చెప్పుచున్నది.

''ఈ వ్యూహమూర్తులు - పురుష, సత్య, అచ్యుత, అనిరుద్ధ మూర్తులుగా నున్నారని వైఖానసవేత్తలు వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధమూర్తులుగా నున్నారని పాంచరాత్రవేత్తలు చెప్పుచు న్నారు. ఉభయమతములలోను సంజ్ఞాభేదమేగాని అర్థభేదములేదు'' అని మహాభారతము చెప్పుచున్నది.

3. విభవస్వరూపము:- అనగా సాధుపరిత్రాణమును, దుష్టశిక్షణ మును, ధర్మసంస్థాపనమును కావించి లోకము ననుగ్రహించు రామ కృష్ణాది స్వరూపము.

4. అన్తర్యామిస్వరూపము:- అనగా జ్ఞానగోచరుడై అన్తర్నియంతయై హృదయకమలకోశాన్తర్వర్తి సుషిరమధ్యగత వైశ్వానరభాస్వరతనుపీతశిఖా మధ్య విద్యోతమానమగు స్వరూపము.

5. అర్చాస్వరూపము:- అనగా ఆశ్రితుల కభిమతమగు ద్రవ్యముల యందావిర్భవించి విభవస్వరూపవైలక్షణ్యముగ దేశ కాలాదినియమములేక సర్వసహిష్ణువై అర్చకపరాధీనుడై ఆలయగృహాదులయందు వేంచేసి యుండు స్వరూపము.

పరమేశ్వరుడు సర్వకళ్యాణగుణములు కలవాడై యున్నను ఆశ్రితుల ఆశ్రయణమునకు సౌకర్యమును కలుగజేయు కళ్యాణగుణములు వాత్సల్యము, సౌశీల్యము, స్వామిత్వము, సౌలభ్యము అను నాలుగు గుణములై యున్నవి. అందులో ఆశ్రితుల ఆశ్రయణమునకు సౌలభ్యము

మొదటిదై కార్యసిద్ధికి పునాదుగా నున్నది. అట్టి అవసరమైన సౌలభ్యము పూర్వము చెప్పిన నాలుగు ప్రాకారములగు పర, వ్యూహ, విభవ, అన్తర్యామి స్వరూపములయందు దేశవిప్రకర్షచేతను, కాలవిప్రకర్షచేతను, ఇంద్రియవిప్రకర్షచేతను లేకయున్నది.

అటుల నాలుగు ప్రకారములయందు లేని సౌలభ్యము అయిదవది యగు అర్చావతారమునందు గిరి నగర గ్రామ గృహాదులయందధి వసించియుండు కారణముచేత అడ్డులేక పరిపూర్ణముగా నున్నది.

''అర్చావతార స్సర్వేషాం బాంధవో బంధువత్సలః'' అనుప్రమాణము అర్చావతారః (జగత్స్వామి అవతారము) అని స్వామిత్వమును, సర్వేషాం బాంధవః (తరతమ భావములేక అందరికి బంధువు) అని సౌశీల్యమును, బంధువత్సలః (బంధువులయందు వాత్సల్యము కలవాడు) అని వాత్సల్యమును చెప్పుచున్నది. భగవంతునికి బంధువనగా భగవత్తీర్థ ప్రసాదముల ననుదినము అనుభవించుచు ఆశ్రయించియుండువాడు అని యజుర్వేద బ్రాహ్మణము చెప్పుచున్నది.

''తదస్య ప్రియ మభి పాథో అశ్యా
న్నరో యత్రదేవయవో మదన్తి
ఉరుక్రమస్య స హి బన్ధురిత్థా
విష్ణోః పదే పరమే మధ్వ ఉత్సః''

(2-4-6-3 మన్త్రః)

తా॥ దేవారాధకులు ఏ భగవత్తీర్థ ప్రసాదములయందు సంతుష్టులగు

---

అస్యా శ్శ్రుతే రయమర్థః॥ అస్య= విష్ణోః; ప్రియం తత్పాథః = తన్నివేదితమన్నాదికం, అభ్యశ్యాం దేవయవః = దేవారాధకాః, నరః = మానవాః, యత్రమదన్తి = యస్మిన్ని వేదితేహృష్యన్తి॥ నివేదితం తీర్థప్రసాదాదికం స్వీకృత్యహృష్టాభవన్తీ త్యర్థః॥ ఇత్థా = ఇత్థం ప్రతి దినం వర్తమానః। ఉరుక్రమస్య = విష్ణోః। బన్ధుః స ఏవ అతీవ అభిమతః। పరమే= పరమోత్కృష్టే, మధ్వే = మధువద్భోగ్యతమే విష్ణోః పదే, ఉత్సః = ఉత్సుకోభవతీత్యర్థః.

చున్నారో ఆ భగవత్తీర్థ ప్రసాదములను అనుదినము అనుభవించుచు భగవంతుని ఆశ్రయించి యుండువాడు భగవంతునకు బంధు వగుచున్నాడు. పరమపదమునం దాసక్తి కలవాడగుచున్నాడు.

అందుచే ఆశ్రితులు పరమేశ్వరుడు నాశ్రయించుటకు వలయు కళ్యాణగుణములన్నియు అర్చావతారమున ప్రకాశించుచున్నవి.

మరియు అర్చావతారమున వేంచేసియున్న పరమేశ్వరుడు అజ్ఞునివలె, అశక్తునివలె, అపూర్ణునివలె, అధీ నునివలెకనుపించుచున్నాడు కాని సర్వ జ్ఞుడు, సర్వశక్తుడు, అవాప్తసమస్తకాముడు, నిరుపాధి క సర్వశేషియగు టవలన నిరవధి క కారుణ్య ప్రవాహముచేత ఆశ్రితులకు యథాధి కారముగ నేత్ర, పుత్ర, కళత్ర, క్షేత్రాది మోక్షపర్యంతములగు సమస్త వాంఛి తములను ఇచ్చుచున్నాడు.

ఈ అర్చాస్వరూపము 1. స్వయంవ్యక్తము, 2. దివ్యము, 3. సైద్ధము, 4. మానుషము అను నాలుగు తెరంగులుగా నున్నది.

1. స్వయంవ్యక్తము:- అనగా స్వయముగా వ్యక్తీభవించిన అర్చా స్వరూపము.

2. దివ్యము:- అనగా దేవతలచేత ప్రతిష్ఠింపబడిన అర్చాస్వరూపము.

3. సైద్ధము:- అనగా యోగసంసిద్ధులచేత ప్రతిష్ఠింపబడిన అర్చా స్వరూపము. ఈ స్వరూపములు పురాణాదులయందు తెలియదగి యున్నవి.

4. మానుషము:- అనగా మనుష్యులచే ప్రతిష్ఠింపబడిన అర్చా స్వరూపము. స్పష్టము.

ఆర్షము:- మహర్షులచేత ప్రతిష్ఠింపబడిన అర్చాస్వరూపము

అయిదవదిగా నున్నదని కొందఱు, పూర్వోక్తములలోనే అన్తర్భావమని కొందఱు అభిప్రాయపడుచున్నారు.

ఈ అర్చాస్వరూపములలో స్వయంవ్యక్తార్చాస్వరూపము బహుతరశక్తి యుక్తమై ప్రకాశించుచున్నది. అట్టి స్వయంవ్యక్తార్చాస్వరూపములలో అగ్ర స్థానమునలంకరించి బ్రహ్మాండమునందు అద్వితీయముగా ప్రకాశించు చున్న వారు శ్రీ శ్రీ వేంకటేశ్వరస్వామివారు.

ఇట్లు పురాణములచే ప్రబోధింపబడుటయేగాక వేలాది మానవులచే నాశ్రయింపబడుచు నేత్ర, పుత్ర, కళత్రాది సర్వవరములను దయాపార వశ్యముచే దానముచేయుచూ తామ్రశకలాది రత్నాన్తములగు దక్షిణలను అతివాత్సల్యముచే అతి ప్రేమచే స్వీకరించుచు శేషశైలశిఖరాగ్రమునందు ఆనందనిలయములో పద్మపీఠమున మన్దస్మితముగా వేంచేసియున్నారు.

ఇది భారతీయుల మహా అదృష్టము.

పై తెల్పిన యీ అంశములను, శ్రీస్వామివారి వైభవములను వరాహ పురాణము, పద్మపురాణము, గారుడపురాణము, మార్కండేయ పురాణము, వామనపురాణము, బ్రహ్మపురాణము, భవిష్యోత్తరపురాణము, ఆదిత్యపురాణము, స్కందపురాణము, సాంకందపురాణము, బ్రహ్మాణ్డపురాణము ఈ మొదలగు పురాణములు, వేదములు, శాస్త్రములు చెప్పుచున్నవి.

శ్రీ వైకుంఠమునందు శ్రియఃపతియగు శ్రీమన్నారాయణుని దర్శనము చేయుచూ నిత్యులగువారలు ముక్తులగువారలు అందరు

''నిత్యాంజలిపుటా హృష్టా నమ ఇత్యేవ వాదినః''

ఇత్యుక్తప్రకారము అంజలిబంధములను చేయుచూ, నమోవాకములను చేయుచూ అవాఙ్మానసగోచరమగు నానందము ననుభవించుచున్నారు అని శాస్త్రములు చెప్పుచున్నవి.

అటులనే ఇచ్చట వేంకటాద్రియందు (తిరుమలయందు) శ్రీ స్వామి వారి దర్శనము చేయువారలు తృప్తితీరకయు, మైమరచియు పునఃపునః దర్శనకాంక్ష లిగురెత్త తిరిగి తిరిగి దర్శించుచూ అంజలి బంధములను చేయుచూ, నమో వాకములను చేయుచూ నిత్యానంద సరూపమగు నానందము ననుభవించుచున్నారు.

శ్రియఃపతి ఐరమ్మదీయము, ఆశ్వత్థము, హిరణ్మయభవనము, అపరాజితపురము మొదలగు పరమానందస్థానములతో ప్రకాశించు శ్రీవైకుంఠమును వదలి పరమానురాగముచే తత్సమానస్థానములచేత ప్రకాశించు నీ వేంకటాద్రియందు వేంచేసియుండుట వలన దీనిని (తిరుమలను) అధ్యాత్మవేత్తలగు మహాపురుషులు కలియుగవైకుంఠ మనుచున్నారు.

శ్రీ స్వామివారి ఆసేచనక (తృప్తితీరని) దర్శనసంజనితానందసాగర మగ్నులై మైమరచిన వారలను తాత్కాలికముక్తులు అనుచున్నారు.

ఇటుల లీలావిభూతియందు సంసారబద్ధులగు జీవసమూహాముల నుద్ధరింప సర్వేశ్వరుడగు శ్రీమన్నారాయణుడు శ్రీవైకుంఠము నుండి శ్రీ వేంకటాద్రికి శ్రీ వేంకటేశ్వరస్వామి వారుగా వేంచేసిన విషయమును బ్రహ్మాదిదేవతలు క్రమముగా తెలుసుకొనగలిగిరి. పిమ్మట వారలు శ్రీ వేంకటాద్రికివచ్చి పుణ్యతీర్థముల స్నానమాచరించి శ్రీ స్వామివారిని దర్శించి ఆరాధనములనుచేసి తీర్థప్రసాదములను స్వీకరించి ప్రభు మర్యాదలతో శ్రీస్వామి వారికి ఉత్సవములను జరిపించి భక్తజన సమూహామునకు నటులనే పరమకాంక్ష నుదయింపజేసిరి.

తరువాత సర్వదేశవాసులగు భక్త జనసమూహాములు తిరుమల యాత్రను పరమపావనముగా భావించి యాత్రేచ్ఛకలవారలై శ్రీ స్వామి వారి దర్శనమునకు పాదచారులై గోవిందనామ భజనములతో వచ్చెడు

వారు; శ్రీస్వామి పుష్కరిణీ, ఆకాశగంగ, పాపవినాశనము, పాండవ తీర్థము మొదలగు శ్రీ స్వామివారి పుణ్యతీర్థముల స్నానమాచరించి విధ్యుక్త ధర్మముల ననుష్టించెడివారు; పరమ శ్రద్ధాభక్తి విశ్వాసములతో విధేయులై శ్రీవారి ఆలయమునకువచ్చి ఆనందనిలయ విమాన ప్రదక్షిణ మాచరించి ప్రార్థనలను, కానుకలను చెల్లించెడువారు; శ్రీ స్వామివారి సన్నిధానమునకు వెళ్ళి శ్రీవారిని దర్శించి తీర్థమును, ప్రసాదమును స్వీకరించెడువారు, ఇంతియేకాక శ్రీవారికి ఆరాధనములను చేయించియు, ఉత్సవములను చేయించియు, ఆర్జితములనిచ్చి తత్ఫలితములను గైకొనియు ధన్యులై స్వస్థానములకు వెళ్ళుచుండెడు వారు. ఇదియే ఇప్పటికిని ఆచారముగా జరుగుచున్నది.

భారతదేశమునందు హిందూ మతములో అందరు ఆస్తికులైనను, భావభేదములచేతను, పూర్వజన్మ సంస్కార విశేషములచేతను, బహువిధములగు శైవశాక్తేయాది మతములయందు శ్రద్ధకలవారలై యుండుట తప్పలేదు. తత్తన్మత ప్రవక్తలు బహుళ ప్రచారము చేసి అంతయు తమ మతముగా చేయచూచినను జరుగలేదు. జరుగుట లేదు, జరగబోదు. ఉదారులగు కొందరు సర్వమత సామరస్యము చేసి ఒకే మతముగా చేయచూచినను అది మరియొక మతమై మత సంఖ్య పెచ్చుగుచున్నది కాని, ఏకత్వమును పొందుటలేదు. మరియు రాను రాను కాలము నాస్తిక మతమునకు దోహదమును చేయుచున్నది.

ఇటుల భారతదేశములోని బహువిధములగు మతములవారు ఆస్తికులు, నాస్తికులు కూడా ఫలార్థులై శ్రీ స్వామివారిని ద్వేషించక ప్రార్థించి ఫలసిద్ధిని బడసి శ్రీవారి సన్నిధానమునకు కుటుంబములతో వచ్చి ప్రార్థనలను చెల్లించి దర్శించి తీర్థ ప్రసాదములను స్వీకరించి, ఆస్తికులై, ఆస్తికాగ్రేసరులై ఆనందపడుచూ వెళ్లుచున్నారు.

విశేషమేమనగా - శ్రీవేంకటేశ్వరస్వామి వారు పరతత్త్వమైన శ్రియఃపతి యొక్క అర్చావతారమై చేతనుల నుజ్జీవింపచేయ శ్రీ వేంకటాద్రియందు వేంచేసియుండిరి.

శ్రీ వారిని దర్శించుచు మతాభినివేశపరులగు తత్తద్దేవతోపాసకులు స్వోపాస్య దేవతా గౌరవమును, స్వాత్మ గౌరవమును కాంక్షించుచూ భేదాభిప్రాయపడుచున్నారు.

కొందరు ఫాలముననేత్రము లేకున్నను సువర్ణ నాగాభరణములు ధరించియున్నాడు. ''వేంకటేశ్వరః'' అని ఈశ్వర శబ్దముచేత వ్యవహరింపబడుచున్నాడు. అందుచే శివుడు అని అభిప్రాయపడుచున్నారు.

కొందరు నాలుగు ముఖములు లేకున్నను, పద్మ పీఠమునయున్నాడు గాన, పద్మాసనుడగు బ్రహ్మయని అభిప్రాయపడుచున్నారు.

కొందరు శరీర సంనివేశమును చూచుచున్నను శుక్రవారము నాడు అభిషేకము జరుగుచున్నదిగాన, ''దేవి'' అని అభిప్రాయపడుచున్నారు.

కొందరు ''నామైకదేశే నామగ్రహణం'' అను న్యాయము చేత భీమసేనుని, భీముడు అనియు, సత్యభామను భామ అనియు, వ్యవహరించుచున్నట్లు కుమారస్వామి పుష్కరిణిని స్వామి పుష్కరిణి అని వ్యవహరించుచున్నారు గాన, కుమారస్వామి పుష్కరిణీ తీరమందుగల స్వామి కుమారస్వామి అని అభిప్రాయపడుచున్నారు.

కొందరు శ్రీ స్వామివారు నివసించియున్న గ్రామము పేరు ''తిరుపతి'' అని కాదు, ''త్రిపతి'' అని పేరు. చాలా కాలముగా ప్రజల నోటపడి వాడుకలో ''తిరుపతి''గా మారినది. ఆనాడు ''త్రిపతి'' అను స్వామివారి పేరును గ్రామమునకు పెట్టియుండవచ్చును. లేక దేవుని పేరే గ్రామమునకు వాడుకలో రావచ్చును.

''త్రిపతి'' అనగా ''త్రయాణాం బ్రహ్మ విష్ణు రుద్రాణాం పతిః'' అను వ్యుత్పత్తిచేత బ్రహ్మ విష్ణు రుద్రులకు ప్రభువైనవాడు అని అర్థము వచ్చు చున్నది. అందుచే శ్రీ వేంకటేశ్వరస్వామి వారు బ్రహ్మకానేరడు, విష్ణువు కానేరడు, రుద్రుడు కానేరడు త్రిమూర్తులకు అతీతుడు, త్రిమూర్తులకు ప్రభువు అని అభిప్రాయపడుచున్నారు.

ఇటుల పలువురు పలువిధములుగా నిగ్రహానుగ్రహసంపన్నమగు నీ కలియుగ ప్రత్యక్షదైవమును స్వోపాస్యదేవతగా నుండిన బాగుండును అను తలంపుతో వ్యవహరించుచున్నారు కాని వేరుకాదు.

మహర్షిపుంగవుల వచనములగు పురాణములను కూడా చూడుము-

శ్రీ భాగవతము, దశమస్కంధము 89-వ అధ్యాయము ఇట్లు చెప్పుచున్నది.

పూర్వము సరస్వతీ నదీతీరమున జరిగిన దీర్ఘసత్రమునందు మహర్షు లకు ముఖ, భుజ, నయన వైలక్షణ్యము కలిగి సృష్టి, స్థితి, లయమనెడుశక్తులచే ప్రకాశించు బ్రహ్మ, విష్ణు, రుద్రులను దేవాధీశులలో ''కోమహాన్'' (ఎవరు అధికులు) అను వితర్కము కలిగెను. ఆ మహత్వమును తెలుసుకొనుటకై మహర్షులందరు బ్రహ్మపుత్రుడగు భృగుమహర్షిని పంపిరి.

ఆ భృగుమహర్షి బ్రహ్మసభకు వెళ్ళి సత్వపరీక్షకై, బ్రహ్మను స్తోత్రమును చేయక మిన్నకుండెను. అందుచే బ్రహ్మ కోపము కలవాడై ఆ కోపమును జలముచేత నగ్నినివలె వివేకముచేత శమింప జేసుకొనెను.

పిమ్మట భృగు మహర్షి కైలాసమునకు వెళ్లెను. శివుడు వచ్చిన సోదరుని ఆలింగనము చేయబోవ, నీవు ''ఉత్పథవర్తివి'' (దారిమిగిలిన

వాడవు) అని అంగీకరించకపోయెను. అందుచే మహాదేవుడు శూలముచే నామహర్షిని చంప ప్రయత్నించెను. పార్వతీదేవి పతిపాదముల వ్రాలి ఆ ఉద్యమమును శమింపచేసెను.

అనంతరము భృగుమహర్షి వైకుంఠమునకు వెళ్లి ఏకాంతమున యున్న శ్రీ విష్ణువు యొక్క వక్షస్థలమున తన్నెను. వెంటనే మహావిష్ణువు తల్పము నుండి దిగి మహర్షి పాదముల వ్రాలి స్వాగతమును ప్రశ్నించి ఆసనమున కూర్చుండబెట్టెను.

ఓ తపోధనా! తమరాకను తెలియని నా అపరాధమును క్షమింపుము. నన్ను, నా లోకమును, తీర్థములకు తీర్థమగు తమ పాదోదకముచేత పవిత్రమును చేయుము అనియు కోరెను. తమ పాద స్పర్శముచే పవిత్రమైన నా వక్షస్థలమునందు లక్ష్మి అనపాయినిగా ఉండగలదు. ఇటుల మధురాతిమధురములగు సాంత్వన వచనముల ను పలుకగా పరితృప్తుడైన భృగుమహర్షి భక్తి అతిశయింప ఆనందబాష్పములను వెలిబుచ్చుచు మిన్నకుండెను.

పిమ్మట భృగుమహర్షి సరస్వతీ నదీ తీరమునకువచ్చి మహర్షుల కందరకు స్వానుభూత విషయములను దెలియజేసెను. బ్రహ్మావాదులగు నా మహర్షులెల్లరు ముక్తసంశయులై, శ్రీ మహావిష్ణువు నిస్సమాభ్యధికమగు పరతత్త్వము అని నిశ్చయమును చేసిరి.

పద్మపురాణము ఉత్తర ఖండము అరువదియవ అధ్యాయము– ఈ విషయమునే విశేషములతో చెప్పుచూ శ్రీ మహావిష్ణువుయందు పరత్వమును, పరత్వానుకూలములగు కల్యాణగుణములను పేర్కొనుచున్నది.

భవిష్యోత్తర పురాణము, వేంకటాచలమాహాత్మ్య ప్రతిపాదన పరమగు

ద్వితీయాధ్యాయము - ఈ విషయమునందే "కో వా భుంక్తే యజ్ఞ ఫలం" (యజ్ఞఫలమును అనుభవించువాడెవ్వడు "కస్య వార్ప్యతే" (ఎవ రికి అర్పించబడుచున్నది) "కో వా ధ్యేయః" (ధ్యానగమ్యుడెవ్వడు) అని వితర్కములుకలవారలై మహర్షులు పరతత్త్వ పరీక్షకు భృగుమహర్షిని పంపిరి. వెళ్లి వచ్చి భృగు మహర్షి తత్త్వమును తెలియజేయ మహర్షులు ముక్తసంశయులై శ్రీ మహావిష్ణువు పరతత్త్వమని నిశ్చయించుకుని, శ్రీ మహావిష్ణువునకే మఖార్పణమును చేసిరని చెప్పుచున్నది.

భృగుమహర్షి పరతత్త్వ నిర్ణయమునకై వచ్చి వెళ్ళిన తరువాత లక్ష్మీదేవి ఏకాన్తమున శ్రీ మహావిష్ణువుతో ఓ దేవదేవా! నా నివాస స్థలమగు వక్ష స్థలమును బ్రాహ్మణుడు తన్నగా మీరు సహించి నన్ను అనాదరణమును చేసితిరి అని ప్రణయకలహమును బూని నేను భూలోకమునకు వెళ్లుచున్నాను అని ఒకవ్యాజమును కల్పించుకుని వెళ్లిపోయెను.

అంత మహావిష్ణువు విస్మయము, అనురాగము, వ్యసనము ఉపర్యు పరిస్థానములనాక్రమించి లక్ష్మ్యన్వేషణార్థమై పరమానందస్థానమగు వైకుంఠమునువదిలి శ్రీ వేంకటాచలమునకు వేంచేసెను అని విశేషములను కూడా చెప్పుచున్నది.

పద్మపురాణము 34వ అధ్యాయము - శ్రీ స్వామివారు లక్ష్మీప్రాప్తికై శుకపురమునందలి పద్మసరోవర తీరమున చాలాకాలము తపస్సును చేసెను. అంత లక్ష్మీదేవి ప్రణయకలహమును వదులుకొని ఆ పద్మసరో వరమున ప్రాదుర్భవించి బ్రహ్మాది దేవతలందరు చూచుచుండ చిరు నగవుతో కల్హారమాలను శ్రీ స్వామివారి కంఠమున వైచి వక్షః పీఠమున లంకరించెను. వెంటనే శ్రీ స్వామివారు ఖగరాజు నధిష్ఠించి భుజగరాజ గిరి (శేషాద్రి)కి వేంచేసి స్వామి పుష్కరిణీతీరమున లక్ష్మీదేవితో ఆనందము ననుభవించుచుండెను అని చెప్పుచున్నది.

పంచకాల పరాయణులగు అస్మదాచార్యులవారు ఒక దినమున తమ స్వాధ్యాయ కాలమునందు సంప్రదాయసిద్ధమగు నొక ఐతిహ్యము నను(గ్రహించిరి.

పూర్వమొకప్పుడు పరత్వ నిశ్చయార్థమగు దేవసభలో చతుర్వేద శ్రూయమాణమై పరతత్త్వ ప్రతిపాదకమై వేదములయందగ్రస్థానము నలంకరించిన పురుషసూక్తము, జగత్ప్రభువగు విరాట్పురుషుని ధర్మము లను ప్రతిపాదించుచుండ ప్రముఖులైన బ్రహ్మరుద్రాది దేవతలు ఈ జగత్ప్రభు ధర్మములు తమకును కలవు, లేకున్న సంపాదింపనగును, అని మనస్సులలో ఆలోచనపడుచూ జగత్ప్రభువును కావచ్చును-అని ఉత్సాహముతో నుండిరి. వీరందరు ఇటులుండగా

''హ్రీశ్చ తే లక్ష్మీశ్చ పత్న్యౌ''

అను ఉత్తరానువాక వచనము ఆ జగత్ప్రభువగు విరాట్పురుషునకు లక్ష్మీపతిత్వము స్వరూప నిరూపక ధర్మము అని స్పష్టముగా చెప్పుటతోడనే బ్రహ్మరుద్రాది దేవతలు మనస్సులలో కలుగుచున్న జగత్ప్రభుత్వాలోచనములను, ఉత్సాహములను వదులుకొని మిన్న కుండిరి. మహావిష్ణువు లక్ష్మీపతియగుటచే జగత్ప్రభువై పరతత్త్వమై ప్రకాశించుచుండెను.

ఉత్తరానువాకము పరత్వమును లక్ష్మీపతిత్వముచే నిరూపించుచున్న విషయయమును పరతత్త్వ వేత్తయగు శ్రీ పరాశరభట్టరువారు: ''అధిజగా వుత్తరశ్చానువాకః'' అను శ్రీసూక్తిచే తెలియజేయుచున్నారు.

పెద్దలు, పురాణములు, వేదములు ఇటుల వాకొనుచున్నను దేవతాంతరోపాసకులగు వారిలో కొందరి భావములను, సంశయములను కనిపెట్టి, విజ్ఞాన సంపన్నులై దూర దర్శనులగు మన పూర్వులు

శ్రీ వేంకటేశ్వరస్వామివారికి శ్రీ లక్ష్మీ అమ్మవారికి అభిషేకము ఏకాన్తముగా చేయతగినదై యున్నను, అట్లుచేయక, అందరి యొక్క సమక్షమున ప్రత్యక్షముగా అభిషేకమును యేర్పాటుచేసియున్నారు.

ఇటుల చేయుటచేత పరమపురుషుడైన శ్రీ స్వామివారి యొక్క స్వయంవ్యక్త దివ్యస్వరూపము ప్రత్యక్ష ప్రమాణముచే కనుపించుచున్నది. ఆ స్వరూపమునందు తత్తద్దేవతాஉసాధారణములగు ఆభరణములుగాని, నేత్రములుగాని, ముఖములుగాని లేకపోవుట చేత సంశయాత్మకులగు వారలెల్లరు తమ తమ సంశయములను వదులుకొనుగలుగుచున్నారు. ఇతర దేవతాస్వరూపము కాదని నిర్ధారణ చేసుకొనగలుగుచున్నారు. మహావిష్ణు స్వరూప నిర్ధారణ సమర్థమగు వక్షస్థ్సలమునందలి లక్ష్మీ అమ్మవారి యొక్క ప్రత్యక్ష దర్శనముచేత శ్రీ వేంకటేశ్వరస్వామివారు శ్రీ మహావిష్ణువు యొక్క అర్చావతారమేనని దృఢముగా నిశ్చయించుకొనగలుగుచున్నారు. కనుక శుక్రవారమునాటి అభిషేకములోని స్వయంవ్యక్త దివ్యస్వరూపసందర్శనము అనేక సంశయములను తొలగించుచున్నది. అనేక నిశ్చయములను కలుగచేయుచున్నది. అందరను కృతార్థులను చేయుచున్నది.

ఇటుల శ్రీ మహావిష్ణ్వవతారమగు శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి సర్వ దేశ వాసి యాత్రాకేంద్రస్థానముగానున్న, శ్రీ వేంకటాద్రి యందు రాత్రి భాగమున బ్రహ్మాదిదేవతలచే నారాధనము జరుగుచున్నది. త్రికాలములయందును శ్రీ వైఖానసశాస్త్ర ప్రకారము ఆరాధన జరుగుచున్నది.

వైఖానసారాధనమును ''శ్రౌతం వైఖానసం ప్రోక్తం'' అని స్మృతులు, పురాణములు, వైదికారాధనము అని చెప్పుచున్నవి. వేదవేద్యుడగు శ్రీస్వామివారికి వైదికారాధనము విశేషమైయున్నది.

శ్రీస్వామివారికి ఉత్సవములు వైఖానసశాస్త్రము ననుసరించియు, బ్రహ్మాదులు శ్రద్ధాభక్తులతో శ్రీస్వామివారికి ఉత్సవములను చేయించి -అని ప్రతిపాదించెడు పురాణములననుసరించియు అతివైభవముగ జరుగుచున్నవి.

శ్రీ స్వామివారి నాశ్రయించుకొని యున్న పుణ్యతీర్థములు శ్రీస్వామివారి నుపాసించు మహర్షులు సేవించుటచేతను, తీరముల యందు తపశ్చరణముచేతను, ఆ తీర్థశక్తి ఆమ్రేడితమై (రెట్టింపై) యాత్రికులను స్నానపానాదులచేత పవిత్రతములనుగా చేయుచూ శ్రీవారి అనుగ్రహపాత్రులను చేయుచున్నవి.

శ్రీ స్వామివారి ఉత్సవాది సమయములు శాస్త్రములననుసరించియు, ఆచారములననుసరించియు యేర్పడియున్నవి.

శ్రీస్వామివారి సేవాసమయములు శ్రీహరి కైంకర్యానుగుణముగా యేర్పడుచుండును.

శ్రీస్వామివారికి యాత్రికులగు మానవులు సేవలననుసరించి భక్తితో నర్పించు ఆర్జితములు కానుకలు కించిత్కారరూపమై అతిదుర్లభమైన మానవజన్మనొందిన యాత్రికులయందు పత్రపుష్పాది న్యాయముగా భగవత్ప్రీతిని కలుగుచేయుచూ శేషత్వమును సంపాదించి కృతార్థులను చేయుచున్నవి.

శ్రీ స్వామివారిని, వారి వైభవములను యాత్రికులగు మానవులు ఫలార్థులైనవారు, అఫలార్థులైనవారు దర్శించుచూ, కృతార్థులగుచూ రాగా రాగా క్రమముగా నిప్పటికి దేవాలయాధికారులు కల్పించిన సౌకర్యములననుసరించియు, బహువిధములగు రక్షణములననుసరించియు, ఒక్కొక్క దినము నందు 30000 (ముప్పదివేలమంది)

యాత్రికులు కూడా శ్రీవారి దర్శనము చేయుచూ తీర్థప్రసాదములను స్వీకరించుచూ కృతార్థులగుచున్నారు.

శ్రీ స్వామి సేవాపరాయణులగు భక్తజన సమూహములు శ్రీవారి కర్పించిన కానుకలు ఆర్జితములు మొదలగునవి 1976 సంవత్సరము నకు దాదాపు పదికోట్ల రూప్యములకు పైగా శ్రీవారికాదాయము వచ్చినదని చెప్పుచున్నారు.

శ్రీస్వామివారి అనుగ్రహపాత్రులగు దేవాలయాధి కారులు యాత్రిక భక్తజన సమూహమునకు ఆనందాతిశయము భక్తివివృద్ధికలుగుటకై అనే కములగు ఉత్సవములను, ఆరాధనములను శ్రీ స్వామివారికి యేర్పాటుచేసియున్నారు. యేర్పాటుచేయుబోవుచున్నారు. అవి భక్తులకు కృతార్థత చేకూరుటకై భక్తజనవశమున్నూ చేసియున్నారు. చేయనున్నారు. భక్తులగువారలు పరమానందముతో శ్రీవారికా ఉత్సవాది కైంకర్యములను స్మరించుచూ దర్శించుటకు, చేయించుటకు ఉవ్విళ్లూరు చున్నారు.

ఉత్సవము - అనగా "ఉత్సూతే హర్షం ఇతి ఉత్సవః" అను నిర్వచనముచేత ఆనందమును అధి కముగా కనునది-అని అర్థము. శ్రీ స్వామివారి ఉత్సవముల వైభవమును యాత్రికుల ఆనందాతిశయ మును పరికింతము.

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీ స్వామివారి మహోత్సవ ములకు ముందుగా అతిమనోహరాలంకారములతో భాసిల్లు ఊర్ధ్వపుం డ్రముల ధరించిన ఐరావతములవంటి మత్తగజములు; దృష్టిపేయములగు వినూత్నాలంకారములతో ప్రకాశించు ఉచ్చైశ్శ్రవములవంటి అశ్వములు; మనోహరాకృతులచేతను, అలంకృతులచేతను భాసురములై మహేశ్వర వాహనమును ధి క్కరించు వృషభములు; వైష్ణవ స్వరూపధారులై

పరమేశ్వర కైంకర్యముద్రాలంకృతులై ప్రకాశించు పరివారజనములు - ఉత్సవపతాకములుగా విచిత్రగతులతో మందగమనము చేయుచుండ,

శ్రీ వైష్ణవ భాగవతోత్తములు ద్వాదశోర్ధ్వపుండ్రధారులై పవిత్ర పద్మాక్షమాల్యాద్యలంకృతులై పంక్తులు తీరి నాలాయిరదివ్య ప్రబంధగాథలను మధురగళారావములతో గానము చేయుచూ ప్రేక్షకుల కిదియే శ్రీ వైకుంఠము అను భావమును కలుగచేయుచూ మందగమనము చేయుచుండ,

నానాదేశాగత నానాభాషా భాషణ తత్పరులగు యాత్రిక భక్తజన సమూహములు, భగవదుత్సవ సంనివేశసందర్శనముచేత నమందానంద మందాకినీవీచికల నీదులాడుచుండ,

నాదస్వరవాద్య వాదనకళారంగములయందు ప్రఖ్యాతిగాంచి సువర్ణ బిరుదభూషితులైన గాన వాదననిపుణులు శ్రీ స్వామివారి ఉత్సవ సంనివేశమును తిలకించి మహోత్సాహముతో తమ గాన వాదన వైశద్య వైచిత్ర్య మాధుర్య నైపుణ్యములచేత ప్రేక్షకులను, శ్రోతలను మైమరపించి ఆనందపారవశ్యమునొందచేయుచూ తాము ను ఆనందపారవశ్యము నొందుచుండ,

దేవాలయాధి కారులు, వారి అనుచరులు, పరివారములు, రాజకీయ భటవర్గములు శ్రీ స్వామిసందర్శనపరాయణులగు భక్తభాగవత సందోహముల సంమర్దకోలాహలములను నివారించుచుండ,

శ్రీ వైకుంఠమున అశ్రుతములగు నీమహోత్సవ విశేషములను తిలకించి ఆనందపరవశులై కామ్యమీ కలియుగ శ్రీ వైకుంఠమే (తిరుమల) యని దృష్ట ప్రపన్న జనసమూహములు పరస్పరాలాపములు చేయుచుండ,

శ్రీవారి వెనుక భాగమున వైదిక సార్వభౌములై చతుర్వేద పారాయణ ప్రవీణులైన భాగవతోత్తములు చిత్తహరవులగు వేదపఠన ధ్వానములచేత శ్రోతల కర్ణపుటముల నమృతమును చిలుకుచుండ,

లయబ్రహ్మలగు నామభజనపరులు నామసంకీర్తనముచేయుచూ పులకితగాత్రులై తన్మయులై వర్తుల పంక్తులతీరి మృదంగాది వాద్య నినాదముల ఫక్కితో మేళవించి నృత్యముల నతిరమణీయముగా చేయుచుండ,

మహాజనసందోహముల మధ్యభాగమునందు వజ్రకవచాది మనోహరాలంకారభూషితులై, విచిత్ర పుష్పమాలాద్యలంకృతులైన శ్రీ వేంకటేశ్వరస్వామివారు నానావిధ రత్నాభరణ, సువర్ణాభరణ, విచిత్ర పుష్పమాలాద్యలంకార శోభితులైన పట్టమహిషులగు శ్రీభూదేవులతో సువర్ణమయ వాహనారూఢులై మహారాజ మర్యాదలతో తిరువీథులలో వేంచేయుచుందురు.

ఈ ఉత్సవవైభవములు అతిమనోహరములై అత్యానంద ప్రదములై శ్రీస్వామివారికి కూడా శ్రీ వైకుంఠమునందు విరక్తిని, ఈ కలియుగ వైకుంఠమునందు (తిరుమలయందు) అనురక్తిని సంపాదించుచున్నవి - అని తలంచవలసియున్నది.

ఇటుల ఉత్సవములేకాక శ్రీ స్వామివారికి సంబంధించిన అన్ని విషయములు అతివైభవమును సంపాదించుకొనియున్నవి.

శ్రీస్వామివైభవ సంతుష్టహృదయులగు దేవాలయాధికారుల అభిప్రాయముమీద, శ్రీ స్వామివారికి ప్రతినిత్యము జరుగు కైంకర్యములను, శ్రీవారికి సంవత్సరములో జరుగు ఉత్సవ విశేషములను, శ్రీవారికి సంబం

ధిష్ఠించియున్న పుణ్యతీర్థముల మహాత్మ్యమును, ★శ్రీ స్వామివారల ఉత్స వాది సమయములను, శ్రీవారి సేవాసమయములను, ఫలదాయకములగు శ్రీవారి ఆర్జితములను, భక్తభాగవత జనములు తెలుసుకొనుటకై చిన్నపొత్తమును రచించబూనితిని.

కాని శ్రీవారి దేవస్థాన సర్వవిషయ పరిపాలనాధికారులగు శ్రీ పి.యస్. రాజగోపాలరాజు మహాశయులు త్వరలో పూర్తిచేయమని చెప్పినను ఈ గ్రంథరచనము శాస్త్రముకంటె ఆచారముమీద నధికముగా నాధారపడియుండుటచేత, కాలము నతిక్రమించినది. దైవబలముచే యథాశక్తి వైష్ణవమగు నీ చిన్న పొత్తమును షడంశములతో రచించి అఖిలభువనైక నియన్తయై దయాసముద్రుడగు శ్రీ శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి సమర్పించడమైనది.

శ్రీ వేంకటేశ్వరస్వామివారి దేవస్థానము ఆంధ్రదేశములోనిదైనను సంనిహితమగు ద్రావిడదేశ సంబంధమువలన చాంద్రమాన సౌరమాన భేదములచే శ్రీవారికి ఉత్సవములు ప్రారంభమైనవి. చాంద్రమాన సౌర మాన భేదసిద్ధములగు నా ఉత్సవముల క్రమము అప్పుడప్పుడు మారు చుండును. పాఠకులు గమనించుదురుగాక.

శ్రీ స్వామివారి దేవాలయ పరిపాలక సభాధ్యక్షులగు శ్రీ అన్నారావు మహాశయులు, శ్రీస్వామివారి దేవాలయ సర్వవిషయ పరిపాలనాధికారులగు శ్రీ పి.యస్. రాజగోపాలరాజు మహాశయులు, (ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు) వారల యొక్క శ్రద్ధాభక్తిశక్త్యతిశయములచే హిందూమత విజయపతాకమై విలసిల్లునీ దేవాలయము దినదినాభివృద్ధిని

---

★ వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవాది సమయములను, సేవాసమయములను, ఆర్జిత సేవా సమయములను భక్తజనులు తెలుసుకొనుటకు 'తిరుమల తిరుపతి యాత్రిక దర్శిని' అను పేర దేవస్థానం చిన్న పుస్తకమును ప్రతి సంవత్సరము ప్రచురిస్తోంది.

కాంచి ప్రపంచములోని దేవాలయ సంస్థలలో అద్వితీయంవుగు దేవాలయముగా ప్రకాశించుచున్నది. శ్రీ స్వామివారి ఆలయము కూడా శ్రీస్వామివారివలె నిస్సమాభ్యధికమైన దేవాలయముగా పేరుకాంచినది.

శ్రీ వేంకటాద్రినివాస రసికుడగు శ్రీస్వామివారు అర్చావతారమున తమ యోగక్షేమములను విచారించుచున్న వీరలకు, వీరల కుటుంబము లకు యోగక్షేమములను విచారించుటయేకాక, ఆయురారోగ్య సౌభాగ్య ములను ప్రసాదించుదురుగాక.

గుణైకపక్షపాతులగు పాఠక మహాశయులు రాజహంస న్యాయముగా నిందలి దోషములను వదలి గుణములనే గ్రహించుదురుగాక యని కోరుచున్నాడను.

పణ్డిత వేదాన్తం జగన్నాథాచార్యులు,
ఆస్థాన విద్వాన్,
తి.తి. దేవస్థానములు,

# వి ష య సూ చి క

★


| విషయము | | పేజీలు |
|---|---|---|
| 1. | శ్రీ వేంకటేశ్వరస్వామివారి నిత్యారాధనము | 1 |
| 2. | శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవములు | 43 |
| 3. | శ్రీ వేంకటేశ్వరస్వామివారి పుణ్యతీర్థములు | 104 |
| 4. | శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవాదిసమయములు | 165 |
| 5. | శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆర్జితములు | 312 |

# 1

## నిత్యారాధన విషయానుక్రమణికా


| విషయము | | పుట |
|---|---|---|
| 1. సుప్రభాతము | .... | 1 |
| 2. విశ్వరూపదర్శనము | .... | 3 |
| 3. శుద్ధి | ... | 4 |
| 4. ప్రాతఃకాలారాధనము | .... | 4 |
| 5. తోమాలసేవ | .... | 5 |
| 6. కొలువు (ఆస్థానము) | .... | 6 |
| 7. సహస్రనామార్చనము | .... | 7 |
| 8. ప్రాతర్నివేదనము (మొదటి ఘంట) | .... | 8 |
| 9. హోమము | .... | 10 |
| 10. బలి | .... | 10 |
| 11. శాత్తుమొఱ | .... | 10 |
| 12. సర్వదర్శనము | .... | 11 |
| 13. శుద్ధి | .... | 11 |
| 14. మాధ్యాహ్నికారాధనము | .... | 11 |
| 15. అష్టోత్తరశతనామార్చనము | .... | 12 |
| 16. మాధ్యాహ్నిక నివేదనము (రెండవ ఘంట) | .... | 12 |
| 17. సర్వదర్శనము | .... | 14 |
| 18. శుద్ధి | .... | 15 |
| 19. సాయంకాలారాధనము | .... | 15 |
| 20. తోమాలసేవ | .... | 15 |
| 21. అష్టోత్తరశతనామార్చనము | .... | 16 |
| 22. నివేదనము (ఘంటా కాలము) | .... | 16 |
| 23. సర్వదర్శనము | .... | 17 |
| 24. ఏకాంతసేవ (శయనాసనము) | .... | 17 |
| 25. గురువార విశేషము (పూలంగి) | .... | 19 |
| 26. శుక్రవార విశేషము (అభిషేకము) | .... | 26 |
| 27. కల్యాణాద్యుత్సవములు | .... | 40 |
| 28. దైనందిన కార్య సంగ్రహము | .... | 41 |

# 2

## ఉత్సవ విషయానుక్రమణికా

విషయము ... పుట


1. సంవత్సరాది ఆస్థానోత్సవము .... 43
2. నిత్యోత్సవము .... 45
3. కొలువు (నిత్యాస్థానోత్సవము) .... 45
4. కల్యాణోత్సవము .... 47
5. సహస్రకలశాభిషేకోత్సవము .... 48
6. రోహిణీ నక్షత్రోత్సవము .... 48
7. ఆర్ద్రా నక్షత్రోత్సవము .... 49
8. పునర్వసు నక్షత్రోత్సవము .... 50
9. శ్రవణ నక్షత్రోత్సవము .... 51
10. శ్రీరామనవమి ఆస్థానోత్సవము .... 53
11. శ్రీరామపట్టాభిషేక ఆస్థానోత్సవము .... 54
12. వసంతోత్సవము .... 56
13. శ్రీ భాష్యకారులవారి ఉత్సవము .... 57
14. చందనమూర్ణోత్సవము .... 58
15. శ్రీ నృసింహజయన్తి ఉత్సవము .... 59
16. ఆణివర ఆస్థానోత్సవము .... 60
17. నారాయణగిరిలో ఛత్రస్థాపనోత్సవము .... 63
18. పవిత్రోత్సవము .... 64
19. శ్రీవరాహజయన్తి ఉత్సవము .... 65
20. గోకులాష్టమీ ఆస్థానోత్సవము .... 65
21. ఉట్ల ఉత్సవము .... 66
22. అనంతపద్మనాభ చతుర్దశీ ఉత్సవము .... 67
23. బ్రహ్మోత్సవము .... 68
24. డోలోత్సవము (ఊంజలిసేవ) .... 71

25. విజయదశమీ పార్వేట ఉత్సవము .... 72
26. దీపావళీ ఆస్థానోత్సవము .... 73
27. చక్రతీర్థముక్కోటి ఉత్సవము .... 75
28. కైశికద్వాదశీ ఆస్థానోత్సవము .... 76
29. కార్తిక దీపోత్సవము .... 77
30. దీపావళీ దీపోత్సవము .... 81
31. ధనుర్మాస ప్రారంభోత్సవము .... 82
32. అధ్యయనోత్సవము .... 84
33. శ్రీ వైకుంఠ ఏకాదశి ఉత్సవము .... 86
34. శ్రీ స్వామి పుష్కరిణీతీర్థ ముక్కోటి ఉత్సవము .... 86
35. పార్వేట ఉత్సవము .... 88
36. శ్రీరామకృష్ణ తీర్థముక్కోటి ఉత్సవము .... 89
37. ప్రణయకలహోత్సవము .... 90
38. రథసప్తమీ ఉత్సవము .... 91
39. కుమారధారా తీర్థముక్కోటి ఉత్సవము .... 93
40. క్షేత్రపాలక పూజోత్సవము .... 95
41. ప్లవోత్సవము (తెప్ప ఉత్సవము) .... 96
42. తుంబురుతీర్థముక్కోటి ఉత్సవము .... 98
43. దర్పణభవనములో డోలోత్సవము .... 99

# 3

## పుణ్యతీర్థ విషయానుక్రమణికా

విషయము — పుట

పుణ్యతీర్థములు .... 104
పుణ్యతీర్థనామనిర్వచనము .... 105
ధర్మరతిప్రదములగు పుణ్యతీర్థములు .... 106
జ్ఞానప్రదములగు పుణ్యతీర్థములు .... 107
జ్ఞానప్రదములగు పుణ్యతీర్థముల నామములు .... 107
భక్తివైరాగ్యప్రదములగు పుణ్యతీర్థములు .... 108
భక్తివైరాగ్యప్రదములగు పుణ్యతీర్థముల నామములు .... 108
ముక్తిప్రదములగు పుణ్యతీర్థములు .... 109

ముక్తిప్రదములగు పుణ్యతీర్థముల నామములు .... 110
పురాణభేదము - సమన్వయము .... 110
పర్వవివరణము .... 111
పర్వసమయములు .... 111
తీర్థపర్వోత్సవములు .... 113
ఉత్ప్రేక్షణము .... 114
1. శ్రీస్వామి పుష్కరిణీ పుణ్యతీర్థము .... 114
2. కుమారధారా పుణ్యతీర్థము .... 128
3. తుంబురు పుణ్యతీర్థము .... 132
4. ఆకాశగంగా పుణ్యతీర్థము .... 136
5. పాపవినాశన పుణ్యతీర్థము .... 141
6. పాణ్డవ పుణ్యతీర్థము .... 144
7. రామకృష్ణ పుణ్యతీర్థము .... 146
8. దేవపుణ్యతీర్థము .... 147
9. చక్రపుణ్యతీర్థము .... 148
10. సనక సనందన పుణ్యతీర్థము .... 149
11. కాయరసాయన పుణ్యతీర్థము .... 151
12. ఫల్గునీ పుణ్యతీర్థము .... 152
13. జాబాలి పుణ్యతీర్థము .... 154
14. వరాహపుణ్యతీర్థము .... 156
15. కాపిల పుణ్యతీర్థము .... 157
16. పద్మసరోవర పుణ్యతీర్థము .... 159
17. నిగమనము .... 163

# 4

## ఉత్సవాది సమయానుక్రమణికా

విషయము ... పుట

1. చైత్రమాసము .... 166
2. చాంద్రసంవత్సరాది, శ్రీ స్వామివారి ఆస్థానము .... 166
3. శ్రీ మత్స్యజయన్తి .... 166
4. శ్రీరామనవమి శ్రీరామస్వామివారి ఆస్థానము .... 167
5. శ్రీరామ పట్టాభిషేకము ఆస్థానము .... 174
6. శ్రీ వేంకటేశ్వరస్వామివారి వసంతోత్సవము .... 183
7. తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారికి పొన్నకాల్వ ఉత్సవము.... 183

8. మేషసంక్రమణము .... 184
9. సౌరసంవత్సరాది .... 184
10. శ్రీ భాష్యకారులవారి శాత్తుమొర .... 184
11. శ్రీరామజయన్తి .... 185
12. శ్రీ ముదలియాండాన్ వర్ష తిరునక్షత్రము .... 185
13. శ్రీ మధురకవి యాళ్వార్లవారి శాత్తుమొర .... 186
14. శ్రీ పరాశరభట్టర్ వర్ష తిరునక్షత్రము .... 186
15. నాగులాపురం శ్రీ వేదనారాయణస్వామివారి బ్రహ్మోత్సవము 186
16. తిరుపతి గంగజాతర .... 188
17. వైశాఖమాసము .... 188
18. భృగుమహర్షి తిరునక్షత్రము .... 188
19. శ్రీ శ్రీనివాస దీక్షితులవారి తిరునక్షత్రము .... 189
20. శ్రీ పరశురామజయన్తి .... 189
21. శ్రీ శంకరజయన్తి .... 189
22. శ్రీ పద్మావతీ శ్రీనివాసుల పరిణయమహోత్సవము .... 190
23. శ్రీ నృసింహజయన్తి .... 193
24. శ్రీ కూర్మజయన్తి .... 194
25. అన్నమాచార్య జయన్తి .... 194
26. శ్రీమహీజయన్తి .... 194
27. శ్రీ హనుమజ్జయన్తి .... 195
28. వృషభ సంక్రమణము .... 195
29. మెయ్యిఞ వరదరాజస్వామివారి వర్షతిరునక్షత్రము .... 195
30. తిరుమలనంబి వర్షతిరునక్షత్రము .... 196
31. శ్రీ నమ్మాళ్వార్లవారి శాత్తుమొర .... 196
32. తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవము .... 197
33. నారాయణవనం శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవము 198
34. శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివార్ల బ్రహ్మోత్సవం, హృషీకేశ్.... 199
35. జ్యేష్ఠమాసము .... 201
36. బుద్ధజయన్తి .... 201
37. తిరుచానూరు శ్రీ పద్మావతి తాయార్లవారి ప్లవోత్సవము .... 201
38. ఏరువాక పౌర్ణిమ .... 201
39. మిథున సంక్రమణము .... 201

40. శ్రీ పెరియాళ్వార్లవారి శాత్తుమొర .... 202
41. శ్రీనాథమునులవారి వర్షతిరునక్షత్రము .... 202
42. జ్యేష్ఠాభిషేకమహోత్సవము .... 203
43. శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివార్ల బ్రహ్మోత్సవము, అప్పలాయగుంట 203
44. తిరుచానూరు శ్రీ సుందరరాజస్వామివారి అవతారోత్సవము .... 205
45. ఆషాఢ మాసము .... 205
46 మరీచిమహర్షి జయన్తి .... 205
47. శయనైకాదశీ .... 205
48. శ్రీ విఖనసాచార్యులవారి శాత్తుమొర .... 207
49. చాతుర్మాస్యవ్రతారంభము .... 207
50. శ్రీ గోవిందరాజస్వామివారి జ్యేష్ఠాభిషేకోత్సవము .... 207
51. వ్యాసపూజ .... 208
52. మంగాపురం శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కారవైభవోత్సవము 208
53. కటక సంక్రమణము .... 208
54. శ్రీ స్వామివారికి అణివర ఆస్థానము .... 209
55. నాగచతుర్థి .... 209
56. గరుడపంచమి .... 210
57. నారాయణగిరిలో ఛత్రస్థాపనోత్సవము .... 210
58. తులసీమాహాత్మ్యము, ఆస్థానము .... 210
59. చక్రత్తాళ్వార్లవారి వర్ష తిరునక్షత్రము .... 210
60. శ్రీ ఆండాళ్ తిరువాడిప్పూరం శాత్తుమొర .... 210
61. తిరుమల శ్రీవారు పురిశైవారి తోటకు వేంచేయుట .... 211
62. కశ్యపమహర్షి జయన్తి .... 212
63. తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారు అహోబిలమఠమునకు వేంచేయుట 212
64. శ్రీ ఆళవందార్లవారి వర్షతిరునక్షత్రము .... 212
65. శ్రావణమాసము .... 213
66. కల్కిజయన్తి .... 213
67. వరలక్ష్మీవ్రతము .... 213
68. తిరుమల శ్రీవారి పవిత్రోత్సవము .... 214
69. శ్రీవైఖానసమహర్షి జయన్తి .... 215
70. కార్వేటినగర శ్రీ వేణుగోపాలస్వామివారి ప్లవోత్సవము .... 215
71. హయగ్రీవ జయన్తి .... 215

| | | | |
|---|---|---|---|
| 72. | శ్రావణోపాకర్మ | .... | 216 |
| 73. | ఋగ్వేదినా ముపాకర్మ | .... | 216 |
| 74. | యజుర్వేదినా ముపాకర్మ | .... | 217 |
| 75. | హిరణ్యకేశీయోపాకర్మ | .... | 217 |
| 76. | ఆపస్తంబోపాకర్మ | .... | 217 |
| 77. | బౌధాయనోపాకర్మ | .... | 218 |
| 78. | కాణ్వమాధ్యందినోపాకర్మ | .... | 218 |
| 79. | సామవేదినాముపాకర్మ | .... | 218 |
| 80. | అథర్వవేదినాముపాకర్మ | .... | 219 |
| 81. | నూతనోపనీతానాముపాకర్మ | .... | 219 |
| 82. | గాయత్రీ జపము | .... | 219 |
| 83. | శ్రీకృష్ణజన్మాష్టమి | .... | 220 |
| 84. | గోకులాష్టమి ఆస్థానం | .... | 222 |
| 85. | తిరుమల శ్రీవారి దేవస్థానమున శిక్యోత్సవము (ఉట్లు) | .... | 223 |
| 86. | తిరుపతి శ్రీకోదండరామస్వామివారి దేవస్థానమున శిక్యోత్సవము | | 223 |
| 87. | తిరుపతి శ్రీగోవిందరాజస్వామివారి దేవస్థానమున చిన్నవీధి శిక్యోత్సవము | | 223 |
| 88. | తిరుపతి శ్రీగోవిందరాజస్వామివారి దేవస్థానమున పెద్దవీధి శిక్యోత్సవము | | 224 |
| 89. | స్వతంత్రదినము | .... | 224 |
| 90. | సింహసంక్రమణము | .... | 224 |
| 91. | శ్రీకృష్ణజయన్తి | .... | 224 |
| 92. | భాద్రపదమాసము | .... | 226 |
| 93. | సామవేదినాముపాకర్మ | .... | 226 |
| 94. | శ్రీబలరామజయన్తి | .... | 227 |
| 95. | శ్రీవరాహజయన్తి | .... | 227 |
| 96. | వినాయకచతుర్థి | .... | 227 |
| 97. | శ్రీకపిలేశ్వరస్వామి సన్నిధానమున వినాయకోత్సవము | .... | 228 |
| 98. | ఋషిపంచమి | .... | 228 |
| 99. | విష్ణుపరివర్తనైకాదశి (భాద్రపదశుద్ధైకాదశి) | .... | 228 |
| 100. | విష్ణుశృంఖలయోగము | .... | 228 |
| 101. | శ్రవణద్వాదశి | .... | 229 |
| 102. | శ్రీవామన జయన్తి | .... | 230 |
| 103. | అనంతపద్మనాభవ్రతము | .... | 230 |

104. మహాలయ పక్షారంభము .... 231
105. బృహత్యుమావ్రతము .... 231
106. మహాభరణి .... 231
107. మధ్యాష్టమి .... 231
108. గజచ్ఛాయా .... 232
109. మహాలయామావాస్యా .... 232
110. కన్యాసంక్రమణము .... 232
111. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవము .... 233
112. ఆశ్వయుజమాసము .... 238
113. శరన్నవరాత్రారంభము .... 238
114. శ్రీ కపిలేశ్వరస్వామివారి సన్నిధిలో కలశస్థాపనము .... 238
115. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి రెండవ బ్రహ్మోత్సవము 239
116. సరస్వతీపూజ .... 242
117. మహాష్టమి .... 242
118. మహానవమి .... 242
119. విజయదశమి .... 243
120. శ్రీవారి బాక్సవారీ ఉత్సవము .... 244
121. చంద్రోదయోమావ్రతము .... 245
122. నరకచతుర్దశి .... 245
123. దీపావళి అమావాస్యా ఆస్థానం .... 246
124. కేదార గౌరీవ్రతము .... 247
125. తులాసంక్రమణము .... 247
126. తులాకావేరీ స్నానము .... 247
127. శ్రీకపిలేశ్వరస్వామి సన్నిధానమున అన్నాభిషేకోత్సవము .... 248
128. సువర్ణముఖరీ తీర్థముక్కోటి - రుద్రపాదాలు: .... 248
129. శ్రీ తిరుమలనంబివారి శాత్తుమొర .... 251
130. శ్రీమణవాళ మహామునులవారి శాత్తుమొర .... 252
131. శ్రీసేనైమొదలియార్‌వారి వర్షతిరునక్షత్రము .... 253
132. శ్రీ వేదాన్తదేశికులవారి శాత్తుమొర .... 253
133. శ్రీ పిళ్లైలోకాచార్యులవారి వర్షతిరునక్షత్రము .... 254
134. శ్రీ పొయ్‌గైయాళ్వారు వర్ష తిరునక్షత్రము .... 254
135. శ్రీ పూదత్తాళ్వార్లవారి వర్ష తిరునక్షత్రము .... 256

| | | | |
|---|---|---|---|
| 136. | శ్రీ పేయాళ్వార్లవారి వర్ష తిరునక్షత్రము | .... | 256 |
| 137. | కార్తికమాసము | .... | 257 |
| 138. | ఆకాశదీపము | .... | 257 |
| 139. | శ్రీవారి పుష్పయాగమహోత్సవము | .... | 257 |
| 140. | అత్రిమహర్షి జయన్తి | .... | 258 |
| 141. | ప్రబోధనైకాదశి | .... | 258 |
| 142. | క్షీరాబ్ధిద్వాదశి | .... | 258 |
| 143. | చాతుర్మాస్యవ్రత సమాప్తి | .... | 259 |
| 144. | కైశికద్వాదశి ఆస్థానం | .... | 259 |
| 145. | నారాయణవనం శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామివారి ప్లవోత్సవము | | 259 |
| 146. | విష్ణ్వాలయములయందు కార్తికపర్వ దీపోత్సవము | .... | 260 |
| 147. | వృశ్చిక సంక్రమణము | .... | 260 |
| 148. | తిరుచానూరు శ్రీ పద్మావతీతాయార్లవారి బ్రహ్మోత్సవము | .... | 260 |
| 149. | శ్రీ కపిలేశ్వరస్వామివారి సన్నిధానమున స్కందషష్ఠ్యుత్సవము | | 262 |
| 150. | చక్రతీర్థ ముక్కోటి | .... | 262 |
| 151. | శ్రీ ఆళ్వారుతీర్థముక్కోటి (కపిలతీర్థముక్కోటి) | .... | 262 |
| 152. | శ్రీకపిలేశ్వరస్వామివారి సన్నిధానమున కృత్తికాదీపోత్సవము | .... | 263 |
| 153. | శ్రీ తిరుమంగైయాళ్వార్లవారి శాత్తుమొర | .... | 263 |
| 154. | శ్రీ తిరుప్పాణాళ్వార్లవారి వర్షతిరునక్షత్రము | .... | 263 |
| 155. | తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారు తిరువడి సన్నిధి కి వేంచేయుట | | 264 |
| 156. | శ్రీ కపిలేశ్వరస్వామివారి సన్నిధానమున కార్తీకసోమవారాభిషేకము | | 264 |
| 157. | మార్గశీర్షమాసము | .... | 264 |
| 158. | దత్తాత్రేయ జయన్తి | .... | 265 |
| 159. | హూణసంవత్సరాది | .... | 265 |
| 160. | శ్రీ గోవిందరాజస్వామివారు రామచంద్రతీర్థకట్టమీదికి వేంచేయుట | | 265 |
| 161. | ధనుస్సంక్రమణము | .... | 265 |
| 162. | ధనుర్మాస పూజారంభము | .... | 266 |
| 163. | శ్రీ తొండరడిప్పొడియాళ్వారు వర్షతిరునక్షత్రము | .... | 266 |
| 164. | శ్రీ కపిలేశ్వరస్వామివారి సన్నిధానమున ప్లవోత్సవము | .... | 266 |
| 165. | శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆర్ద్రాదర్శన మహోత్సవము | .... | 267 |
| 166. | తిరుమల శ్రీవారి సన్నిధానమున అధ్యయనోత్సవారంభము | .... | 267 |

167. చిన్నశాత్తుమొర .... 267
168. శ్రీవైకుంఠైకాదశి .... 268
169. శ్రీస్వామిపుష్కరిణీతీర్థముక్కోటి .... 268
170. ప్రణయకలహోత్సవము .... 269
171. పెద్దశాత్తుమొర .... 269
172. శ్రీవారి సన్నిధానమున అధ్యయనోత్సవము పూర్తి .... 270
173. శ్రీఆండాళ్ నీరాట్టోత్సవము .... 270
174. భోగిపండుగ - భోగితేరు .... 271
175. పౌషమాసము .... 272
176. మకరసంక్రమణము - ఉత్తరాయణ పుణ్యకాలము .... 272
177. కనుమపండుగ .... 273
178. శ్రీ గోదా పరిణయోత్సవము .... 274
179. తిరుమల శ్రీవారు పార్వేట మండపమునకు వేంచేయుట .... 274
180. శ్రీకపిలేశ్వరస్వామివారి సన్నిధానమున శ్రీకామాక్షీదేవికి చందనాభిషేకము 274
181. శ్రీరామకృష్ణతీర్థముక్కోటి .... 274
182. శ్రీ తిరుమళిశై యాళ్వారు వర్షతిరునక్షత్రము .... 275
183. శ్రీకూరత్తాళ్వారు వర్షతిరునక్షత్రము .... 275
184. తిరుపతిశ్రీగోవిందరాజస్వామివారి సన్నిధానమున అధ్యయనోత్సవారంభము 276
185. చిన్నశాత్తుమొర .... 276
186. మకరశుక్లైకాదశీ .... 276
187. ప్రణయకలహోత్సవము .... 277
188. పెద్దశాత్తుమొర .... 277
189. తిరుపతిశ్రీగోవిందరాజస్వామివారి సన్నిధానమున అధ్యయనోత్సవం పూర్తి 277
190. మాఘమాసము .... 278
191. అర్ధోదయము - మహోదయము .... 278
192. రథసప్తమి .... 279
193. భీష్మాష్టమి .... 280
194. మధ్వనవమి .... 280
195. భీష్మైకాదశి .... 280
196. శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివార్ల బ్రహ్మోత్సవము, శ్రీనివాసమంగాపురం 280
197. తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి తెప్ప ఉత్సవము .... 282

198. మహాశివరాత్రి .... 282
199. శ్రీ కపిలేశ్వరస్వామివారి నందివాహనోత్సవము .... 283
200. కుంభసంక్రమణము .... 283
201. కుమారధారా తీర్థముక్కోటి .... 284
202. తిరుక్కచ్చినంబివారి శాత్తుమొర .... 284
203. శ్రీ కులశేఖరాళ్వారు వర్షతిరునక్షత్రము .... 285
204. ఫాల్గుణమాసము .... 285
205. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ప్లవోత్సవము .... 286
206. హోలికాపండుగ .... 286
207. చంద్రగ్రహణము .... 286
208. సూర్యగ్రహణము .... 288
209. శ్రీలక్ష్మీజయన్తి .... 293
210. మీనసంక్రమణము .... 295
211. మహానదీ పుష్కరములు .... 295
212. తిరుపతి శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవము .... 297
213. తుంబురుతీర్థముక్కోటి .... 298
214. శ్రీ గోవిందరాజస్వామివారి పంగున్యుత్తరం శాత్తుమొర .... 299
215. శ్రీశాలనాచ్చియార్ శాత్తుమొర .... 299
216. నాగులాపురం శ్రీవేదనారాయణస్వామివారి సూర్యసేవా; ప్లవోత్సవం 300
217. తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి పూలంగి .... 303
218. తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి పూలంగి .... 303
219. శ్రీకృష్ణస్వామివారికి రోహిణీ నక్షత్రాస్థానము .... 303
220. శ్రీస్వామివారికి ఆర్ద్రానక్షత్రాస్థానము .... 303
221. శ్రీరామస్వామివారికి పునర్వసు నక్షత్రాస్థానము .... 304
222. శ్రీస్వామివారికి శ్రవణనక్షత్రాస్థానము .... 304
223. తిరుమల శ్రీస్వామివారికి ప్లవ (తెప్ప) ఉత్సవము .... 304
224. శ్రీస్వామివారికి పూలంగి ఉత్సవము .... 306
225. శ్రీస్వామివారికి అభిషేకమహోత్సవము .... 306
226. శ్రీ స్వామివారికి ప్రభుత్వోత్సవము .... 307
227. శ్రీ స్వామివారికి కల్యాణోత్సవము .... 307
228. శ్రీస్వామివారికి దర్పణభవనములో డోలోత్సవము .... 308

229. శ్రీ స్వామివారికి ఏకాంతోత్సవము .... 309
230. శరణ్యదంపతులగు శ్రీలక్ష్మీవేంకటేశ్వరదివ్యదంపతులకు నామమంత్రపూజా 309

# 5

## ఆర్జిత విషయానుక్రమణికా

| విషయము | | పుట |
|---|---|---|
| ఉపోద్ఘాతము | .... | 312 |
| ప్రత్యేక దర్శనము | .... | 314 |
| సేవలు | .... | 314 |
| ఫలితార్థము | .... | 317 |

ఓమ్

# శ్రీ వేంకటేశ్వర వైభవము

★

# 1

తిరుమల

శ్రీ వేంకటేశ్వరస్వామివారి

## ని త్యా రా ధ న ము

# 1

# శ్రీ స్వామివారి నిత్యారాధన కార్యక్రమము

ఓమ్॥ అపార కారుణ్యౌదార్య వాత్సల్య సౌశీల్య స్వామిత్వ సౌలభ్యాద్యనన్తకల్యాణ గుణ మహోదధియై, కలియుగప్రత్యక్ష దైవమై కామితార్థ ప్రదుడై శ్రీవేంకటాద్రి (తిరుమల) యందు ఆనంద నిలయమున పరమానంద ప్రదాతయై అర్చావతారమున వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి దేవస్థానములో ప్రతినిత్యము కవాటోద్ఘాటనాది కవాట బంధపర్యన్తము అనగా ఆలయము తలుపులు తెరచినది మొదలు తలుపులు మూయువరకు గల కాలములో జరుగు కార్యక్రమ వివరణము.

## సుప్రభాతము

బ్రాహ్మముహూర్తమునకు (56 ఘడియలకు)) ముందుగానే, ప్రబోధవాద్యములను వాదకులు మధురముగాను, మృదులముగాను శ్రీవారి దేవస్థానములో మ్రోగించుచుండ అర్చకస్వాములు, జియ్యంగార్లు, ఏకాంగులు, ఆచార్య పురుషులు శ్రీ వైష్ణవస్వాములు, వేద వేత్తలు, భాగవతోత్తములు, భక్తులు, అధికారులు, పరిజనములు,

పరివారములు మొదలగు వారు తమ తమ విధ్యుక్తధర్మముల నాచరించి పవిత్రగాత్రులై స్వరూపధారులై శ్రీ స్వామివారి దేవాలయ మహాద్వారము నుంచి భగవద్ధ్యానము చేయుచు గోవిందనామ సంకీర్తనముచేయుచూ ధ్వజప్రదక్షిణ పార్శ్వము నుంచి ఆనందనిలయ విమాన ప్రదక్షిణముగా శ్రీస్వామివారి సువర్ణద్వారమున గల ద్వారపాలకుల పురోభాగమునకు క్రమముగా చేరెదరు. అర్చకస్వాములు శ్రీవారి సువర్ణ ద్వారములోని బంగారు తలుపులకు గల అంతర్బంధమును (లోపలిగడియను) మంత్ర పూర్వకముగా యంత్రికతో (కుంచె కోలతో) తొలగించెదరు. ఆ తలుపులకు బయట అధి కారులచే బంధి ంపబడియున్న రెండు తాళములయందుగల సీళ్ళను తొలగించి తాళములను తీసి వంశ పరంపరా ప్రాప్తమగు శ్రీవారి కైంకర్యముగల యాదవుడు (గొల్ల) తలుపులను తెరుచును. వెంటనే అర్చకస్వాములు మహర్షికుల తిలకుడగు విశ్వామిత్ర మహాముని త్రేతాయుగమునందు శ్రీ స్వామివారిని గూర్చి యొనరించిన "కౌసల్యా సుప్రజా రామ! పూర్వా సంధ్యా ప్రవర్తతే, ఉత్తిష్ఠ నరశార్దూల! కర్తవ్యం దైవమాహ్నికం" అను సుప్రభాత గీతమునుప్రారంభి ంచి శ్రీవారి సుప్రభాతమును పఠించుచు, జియ్యంగార్లతోను ఏకాంగులతోను యాదవుని(గొల్ల)తోను ఆలయమందు ప్రవేశించెదరు. ఇచ్చట సువర్ణ ద్వారమునందుగల భక్తులందరు, ఆ సుప్రభాతముననువదించుచు శ్రీవారి సుప్రభాతమును ఉచ్చైస్స్వరముతో నతిమధురముగా శ్రీస్వామివారు నిదురనుండి లేచునట్లు పఠి ంచి క్రమముగా శ్రీ వేంకటేశస్తోత్రమును, శ్రీవేంకటేశ ప్రపత్తిని, శ్రీ వేంకటేశమంగళాశాసనమును పఠి ంచుచుందురు. ఆలయమునందు ప్రవేశించిన అర్చకస్వాములు అన్తర్ద్వారమునందు తమచే బంధింపబడిన తలుపుల తాళమును తీసి తలుపులు తెరచెదరు. క్రమముగా శ్రీవారి సన్నిధానమునకు చేరి అచ్చట శ్రీవారి పాదాబ్జముల

నాశ్రయించి నమస్కరించి ధ్యానించి, సాత్త్వికత్యాగ మొనరించి, ఆజ్ఞైకొని, శయనమునందు నిదురించుచున్న శ్రీభోగ శ్రీనివాసస్వామి వారి సన్నిధానమునకు వచ్చి, కరతలధ్వానములు చేసి ప్రణవ పూర్వ కముగాను, మంత్రపూర్వకముగాను శ్రీవారిని నిదురనుండి మేల్కొలిపి శ్రీవారి సన్నిధానమున వారి స్వస్థానమందు వేంచేపుచేయుదురు. జియ్యంగార్లు, ఏకాంగులు సన్నిధి కివచ్చి, దీపోద్దీపనము గర్భాలయ సంమార్జనము మొదలగు క్రియలను నిర్వర్తించెదరు. తరువాత పరి చారకులు యవనిక (తెర)ను వేయగా అర్చకుడు శ్రీస్వామివారికి వెన్న, పాలు, పంచదార నివేదనము చేయును. కర్పూరైలాలవంగ జాజీక్రముకాది చూర్ణముతో కూడిన సుగంధి ముఖవాసమును (తాంబూలమును) సమర్పించి నీరాజనమును చేయును. అర్చకుడు తాను తీర్థస్వీకారము చేసి శఠారి తీసుకొని అచ్చటి వారలకు కూడా తీర్థము శఠారి సాయించును. సువర్ణ ద్వారము ముందుగల భక్తులు చేయుమంగళా శాసనము పూర్తికాగానే సువర్ణద్వారము తలుపులు తెరు వబడును. అప్పుడు శ్రీస్వామివారికి కర్పూరహారతి చేయబడును. సువర్ణద్వారము నందుండి మంగళాశాసనముచేయు భక్తులందరు అతి ఆతురతతో క్రమక్రమముగా శ్రీవారి సన్నిధానమునకు వచ్చెదరు.

## విశ్వరూప దర్శనము

ఈ విశ్వరూప దర్శనమునందు రాత్రి పూజాన్తమున ఆలయము తలుపులు మూయగానే బ్రహ్మాది దేవతలు వచ్చి శ్రీస్వామివారికి ప్రణమిల్లి, ప్రార్థించి, ధ్యానించి, అర్చించి, తీర్థస్వీకారము చేసి పరమ పవిత్రులై సంతుష్టాంతరంగులై వెళ్ళెదరు. గాన, బ్రహ్మాది దేవతలు తీర్థ స్వీకారము చేయగా మిగిలిన శ్రీవారి తీర్థము బ్రహ్మతీర్థమను పేరుతో

శ్రీ జియ్యంగార్లకు ఆచార్యపురుషులకు శ్రీ వైష్ణవగోష్ఠికి భక్తులకు క్రమముగా వినియోగము చేయబడును. ఇందులకై విశ్వరూప సేవా పరాయణులగు భక్తాగ్రేసరులు అతి కౌతుకముతో కనిపెట్టుకునియుందురు. ఇది గొప్ప విశేషముగా సంప్రదాయవేత్తలు భావించెదరు. విశ్వరూప సేవాపరాయణులందరకు క్రమముగా దర్శనము లభించును.

## శుద్ధి

తరువాత ఆలయములో పూర్ణముగా శుద్ధిజరుగును.

## ప్రాతఃకాలారాధనము

ఆరాధనమునకు పూర్వాంగముగా శ్రీ జియ్యంగారు పుష్పసంచయ స్థానమగు యమునత్తురైకి వేంచేసి అచ్చట శ్రీ స్వామివారి పుష్పకైంకర్యపరులగు పరిచారకులు పుష్పములచేతను, కమలముకుళములచేతను, దవనముచేతను, మరువముచేతను ప్రత్యేకముగ తయారుచేసిన వివిధ మాలలచేతను; పుష్పములచేతను, తులసీదళముల చేతను నిండించిన వేణుమయ పాత్రమును (వెదురుగంపను) శిరస్సు యందుంచుకుని భగవద్ధ్యానము చేయుచూ జాఘంటానాదము చేయువాదకుడు ముందు నడుచుచుండ ధ్వజదండపార్శ్వమునుంచి శ్రీస్వామివారి సన్నిధానమునకు తెచ్చి ఉంచెదరు. అర్చకుడు ఆ పుష్పసంచయమును శుద్ధియొనరించి, పూర్వాంగములను పూర్తికావించుకుని సంస్కరించి ఘంటానాదము చేయుచూ, అఖిలబ్రహ్మాండకోటి నాయకుడైన శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆరాధనమును శ్రీ వైఖానస శాస్త్రప్రకారము ప్రారంభించును. ప్రారంభించి క్రమముగా శ్రీ కౌతుక మూర్తియగు శ్రీభోగ శ్రీనివాసస్వామివారిని చతుష్కోణాలంకృతమగు రజతమయ (వెండి)

పీఠమునందు వేంచేపుచేసి పురుషసూక్తముతో అభిషేకము ప్రారంభిం చును. వేదవేత్తలు శ్రీవైష్ణవస్వాములు ఆ పురుషసూక్తమును పఠించుచుండ అభిషేకము పూర్తిచేయుదురు. శ్రీ జియ్యంగార్లు, శ్రీ వైష్ణవస్వాములు నీరాట్టమును పఠించుదురు. తరువాత శ్రీవారికి వస్త్రాభరణ పుండ్రా దులు సమర్పించి శ్రీవారి సన్నిధానమున వేంచేపు చేయుదురు. తరువాత శ్రీవారి (తిరువడి) సువర్ణపాదములను స్నాన పీఠమునందుంచి భక్తిశ్రద్ధ లతో అభిషేకము చేసి శ్రీవారి పాదాబ్జములయందు సమర్పింతురు. పిమ్మట మహత్తర శక్తియుక్తములై శ్రీవారి సన్నిధానమున వేంచేసియున్న శ్రీ సీతారామ, నరసింహ, గోపాల, మత్స్య కూర్మాద్యనేకసాల గ్రామ మూర్తులను స్నాన పీఠమునందుంచి అభిషేకము సమర్పించి తిరిగి వారి స్వస్థానమందుంచెదరు. ఇట్లు జరిగిన అభిషేకతీర్థములన్నియు త్రిపథగా తీర్థములవలె ప్రకాశించుచు అస్మదాదులను తరింపచేయుటకై పతద్గ్రహపా త్రమునకు వచ్చి చేరును. అనంతరము క్రమముగా శ్రీవారికి, ఇతర మూర్తులకు మహనీయమూర్తులకు గర్భాలయ దేవతలకు యథోక్తములగు ఉపచారములు జరుగుచుండును. అటు సమయములో శ్రీ జియ్యంగార్లు, శ్రీ వైష్ణవస్వాములు శ్రీ తొండరడిప్పొడియాళ్వారు సాయించిన తిరుప్పళ్లి ఎళుచ్చి అరువది పాశురములు దివ్యప్రబంధ మును గానము చేయుచుందురు. తరువాత అలంకారాసనములోని తోమాలసేవ ప్రారంభమగును.

## తోమాలసేవ

శ్రీ జియ్యంగార్లు, ఆచార్యపురుషులు, అధ్యాపకులు, శ్రీ వైష్ణవ స్వాములు శ్రీ ఆండాళ్ సాయించిన తిరుప్పావు (30) ముప్పది పాశు రములు దివ్యప్రబంధములో 28 ఇరువదియెనిమిది పాశురములను

అతి మధురముగా అతి శ్రావ్యముగా గానమును చేయుచుండ అర్చకుడు శ్రీ జియ్యంగార్లు ఇచ్చు పుష్పమాలలను తీసుకుని భయభక్తి శ్రద్ధావిధేయతలతో మామూలుమేరకు శ్రీభోగ శ్రీనివాసమూర్తివారికి, శ్రీ భూదేవులకు శ్రీవారికి కంఠమాలలు, హృదయపర్యన్తమాలలు, నాభి పర్యన్త మాలలు, కటిపర్యన్త మాలలు, జానుపర్యన్తమాలలు, పాదపర్యన్తమాలలు, కఠారిమాలలు, శంఖచక్ర మాలలు, శిరోమాలలు, శిఖరమాలలు, బహువిధములగు పుష్పమాలలను బహువిధముగా సమర్పించును. క్రమముగా ఇతర మూర్తులకు ఇతర స్వాములకు పుష్పమాలలు సమర్పించును. తోమాల సేవ అను పేరుతో జరుగు అలంకారాసనములోని ఈ పుష్పమాలాలంకార సమర్పణ వైభవమును రెప్పలువాల్చక శ్రీవారిని దర్శించు యాత్రికులగు భక్తాగ్రేసరులు ఆనందపరవశులై మైమరచియుందురు. పిమ్మట మంత్రపుష్పము జరిగి నక్షత్రహారతి, కర్పూర హారతి జరుగును. తరువాత శ్రీవారికి కొలువు. (ఆస్థానము) ప్రారంభమగును.

## కొలువు (ఆస్థానము)

శ్రీనివాసప్రభుమూర్తి (కొలువు శ్రీనివాసస్వామివారు) సువర్ణ ద్వారమునకు (బంగారు వాకిలికి) ముందుగల ఆస్థాన మండపమందు అమర్చిన సింహాసనమునకు సువర్ణఛత్రము, వింజామరలు మొదలగు మహారాజ మర్యాదలతో వేంచేసి, సింహాసనము నధిష్ఠించెదరు. వెంటనే అర్చకుడు శ్రీవారికి ఆరాధనముచేయు మహారాజమర్యాదలు జరుపును. శ్రీవారి అర్చకునకు మాత్రాదానమును అనగా దక్షిణ తాంబూలతిల ఫలాదియుత తండులదానమును చేయుదురు. అర్చకుడు ఆ దానమును ప్రతిగ్రహించి శ్రీస్వామివారికి నిత్యైశ్వర్యోభవ, అని మంగళాశాసనముచేయుచు శ్రీవారి పాదాబ్జములయందు పుష్పాంజలి

నర్పించును. తరువాత మిరాశీదార్లు దివ్యప్రబంధమును, చతుర్వేదములను, ఉపనిషత్తులను, పురాణములను, ఇతిహాసములను, కల్పసూత్రములను, బ్రహ్మసూత్రములను, భాష్యములను శ్రీవారికి శ్రద్ధాభక్తులతో వినిపించెదరు. పిమ్మట పంచాంగమును ఆ దినమునందును, పరదినమునందునుగల తిథి వారనక్షత్ర యోగకరణములతోను. గ్రహసంచార విశేషములతోను, ఉత్సవాది విశేషములతోను వినిపించెదరు. అనంతరము శ్రీవారికి పూర్వదినమున భక్తులు సమర్పించిన కానుకల ద్రవ్యమునం తయు నాణెముల ప్రకారము వివరముగా వినిపించెదరు. తరువాత శ్రీవారికి గుడమిశ్రమగు తిలచూర్ణము (బెల్లముతో కూడిన నువ్వుపిండి)) నివేదనము జరిగి హారతి జరుగును. జియ్యంగార్లు అధికార్లు మొదలగువారలకు శఠారి జరిగి ఆ ప్రసాద వినియోగము జరుగును. అంతట శ్రీ స్వామివారు కొలువు చాలించి మహారాజమర్యాదలతో శ్రీవారి సన్నిధానమున స్వస్థానమునకు వేంచేయుదురు. తరువాత శ్రీస్వామివారికి సహస్రనామార్చనము ప్రారంభమగును.

## సహస్రనామార్చనము

అర్చకుడు శ్రీస్వామివారి పాదాబ్జముల సాన్నిధ్యమున కూర్మాసనము మీద పద్మాసనమున కూర్చుని ఘంటానాదము చేయుచు సంకల్పమొనరించి పూర్వాంగములగు ఉపచారములు సమర్పించి తులసీ పుష్పములను తీసుకుని ''ఓమ్ శ్రీ వేంకటేశాయ నమః'' అని పూజనము ప్రారంభించగానే, మిరాశిదారగు భాగవతోత్తముడు బ్రహ్మాణ్డ పురాణాంతర్గతమగు శ్రీ వేంకటేశ్వరస్వామివారి సహస్రనామములను మధురాతి మధురముగా అతి శ్రావ్యముగా ఆద్యన్తములయందు

ప్రణవ సమస్సంపుటీకరణము చేసి ఉచ్చైస్స్వరముతో శ్రద్ధాభక్తులతో పఠింపుచుండును. అర్చకుడు తదేక ధ్యానముతో సంసారసాగర సముత్తరణ సేతువులగు శ్రీవారి పాదాబ్జములయందు తులసీదళములను, పుష్పములను సమర్పించుచుండును. ఇది అర్చకుని యొక్క జన్మాన్తర సహస్రార్జిత పుణ్యసముదాయ ఫలముగా భావించవలసియున్నది. ఇటుల శ్రీవారి సహస్రనామార్చనము పూర్తి కాగానే శ్రీవారి పాదముల యందు పూజించబడిన తులసీదళములను పుష్పములను తీసుకుని అర్చకుడు శ్రీవారి పట్టమహిషులగు శ్రీభూదేవుల చరణారవిందములయందు ''ఓమ్ శ్రీం, శ్రియైనమః'' అని పూజించుటకు ప్రారంభించును. మిరాశీదారగు భాగవతోత్తముడు వరాహపురాణోక్తములగు లక్ష్మీనామములను అతిమధురముగా శ్రద్ధాభక్తులతో పఠించుచుండును. అర్చకుడు తదేకధ్యానముతో జగన్మాతృస్థానము నలంకరించిన శ్రీభూదేవులను పూజించుచుండును. శ్రీశ్రీవారి సహస్రనామార్చన దర్శన సేవాపరాయణులగు యాత్రికులు, భక్తులు కన్నుల కరువుదీర చూచుచు తమజన్మ ధన్యతను తలపోయుచు పరమానందసముద్రములో మునిగి ఒడలుమరచియుందురు. శ్రీవార్లకు శ్రీతాయార్లకు పూజనము పూర్తికాగానే నక్షత్ర హారతి వెంటనే కర్పూరహారతి జరుగును. ఈ అర్చన సేవాపరాయణులయొక్క దర్శనసేవ పూర్తి అయిన వెంటనే శ్రీవారికి భోజ్యాసనము ప్రారంభమగును. లఘుశుద్ధి జరుగును.

## ప్రాతర్నివేదనము (మొదటిఘంట)

శ్రీవారి పరిచారకుడు సువర్ణద్వారమునందు నిలువంబడి పచనాలయమందు పాకకైంకర్యపరతంత్రులైయున్న పాచకుల యొక్క శ్రవణ కుహరములయందు ప్రవేశించునటుల ''శ్రీవారికి ప్రసాదములు

సిద్ధము కావలెను'' అను విచిత్ర శబ్దనాదము చేయును. వెంటనే కైంకర్యపరులు పాకశాలనుంచి శ్రీవారికి మామూలుగా నిత్యము జరుగుచున్న మాత్రా ప్రసాదము, ఇతర ప్రసాదములను, విశేష ప్రసాదములను, ప్రార్థనా ప్రసాదములను మోసుంచి తెచ్చి శ్రీవారి దృష్టిప్రసార స్థానమునందు ఉంచి ప్రతి కైంకర్యపరుడున్నూ ''ధన్యోఽస్మి'' అని ఆనందపడుచూ శ్రీవారిని దర్శించి వెళ్ళుదురు. పిమ్మట అర్చకస్వాములు ఆలయములో ప్రవేశించి తృతీయద్వారము తలుపులు వేయుదురు. భక్తాగ్రేసరుడగు పరిచారకుడు ఆస్థానమండపములో సువర్ణ ద్వారమునకు దక్షిణ భాగమునయున్న రెండుమహాఘంటల యొక్క మధ్యభాగమున కూర్చుని రెండు ఘంటలయొక్క అంతర్భాగమునగల ఆయసదండముల రెండుచేతులంబూని గర్భాలయమందు శ్రీస్వామివారు ఇతర మూర్తులు ఆరగించువరకు ప్రణవధ్వని పరంపరలు బయలుదేర మ్రోగించుచుండును. ఇదియే ఘంటాకాలము. శ్రీస్వామివారి సన్నిధానమునగల అర్చకుడు శ్రీవారికి ప్రతిపదార్థమును వివరముగా మంత్రపూర్వకముగా నివేదించి భోజ్యాసనోచితములగు ఉపచారములను సమర్పించును. ఏలాలవంగ తక్కోల జాజీ కర్పూర క్రముకాది చూర్ణమిశ్రితమగు ముఖవాసమును (తాంబూలము) సమర్పించును. కర్పూరహారతి జరుగును. పిమ్మట అర్చకుడు శ్రీవారికి నివేదితములైన ప్రసాదములలో శ్రీవారి ఆజ్ఞప్రకారము తనభాగ లబ్ధమైన ప్రసాదమును తీసుకొని వేరొక పాత్రయందుంచుకొనును. అర్చకస్వాములు ఘంటాకాలమునందు బంధింపబడిన ద్వారము తలుపులు తెరచెదరు. మహాఘంటా ప్రణవధ్వానము శమించును, పాచక కైంకర్యపరులు ఆలయములో ప్రవేశించి శ్రీవారికి నివేదింపబడిన ప్రసాదములను నిర్ణీత స్థానములకు చేర్చెదరు.

## హోమము

అనంతరము యాగశాలయందు హోమము జరుగును.

## బలి

పిమ్మట ఆలయదేవతలు, ద్వారదేవతలు, ద్వారపాలకులు, లోక పాలకులు, విమానపాలకులు, అనపాయినులు మొదలగు దేవతలలో నిత్యతృప్తులగు పూజాకాంక్షులకు పూజలు జరిగినవి కాన బలికాంక్షులకు దేవాలయమునకు చుట్టుగల వారివారి బలిపీఠములయందు బలిని సమం త్రకముగా ఉపచారములతో నిచ్చి బలిపీఠమునందును బలిశేషమును దివానక్తంచరులగు భూతయక్షపిశాచాదులకు ధ్వజదండపృష్ఠభాగమున ప్రకాశించుచున్న సువర్ణ బలిపీఠ పార్శ్వమునందు సమంత్రకముగా నిచ్చెదరు. పిమ్మట శ్రీవారి సన్నిధానమునకు వెళ్ళెదరు. ఈ సమయమున అర్చకులు ఇతర దేవతలకు ఆరాధనమును నివేదనమును చేయుదురు. శ్రీ భాష్యకారుల వారికి ఆరాధనమును శ్రీవారికి నివేదితమైన ప్రసాద మును నివేదనచేయుదురు.

## శాత్తుమొఱ

పిమ్మట శ్రీవారి సన్నిధానమునకు జియ్యంగార్లు, ఏకాంగులు, ఆచార్యపురుషులు, శ్రీవైష్ణవస్వాములు వచ్చి శ్రీ ఆండాళ్‌సాయించిన తిరుప్పావు ముప్పది పాశురముల దివ్యప్రబంధములో శేషించిన రెండు పాశురములు ఈ శాత్తుమొరలో అనుసంధానముచేసి మంగళాశాసనము చేసెదరు. కర్పూరహారతి జరుగును. పిమ్మట గోష్ఠికి తీర్థము, శఠారి, చందనము, ప్రసాదము వినియోగము జరుగును. శ్రీవారిని సేవించు

కుని వైష్ణవస్వాములు స్వరూపానుగుణముగా వెలుపలకు వచ్చెదరు.

ఇది శ్రీవారి ప్రాతఃకాలారాధనము.

## సర్వదర్శనము

అనాలోచిత విశేషాశేషలోకశరణ్యుడగు శ్రీ స్వామివారు సర్వదర్శనము అను పేరుతో విశేష విచారములేకనే సర్వమానవులకు క్రమముగా (క్యూలో) తమ దర్శనమును ఇచ్చుచూ తీర్థమును, శఠారిని, ప్రసాదములను ఇప్పించుచూ వారల కష్టసుఖములను ప్రార్థనలను తెలుసుకొనుచూ తెలియనివానివలె నటించుచూ వేంచేసియుందురు. ఇదియే సర్వదర్శనము.

## శుద్ధి

శ్రీస్వామివారికి మాధ్యాహ్నిక కాలారాధన సమయముకాగానే సర్వదర్శనము ఆపివేయబడి శుద్ధి జరుగును.

## మాధ్యాహ్నికారాధనము

అర్చక స్వాములు విధ్యుక్తకర్మానుష్ఠానము పూర్తి యొనరించుకుని శ్రీస్వామివారికి మాధ్యాహ్నికారాధన కైంకర్యమును చేయుటకై శ్రీవారి సన్నిధానమునకు వచ్చి చేరెదరు.

అర్చకుడు శ్రీవారి సన్నిధానములో కూర్మాసనము మీద కూర్చుని ఘంటానాదము చేయుచూ మాధ్యాహ్నికారాధనమునకు సంకల్పము చేసి ఆరాధనము ప్రారంభించును. శ్రీవారికి మాధ్యాహ్నికారాధనోపయుక్తములగు ఉపచారములు సమర్పించును. ఇతర

మూర్తులకు, ఇతర దేవతలకు అట్లే ఉపచారములు సమర్పించును.

## అష్టోత్తర శతనామార్చనము

అర్చకుడు శ్రీస్వామివారికి అష్టోత్తర శతనామార్చనమును సంకల్పించి ''ఓం వేంకటేశాయ నమః'' అని వరాహ పురాణాన్తర్గత ములగు శ్రీ వేంకటేశ్వరాష్టోత్తర శతనామములను ప్రారంభించగానే, మిరాశిదారగు వాద్యారి ఆ నామమును అనువదించుచు, అతి మధుర ముగా ''ఓమ్ శ్రీ శేషాద్రినిలయాయ శ్రీ వేంకటేశాయ నమః'' అని నూట యెనిమిది నామములను శ్రోతల జన్మపావనమగునట్లు పఠించు చుండును. అర్చకుడు ప్రతినామాన్తమునందును తులసీ పుష్పములను శ్రీవారి పాదాబ్జములయందు పరమభక్తితో సమర్పించుచుండును. ఇటుల శ్రీవారికి అష్టోత్తర శతనామార్చనము పూర్తి అయినవెంటనే అర్చకుడు శ్రీవారి పాదాబ్జములయందు పూజించిన తులసీపుష్పములను తీసుకుని శ్రీవారి నిత్యానపాయినులగు శ్రీ భూదేవులను పూజింప ''ఓమ్ శ్రీం శ్రియైనమః'' అని శ్రీ లక్ష్మీనామమును ప్రారంభించగానే మిరాశిదారు అతిమధురముగా వరాహపురాణాంతర్గత ములగు లక్ష్మీనామములను పఠించుచుండును. అర్చకుడు జగన్మాతలగు శ్రీ భూదేవుల యొక్క పాదాబ్జములయందు తులసీపుష్ప ముల నర్పించుచుండును. నామార్చనము పూర్తి అయినతోడనే నక్షత్ర హారతి అయి కర్పూరహారతి జరుగును. జియ్యంగారికి నామపాఠకు నకు శఠారి జరుగును.

## మాధ్యాహ్నిక నివేదనము (రెండవ ఘంట)

పరిచారకుడు సువర్ణ ద్వారము ముందు నిలబడి పచనాలయములోని

కైంకర్యపరులకు తెలియునట్లుగా "శ్రీవారికి ప్రసాదములు సిద్ధము కావలెను." అను విచిత్ర శబ్దనాదము చేయును. వెంటనే కైంకర్యపరులు వచనాలయమునుంచి శ్రీవారికి మధ్యాహ్నకాలమున జరుగు శుద్ధాన్నము, ఇతర ప్రసాదములు, విశేషప్రసాదములు, ప్రార్థనా ప్రసాదములు, ఉత్సవ ప్రసాదములను భక్తిశ్రద్ధలతోతెచ్చి శ్రీవారి దృష్టిప్రసార స్థానము నందుంచి శ్రీవారికి నమస్కరించి కృతకృత్యులమైతిమి-అని సంతోషించుచూ వెళ్లెదరు. పిమ్మట అర్చకస్వాములు ఆలయములో ప్రవేశించి ద్వారము తలుపులు వేయుదురు. అర్చకుడు శ్రీవారికి ఇతర మూర్తులకు ఇతర దేవతలకు భోజ్యాసనమును ప్రారంభించి ప్రసాదములను క్రమముగా నివేదించి ఉత్తరాంగములగు ఉపచారములను సమర్పించుచుండును. సువర్ణద్వారమునకు దక్షిణ భాగమునయున్న మహా ఘంటలకు మధ్యగా కూర్చుని పరిచారకుడు రెండు ఘంటలను తలుపు మూసినది మొదలు తలుపులు తెరచువరకు శ్రీవారికి నివేదన సమయమున ప్రణవనాదముతో ప్రయోగించుచుండును. పిమ్మట అర్చకుడు శ్రీవారికి ఏలాలవంగక్రముకాదిచూర్ణయుతమైన తాంబూలమును సమర్పించి కర్పూరహారతి చేసి పుష్పాంజలిని శ్రీవారిపాదముల యందుంచి క్షమామంత్రము ననుసంధించును. అర్చకస్వాములు మామూలు ప్రకారం ఆజ్ఞాలబ్ధమైన ప్రసాదము వేరుగా తీసికొని ద్వారము తలుపులు తెరచెదరు. మహాఘంటానాదము శమించును. కైంకర్యపరులు నివేదిత ప్రసాదములను నిర్ణీత స్థానములకు చేర్చెదరు.

శ్రీ భాష్యకారులవారికి నివేదనము జరుగును. శ్రీవారికి మాధ్యాహ్నికారాధనము పూర్తికాగానే శ్రీ మలయప్పస్వామివారు జగన్మాతలగు శ్రీ భూదేవులతోకూడి నరవాహనమగు తిరుచ్చియందు వేంచేసి సకల మర్యాదలతోను, వాద్యములతోను విమాన ప్రదక్షిణముగా తమ రాకకై

ఎదురుచూచుచు ఆనందపడుచు కనిపెట్టుకునియున్న కల్యాణ ప్రార్థనా దిపరులగు భక్తాగ్రేసరులయొక్క మనోరథములను తీర్చగలందులకై రంగమండపమునకు వేంచేయుదురు. అచ్చట నిరుపాధిక మాతా పితృలగు శ్రీ భూదేవులు శ్రీ మలయప్పస్వామివారు సాయంకాలము వరకు బిడ్డలగు ప్రార్థనాపరులయొక్క ప్రార్థనారూపములగు కల్యాణో త్సవములను, బ్రహ్మోత్సవములను, వసంతోత్సవములను, వాహనోత్స వములను, ఆదర్శమండప దర్శనోత్సవములను (అద్దముల మహల్ ఉత్సవము) పూర్తి యొనరించి ప్రార్థనాపరులను సంతోషపెట్టు అదృష్టవంతుని అదృష్టాధీనమగు వాహనము నధిష్ఠించి తిరువీధులు వేంచేసి జనానావారితోసహా శ్రీ మలయప్పస్వామివారు శ్రీవారి సన్నిధా నమున తమ స్థానములకు వేంచేయుదురు. ఇచ్చట శ్రీవారికి మాధ్యాహ్ని కారాధనము పూర్తి అయిన వెంటనే అధికారులు దర్శనప్రియులు, దర్శనము చేసెదరు. సర్వదర్శనము ప్రారంభమగును.

## సర్వదర్శనము

శ్రీవారు మధ్యాహ్నమునుంచి సాయంకాలము వరకు సర్వదర్శన మను పేరుతో సర్వమానవులకు దర్శనమిచ్చుచు భక్తిపూర్వకముగా వారు సమర్పించు కానుకలను స్వీకరించుచూ వారి కామితముల నివ్వనాలోచించుచూ శ్రమయనక వేంచేసి యుండెదరు.

ప్రతిదినము ఉదయమునుంచి సాయంకాలము వరకు శ్రీవారి అధికారులు, పరిచారకులు, పరివారములు ఆస్థానమండపములో కుబేరభాగమున శ్రీవారికి పూర్వదినమునందు భక్తులు సమర్పించిన కానుకలను జాతీయముల ప్రకారముగా గణించి పెట్టెలకు పెట్టి సీళ్ళు వేయించి ఆలయములో చేర్చెదరు. దీనినే పరకామణి అని యందురు.

## శుద్ధి

శ్రీవారి సాయంకాలారాధన సమయము కాగానే సర్వదర్శనమును ఆపివేసి స్థాన శుద్ధి జరుగును.

## సాయంకాలారాధనము

శ్రీవారికి సాయంకాలారాధనము చేయుటకై, విధ్యుక్తకర్మానుష్ఠానమొనరించుకుని అర్చకుడు శ్రీవారి సాన్నిధ్యమునకు వచ్చును. ఆరాధనపూర్వాంగముగా శ్రీ జియ్యంగారు, పుష్పసంచయ స్థానమగు యమునత్తురైకి వెళ్లి అచ్చట పుష్పకైంకర్యపరులచేత, పుష్పములతోటియు, పుష్పసరములతోటియు, తులసీదళములతోటియు నిండింపబడి యున్న వేణుపాత్రమును (వెదురు గంపను) శిరస్సుయందుంచుకుని జాఘంటా నాదముతో శ్రీవారి సన్నిధానమునకు తెచ్చి ఉంచెదరు. అర్చకుడు పుష్పసంచయమును శుద్ధి యొనరించి మామూలు ప్రకారము శ్రీవారికి ఆరాధనము ప్రారంభించును. సాయంకాలౌపయికములగు ఉపచారములను సమర్పించును. శ్రీ జియ్యంగార్లు, శ్రీ వైష్ణవస్వాములు మామూలు ప్రకారము దివ్యప్రబంధము నిత్యానుసంధాన పాశురములను ప్రారంభించెదరు. అర్చకుడు ఉపచారములు పూర్తికాగానే తోమాల సేవ ప్రారంభించును.

## తోమాల సేవ

అర్చకుడు శ్రీస్వామివార్లకు మామూలు ప్రకారము పుష్పసరములు సమర్పించుచుండును. శ్రీ వైష్ణవస్వాములు దివ్యప్రబంధమును గానము చేయుదురు. మంత్రపుష్పము జరుగును. నక్షత్రహారతి అయి

కర్పూరహారతి జరుగును. శ్రీవారికి తోమాలసేవ పూర్తి అగును.

## అష్టోత్తర శతనామార్చనము

అనంతరము శ్రీస్వామివారికి మామూలు ప్రకారం అష్టోత్తరశత నామార్చనము, శ్రీ భూదేవులకు లక్ష్మీనామార్చనము క్రమముగా జరుగును. అర్చనము పూర్తికాగానే మామూలుప్రకారము జియ్యంగార్లకు, స్వాములకు, నామపాఠకునకు శఠారి జరుగును. నివేదనము ప్రారంభమునకుగాను లఘుశుద్ధి జరుగును.

## నివేదనము (ఘంటాకాలము)

పిమ్మట మామూలు ప్రకారము పరిచారకుడు ఆహ్వానించగానే పాక కైంకర్యపరులు పాకశాలనుంచి ప్రసాదములు, దోసెలు పణ్యారములు తెచ్చి శ్రీవారికటాక్షపాత్రమగునట్లు వుంచి వెళ్లెదరు. అర్చక స్వాములు ఆలయములోనికి వచ్చి తలుపులు వేయుదురు. అర్చకుడు మామూలుప్రకారం నివేదనము చేయును. మామూలు ఘంటానాదము జరుగుచుండును. శ్రీవారికి ఆరగింపు పూర్తికాగానే, తలుపులు తీయుదురు. ఘంటానాదము ఆగిపోవును. పాచక కైంకర్యపరులు శ్రీవారికి నివేదితములైన ప్రసాదములను నిర్ణీతస్థానములకు చేర్చెదరు. వెంటనే తిరువీస ప్రసాదము శ్రీవారి నివేదనకై తెచ్చి ఉంచెదరు. అర్చకుడు తలుపులువేసి శ్రీవారి నివేదనము ప్రారంభించును. ఈ నివేదన కాలములో శ్రీవారి ఆలయములో నున్న చిన్న ఘంటను మ్రోగించుచుందురు. నివేదనము పూర్తికాగానే తలుపులు తీయుదురు. వెంటనే పచనకైంకర్యపరుడు, తిరువీస ప్రసాద పాత్రమును తీసికుని వెళ్ళును. ఏకాంతముగా శాత్తుమొర జరుగును. వెంటనే సర్వదర్శనము ప్రారంభమగును.

## సర్వదర్శనము

శ్రీ స్వామివారు ప్రాతఃకాలము మధ్యాహ్నకాలము సర్వదర్శనము లలో దర్శనములేని వారలకు అభ్యాగతులకు దర్శనమిచ్చుటకే ఈ సమయ ములోకూడా సర్వదర్శనము నంగీకరించినారు. భక్తులు మామూలు దర్శనము చేయుచూ విమాన ప్రదక్షిణము చేయుచు కానుకల నర్పించుచూ ఆనందపడుచూ వెళ్ళుచుందురు. శయనాసనమునకు సమయము కాగానే సర్వదర్శనము ఆపివేయబడి స్థానశుద్ధి రంగవల్లులు (ముగ్గులు) యేర్పాటు జరుగును, ఏకాంతసేవ ప్రారంభమగును.

## ఏకాంతసేవ (శయనాసనము)

పూర్వాంగముగా పరిచారకులు శ్రీస్వామివారి గర్భాలయమునకు ముందు ఆలయములో వెండిగొలుసులలో బంగారు మంచమును, అందులో పట్టుపరుపులు, పట్టుదిండ్లు, పట్టుశాటీలు మొదలగు శయన పరికరములను యేర్పాట్లు చేయుదురు. పిమ్మట బహు విధములగు ఫలములు, ద్రాక్ష, శర్కర క్షీరములు, కలకండ, బాదం పప్పు, జీడిపప్పు మొదలగు అనేకములైన అనుభావ్యపదార్థములను, ఏలా లవంగతక్కోల జాజి కర్పూర క్రముకాదిచూర్ణముతో కూడిన తాంబూ లములను తెచ్చి శ్రీవారి సన్నిధానమున ఉంచెదరు. అనంత రము అర్చ కుడు ద్వారము తలుపులువేసి శ్రీవారికి శయనాసనాంగములగు ఉపచార ములుచేసి భోగ్యద్రవ్యములనన్నియు ప్రత్యేకముగా శ్రీవారికి నివేదించి, ముఖవాసమును సమర్పించి పిమ్మట కర్పూరహారతి భక్తిశ్రద్ధలతో నర్పించి ఏకాంతముగా శ్రీవారిపాదములనాశ్రయించి ద్వయము ననుసంధించి క్షమామంత్రమును పఠించి రక్షణ భారమునుంచి మైమరచి ఆనందము

అనుభవించును. ధన్యతావాదము చేయుచూ కౌతుకమూర్తియగు శ్రీభోగ శ్రీనివాసస్వామివారిని ముందు అమర్చియున్న సువర్ణ శయనమందలి పట్టుపరుపులయందు శయనాసనములో వేంచేపుచేయును. ద్వారము తలుపులు తీయబడును. తాళ్ళపాకంవారు అన్నమాచార్యులవారి గీతములను మృదులమగు తాంబురనాదముతో కలిపి శ్రీవారు నిదురించునట్లు గానము చేయుచుందురు. ఏకాంతసేవా దర్శన పరాయణులగు మహానుభావులందరు, నారీమణులందరు శ్రీవారి శయన వైభవమును చూచి ఆనందసముద్రములో మునిగియుందురు. అప్పుడు శ్రీవారికి శయనాసనములో కర్పూరహారతి జరుగును. పిమ్మట తీర్థప్రసాదములు శ్రీస్వాములకు, ఏకాంతసేవాదర్శన పరాయణులకు వినియోగము జరుగును. శ్రీవారి ఏకాంత సేవాదర్శనము చేసుకుని భక్తులు క్రమముగా ఆలయము నుంచి వెళ్ళెదరు. పిమ్మట అర్చకుడు రాత్రిబ్రహ్మాదులు వచ్చి శ్రీవారిని ఆరాధించుటకు తగు తీర్థాది పరికరములను యేర్పాటు చేయించును. పరిచారకులను పంపి తలుపులువేసి, శ్రీవారి సన్నిధికి చేరి అన్ని యేర్పాట్లు చూచి పిమ్మట శ్రీవారికి మానసికములగు మనోరథములను తెలుపుకొని ఆజ్ఞను గైకొని సంప్రదాయానుసారముగా బయలు దేరును. తృతీయద్వారమునకు వచ్చి తలుపులను యంత్రము (తాళము) చే బంధించి సువర్ణద్వారమునకు వచ్చును. అచ్చట అర్చకుడు మంత్రపూర్వకముగా యంత్రికతో (కుంచెకోలతో) సువర్ణ ద్వారకవాటములకు అంతర్బంధమును చేయును. పిమ్మట అధికారులు ఆ తలుపులకు బయట తాళములు రెంటిని వేసి సీళ్ళు వేసెదరు. అందరు భగవద్ధ్యానము చేయుచూ విమాన వందనముతో మహాద్వారమునకుచేరి, రక్షకభటులను నియమించి వారివారి స్వస్థానములకు చేరి కృతార్థులయ్యెదరు.

# గురువారవిశేషము- (పూలంగి)

విభూతిద్వయనాయకుడై ఈ లీలావిభూతియందు చేతనోజ్జీవనార్థము కొంతకాలము నివాసము చేయదలచి తిరుమలయందు అర్చావతారమున వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారికి ప్రతి గురువారము నిత్యకైంకర్యములో విశేషము (పూలంగి) జరుగును. ఈ దినమున భక్తులు తరచుగా తిరుప్పావడను (అన్నకూటోత్సవమును) చేయించుచుందురు.

గురువారమున శ్రీ స్వామివారికి ప్రాతఃకాలారాధనముపూర్తి కాగానే అర్చకులు అంతర్ద్వారము తలుపులువేసి ఏకాంతముగా సళ్ళింపు చేయుదురు. అనగా శ్రీవారికి అలంకరింపబడియున్న సువర్ణాభరణములు, రత్నాభరణములు, సువర్ణహారములు, రత్నహారములు, పీతాంబరములు అన్నియుతీసి భద్రపరచెదరు. మరియు శ్రీవారి పచ్చకర్పూరపు ఊర్ధ్వపుండ్రమును అర్ధభాగమును తగ్గించి భక్తులు శ్రీవారి నయనగోచరముగునట్లును, వారు శ్రీవారి నయనారవింద సౌందర్యమును చూచునట్లును చేసెదరు. పిమ్మట 24 మూర సరిగ పట్టంచు ధోవతిని అతి రమణీయముగా ధరింపచేసి 12 మూరగల అట్టి ఉత్తరీయమును ఉపవీత పద్ధతితో సమకూర్చి, శ్రీపాదములను, శ్రీహస్తములను, శంఖచక్రములను, కర్ణభూషణములను, సువర్ణ సాలగ్రామ హారమును సమర్పించెదరు. వెంటనే అంతర్ద్వారము తలుపులు తీసెదరు.

ఆ సమయమున శ్రీవారు చేతనులకు క్షేమంకరములగు శంఖ చక్రములతోను, క్షేమసూచకములగు వైకుంఠ కటిహస్తములతోను, వస్త్రోత్తరీయములతోను చిత్తహరమగు స్వతస్సిద్ధ దివ్యస్వరూప సౌంద ర్యమును ప్రకాశింపచేయుచూ, వక్షస్థలమున శ్రీ భూదేవులతో వేంచేసి యుందురు.

## శుద్ధి

పిమ్మట దేవాలయములో శుద్ధి జరుగును. శ్రీవారికి మాధ్యాహ్ని కారాధనము ప్రారంభమగును.

## మాధ్యాహ్నికారాధనము

మామూలు మేరకు తోమాల అర్చనము పూర్తి అయిన పిమ్మట నివేదన సమయము వచ్చును.

## మాధ్యాహ్నిక నివేదనము

శ్రీవారికి తిరుప్పావడ కైంకర్యము జరుగు నెడల, ఆస్థాన మండపములో తగిన ఆవరణయవనికను యేర్పాటు చేయుదురు.

## తిరుప్పావడ

పాచకకైంకర్యపరులు ఆరుమూటలు (అనగా 450 కిలోలు) పరిమాణముగల తండులములతో తయారుచేయబడిన అన్నప్రసాద మును (పులిహోరను) గంగాళములతో తెచ్చి ఆ యవనిక (తెర) మధ్యభాగమున శ్రీవారి దృష్టిప్రసారము కలుగునట్లు అన్నరాశిని

చేయుదురు. ఆ అన్నరాశిని కొన్ని పర్వములుగా తయారుచేసి పైభాగమున పెద్ద అన్నకూటమును (శిఖరమును) యెనిమిది దిక్కుల యందు శిఖరములను యేర్పాటుచేసి నారికేళఫలముల యొక్క అర్ధభాగములచేతను, పుష్పములచేతను, అన్ని దిక్కులయందును, ముఖ భాగమందును రమణీయముగా అలంకరించి అన్నరాశిని సిద్ధముచేయుదురు. అందుచే ఈ తిరుప్పావడను అన్నకూటోత్సవమని వ్యవహరించుచున్నారు. పిమ్మట శ్రీవారిసన్నిధి కి విశేషములగు లడ్డు ప్రసాదములు, వడ ప్రసాదములు, అప్పం ప్రసాదములు, దోసె ప్రసాదములు, జిలేబీ ప్రసాదములు, పాయస ప్రసాదములున్నూ, మామూలు ప్రసాదములున్నూ, విశేష ప్రసాదవములున్నూ చేర్చి శ్రీవారి దృగ్గోచరమగునట్లు చేసెదరు.

అంతట మహాఘంటలనుండి ప్రణవనాదము బయలుదేరును. వెంటనే అర్చకులు ఏకాంతముగా శ్రీస్వామివారికి అన్ని ప్రసాదములను ప్రత్యేకముగా నివేదనముచేసి అన్నరాశిని క్రమముగా నివేదనముచేసి నివేదనాంతోపచారములను సమర్పించి నివేదనమును పూర్తి యొనరించెదరు. అంతట శ్రీ భాష్యకారులవారికి నివేదనము జరుగును.

పిదప ఆవరణయవనికను (తెరను) తొలగించి, తిరుప్పావడ వద్దకు ప్రార్థనాపరులగు గృహస్థులను రప్పించి దత్తమును చేయించెదరు. ఇచ్చటనుండియే శ్రీవారికి కర్పూరహారతి జరుగును. అధి కారులకు ఫలతాంబూల బహుమానము జరుగును. అనంతరము అర్చకులు వారి భాగలబ్ధమగు ప్రసాదమును (హళ్ళు) ఈ తిరుప్పావడ నుంచి తీసు కొనెదరు. వెంటనే ఈ ప్రసాదము నుంచి గోష్ఠికి స్థానబహుమానము జరుగును. తరువాత ప్రార్థనాపరులగు గృహస్థులకు వారి బంధువులతో సహా శ్రీవారి దర్శనము జరిగి వారికి వస్త్రబహుమానము జరుగును.

ప్రార్థనాపరులు స్వస్థానమునకు వెళ్ళెదరు. శ్రీస్వామివారి సన్నిధానమున సర్వదర్శనము ప్రారంభమగును.

## సర్వదర్శనము

ఆ సర్వదర్శనములో శ్రీవారు, భక్తులను కన్నులార కటాక్షించు చుందురు, భక్తులు శ్రీవారి కటాక్ష పాత్రులగుచు శ్రీవారి నయనార వింద సౌందర్యమును కన్నులార కాంచుచు బ్రహ్మానందమునను భవిం చుచూ తీర్థాదిస్వీకారము చేయుచూ శ్రీవారి స్వయంవ్యక్త దివ్య స్వరూప సౌందర్య శక్త్యపహృత చిత్తులై వెళ్ళలేక వెళ్ళుచుందురు.

## శుద్ధి

సాయంకాలారాధన సమయముకాగానే సర్వదర్శనము నిలుపబడి దేవాలయ శుద్ధి జరుగును.

## సాయంకాలారాధనము

వెంటనే అర్చకుడు శ్రీవారి సాయంకాలారాధనమునకుగాను నిత్యకర్మలనాచరించి మర్యాదలతో ఆలయమును ప్రవేశించి శ్రీవారి సన్నిధానమునకు చేరును.

అనంతరము శ్రీ జియ్యంగార్లు, ఏకాంగి యమునత్తురై అను పుష్పసంచయస్థానమునకు వెళ్ళి అచ్చట పుష్పకైంకర్యపరుల చేత తయారుచేయబడిన పుష్పమాలికలతోను, పుష్పములతోను నిండియున్న వేణుమయ పాత్రములను (వెదురు గంపలను) రెంటిని జియ్యంగార్లు, ఏకాంగివారు శిరస్సులయందుంచుకుని మామూలు ప్రకారం జాఘంటా

వాద్యముతోను, మంగళవాద్యములతోను ధ్వజప్రదక్షిణముగా సువర్ణ ద్వారమునకు వచ్చి అచ్చట వాద్యములను వదలిపెట్టి శ్రీవారి సన్నిధానమునకు వచ్చి ఆ పుష్పపాత్రములను సమర్పించెదరు.

ఇంతలో అర్చకుడు శ్రీవారికి కపాయిని (గాత్రసంవరణ వస్త్ర విశేషమును) తిరుమేనుకు కిరీటమునకు సమర్పించును. సాయంకాలా రాధనము ప్రారంభమగును. జియ్యంగారు ఆలవట్టముతో (పట్టు విసరెతో) విసరుచూ దివ్యప్రబంధమును గానము చేయుచుందురు. అర్చకుడు శ్రీవారికి ఉపచారములను పూర్తిచేసి అలంకారాసనములో తోమాలసేవ ప్రారంభము చేయును. అంతట జియ్యంగారు, అధ్యాప కులు ఆచార్య, పురుషులు, శ్రీ వైష్ణవస్వాములు అందరు ఆలయము లోని మూడవ అంతర్ద్వారము ముందుకువచ్చి పంక్తులుతీరి పద్మాసన మున కూర్చుండి దివ్యప్రబంధములోని నిత్యానుసంధాన పాశురములను (140) గానము చేయుచుందురు. సువర్ణద్వారమునకు పురోభాగము నగల ఆస్థాన మండపమునందు గరుడాళ్వారు సన్నిధి వద్ద మంగళవా ద్యములు జరుగుచుండును. శ్రీవారి బంగారువాకిలియందుగల మామూలు పరదాను తీసివేసి పూలంగి పరదాను, అనగా మధ్యభాగ మున శ్రీవారి ప్రతిమతో అతిరమణీయముగా తయారు చేయబడిన నగిషీపనిగల 'వెల్వెట్టు' పరదాను కట్టెదరు.

## (పూలంగి) తోమాలసేవ

అర్చకులు ఆ అంతర్ద్వారము యొక్క తలుపులు మూసివేసి ఏకాంతముగా శ్రీస్వామివారికి పుష్పాలంకారమును ప్రారంభించెదరు.

వివిధములై, విచిత్రములై, సుగంధములై, రమణీయములై యున్న పుష్పమాలికలతో శ్రీవారికి వస్త్రరూపముగాను, ఉత్తరీయరూపముగాను

ఆభరణరూపములుగాను, కిరీటరూపముగాను, శంఖ చక్రరూపము గాను, తిరుమేను అంతయు పుష్పమయమగునటుల అలంకరించెదరు. దుష్టశిక్షణ దక్షమగు సూర్యకఠారి అను ఖడ్గమును శ్రీస్వామివారి వామ హస్తమునందుంచి పుష్పమాలలతో నలంకరించెదరు.

ఆ సమయమున పుష్పములతోను పుష్పమాలికలతోను, నిండి అతివిచిత్ర సన్నివేశములో యున్న శ్రీస్వామివారి తిరుమేనునంతయు చూడంచూడ, పూలంగిని ధరించిన శ్రీస్వామివారు పుష్పాస్త్రుడగు మన్మథుని సౌందర్యముకంటె కోటిరెట్లు యెక్కువ సౌందర్యముకలవారై భక్తులకు తమ కోటి మన్మథ సౌందర్యమును చూపనుందురు.

పూలంగి సమర్పణము పూర్తికాగానే అంతర్ద్వారము తలుపులు తీసి శ్రీవారికి కర్పూరహారతి చేసెదరు. ప్రబంధ పారాయణస్వాములు అందరు సన్నిధి కి వెళ్ళెదరు. ప్రబంధపారాయణమును ముగించెదరు. కర్పూరహారతి జరుగును. మామూలు ప్రకారం మంత్ర పుష్పం జరిగి హారతి జరుగును.

## అర్చనము

పిమ్మట మామూలు ప్రకారం శ్రీవారికి తాయార్లకు అర్చన జరిగి కర్పూరహారతి జరుగును.

## నివేదనము

వెంటనే శ్రీస్వామివారికి మళుహోర, పొంగలి, దోసె, పణ్యార ములు కాక విశేషముగా శైత్యోపచారమునకై వడపప్పు, పానకము నివే దనము జరుగును. తిరువీసముకూడా నివేదనము జరిగి ఏకాంతముగా శాతుమొర జరుగును.

## పూలంగిదర్శనము

పిమ్మట అధి కారులు అందరు పూలంగిని ధరించిన శ్రీస్వామి వారిని సేవించి క్షమాపణమును కోరుచూ వెళ్ళుచుందురు.

వెంటనే ఆర్జితముగా పూలంగిదర్శనము★ ప్రారంభమగును. ఈ దర్శనములో పూలంగిని ధరించిన శ్రీస్వామివారిని సేవించిన ప్రతి మానవుడు భక్తుడై మితిలేని ఆనందము కలవాడై తీర్థస్వీకారము చేయుచూ, పాదుకాధారణము చేయుచూ, ధన్యతను తలపోయుచూ శ్రీవారి కటాక్ష పాత్రుడగుచూ వెళ్ళుచుండును.

ఒక్కొక్క గురువారం పూలంగిని ధరించియున్న శ్రీస్వామివారిని సేవించి శ్రీవారి కటాక్ష పాత్రులగుచు వేలాది భక్తజనులు కృతార్థులగు చున్నారు.

## శుద్ధి

ఇటుల ఆర్జితమగు పూలంగి దర్శనము పూర్తికాగానే దేవాలయములో శుద్ధి జరుగును.

## ఏకాంతసేవ

మామూలుప్రకారం ఏకాంతసేవ జరుగును. కైంకర్యపరులు అందరు కోవెల తీర్మానము చేసుకుని స్వస్థానములకు వెళ్ళెదరు. ఇదియే గురువార విశేషము.

---

★ మునుపు ఆర్జితసేవ నుండిన 'పూలంగిసేవ' ప్రస్తుతము 'పూలంగి సర్వదర్శనము'గా మార్చబడినది. కనుక నేడు పూలంగిసేవను ఆర్జితసేవగా నిర్వహించుటలేదు.

# శుక్రవార విశేషము (అభిషేకము)

సకల చరాచర జగన్నియన్తయై శ్రీ వైకుంఠాద్రియని ప్రఖ్యాతి కాంచిన ఈ తిరుమలయందు లక్ష్మీసమాశ్లిష్ట భుజాన్తరుడై అర్చావతార మున వేంచేసియున్న శ్రీవేంకటేశ్వరస్వామివారికి తద్వక్షస్థల నిత్య నివాస రసికురాలగు శ్రీలక్ష్మి అమ్మవారికి ప్రతిశుక్రవారము అభిషే కము జరుగును.

శుక్రవారము ఉదయము శ్రీస్వామివారు గురువారమునాడు రాత్రి ధరించిన పూలంగితోనే విశ్వరూపదర్శనమునిచ్చెదరు.

విశ్వరూపదర్శనము పూర్తిఅయిన పిమ్మట అర్చకులు అంతర్ద్వారము తలుపులు వేసి ఏకాంతముగా శ్రీవారి పుష్పాలంకార మును సళ్ళింపుచేసి ద్వారము తలుపులు తెరచెదరు.

## శుద్ధి

పిదప ఆలయశుద్ధి జరిగి, ప్రాతఃకాలారాధనము ప్రారంభమగును.

## ప్రాతఃకాలారాధనము

మామూలు మేరకు తోమాలసేవ, ప్రభుత్వోత్సవము (కొలువు) అర్చనము, ప్రసాదములనివేదనము, శాత్తుమొర ఏకాన్తముగా జరుగును.

## అభిషేక పూర్వాంగములు

ఇటుల శ్రీస్వామివారికి ప్రాతఃకాలారాధనము పూర్తికాగానే అర్చకులు, యవనికను (తెరను) వేసి ఏకాన్తముగా శ్రీవారికి శుక్రవారనిమిత్తమగు అభిషేకమునకు సంకల్పమునుచేసి ఉచితములైన ఉపచారములు సమర్పించి అష్టోత్తరశతనామార్చనమును చేసెదరు. తరువాత అభిషేకమునకు పూర్వాంగముగా శ్రీవారి ఊర్ధ్వపుండ్రములోని అర భాగమున్ను తగ్గించి సూక్ష్మముగా నూర్ధ్వపుండ్రమునుంచి వస్త్రోత్తరీయముల తొలగించి స్నానశాటీని లేక స్నానకౌపీనమును ధరింపజేసెదరు.

ఈ సమయములో పరిచారకులు శ్రీవారి సన్నిధానమున రెండు వెండి గంగాళముల గోక్షీరములను, రెండు వెండి గంగాళముల శ్రీవారి బంగారుబావి శుద్ధోదకమును సిద్ధపరచెదరు.

ఈ సమయముననే శ్రీస్వామివారి మహాద్వారమున కిరుపార్శ్వములయందును విచిత్రాలంకారవిభూషితములై విష్ణుభక్తులైన గజరాజులోయన ఊర్ధ్వపుండ్రములను ధరించిన శ్రీవారి మత్తగజములు రెండును గజపాలక శాసనములను పరిపాలించుచూ శ్రీవారి అభిషేక దర్శనానంద సమయమును వెల్లడించుచున్నవోయన మహత్తరములైన ఘీంకారములను చేయుచూ భక్తులగు యాత్రికులచే సత్కరింపబడుచూ మహారాజ చిహ్నములై అభిషేకాన్తమువరకు వేచియుండును.

అభిషేక సమయమును పరిపాలించు శ్రీ జియ్యంగార్లు, అధికారులు ఏకాంగులు పరిచారకులు ఆచార్యపురుషులు శ్రీవైష్ణవ స్వాములు శ్రీవారి ప్రథమ ప్రాకారములోని పరిమళం అరకువెళ్ళి అచ్చట యేర్పాటు చేయబడియున్న రజతపాత్రములలో జియ్యంగార్లు శ్రీవారి ఊర్ధ్వపుండ్రమునకుగాను పచ్చకర్పూరము కస్తూరి కలిగియున్న రజతపాత్రమును (వెండిగిన్నెను), అధికారులు కుంకుమపువ్వుతో

తయారుచేయబడిన నలుగుబిళ్ళలు చందనబిళ్ళలు, పసుపు కలిపియున్న రజతపాత్రమును, పరిచారకులు, పచ్చకర్పూరము, కుంకుమపువ్వు, చందనముతో తయారుచేయబడి ''పరిమళం'' అను పేరుతో వ్యవహరింపబడుచున్న సుగంధ పదార్థముతో నిండియున్న రజత పాత్రమును, అభిషేక కైంకర్యపరులగు గృహస్థులు వారి వారి భక్తిశక్త్యనుగుణమగు ఆర్జితములననుసరించి కొందరు పూర్ణాభిషేక సేవానుగుణపదార్థపాత్రములను, కొందరు గంబూరా (పచ్చకర్పూరం) పాత్రములను, కొందరు జాఫ్రా (కుంకుమపువ్వు) పాత్రములను కొందరు పునుగు పాత్రములను, కొందరు కస్తూరి పాత్రములను భక్తిశ్రద్ధలతో తీసుకుని అందరు మంగళ వాద్యములతోను శ్వేతచ్ఛత్రాది మర్యాదలతోను పరివారములతోను, ధ్వజదండప్రదక్షిణముగా విమాన ప్రదక్షిణము చేయుచూ సువర్ణ ద్వారమునకు వచ్చి, అచ్చటనుంచి అధికారులు, జియ్యంగార్లు, ఏకాంగులు, పరిచారకులు అభిషేక కైంకర్యపరులు ఆలయములో ప్రవేశించి ఆ పాత్రములను శ్రీవారికి సమర్పించెదరు. యవనిక (తెర) తీసివేయబడును.

## అభిషేక మహోత్సవము

శ్రీలక్ష్మీ సమాశ్లిష్ట భుజాన్తరుడగు శ్రీవారికి అభిషేక మహోత్సవము ప్రారంభమగును. అర్చకుడు శ్రీస్వామివారి పాదాబ్జములకు శ్రీతాయ్యార్ల వారికిని నమస్కరించి ఉష్ణీషాదులతో నియమింపబడినవాడై అభిషేకమునకు అనువగు పీఠమునందు నిలువంబడి వాఙ్నియమముకలవాడై జియ్యంగార్లు అందిచ్చిన ఆకాశగంగా జలముతో పూరింపబడిన సువర్ణశంఖమును తీసుకొని ''హరిఃఓమ్'' సహస్రశీర్షా పురుషః అని చతుర్వేదశ్రూయమాణమగు పురుషసూక్తం పఠించుచూ

శ్రీతాయ్యార్ల వారితో ప్రకాశించు శ్రీస్వామివారి శిరోభూషణమై పరత్వ జ్ఞాపకమగు కిరీటమునందు భక్తిశ్రద్ధలతో అభిషేకము చేయుచుండును. వేదపారాయణపరులు, వేదవేత్తలు, ఆచార్యపురుషులు శ్రీవైష్ణవస్వాములు ఆ వచనము ననువదించుచూ పంచసూక్తములను పంచోపనిషత్తులను శ్రీవారి అభిషేకాన్తమువరకు అతిమనోహరముగా అతిశ్రావ్యముగా పారాయణమును చేయుచుందురు.

శ్రీస్వామివారికి పురోభాగమున కూర్చునియున్న అధికారులు, అభిషేక కైంకర్యపరులు, అభిషేకదర్శన సేవాపరాయణులైన భక్తులు, భాగవతులు అందరు శ్రీవారితిరుముఖమండల దివ్యసౌందర్యమును బ్రహ్మత్వాదులను ఇవ్వజాలిన కటాక్ష ప్రసారముగల వికసితపుండరీక ములవంటి విశాలనేత్రముల దివ్యసౌందర్యమును, స్మితపూర్ణములగు గండస్థలముల దివ్యసౌందర్యమును, రుద్రేంద్రాదులచే స్తోత్రము చేయబడు నిరతిశయ సౌందర్య సౌకుమార్యాద్యనన్త గుణగుంభితమైన ఆ స్వయంవ్యక్త దివ్యస్వరూపమును సంసారసాగర సముత్తరణ సేతువులై ప్రపన్న జనతా శరణవరణీయములగు దివ్య శ్రీపాదారవింద ములను కన్నులారకాంచి మనసారస్మరించి శ్రీస్వామివారు శ్రీవైకుంఠ మును వదలివచ్చినది మనకొరకేనని తలపోయుచూ పరమానంద సము ద్రములో మునుంగుచూ తేలుచూ ఆనందమునకు మేరలేక ముక్తులవలె ఆనందము ననుభవించుచూ నమస్కరించుచూ అంజలి బంధములను చేయుచూ తన్మయులై మైమరచియుందురు.

## క్షీరాభిషేకము

ఆ సువర్ణ శంఖాభిషేకము పూర్తికాగానే క్షీరాభిషేకము ప్రారం భమగును. అర్చకుడు జియ్యంగారు ఇచ్చెడు క్షీరములతో నిండిన

శంఖములను క్షీరములతో నిండిన పాత్రములను తీసుకుని తదేక ధ్యానముతో శ్రీవారికి క్షీరాభిషేకము చేయుచుండును. వేదవేత్తలు వేదపారాయణమును చేయుచుందురు. భక్తులు శ్రీవారి అభిషేక మహోత్సవమును దర్శించుచుందురు. ఆనందము ననుభవించుచుందురు.

ఇటుల రెండు గంగాళముల గోక్షీరములు పై విధముగా శ్రీవారికి అభిషేకము జరుగగా అభిషేకాన్తమునందు శ్రీవారి వైకుంఠ హస్తమునుండి వచ్చు క్షీరములను పాత్రమునకు సంగ్రహించెదరు. తరువాత భక్తులకు వినియోగము చేయబడును.

## శుద్ధోదకాభిషేకము

పిమ్మట శ్రీ స్వామివారికి శుద్ధోదకాభిషేకము జరుగుచుండ పరిచారకులు శ్రీవారి బంగారు బావినుండి శుద్ధోదకమును కలశములతో తెచ్చి గంగాళములనింపుచుందురు. ఇటుల కొంత సమయము జరిగిన తరువాత అభిషేకమును ఆపి వేసెదరు. వెంటనే అర్చకులు కేసరి బిళ్లలు చందనం బిళ్లలుగల పాత్రమును తీసుకుని ఆ బిళ్లలను శ్రీవారి శ్రీహస్తమందు సమర్పించి వాటిని శ్రీవారి శ్రీహస్తరేఖాంకితములు చేసి తీసుకుని తరువాత అర్చకులు జియ్యంగార్లు, అధికారులు వారల యేర్పాటు ప్రకారం తీసుకొనెదరు.

## ఉద్వర్తనము

పిమ్మట అర్చకులు పరిమళ పాత్రమును తీసుకుని ఆ పరిమళమును శ్రీస్వామివారికి ఆ పాదకిరీటమును శరీరమందంతయు పూసి నలుగిడి శుద్ధోదకాభిషేకమును ప్రారంభించెదరు.

ఆ అభిషేకములో శ్రీస్వామివారి తిరుమేనునందలి పరిమళముతో కలసి జారుచున్న అభిషేకోదకమును అవయవములవారిగాను ఆయుధములవారిగాను అర్చకులు పాత్రములకు సంగ్రహించి అర్చకులు, జియ్యంగార్లు అధికారులు తరువాత వారల యేర్పాటు ప్రకారం తీసుకొనెదరు.

మరియు పరిమళచర్చితమగు శ్రీవారి వైకుంఠహస్తమునుండి జారు అభిషేకోదకమును పాత్రములకు సంగ్రహించి పై వారలు తరువాత వారల యేర్పాటు ప్రకారం తీసుకొనెదరు.

ఇంతియేకాక ప్రత్యేకముగా పరిమళచర్చితమగు శ్రీవారి వైకుంఠ హస్తమునుండి వచ్చు అభిషేక పరిమళ తీర్థమును పాత్రమునకు సంగ్రహించి మాయావిమోచకమగు నా తీర్థమును తరువాత భక్తులకు వినియోగము చేయుదురు.

## శ్రీ లక్ష్మీహరిద్రాభిషేకము

తిరిగి శ్రీవారికి శుద్ధోదకాభిషేకము జరుగును. అర్చకులు ఆ అభిషేకములో అనపాయినియై శ్రీవారి వక్షస్థలమునందు వేంచేసియున్న శ్రీలక్ష్మీ అమ్మవారికి హరిద్రాపాత్రమునుండి హరిద్రను తీసి సమర్పించి అభిషేకమును చేయుచుందురు.

ఈ సమయమున శ్రీవారి అభిషేక దర్శన సేవాపరాయణులగు వారలలో కొందరు శ్రీవారి వక్షస్థలమున దేదీప్యమానముగా వేంచేసి యున్న శ్రీలక్ష్మీ అమ్మవారి దర్శనమును కన్నులారచేసి పరమానంద భరితులై యుందురు.

శ్రీస్వామివారు సువర్ణ నాగాభరణములతో యుండిరిగాన

రుద్రావతారామా; శుక్రవారము అభిషేకము జరుగును గాన శక్త్యవతారమా; పద్మపీఠమునందుండిరి గాన బ్రహ్మావతారమా; లేక కుమారస్వామి అవతారమా; ఇటుల అనేక విధములుగా డోలాయమానమానసులగు కొందరు తమ హృదయములయందు చాలా కాలమునుంచి పాతుకొని యున్న తీరని సందేహములు గాఢమైన కళంకములు, దృఢమైన అభిమానములు అన్నియు పటాపంచలై శమించి పోవుటచే నందరు పరమ వైష్ణవులగుచుందురు.

శ్రీస్వామివారు గురువారమున జగన్మోహనకరమగు పూలంగితో దర్శనమిచ్చి దర్శన సేవాపరాయణులయొక్క హృదయ భూముల యందు భక్తిబీజములను నాటిరి గాన ఈనాడు శుక్రవారమున తమ అభిషేక సమయములో పురుషకారభూతురాలైన శ్రీలక్ష్మి అమ్మవారితో సహా తమ స్వయంవ్యక్త దివ్య స్వస్వరూపదర్శనమిచ్చి ఆ దర్శనసేవా పరాయణులయొక్క హృదయభూముల యందు నాటిన భక్తిబీజములను తమ దయారసముతో నభిషేకముచేసి క్రమముగా అంకురితములను గాను పల్లవితములగాను పుష్పితములనుగాను ఫలితములనుగాను చేయుచుందురు. ఇది చేతన జాతముయొక్క మహాదృష్టముగా భావించవలసియున్నది.

## శుద్ధోదకాభిషేకము

తరువాత శ్రీవారికి తిరిగి శుద్ధోదకాభిషేకము జరుగును. అష్టోత్తర శతకలశములతో (108) అభిషేకము పూర్తియగుచుండ ఆకాశ గంగాజలపూరితమగు సువర్ణశంఖముతో అభిషేకముచేసి అభిషేకమును పూర్తిచేయుదురు. ఆ అభిషేక తీర్థమును పాత్రమునకు సంగ్రహించి, శ్రీస్వామివారి కైంకర్యముచేయు జన్మాన్తర సిద్ధ

మహాదృష్టశాలియగు అర్చకుడు తనశిరస్సున ప్రోక్షించుకుని సన్నిధానముననున్న అర్చకుల యొక్కయు జియ్యంగార్ల యొక్కయు ఏకాంగులయొక్కయు ఆచార్యపురుషులయొక్కయు అధికారుల యొక్కయు శిరస్సులయందు ''పూతోభవ'' అని ప్రోక్షించును.

పిమ్మట యవనికను (తెర) వేయుదురు. అర్చకుడు స్నాన పీఠ మునుంచి దిగును. చతుర్వేదపారాయణము నిలిచిపోవును. వెంటనే జియ్యంగార్లు అధ్యాపకులు ఆచార్యపురుషులు శ్రీ వైష్ణవస్వాములు ద్రావిడవేదము నీరాట్టం 10 పాశురములను అనుసంధానము చేయు చుందురు.

## ప్లోత విమార్జనము

అర్చకులు శ్రీస్వామివారి స్నానశాటీని తొలగించి ప్లోతవస్త్రము (తడితుడిచెడు వస్త్రము)తో శ్రీవారి శరీరమందంతయు తడి లేకుం డునట్లు తుడిచెదరు. శ్రీవారి శిరస్సునకు (కిరీటమునకు) ఒక పాడి వస్త్రమును రమణీయముగా చుట్టెదరు. జియ్యంగార్లు ఆలవట్టముతో (పట్టువిసరెతో) శ్రీవారికి విసురుచుందురు. అర్చకులు శ్రీవారికి 24 మూరపాడవుగల సరిగపట్టంచు ధోవతిని అతి రమణీయముగా ధరిం పచేసి అట్టి 12 మూరగల ఉత్తరీయమును వల్లెవాటుగా వేసి, కర్పూర పాత్రమునుండి పచ్చకర్పూరమును, కస్తూరిని తీసుకొని శ్రీవారి తిరు ముఖమండల కాంతులు ప్రకాశించునటుల యథాప్రమాణముగా సుంద రముగా ఊర్ధ్వపుండ్రమును (నీరుతిరుమణికాపును) సమర్పించెదరు.

దివ్యప్రబంధానుసంధానము ఆగిపోవును. వెంటనే శ్రీవారికి గో నవనీతం (వెన్న) పంచదార నివేదనముచేసి ముఖవాసము (తాంబూ లము)ను సమర్పించెదరు. అంతట సువర్ణ నీరాజన పాత్రమునందు

శ్రీవారికి పచ్చకర్పూరహారతి చేయుచూ తెరను తీయుదురు.

అప్పుడు అభిషేక దర్శన సేవాపరాయణులగు భక్తజనులలో మనోహరమైన ఒక కలకలము బయలుదేరును. అందరు, ఆనందమును ఔత్సుక్యమును మొదలగు భావములను అనుభవించుచూ శ్రీవారి స్వతస్సిద్ధ దివ్య సౌందర్య సన్నివేశాపహృతచిత్తులై దేవత్వమును పొందిన వారివలె రెప్పలను వాల్చక తదేక ధ్యానముతో ఉద్గ్రీవులై (మెడలెత్తిన వారలై) శ్రీవారిని దర్శించుచుందురు. అభిషేకము పూర్తియగుటచే జియ్యంగార్లు అధికారులు మొదలనవారు సన్నిధినుంచి దేవాలయ పురోభాగమునకు వెళ్లుదురు.

పిమ్మట అర్చకులు, ఇతర అధి కారులయొక్కయు శ్రీవారి కైంకర్య పరులయొక్కయు అభిషేక కైంకర్యపరులయొక్కయు, అభిషేక దర్శక సేవాపరాయణులయొక్కయు శిరస్సులయందు శ్రీవారి అభిషేకోదకమును ప్రోక్షించుచూ వారలను పునీతులను చేయుచూ ఆర్జితమగు శ్రీవారి అభిషేక దర్శనమును పూర్తిచేయుదురు.

## అలంకారసమర్పణము

వెంటనే అర్చకులు శ్రీవారి ఊర్ధ్వపుండ్రమునకుగాను శ్రీజియ్యంగారు ఇచ్చిన పచ్చకర్పూర కస్తూరి పాత్రమును తీసుకొన గానే వారు ప్రబంధ తొడక్కంచేసి శేషపరిమళమును వారల యేర్పాటు ప్రకారము తీసుకుని అంతర్ద్వారము ముందు భాగమునకు వెళ్లెదరు. అంతట అర్చకులు అంతర్ద్వారము తలుపులు వేసి ఏకాంతముగా శ్రీవారికి ఊర్ధ్వపుండ్ర వస్త్రాభరణాద్యలంకారములను సమర్పించెదరు. ఆ సమయమున శ్రీ జియ్యంగార్లు, అధ్యాపకులు, ఆచార్య పురుషులు అంతర్ద్వారము యొక్క ముందుభాగమున పంక్తులుతీరి

పద్మాసనమున కూర్చుండి దివ్య ప్రబంధము నాచ్చియార్ తిరుమొళి (150) పాశురములను గానము చేయుచుందురు. పిమ్మట అర్చకులు తగుయేర్పాట్లు చేసుకుని శ్రీవారికి పచ్చకర్పూరముతో మామూలు ప్రకారము ఊర్ధ్వపుండ్రమును మధ్యభాగమున కస్తూరితో తిలకపుండ్రమును అతిరమణీయముగా సమర్పించెదరు. దివ్యప్రబంధగానము ఆగిపోవును.

శంఖచక్రోర్ధ్వ పుండ్రాదులచే చిత్రింపబడిన బంగారుసరిగ పట్టంచుతోకూడిన 24 మూర పొడవు 4 మూర వెడల్పు గల అమూల్యమైన బంగారుసరిగ పట్టుధోవతిని అతిసుందరముగా సమర్పించి, 12 మూర పొడవు 2 మూర వెడల్పుగల అమూల్యమైన సరిగపట్టంచుతో కూడిన పట్టు ఉత్తరీయమును వల్లెవాటుగా వేయుదురు. హృదయ ప్రదేశమునందు కపాయిని (గాత్రసంవరణ వస్త్ర విశేషమును) సమకూర్చి కఠారి వస్త్రమును సమర్పించెదరు. ఈ కఠారి వస్త్రముతో శ్రీవారి సూర్యకఠారియను ఖడ్గ సంబంధము కలిగి ప్రకాశించుచూ భక్తులకు దర్శనమిచ్చుచుండును.

పిమ్మట శ్రీవారికి ఆభరణములను సమర్పించుదురు.

| | |
|---|---|
| సువర్ణపద్మపీఠము | - శ్రీపాదముల క్రింద |
| సువర్ణపాదములు | - శ్రీ పాదములకు |
| నూపురములు(చిరు గజ్జెలతో కూడుకున్నవి) | - శ్రీపాదములకు పైన పాదాభరణములు |
| పాగడాల్ | - నూపురములకు పైన పాదాభరణములు |
| కాంచీగుణము | - మధ్యమాభరణము (మొలనూలు) |

| | |
|---|---|
| ఉదరబంధము (నాగఫణ యుతము) | మధ్యాభరణము (బెల్టు) |
| దశావతారరశనా చిరు గంటలతోకూడినది | దశావతారములు, పంచవ్యూహములు, శ్రీభూదేవులు, స్వామివారు, 18 విగ్రహములతో కూడిన చిరుగంటల మొలత్రాడు |
| చిన్నకంఠాభరణము | కంఠభూషణము |
| పెద్దకంఠాభరణము | వక్షస్థల పర్యన్తము |
| బంగారు పులిగోరుహారము | హృదయపర్యన్తము |
| గోపు హారము | నాభిపర్యన్తము అయిదు పేటల హారము |
| సువర్ణయజ్ఞోపవీతము | రత్నగ్రంథులుగల ఆరుపేటల ఉపవీతము |
| సాధారణ యజ్ఞోపవీతము | షణ్ణవతిచే తయారైన యజ్ఞోపవీతము |
| తులసీపత్రహారము | కటిహస్తపర్యన్తము 108 పత్రముల హారము |
| చతుర్భుజలక్ష్మీహారము | జానుపర్యన్తము 108 లక్ష్మీ ప్రతిమలతోకూడిన హారము |
| అష్టోత్తరశతనామహారము | జంఘాపర్యన్తము (108) అష్టోత్తర శతనామములుగల బిళ్లలతోకూడిన హారము |

| | | |
|---|---|---|
| సహస్రనామ హారము | – | పాదపర్యన్తము (1000) వెయ్యి నామములుకల వెయ్యి బిళ్లలతో కూడిన ఐదువరుసల హారము |
| సూర్య కఠారి | – | నాభ్యాది పాదపర్యన్తము కఠారి వస్త్రమునకు సంబంధించినది |
| వైకుంఠ హస్తము | – | దక్షిణహస్తము |
| కటి హస్తము | – | వామహస్తము |
| కడియములు | – | కర భూషణములు |
| కడియములు | – | భుజదండ భూషణములు |
| నాగాభరణములు | – | భుజదండ భూషణములు |
| భుజకీర్తులు | – | భుజభూషణములు |
| కర్ణపత్రములు | – | కర్ణభూషణములు |
| చక్రశంఖములు | – | ఇతరహస్తములయందు |
| కిరీటము | – | శిరోభూషణము పరత్వ వ్యంజకము |

ఈ ఆభరణములన్నియు సువర్ణాభరణములు. ప్రతి దినమందును సామాన్యముగా సమర్పించబడియుండును.

విశేషదినములయందు విశేషాభరణములు అనగా 1 రత్న కిరీటము, మేరుపచ్చ (గారుత్మతము), రత్నమయ చక్ర శంఖములు:– రత్నమయకర్ణపత్రములు, రత్నమయ వైకుంఠహస్తము, రత్నమయ కటిహస్తము రత్నమయమగు మకరకంఠి (మూడుతరగతులుగా వుండును) సువర్ణ పీతాంబరము – ఈ పదిరత్నాభరణములు

సమర్పించబడుచుండును. కొన్ని కొన్ని దినములయందు వేరుగా సంరక్షింపబడి యున్న సువర్ణాభరణములు రత్నాభరణములు రత్నహారములు పలువిధములైనవి ఉత్సాహానుగుణముగా సమర్పించబడుచుండును.

ఇటుల శ్రీ స్వామివారికి అమూల్యములగు వస్త్రములచేతను, ఆభరణములచేతను హారములచేతను అతిరమణీయముగా వైభవాలంకారము పూర్తి అయిన పిమ్మట అంతర్ద్వారము తలుపులు తీసెదరు.

## సువర్ణలక్ష్మి అభిషేకము

శ్రీస్వామివారి వక్షస్థలమునందు సువర్ణప్రతిమా రూపముగా వేంచేసియున్న శ్రీలక్ష్మీతాయార్లవారికి గర్భాలయమునందు సమంత్రకముగా పరిమళముతోను హరిద్రతోను అభిషేకము జరుగును. దక్షిణ భాగమున అధికారులు, శ్రీవైష్ణవస్వాములు అందరు కులశేఖరపడికి ముందుభాగమునకు వచ్చియుందురు.

అర్చకుడు పంచపాత్రములతోకూడిన వెండిపళ్లెరమునందు శ్రీలక్ష్మీ తాయార్లవారిని సువర్ణపాత్రముపైన స్థానకములో వేంచేపుచేసి శ్రీతాయార్లవారికి అభిషేకానుగుణములగు ఉపచారములను సమర్పించి పంచపాత్రములలోని పరిమళ తీర్థమును సువర్ణశంఖముతో తీసుకొని భక్తితో విధేయతతో ''హరిః ఓమ్'' 'హిరణ్యవర్ణాం హరిణీం' అని శ్రీ సూక్తమును పఠించుచూ అభిషేకము చేయనారంభింపగానే వేద పూతగాత్రులగు వేదపారాయణపరులు అర్చకముఖోద్గతమైన ఆ వాక్యము ననువదించుచూ శ్రీసూక్తమును అతిశ్రావ్యముగా పఠించుచుందురు. అర్చకుడు శ్రీతాయార్లవారికి ఆ శ్రీసూక్తముతో పరిమళాభిషేకమును హరిద్రాభిషేకమును పూర్తిచేసి ప్లోతవస్త్రముతో (తుడిచెడు

పొడివస్త్రముతో) తడిలేకుండునట్లు తుడిచి అనువైన సరిగపట్టు వస్త్రమును ధరింపజేసి తిలకమునుదిద్ది శ్రీవారి వక్షస్థలములో దక్షిణ భాగమున సువర్ణహారముచే మహాభరణముగా వేంచేపుచేయుదురు. భూదేవీవారును శ్రీవారి వక్షస్థలములో వామభాగమున సువర్ణ ప్రతిమా రూపముగా వేంచేపు అయియుందురు. ఇది అనాది ఆచారము.

ఇటుల మనోహర వస్త్రభూషణాద్యలంకృతులై వక్షస్థలమునందు శ్రీభూదేవులతో ప్రకాశించు శ్రీస్వామివారికి నీరాజన పాత్రముచే కర్పూర హారతిజరుగును. ఇదియే అభిషేకమహోత్సవము.

## మాధ్యాహ్నికారాధనము

ఇటుల శ్రీస్వామివారికి శ్రీతాయర్లవారికి శుక్రవారాభిషేకాలంకారాదులు పూర్తి అయిన పిమ్మట శ్రీవారి మాధ్యాహ్నికారాధనమునకుగాను మరియొక అర్చకుడు అహ్నిక కర్మల నాచరించి మర్యాదలతో శ్రీవారి సన్నిధానమునకు వచ్చిచేరును.

పిమ్మట శ్రీ జియ్యంగార్లు మామూలు ప్రకారము యమునత్తురైకి వెళ్ళి తులసీ పుష్పములు పుష్పమాలలుకల వేణుమయ పాత్రమును తెచ్చి శ్రీవారి సన్నిధానమున ఉంచెదరు.

## తోమాలసేవ

అర్చకుడు శ్రీవారికి ఆరాధనము ప్రారంభించి మధ్యాహ్నోచితములగు ఉపచారములను సమర్పించి తోమాలసేవ ప్రారంభించును. జియ్యంగార్లు, అధ్యాపకులు, శ్రీవైష్ణవస్వాములు ''సిరియతిరుమడల్''

అను (72) దివ్యప్రబంధ పాశురములను గానము చేయుచుందురు. తోమాలసేవ పూర్తికాగానే మంత్రపుష్పము జరిగి హారతి జరుగును.

## అర్చనము

వెంటనే అష్టోత్తర శతనామార్చనము, హారతి జరుగును.

## మాధ్యాహ్నిక నివేదనము (రెండవ ఘంట)

అప్పుడు పాచక కైంకర్యపరులు శుక్రవార నిమిత్తకమగు ప్రసాదములు భక్ష్యభోజ్యాదులు శైత్యోపచారమునకై వడపప్పు, పానకము మామూలు ప్రసాదములు తెచ్చి శ్రీవారికి పురోభాగమున నుంచి వెళ్లెదరు. ఘంటానాదము ప్రారంభమగును. అర్చకులు అంతర్ద్వారము తలుపులువేసి శ్రీవారికి ప్రశాన్తముగా నివేదనము చేయుదురు. నివేదనము పూర్తికాగానే తలుపులు తీయుదురు. ఘంటానాదము శమించును. పాచక కైంకర్యపరులు ప్రసాదములను నిర్ణీత స్థానములకు చేర్చెదరు. అర్చకుడు శ్రీవారి పరివారదేవతలకు బలిని సమర్పించి శేషమును భూతపీఠమున చేర్చును. ఈ సమయములో ఇతర దేవులకు శ్రీ భాష్యకారులవారికి నివేదనము జరుగును. ఏకాంతముగా శాత్తుమొర జరుగును.

## కల్యాణాద్యుత్సవములు

అంతట శ్రీమలయప్పస్వామివారు పట్టమహిషులగు శ్రీభూదేవులతో కల్యాణాద్యుత్సవ నిర్వహణార్థమై మహారాజమర్యాదలతో రంగమండపమునకు వేంచేయుదురు. అచ్చట శ్రీవారికి కల్యాణాద్యుత్సవములు, జరుపబడును.

## సర్వదర్శనము

ఇచ్చట శుక్రవారాభిషేకము జరిగి విచిత్రాలంకార విభూషితులై వేంచేసియున్న శ్రీస్వామివారి సన్నిధానమున భక్తులకు సర్వదర్శనము జరుగుచుండును.

## శుద్ధి

శ్రీవారికి సాయంకాలారాధన సమయము కాగానే సర్వదర్శనము ఆపివేయబడి శుద్ధిజరుగును.

పిమ్మట మామూలుమేరకు శ్రీవారికి సాయంకాలారాధనము ఏకాంతసేవ క్రమముగా జరిగి కోవెల తీర్మానము జరుగును. ఇదియే శుక్రవార కార్యక్రమము.

## దైనందిన కార్య సంగ్రహము

1. శ్రీ తిరుమల శ్రీస్వామివారి ఆలయము తలుపులు ప్రతినిత్యము (20) ఇరువది గంటలకాలము తెరువబడి యుండును.
2. విశేష దినములయందు మరియు రెండు గంటల కాలము తెరవబడియుండును.
3. శ్రీవారికి ప్రాతఃకాలమునందు మధ్యాహ్న కాలమునందు సాయంకాలమునందు ఈ మూడు కాలములయందును శ్రీ వైఖానస శాస్త్ర ప్రకారము ఆరాధనము జరుగుచుండును.
4. రాత్రి పూజాన్తమునందు, తలుపులు మూసిన తరువాత బ్రహ్మాది దేవతలు వచ్చి ఆరాధించుటకు తీర్థాది సౌకర్యములు చేయబడును.

5. ఉదయమున విశ్వరూప దర్శనములో బ్రహ్మపూజా ప్రాప్తమైన శ్రీవారి తీర్థమును విశ్వరూపసేవా పరాయణులగు వారలకు వినియోగము జరుగుచుండును.

6. ప్రతిదినమునందును ఆరాధనములు పూర్తి అయిన తరువాత సర్వదర్శనము జరుగుచుండును.

7. ఒక్కొక దినమున సర్వదర్శనములో శ్రీవారిని వేలమందికి పైగా దర్శించుచుందురు.

8. ఒక్కొక దినమున శ్రీవారికి యాత్రికులు లక్షలకు పైగా కానుక లర్పించుచుందురు.

9. ఒక దినమున ఒక యాత్రికుడు శ్రీవారికి యాభై లక్షలు కానుకగా యిచ్చుటకూడా కలదు.

10. శ్రీవారికి భారతీయులేకాక విదేశీయులుకూడా వేలకొలది కానుకలు పంపుచుందురు.

11. ఫలార్థులగు యాత్రికులు భక్తులు ప్రార్థనా ఫలములను పొందియే శ్రీవారికి ప్రార్థనలను సమర్పించుచుందురు.

"వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తికించన।
వేంకటేశ సమోదేవో నభూతో నభవిష్యతి॥
సత్యం సత్యం పున స్సత్యం భుజ ముద్ధృత్యచోచ్యతే॥

ఇతి పరమార్థః

ఓమ్

# శ్రీ వేంకటేశ్వర వైభవము

★

**2**

తిరుమల

శ్రీ వేంకటేశ్వరస్వామివారి

## ఉ త్స వ ము లు

# 2

# తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఉ త్స వ ము లు

## 1. సంవత్సరాది ఆస్థానోత్సవము

శ్రీ వేంకటాద్రియందు చేతన రక్షణార్థమై కలియుగ ప్రత్యక్ష దైవముగా అవతరించియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారికి చాంద్రమాన సంవత్సరాది (ఉగాది) పండుగ దినమునందు ఆస్థానమహోత్సవము జరుగును.

శ్రీస్వామివారికి ప్రాతఃకాలారాధనము పూర్తిఅయినపిమ్మట ఉత్సవమూర్తులగు శ్రీ మలయప్పస్వామివారు తమపట్టమహిషులగు శ్రీ భూదేవులతో సువర్ణద్వారమునకు ముందుగల ఆస్థానమండపమందు సర్వభూపాల వాహనములో వేంచేయుదురు. శ్రీ సేనాధి పతివారు వేరొక పీఠమునందు దక్షిణాభి ముఖముగా వేంచేయుదురు. శ్రీవార్లకు విశేష రత్నమయములగు తిరువాభరణములతో విశేషకౌశేయదుకూలములతో బహు పరిమళ యుతములగు మనోహరములైన పుష్పమాలికలతో అలంకారము సమర్పించెదరు. తరువాత శ్రీస్వామివార్ల సన్నిధానమున మాధ్యాహ్నికారాధనము ప్రారంభమై నివేదమునకు నిత్య ప్రసాదములు,

విశేష ప్రసాదములు, ఆస్థాన ప్రసాదములు సిద్ధపరచి పణ్యారపాత్రము లను పరిచారకులు శిరస్సు యందుంచుకుని, శ్వేతచ్ఛత్రాది మర్యాద లతో మంగళవాద్యములతో శ్రీ జియ్యంగార్లు ఆచార్యపురుషులు ఉద్యోగస్థులు ఆలయప్రదక్షిణముగా శ్రీస్వామివారి సన్నిధానమునకు శ్రీమలయప్పస్వామివారి సన్నిధి కి చేర్చెదరు. వెంటనే శ్రీవార్లకు నివేదనము జరుగును.

తరువాత శ్రీవార్లకు నూతనవస్త్రములు రజతపాత్రము నందుం చినవి శ్రీ జియ్యంగారు శిరస్సునందుంచుకుని శ్వేతచ్ఛత్రాది మర్యాద లతో మంగళవాద్యములతో ఆలయ ప్రదక్షిణముగా శ్రీస్వామివారి సన్ని ధానమునకు వచ్చి సమర్పించెదరు. అర్చకులు ఆ నూతన వస్త్రము లను శ్రీవారికి ధరింపచేసెదరు. పిమ్మట శ్రీవారికి హారతిజరిగి గోష్ఠికి తీర్థవినియోగము జరుగును. మిగిలిన రెండువస్త్రములు గల రజత పాత్రమును శ్రీజియ్యంగారు శిరస్సునందుంచుకుని శ్రీమలయప్పస్వామివారి సన్నిధి కివచ్చి సమర్పించెదరు. ఆ వస్త్రములను అర్చకులు శ్రీమలయప్పస్వామివారికి శ్రీ సేనాధిపతివారికి సమర్పించె దరు. పిమ్మట అర్చకులకు మర్యాదజరిగి శ్రీవారికి అక్షతారోపణము జరుగును. వెంటనే సిద్ధాంతిగారు నూతనపంచాంగమును వివరించెదరు. సిద్ధాన్తిగారికి మర్యాదజరుగును. తరువాత శ్రీస్వామివారికి కొలువు, మాత్రాదానము (తాంబూలదక్షిణాతిల ఫలాదియుతతండుల దానం) జరుగును. వెంటనే శ్రీవారికి హారతులు జరిగి శ్రీజియ్యంగారు వారికి సర్కారువారికి మర్యాదలు జరిగి స్థానబహుమానపూర్వ కముగా ప్రసాదములు పణ్యారములు గోష్ఠికి వినియోగము చేయబడును.

## 2. నిత్యోత్సవము

దేవాదిదేవుడై (తిరుమల) శేషపర్వతమునందు అర్చావతారమున వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి చాంద్ర సంవత్సర ప్రారంభము మొదలుకొని నలుబది దినములు నిత్యోత్సవములు జరుగును. ప్రతిదినము సాయంకాలము శ్రీమలయప్ప స్వామివారు (ఉత్సవ మూర్తులు) బంగారు తిరుచ్చియందు వేంచేసెదరు. రత్నాభరణముల చేతను, పట్టువస్త్రములచేతను, పుష్పమాలికలచేతను శ్రీవారికి అలంకారము జరిగి తిరువీధుల ఉత్సవమును సమస్త పరివారములతో, మంగళవాద్యములతో వేదపారాయణముతో పూర్తి యొనరించుకుని క్రమముగా శ్రీభాష్యకారులవారి సన్నిధి ముఖమండపమునకు వేంచేయుదురు. అచ్చట శ్రీవారికి ఆరాధనము జరిగి తళియలు ఆరగింపు అయి హారతి జరుగును. పిమ్మట శ్రీవారికి సమర్పింపబడియున్న తోమాలను తీసి అర్చకులు శ్రీ భాష్యకారులవారికి సమర్పించి శేష హారతి మొదలగు మర్యాదలను జరిపెదరు. పిమ్మట ప్రసాదముతో అర్చకులకు శ్రీభాష్యకారులవారికి మర్యాదలు జరిగి స్థానబహుమాన పూర్వకముగా గోష్ఠికి ప్రసాద వినియోగము జరుగును. తరువాత శ్రీవారు సన్నిధికి వేంచేయుదురు. (ఈ నిత్యోత్సవములో రెండవదినము మొదలు చివరవరకు శ్రీవారు మాత్రమే తిరుచ్చిలో తిరువీధుల ఉత్సవమునకు వేంచేయుదురు.)

## 3. కొలువు (నిత్యాస్థానోత్సవము)

ఆశ్రితకల్ప భూరుహమై సప్తాచలమున అర్చావతారమున వేంచేసియున్న శ్రీవేంకటేశ్వరస్వామివారికి ప్రతిదినము ఆరాధనాంగముగ కొలువు (ఆస్థానోత్సవము) జరుగును. శ్రీ స్వామివారికి ప్రతిదినము

ఉషఃకాలమునకు పూర్వమే సుప్రభాతము జరిగి విశ్వరూపదర్శనము ప్రారంభమగును. ఆ విశ్వరూప దర్శనమందు రాత్రియందు శ్రీస్వామి వారికి బ్రహ్మాదులు ఆరాధనముచేసి తీర్థస్వీకారము చేయగా మిగిలిన తీర్థమును విశ్వరూప దర్శన పరాయణులగు భక్తులకు వినియోగమైన వెంటనే శుద్ధిజరిగి ఆరాధనాంగముగా తోమాలసేవ ప్రారంభమగును. దివ్యప్రబంధ పారాయణము, చతుర్వేదపారాయణము జరుగుచుండ పరిమళ పరిపూర్ణములగు వివిధములైన పుష్పమాలలను ఆరాధకులు శ్రీస్వామివారికి సమర్పించెదరు. తరువాత, (శ్రీనివాసప్రభువు) కొలువు శ్రీనివాసమూర్తి సువర్ణద్వారము ముందుగల ఆస్థానమండపమునందు అమర్చియున్న సింహాసనమునకు సువర్ణ ఛత్రము, వింజామరలు మొదలగు రాజ మర్యాదలతో వేంచేయుదురు. అచ్చట శ్రీవారికి ఆరాధనముజరిగి శ్రీవారు అర్చకులకు మాత్రాదానము చేయుదురు. ఆరాధకులు శ్రీవారి పాదములయందు మన్త్రపుష్పమును సమర్పించెదరు. మిరాశీదార్లు దివ్య ప్రబంధములను, చతుర్వేదములను, వేదాంగములను ఇతిహాస పురాణములను, కర్మసూత్రములను, బ్రహ్మ సూత్రములను వినిపించెదరు. పంచాంగములో నాటిదినమున జరుగు తిథి వార నక్షత్ర యోగ కరణాదులను విశేషములను పరదినమునందు జరుగు తిథి వార నక్షత్రయోగ కరణాదులను విశేషములను వినిపించెదరు. తరువాత శ్రీ స్వామివారికి పూర్వదినము నందు వచ్చిన ఆదాయమును నాణెముల వారిగా లెఖ్ఖలను వినిపించెదరు. పూర్తికాగానే గుడమిశ్రమగు తిలపిష్టము (నువ్వుపిండి) శ్రీవారికి నివేదనముజరిగి హారతి అయి జియ్యంగార్లకు అధికారులకు మర్యాదలు జరిగి గోష్ఠికి ఆ ప్రసాదము వినియోగము చేయబడును. తరువాత శ్రీస్వామివారు కొలువుచాలించి రాజమర్యాదలతో సన్నిధికి వేంచేయుదురు.

## 4. కల్యాణోత్సవము

సకల కల్యాణగుణాకరుడై, సకల కల్యాణప్రదాతయగు తిరుమల యందు వేంచేసియున్న శ్రీవేంకటేశ్వరస్వామివారికి ప్రతినిత్యము భక్తజన ప్రార్థనా పూర్వకముగ కళ్యాణోత్సవములు జరుగును.

కల్యాణ ప్రార్థనానిర్వహణ కాముకులై భక్తాగ్రేసరులగు యజమానులు కళత్ర పుత్రమిత్ర బంధు సమేతముగా శ్రీస్వామివారి రంగమండపమునకు వచ్చి శ్రీస్వామివారి రాకకై నిరీక్షించుచుండ, శ్రీస్వామివారు ప్రాతఃకాలారాధనమును మాధ్యాహ్నికారాధనమును పూర్తి అయిన వెంటనే తమ పట్టమహిషులగు శ్రీ భూదేవులతో సహ సువర్ణ తిరుచ్చి యందు వేంచేసి వాహనములో ఆనందనిలయ విమాన ప్రదక్షిణముగా పరివారములతో మంగళవాద్యములతో రంగమండపమునకు వేంచేసి భక్త జనము నిర్నిమేషులై అత్యానందముతో చూచుచుండ ఆ వాహనము వీడి శ్రీమలయప్పస్వామివారు ఒక సువర్ణ పీఠమును, శ్రీ భూదేవులు మరియొక సువర్ణ పీఠమును అలంకరించెదరు. వెంటనే ఆచార్యుడు కల్యాణసంబంధమగు వైదికతంత్రము నారంభించి క్రమముగా శ్రీవారి యొక్కయు శ్రీభూదేవులయొక్కయు గోత్ర ప్రవర పూర్వకముగా మంగళసూత్రధారణము మొదలగు కల్యాణ ధర్మములను నడిపించెదరు. పిమ్మట శ్రీవారు శ్రీభూదేవులు పుష్పమాలికలను మార్చుకొందురు. శ్రీవారి పార్శ్వమున శ్రీభూదేవులు తమ స్వస్థానము నలంకరించెదరు. పిదప అక్షతారోపణము సదస్సు జరుగును. పిమ్మట శ్రీవార్లకు ప్రసాద నివేదన జరిగి యజమానులకు వస్త్రాది బహుమానములు జరుగును, తరువాత యజమానులు ధర్మపత్నీ సమేతులైన శ్రీవార్లను సేవించి కృతార్థులై మర్యాదలతో తమ తమ స్వస్థానముల ప్రవేశించెదరు.

## 5. సహస్ర కలశాభిషేకోత్సవము

దేవదేవుడగు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారికి భక్తజన ప్రార్థనా పూర్వకముగా ప్రతిబుధవారము సహస్ర కలశాభిషేకోత్సవము జరుగును. శ్రీవారికి ఆరాధనము అయినపిమ్మట బంగారు వాకిలి ముందు ఆరాధనమండపమున ఏర్పరచిన ప్రత్యేక స్నానపీఠములయందు శ్రీభోగ శ్రీనివాసస్వామివారు, శ్రీ భూదేవులతోటి శ్రీమలయప్పస్వామి వారు, శ్రీ సేనాధిపతులవారు వేంచేయుదురు. వెంటనే బంధు, పుత్ర, మిత్రాదులతో కూడిన అభిషేక ప్రార్థనాకాముకులగు యజమానులతో అధి కారులతో కూడిన భాగవతగోష్ఠి యందు ఆచార్యులవారు అభి షేక సంబంధమగు వైదికప్రక్రియ ప్రారంభించి తీర్థపూర్ణములగు సహ స్రకలశములను నవకలశములను సంస్కరించెదరు. తరువాత హోమ ములు జరిపి వేదఘోషలతో అభిషేకము ప్రారంభమై అంతమున నవ కలశతీర్థముతో సహస్రధారాభిషేకము జరుగును. దీనిని దర్శించి తీర వలెను. శ్రీవారలు వస్త్రాభరణాదులచే నలంకరింపబడి నివేదన జరిగి అక్షతారోపణము జరుగును. యజమానులకు దర్శనము బహుమా నము జరిగి స్వస్థానముల ప్రవేశించెదరు.

## 6. రోహిణీ నక్షత్ర ఉత్సవము

అఖిలజగన్నిర్మాణచతురుడై శ్రీ శేషాద్రియందు వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధానములో శ్రీ రుక్మిణీతాయార్లతో సాక్షాత్కరించుచున్న శ్రీకృష్ణస్వామివారికి ప్రతి రోహిణీ నక్షత్రమునం దును ఉత్సవము జరుగును. రోహిణి నక్షత్రమందు స్వామివారికి ప్రాతఃకాలారాధనము, మాధ్యాహ్నికారాధనము పూర్తి అయిన తరు వాత శ్రీకృష్ణస్వామివారు శ్రీ రుక్మిణీతాయార్ల వారితోసహా తిరుచ్చిలో

వేంచేయుదురు. వెంటనే విశేషములగు కౌశేయాది వస్త్రములతోను రత్నాభరణములతోను ఘ్రాణతర్పణమగు పరిమళములచే పూరితములగు పుష్పమాలికలచేతను శ్రీకృష్ణస్వామివారికి శ్రీరుక్మిణీ అమ్మవారికి అలంకారము జరుగును. కర్పూరహారతిజరుగును. వెంటనే చతుర్వీధుల ఉత్సవమునకు బయలుదేరుదురు. మంగళవాద్యములతోను, పరివారములతోను, శ్వేతచ్ఛత్రములతోను, వేదవేత్తల వేదపారాయణముతోను, దివ్య ప్రబంధవేత్తల దివ్యప్రబంధపారాయణములతోను హస్త్యశ్వాది చతురంగములతోను యాత్రిక భక్తబృందములతోను చతుర్వీధులు ఉత్సవము పూర్తి అయి శ్రీ శ్రీ స్వామివార్ల యొక్క బంగారు వాకిలి ముందు ఆస్థానమండపములో వేంచేయుదురు. అచ్చట శ్రీకృష్ణస్వామివారికి శ్రీ రుక్మిణీతాయార్లకు ఆరాధనము ప్రసాద నివేదనము జరిగి కర్పూరహారతి జరుగును. వెంటనే జియ్యంగారువారికి సర్కారువారికి బహుమానము జరిగి ఆస్థాన బహుమానపూర్వకముగా గోష్ఠికి చందనతాంబూల ప్రసాద వినియోగవు జరుగును. శ్రీ కృష్ణస్వామివారు, శ్రీ రుక్మిణీతాయార్లు లోపలికి వేంచేయుదురు.

## 7. ఆర్ద్రా నక్షత్రోత్సవము

అఖిల భువన నియన్తయై దయాసాగరుడైన, శ్రీవైకుంఠాద్రియని ప్రఖ్యాతిగాంచిన పర్వతరాజమగు తిరుమలయందు అర్చావతారమున వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధానమున యతిరాజగు శ్రీ భాష్యకార్లవారికి ఆర్ద్రానక్షత్ర దినోత్సవము జరుగును.

ఈ దినమున శ్రీస్వామివారికి మాధ్యాహ్నికారాధనము పూర్తి అయిన పిమ్మట శ్రీ మలయప్పస్వామివారు రంగమండపమునకు వేంచేసెదరు. అచ్చట ఆర్జితములగు ఉత్సవములు పూర్తి అయిన తరువాత

ఆర్ద్రానక్షత్రోత్సవమునకై తిరుచ్చినధిష్ఠించి మహాద్వారమువద్దకు వేంచేసెదరు. శ్రీ భాష్యకారులవారు మరియొక తిరుచ్చిలో వేంచేసి శ్రీ స్వామివారికి ఎదురుగావచ్చెదరు. అప్పుడు శ్రీవారికి హారతి జరిగి శేషహారతి పుష్పసరము శఠారి మర్యాదలు శ్రీభాష్యకారులవారికి జరుగును. తరువాత శ్రీ స్వామివారున్నూ శ్రీవారికి ఎదురుగా శ్రీభాష్యకారుల వారున్నూ తిరువీథులలో ఉత్సవమునకు వేంచేయుదురు. ఉత్సవములో గుర్రాలపాగావద్ద నుంచి దివ్యప్రబంధ పారాయణము జరుగుచుండును. తిరువీథుల ఉత్సవము పూర్తి అయి మహాద్వారమునకు వేంచేసినప్పుడు శ్రీవారికి హారతి అయి ఇహల్ గోష్ఠికి శఠారి సాయించెదరు. పిమ్మట శ్రీవారు విమాన ప్రదక్షిణముగా శ్రీభాష్యకారులవారి ఆలయముఖ మంటపమునకు వేంచేసెదరు. శ్రీభాష్యకారులవారు వారి సన్నిధిలోనికి వేంచేసెదరు. అనంతరము శ్రీవారికి నివేదనము అయి హారతి జరుగును. ఆ శేషహారతి శఠారి శ్రీభాష్యకారులవారికి మర్యాద జరుగును. తరువాత శ్రీస్వామివారికి నివేదింపబడిన ప్రసాదములు స్థానబహుమాన పూర్వకముగా గోష్ఠికి భక్తజనులకు వినియోగము చేయబడును. అనంతరము శ్రీస్వామివారు శ్రీవారి సన్నిధానమున స్వస్థానమునకు వేంచేసెదరు.

## 8. పునర్వసు నక్షత్రోత్సవము

అఖిలభూతరక్షాపరాయణులై (తిరుమల) వేంకటగిరియందు వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధానములో శ్రీ సీతా లక్ష్మణులతో సాక్షాత్కరించుచున్న శ్రీరామచంద్రస్వామివారికి ప్రతి పునర్వసు నక్షత్రమునందును ఉత్సవము జరుగును.

ఆ పునర్వసు నక్షత్రదినమునందు శ్రీ వేంకటేశ్వరస్వామివారికి

ప్రాతఃకాలారాధనము, మాధ్యాహ్నికారాధనము పూర్తి అయిన పిదప శ్రీ సీతారామలక్ష్మణ పెరుమాళ్లను బంగారు తిరుచ్చియందు వేంచేయింతురు. వారలకు పట్టువస్త్రములచేతను, తిరువాభరణములచేతను, మనోహరములగు పుష్పమాలికలచేతను చక్కగా అలంకారము జరుగును. శ్రీరామభక్తాగ్రేసరుడగు శ్రీ ఆంజనేయస్వామివారిని వేరొక తిరుచ్చియందు వేంచేపుచేసి వస్త్రాభరణ పుష్పమాలికలచే నలంకారము జరుగును. పిమ్మట శ్రీస్వామివార్లకు హారతి జరుగును. వెంటనే ఆనందనిలయ విమాన ప్రదక్షిణముగా తిరువీధులు ఉత్సవమునకు శ్రీస్వామివార్లు వేంచేయుదురు. సకలపరివారములతోను సకల వాద్యములతోను భక్తబృందములతోను వేదపాఠకులతోను, దివ్యప్రబంధపాఠకులతోను క్రమముగా మహాప్రదక్షిణముగా ఉత్సవముతో శ్రీవారి సన్నిధికి వేంచేయుదురు. అచ్చట శ్రీ స్వామివార్లకు ఆరాధనము ప్రసాద నివేదనము జరిగి హారతి జరుగును. పిమ్మట పుష్పసరము, శేషహారతి శ్రీ ఆంజనేయస్వామివారికి జరుగును. పిమ్మట జియ్యంగారువారికిని, సర్కారు వారికిన్ని మఠం వారికిని బహుమానము జరిగి వెంటనే చందన తాంబూల ప్రసాద వినియోగము స్థానబహుమాన పూర్వకముగా జరుగును. తరువాత శ్రీ స్వామివారు సన్నిధిలోకి వేంచేయుదురు.

## 9. శ్రవణ నక్షత్రోత్సవము

సకల చరాచర నియన్తయై (తిరుమల) శ్రీ శేషభూధరమున వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామివారి శ్రవణనక్షత్రము అవతార నక్షత్రముగాన ప్రతిశ్రవణ నక్షత్రమందును ఉత్సవము జరుగును.

ఈ శ్రవణ నక్షత్ర దినమున ఉదయం శ్రీవారికి తోమాల

అయిన పిమ్మట శ్రీమలయప్ప స్వామివార్లకు పట్టమహిషీలగు ఉభయ నాంచార్లవారికి తిరుమంజనము జరుగును.

మాధ్యాహ్నికారాధనముపూర్తి అయిన పిమ్మట శ్రీమలయప్ప స్వామివారు పట్టమహిషులతో, భక్తజన ప్రార్థనా పరిపూర్తికై కల్యాణమండపము (అనగా రంగమండపము)నకు వేంచేయుదురు. అచ్చట భక్తజన కామితములను పూర్తి యొనరించిన పిదప తమ అవతార నక్షత్రోత్సవమున్నకై పట్టమహిషులతో బంగారు తిరుచ్చియందు వేంచేయుదురు. విశేష రత్నాభరణములతోను విశేషములగు పట్టువస్త్రములతోను పుష్పమాలికలతోను అలంకారము జరుగును. తరువాత కర్పూరహారతి జరిగి, శ్రీ జియ్యంగారు వారికి, సర్కారు వారికి శఠారి అయి విమాన ప్రదక్షిణము సకల పరివారముతో విమాన ప్రదక్షిణముగా చతుర్వీథుల ఉత్సవమునకు సర్వపాప సంచయ నివర్తకమగు దర్శనము భక్తబృందమున కందచేయుచు బయలుదేరెదరు. వేదధ్వానము లొకవంక దివ్యప్రబంధరావము లొకవంక గోవింద ధ్యానము లొకవంక కర్ణములదూరి పాపపుంజముల పారద్రోలుచుండ శ్రీవారు పట్టమహిషీ సమేతముగా దర్శనమిచ్చి నేత్ర సాఫల్యమును చేయుచుండ యాత్రికుల అదృష్టమేమని చెప్పవచ్చును. అది వాచామగోచరము. ఇట్లా చతుర్వీథులు ఉత్సవము జరిగి, బంగారువాకిలి వద్దగల ఆస్థానమండపమునకు శ్రీవారు వేంచేయుదురు. అచ్చట శ్రీవారికి ఆరాధనము ప్రసాద నివేదనము జరిగి హారతి అయి జియ్యంగారు వారికి సర్కారువార్ల బహుమానం జరిగి ఆస్థాన బహుమాన పూర్వకముగా గోష్ఠికి వినియోగము జరుగును. శ్రీవారు సన్నిధిలోకి వేంచేయుదురు.

## 10. శ్రీరామనవమి ఆస్థానోత్సవము

అపార కారుణ్య వారాశియై (తిరుమల) శ్రీ శేషగిరియందు లోక రక్షణార్థమై అర్చావతారమున వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామివారి సన్నిధానమున ప్రతిసంవత్సరము చైత్రశుద్ధ నవమీ శుభదినమున శ్రీరామ స్వామివారికి ఆస్థానము జరుగును.

శ్రీ మహావిష్ణువు త్రేతాయుగమునందు అయోధ్యా పురవాసుల పూర్వజన్మ సహస్రార్జిత పుణ్యఫలమై కౌసల్యా దశరథుల తపః ఫలరాశియై సూర్యవంశమునందు చైత్ర శుద్ధ నవమీ శుభవాసరమున సూర్యాంగారక శని గురుశుక్రులు అయిదు గ్రహములు ఉచ్చస్థులై యుండగా పునర్వసు నక్షత్రయుత కర్కాటక లగ్నమునందు శ్రీరాముడుగా అవతరించెను. అందుచే చైత్ర శుద్ధ నవమీ దినము పవిత్రాతి పవిత్రమైనది. ఆ దినమున సాయంకాలము శ్రీరామస్వామివారికి చతుర్వీథులలో సర్వపరివారములతో మంగళవాద్యములతో హనుమద్వాహనోత్సవము జరుగును. వెంటనే శ్రీ స్వామివారి సువర్ణద్వారము ముందు సర్వభూపాల వాహనములో శ్రీరామచక్రవర్తి స్వామివారు శ్రీ సీతామహాదేవి శ్రీ లక్ష్మణస్వామివారు ఆస్థానమునకై వేంచేయుదురు. శ్రీ ఆంజనేయ స్వామివారు మరియొక పీఠము మీద దక్షిణాభిముఖముగా వేంచేయుదురు. ఆస్థానమండపము శ్రీస్వామివార్లతోను కైంకర్యపరులతోను అధికారులతోను భక్తజనముతోను పరివారముతోను నిండియుండ చూచువారలకు ఆనందపులకాంకురములుత్కటమై శరీర విస్మృతి కలిగి అయోధ్యయందలి శ్రీరామచక్రవర్తి ఆస్థానమును ధ్యానించు చుందురు. అంతట శ్రీరామస్వామివారికి ఆరాధనము జరుగును. ప్రసాదము నివేదింపబడును. అక్షతారోపణము జరుగును. పిమ్మట శ్రీరామస్వామివారి పాదారవిందముల యందుంచిన

శ్రీరామాయణమును ఆరాధకులు మీరాశీదార్లగు పౌరాణికుల కిచ్చెదరు. వారు సంప్రదాయానుసారముగ శ్రీరామజనన భాగమును అతిమనోహరముగా అతిశ్రావ్యముగా పురాణ కాలక్షేపము చేయుదురు. పిమ్మట వారికి బహుమానము జరుగును. వెంటనే శ్రీస్వామివారికి హారతులు జరిగి పిమ్మట శ్రీజియ్యంగారువారికి సర్కారువారికి మర్యాదలు జరిగి, ఆస్థాన మర్యాదల ప్రకారం గోష్ఠికి చందన తాంబూల ప్రసాద వినియోగము జరుగును. తరువాత శ్రీరామ స్వామివారు శ్రీసీతామహాదేవి శ్రీలక్ష్మణస్వామివారు శ్రీఆంజనేయస్వామివారు కొలువుచాలించి శ్రీవారి సన్నిధికి వేంచేయుదురు.

## 11. శ్రీరామపట్టాభిషేకాస్థానోత్సవము

భక్తజన సంరక్షణార్థమై సప్తాచలమునందు (తిరుమల) అర్చావతారమున వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధానమున ప్రతి సంవత్సరం చైత్రశుద్ధదశమీ శుభవాసరమున శ్రీరామచక్రవర్తి స్వామివారికి పట్టాభిషేక మహోత్సవనిమిత్తమగు ఆస్థానము జరుగును.

శ్రీ వేంకటేశ్వరస్వామివారికి ప్రాతఃకాలారాధనము మాధ్యాహ్నికారాధనము పూర్తి అయిన పిమ్మట సాయంకాలము శ్రీ సీతారామలక్ష్మణులను ఒక సువర్ణతిరుచ్చిలోను, ఆంజనేయస్వామి వారిని వేరొక తిరుచ్చిలోను వేంచేపుచేసి విశేషాభరణములతో విశేష కౌశేయములతోను పుష్పమాలికలతోను అలంకరించెదరు. శ్రీరామస్వామివారికి శ్రీఆంజనేయులవారు అభిముఖముగానుండునట్లు యేర్పాటు చేసి చతుర్వీథులలో స్వపరివారములతో మంగళవాద్యములతో ఉత్సవము జరుగును. పిమ్మట శ్రీస్వామివారి బంగారువాకిలి ముందుగల ఆస్థానమండపములో సర్వభూపాలవాహనములో వేంచేయుదురు. కపికుల చక్రవర్తియగు



శ్రీ వేంకటేశ్వరస్వామి వారి రథోత్సవము



శ్రీ వేంకటేశ్వరస్వామి వారి గరుడోత్సవము

సుగ్రీవుడు, యువరాజగు అంగదుడు, శ్రీఆంజనేయస్వామివారు శ్రీవారికి ఎడమపార్శ్వములో దక్షిణాభిముఖముగా వేరు పీఠముల మీద వేంచేయుదురు. ఆచార్యర్చక పరిచారక యజమానులతోటియు, పరివారములతోటియు, భక్తజనముతోటియు నిండి ప్రకాశించు ఆ ఆస్థానమందు, శ్రీవార్లకు ఆరాధనము ఆరగింపు జరుగును. 'తరువాత' త్రేతాయుగమున, అయోధ్యానగరమున అవతరించి దుష్ట శిక్షణము శిష్టరక్షణముకావించి పిదప అయోధ్యానగరము నందు ఛత్ర చామరాది కైంకర్యపరులైనలక్ష్మణ భరతశత్రుఘ్నుల తోటియు, విభీష ణాది రాక్షసవీరులతోటియు, సుగ్రీవాంగద జాంబవద్ధనుమదాది వాన రవీరులతోటియు బ్రహ్మేంద్రాదులతోటియు, దేవబృందములతోటియు, వశిష్ఠవామదేవవాల్మీకి విశ్వామిత్ర మార్కండేయాది మహర్షులతోటియు, మహారాజులతోటియు పౌరజన సహస్రములతోటియు, నిండి ప్రకాశిం చుచున్న నిండు పేరోలగమునందు లోక రక్షణార్థమై శ్రీసీతాదేవీవార్లతో రత్నఖచితసింహాసనము నలంకరించిన ఇనకుల తిలకుడగు శ్రీరామ చక్రవర్తియొక్క పట్టాభిషేకమంగళములను పౌరాణికులు శ్రీరామ పాదారవిందముల యందున్న శ్రీమద్రామాయణమును అర్చకులు వారి చేతికి యివ్వగా పురాణ కాలక్షేపము చేయుదురు. ఆ సమయమున శ్రీరామచక్రవర్తి వారి పాదారవిందముల యందున్న పుష్పమాలికలను రత్నహారములను సుగ్రీవాంగద ఆంజనేయస్వామివార్లకు సమర్పించెదరు. మర్యాదలు జరుగును. పిమ్మట పౌరాణికులకు బహుమానము జరుగును. తరువాత హారతులు జరిగి శ్రీ జియ్యంగారికి సర్కారు వారికి బహుమానము జరుగును. తరువాత చందన, తాంబూల ప్రసా దవినియోగము, ఆస్థాన మర్యాద పూర్వకముగా గోష్ఠికి జరుగును. వెంటనే శ్రీవార్లు శ్రీ స్వామివారి సన్నిధిలోనికి వేంచేయుదురు.

# 12. వసంతోత్సవము

అఖిలజగదుద్భవ స్థితిలయకారకుడై శ్రీ వేంకటాద్రియందు అర్చావతారమున వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారికి ప్రతి సంవత్సరము వసంతర్తువునందు చైత్రమాసమున శుద్ధత్రయోదశీ చతుర్దశీ పూర్ణిమ ఈ మూడు దినములు ఉత్సవములు జరుగును. ప్రథమ దినమున శ్రీవారికి ప్రాతఃకాలారాధనము మాధ్యాహ్నికారాధనము అయిన పిమ్మట శ్రీమలయప్ప స్వామివారు శ్రీ భూదేవులతో బంగారుతిరుచ్చిలో వేంచేసి తిరువీథుల ఉత్సవములో ఆలయమునకు పశ్చిమ భాగమున యున్న వసంతమండపమునకు వేంచేయుదురు. అచ్చట శ్రీవారికి ఆరాధనము జరిగి పిమ్మట అభిషేకము అలంకారము జరుగును. సాయంకాలము ఆస్థానము జరిగి ఉత్సవముతో శ్రీవారిసన్నిధానమునకు వేంచేయుదురు.

రెండవదినము శ్రీమలయప్పస్వామివారు శ్రీభూదేవులతోకూడ ఆరాధనము జరిగి ఉదయమే వెండి రథము నధిరోహించెదరు. ఆ రథోత్సవము పూర్తి అయిన పిమ్మట ఆ రథమును వీడి వసంత మండపమునకు వేంచేయుదురు. అచ్చట ఆస్థానము జరిగి అభిషేకము అలంకారము జరుగును. సాయంకాలము ఆస్థానము జరిగి ఉత్సవముతో తిరువీథులు వేంచేసి శ్రీవారి సన్నిధానమునకు వేంచేయుదురు. మూడవదినమున ఆరాధనము అయిన పిమ్మట శ్రీ మలయప్పస్వామివారు శ్రీభూదేవులతో కూడ ఒక తిరుచ్చిలోను, శ్రీసీతా రామలక్ష్మణులు వేరొక తిరుచ్చిలోను శ్రీరుక్మిణీ సమేతముగా శ్రీకృష్ణస్వామివారు వేరొక తిరుచ్చిలోను శ్రీ ఆంజనేయస్వామివారు మరియొక తిరుచ్చిలోను వేంచేసి తిరువీథుల ఉత్సవముతో వసంతమండపమునకు వేంచేయుదురు. అచ్చట శ్రీవార్లకు ఆస్థానము, అభిషేకము,

అలంకారములు జరుగును. సాయంకాలమున త్రేతాయుగవతారమగు శ్రీరామచంద్రచక్రవర్తిస్వామివారు ద్వాపరయుగావతారమగు శ్రీకృష్ణస్వామి వారు కలియుగ ప్రత్యక్షార్చావతారమగు శ్రీ వేంకటేశ్వరస్వామివారు ఆస్థానముతో వేంచేసియుండ దర్శించిన భక్తకోటియొక్క నేత్ర సాఫల్యము యెంతగా తలంచవలెను. వారి అదృష్టము ప్రమాణాతీత ముగా భావించవలెను. అపూర్వ సంఘటనము శ్రీస్వామివార్ల ఆస్థానము పూర్తి అయిన తరువాత సమస్తపరివారములతోను భక్తబృందముతోను తిరువీథులు ఉత్సవముతో వేంచేసి శ్రీవారి సన్నిధానమున ప్రవేశించెదరు. ఈ ఉత్సవము వసంతర్తువునందు జరుగును, గాన వసంతోత్సవము అనియు సమస్తకామితములను సమకూర్చగలదనియు ఆగమములు చెప్పుచున్నవి.

## 13. శ్రీ భాష్యకారులవారి ఉత్సవము

సర్వపురుషార్థ ప్రదాన చతురుడై వేదపర్వతమని ప్రఖ్యాతిగాంచిన తిరుమలయందు అర్చావతారమున వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సన్నిధానమున వేంచేసియున్న శ్రీ భాష్యకారుల వారికి మేషమాసమున ఆరుద్రా నక్షత్రము జన్మనక్షత్రమగుటచే ప్రతి సంవత్సరము ఆ ఆరుద్రా నక్షత్రమునకు ముందుగా 10 (పది) దినములుగా ప్రారంభించి శ్రీ భాష్యకారులవారికి ఉత్సవములు జరుగును.

మొదటిదినము శ్రీస్వామివారికి ప్రాతఃకాలారాధనము నివేదనము శాత్తుమొర పూర్తి అయిన పిదప అధికారులు అర్చకస్వాములు పరిచారకులు మొదలైనవారు శ్వేతచ్ఛత్రాది మర్యాదలతో పరివారములతో మంగళవాద్యములతో శ్రీవారి శఠారిని వేంచేపుచేసుకుని విమాన ప్రదక్షణముగా శ్రీ భాష్యకారులవారి సన్నిధికి వేంచేయుదురు. అచ్చట

శ్రీ భాష్యకారులవారిని ఒక తిరుచ్చియందు వేంచేపుచేసుకుని తిరు వీధులు ఉత్సవము జరుపుదురు. ప్రదక్షిణముగా మహాద్వారమువద్దకు రాగానే, ఇహల్‌దోశపడి ఆరగింపుజరిగి విమాన ప్రదక్షిణముగా శ్రీ భాష్యకారులవారు తమ సన్నిధిలోనికి వేంచేయుదురు. పిమ్మట ఇహల్‌గోష్ఠికి వినియోగము జరుగును. శ్రీశఠారి శ్రీవారిసన్నిధి ని వేంచేయుదురు. సాయంకాలము నిత్యోత్సవమునకుగాను శ్రీ మలయప్ప స్వామివారు ఒక తిరుచ్చియందును వారి కభిముఖముగా శ్రీ భాష్యకారులవారు మరియొక తిరుచ్చియందును వేంచేసి మహా ద్వారమువద్దకు రాగానే శ్రీమలయప్ప స్వామివారికి హారతి అయి శేష హారతి శ్రీభాష్యకారులవారికి జరుగును. పిమ్మట తిరువీధులు ఉత్స వము జరిగి క్రమముగా శ్రీభాష్యకారులవారి ముఖమండపమునకు శ్రీ మలయప్పస్వామివారు వేంచేయుదురు. అచ్చట శ్రీవారికి ఆరాధ నము, నివేదనములు జరిగి హారతి అయిన పిమ్మట శేషహారతి శేష పుష్పహారము శఠారి మొదలగు మర్యాదలు శ్రీ భాష్యకారులవారికి జరుగును. తరువాత ఆరగింపు అయిన ప్రసాదముగోష్ఠికి ఆస్థాన బహుమాన పూర్వకముగా వినియోగము చేయబడును. శ్రీస్వామివారు సన్నిధి కి వేంచేయుదురు.

## 14. చందన చూర్ణోత్సవము

ఆశ్రితజనకల్పభూరుహమై (తిరుమల) శ్రీ వేంకటభూధరము నందు వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారికి నిత్యోత్సవములో చందన చూర్ణోత్సవము జరుగును.

శ్రీవారికి ప్రాతఃకాలారాధనము మాధ్యాహ్నికారాధనము అయిన పిదప శ్రీ మలయప్పస్వామివారు నిత్యోత్సవమునకై తిరుచ్చిలో

మహాద్వారమువద్దకు వేంచేయుదురు. శ్రీ భాష్యకారులవారు వేరొక తిరుచ్చిలో మహాద్వారమువద్దకు వచ్చి శ్రీ మలయప్పస్వామివారికి అభిముఖముగా నుందురు. అప్పుడు శ్రీ మలయప్ప స్వామివారికిని శ్రీభాష్యకారులవారికిని చందన చూర్ణము (గంధంపొడి) అర్చకులు సమర్పించెదరు. వెంటనే శ్రీవారు తమ పరివారముతో చతుర్వీథులలో ఉత్సవమునకు వేంచేయుదురు. ఆ ఉత్సవ సమయములో ఉత్తర పారుపత్యదారు అనువారు భగవద్భాగవత శేషమగు ఈ చందన చూర్ణమును భక్తజనమునకు యాత్రికులకు వినియోగము చేయుదురు. శ్రీవారు ఉత్సవములో ప్రదక్షిణముగా వచ్చి శ్రీవారిసన్నిధి కి వేంచేయుదురు. పిమ్మట శ్రీవారు శ్రీభాష్యకారులవారి ముఖమండపమునకు వేంచేయుదురు. అచ్చట ఆరాధనము తళియల నివేదనము జరిగి హారతి అయి స్థానబహుమాన పూర్వకముగా గోష్ఠికి వినియోగము జరుగును. తరువాత శ్రీవారు సన్నిధి కి వేంచేయుదురు.

## 15. శ్రీ నృసింహజయన్తి ఉత్సవము

ఆర్తత్రాణ పరాయణుడై (తిరుమల) వేంకటశైలమునందు అర్చావతారమున వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధానమున చాంద్రమాన ప్రకారముగా వైశాఖశుద్ధ చతుర్దశి శుభవారమున ప్రదోషసమయమున శ్రీనృసింహస్వామివారికి జయన్తి ఉత్సవము జరుగును.

ఆ దినము శ్రీస్వామివారికి సాయంకాలారాధనము తోమాల అర్చన, తోమాల దోశవడి ఆరగింపు అయిన పిదప అర్చకస్వాములు శ్రీవారి శఠారిని వేంచేపు చేసుకొని పరివారములతో మంగళ వాద్యములతో విమాన ప్రదక్షిణముగా శ్రీ నృసింహస్వామివారి సన్నిధి కి

వెళ్లెదరు. అచ్చట శ్రీనృసింహస్వామివారికి అభిషేకముచేసి వస్త్రాభరణ పుష్పహారాద్యలంకారములు సమర్పించి ఆరాధనముచేసి తళియలు పానకం, వడపప్పు మొదలగు పదార్థములు నివేదన చేయుదురు.

పిమ్మట దివ్య ప్రబంధపారాయణము శాత్తుమొర జరిగి హారతి అయి జియ్యంగారికి బహుమానము జరుగును. ఆరగింపు అయిన పదార్థములు స్థానబహుమాన పూర్వకముగా గోష్ఠికి వినియోగము జరుగును. పిమ్మట అర్చక స్వాములు శ్రీవారిని వేంచేపు చేసుకొని మంగళవాద్యములతో పరివారములతో ధ్వజప్రదక్షిణముగా శ్రీవారి సన్నిధికి వేంచేయుదురు. పిమ్మట తత్కాలకృత్యములు జరుగును.

## 16. ఆణివర ఆస్థానోత్సవము

అఖిల బ్రహ్మాండ నాయకుడై అపార కారుణ్య సాగరుడై (తిరుమల) శేషాచలమునందు ఆశ్రిత రక్షణార్థమై వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారికి ప్రతి సంవత్సరము దక్షిణాయన ప్రారంభ దినమున ఆనివర ఆస్థానము అనుపేరుతో నొక మహత్తరమగు ఆస్థానోత్సవము జరుగును.

ఆ పర్వదినమునందు శ్రీ స్వామివారికి విశ్వరూపము, తోమాల సేవ జరిగినవెంటనే ఉత్సవమూర్తులగు శ్రీమలయప్పస్వాముల వారికి వారి పట్టమహిషులగు శ్రీ భూదేవులకూ సేనాధిపతియగు విష్వక్సేనుల వారికి ఏకాన్తముగా అభిషేకము (తిరుమంజనము) జరుగును. తరువాత శ్రీ స్వామివారికి అర్చనము జరిగి కొలువు లేకనే (నివేదనము) మొదటిఘంట జరుగును. వెంటనే శ్రీమలయప్పస్వామివారు శ్రీ భూదేవులతో సువర్ణ ద్వారము ముందుగల ఆస్థానమండపమునందు

అమర్చియున్న బంగారు సర్వభూపాల వాహనమందు వేంచేయుదురు. వారలకు వజ్రకవచాద్యాభరణములతో అతిమనోహరముగా అలంకారము సమర్పింపబడును. సేనాధిపతివారు శ్రీవారి పార్శ్వమునందు వేరొక పీఠము మీద దక్షిణాభిముఖముగా వేంచేయుదురు. వారికిని తిరువాభరణములు సమర్పింపబడును. శ్రీవార్లకు అతివైభవముగా పుష్పమాలలతో అలంకారము సమర్పింపబడును. తరువాత శ్రీవారి సన్నిధానములోను, ఆస్థానములోను రెండవ అర్చనము అయిన పిమ్మట పేష్కార్లు, పారుపత్యదార్లు, ఇతర ఉద్యోగస్థులు పెద్దజియ్యంగార్లు, చిన్నజియ్యంగార్లు, ఏకాంగులు, ఆచార్యపురుషులు వెంటరాగా మంగళవాద్యములు, శ్వేతచ్ఛత్రములు, చామరములు వగైరా మర్యాదలతో శ్రీస్వామివారి ప్రసాదములను గమేకార్లు విమాన ప్రదక్షిణముగా ధ్వజప్రదక్షిణము చేయించితెచ్చి శ్రీవారి సన్నిధానమున, ఆస్థానమునందును ఉంచెదరు. వెంటనే శ్రీవార్లకు ఆరగింపు రెండవఘంట సన్నిధిలోను, ఆస్థానములోను జరుగును.

తరువాత శ్రీవారికి నూతన వస్త్రములను ఆరింటిని వెండితట్టయందుంచుకొని జియ్యంగార్లు శిరస్సునవహించి మంగళవాద్యములు, శ్వేతచ్ఛత్రములు వగైరా మర్యాదలతో దేవస్థానం అధికార్లు అందరు వెంటరాగా విమాన ప్రదక్షిణముగా శ్రీస్వామివారి సన్నిధిలోనికి వచ్చెదరు. అర్చకులు ఆతట్టలోని ఆరు వస్త్రములలో నాలుగు వస్త్రములను శ్రీస్వామివారికి సమర్పించెదరు. వెంటనే శ్రీవారికి హారతి జరిగి గోష్ఠికి మామూలు ప్రకారం తీర్థం, ఆలవట్టం, చందనం, శఠారి, మడుపు వినియోగం జరుగును. తరువాత జియ్యంగార్లు మిగిలిన రెండు వస్త్రములుగల తట్టను శిరస్సుయందుంచుకొని ఆస్థానమండపమునగల శ్రీమలయప్పస్వామివార్ల సన్నిధికి వచ్చెదరు. అర్చకులు ఆ రెండువస్త్రములలో ఒక వస్త్రమును శ్రీమలయప్పస్వామివారికి

మరియొక వస్త్రమును శ్రీసేనాధిపతివారికి సమర్పించెదరు. అర్చకులు శ్రీసేనాధి పతివారికి శ్రీపాదవస్త్రవముతో పరివట్టం కట్టి శ్రీ మలయప్పస్వామి వారికి అక్షతారోపణము చేసి సేనాధిపతివారికి శఠారిసాయించి పరివట్టంబిచ్చెదరు. అర్చకులకు శఠారిమర్యాదలు జరుగును. తరువాత ఆస్థానము (కొలువు) అయి హారతి జరుగును. వెంటనే పెద్దజియ్యంగారు వారికి పరివట్టముకట్టి శ్రీవారి పాదారవిందములయందుంచబడిన వారి స్వంత మొహరును వారిచేతికి యిచ్చి దేవస్థానంలచ్చన అనుబీగాల్లగుత్తిని వారి చేతికి తగిలించి చందన తాంబూలాది మర్యాదలు చేసెదరు. తరువాత ఆ లచ్చన అను బీగాలగుత్తిని శ్రీస్వామివారి పాదారవిందములయందుంచెదరు. చిన్న జియ్యంగారువారికి వారిస్వంత మొహరును వారిచేతికి యిచ్చి పై విధముగా వారికిని మర్యాదలు జరుగును. తరువాత ఏకాంగి వారికి, తరువాత దేవస్థానం కమిటీవారి తరపున ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు వారికి యావత్తు మర్యాదలు జరుగును. ఎగ్జిక్యూటివ్ ఆఫీసరువారికి మాత్రము శ్రీవారి పాదములయందుంచబడిన సర్కారు మొహరు ఇవ్వబడును. తరువాత ఆస్థానములో నజరానాకానుకలను ఏకాంగివారు వసూలుపరిచి సర్కారు వారి వశంచేసెదరు. వారు చిట్టాను జమకట్టె దరు. తరువాత ట్రస్టీలు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు, పేష్కారు, పారు పత్యదారు, మైసూరురాజా, తాళ్ళపాకంవారు, తరిగొండవారు వీరి యొక్క హారతులు చేయబడును. తరువాత ట్రస్టుఫండు హారతులు రూపాయ హారతులు జరుగును. తరువాత జియ్యంగారు వారికి, ట్రస్టీలకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసరువారికి మర్యాదలు జరుగును. పిమ్మట శ్రీ స్వామివారికి నివేదింపబడిన చందన, తాంబూల ప్రసాదములు గోష్ఠి మర్యాద ప్రకారముగాను, ఇష్టవినియోగ ప్రకారముగాను జరుగును: తరువాత యాత్రికులకు ప్రసాదవినియోగము వగైరాలు

జరుగును. శ్రీస్వామివారు శ్రీభూదేవులతో, శ్రీ సేనాధిపతివారితోను ఆస్థానము నుండి సన్నిధికి వేంచేయుదురు. ఇదియే ఆనివర ఆస్థానోత్సవము.

## 17. శ్రీ నారాయణగిరౌ ఛత్రస్థాపనోత్సవము

విభూతిద్వయ నాయకుడై కలియుగ వైకుంఠమని పేరు కాంచిన తిరుమలయందు అర్చావతారమున వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామివారి శ్రీ పాదముద్రలతో ప్రకాశించు శిలాఫలకముతో ప్రఖ్యాతి గాంచిన నారాయణగిరి యందు ప్రతి సంవత్సరము శయనైకాదశీ (ఆషాఢశుద్ధైకాదశీ) పర్వదినమున అనగా ద్వాదశీ దినమునందు శ్రీపాదపూజాఛత్రస్థాపన ఉత్సవములు జరుగును.

శ్రీస్వామివారికి ప్రాతఃకాలారాధనము మాధ్యాహ్నికారాధనము పూర్తి అయిన తరువాత అర్చక స్వాములు, ఏకాంగులు అధికారులు పరిచారకులు మొదలగు కైంకర్యపరులు రెండు భూచక్రగొడుగులను యమునోత్తరమునుండి పుష్ప సరములను సువర్ణ కూపతీర్థమును తీసుకొని మంగళవాద్యములతో మహాప్రదక్షిణముగా బయలుదేరి మేద రగోటువద్దకు వచ్చి వాద్యములను నిలిపి నారాయణగిరికి వెళ్ళె దరు. అచ్చట శిలాఫలకము నందుగల శ్రీవారి పాదములకు సువర్ణ కూప తీర్థముతో అభిషేకముచేసి టెంకాయలు కొట్టి ఆరగింపు చేసె దరు. పిమ్మట హారతి అయి ఆరగింపు అయిన టెంకాయలు స్థానబ హుమాన పూర్వకముగా గోష్ఠికి వినియోగము జరుగును. పిమ్మట శ్రీవారిపాదములకు ప్రాంతమునగల చెట్లకు భూచక్రగొడుగులు కట్టబడును. వెంటనే కైంకర్యపరులు భక్తులు అందరు నారాయణగిరి దిగి బంగాళా తోటకు వచ్చి అచ్చట శ్రీస్వామివారి ప్రసాదము స్థాన

బహుమానపూర్వకముగా వినియోగము చేయబడి వనభోజనము జరుగును. పిమ్మట మంగళవాద్యములతో నందరు భగవన్నామసంకీర్తనముతో మహాద్వారమునకు వచ్చెదరు. శ్రీవారి కైంకర్యములను నిర్వర్తించెదరు.

## 18. పవిత్రోత్సవము

అఖిలహేయప్రత్యనీక కల్యాణగుణాకరుడై తిరుమల (శ్రీవేంకటాద్రియందు అర్చావతారమున వేంచేసియున్న) శ్రీవేంకటేశ్వర స్వామి వారికి ప్రతిసంవత్సరము శ్రావణ శుద్ధ దశమీ శుభవాసరమున అంకురార్పణము జరిగి, ఏకాదశీ, ద్వాదశీ, త్రయోదశీ మూడు దినములయందు పవిత్రోత్సవము జరుగును. పవిత్రోత్సవము అనగా పట్టుతో పూసలుగా అమర్చబడిన మాలలను ప్రతిష్ఠించి శ్రీ స్వామివారికి వారి పరివారదేవతలకు సమర్పణము చేయు ఉత్సవము. ఆగమ శాస్త్రమిట్లు చెప్పుచున్నది. అర్చావతారమున వేంచేసియున్న భగవంతునకు జరుగవలసిన నిత్య పూజనములును బ్రహ్మాదులైనను శాస్త్రప్రకారము జరుపుటకు శక్తులు కానేరరు. అల్పజ్ఞులగు మానవులకు భగవత్పూజన మతిదుస్సాధ్య మగుచున్నది. అందుచే సంవత్సరము భగవత్పూజనము చేయుటలో న్యూనాతిరిక్త దోషములు అనేకములు సంభవించగలవు. అట్లు అజ్ఞానముచే సంభవించిన శ్రీస్వామి సంవత్సరపూజనములోని దోషములును ఈ పవిత్రోత్సవముచే తొలగిపోవును. గాన శ్రీ స్వామివారికి ప్రతి సంవత్సరము పవిత్రోత్సవము చేయతగియున్నది. మరియు పురుషార్థ కాముకులగు మానవులు శ్రీస్వామివారికి ఈ పవిత్రోత్సవము చేసినను, చేయించినను, ధర్మమును, అర్థమును, కామమును మోక్షమును సర్వవిధములగు వాంఛితములను బడయగలరు.

## 19. శ్రీవరాహజయన్తి ఉత్సవము

సర్వ జగన్నియమ నాధ్యక్షుడై (తిరుమల) పుణ్య భూధరమగు శ్రీ వేంకటాద్రియందు అర్చావతారమున వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామివారికి మాననీయుడగు శ్రీ వరాహస్వామివారికి ప్రతి సంవత్సరము శ్రావణమాసమున శ్రవణనక్షత్రము శుభవాసరమున జయన్తి ఉత్సవము జరుగును.

ఆ దినమున శ్రీ స్వామివారికి రాత్రికైంకర్యములు జరిగి తీర్మానమునకు ముందుగా అర్చకస్వాములు, పాచకులు, పరిచారకులు మొదలగు కైంకర్యపరులు అందరు శ్రీ వరాహస్వామివారి సన్నిధానమునకు వచ్చెదరు. అచ్చట శ్రీవరాహస్వామివారికి ఆరాధనము ప్రసాదతళియలు నివేదనము జరుగును. హారతి అయిన పిమ్మట ఆరగింపు అయిన ప్రసాదములు స్థానబహుమాన పూర్వకముగా గోష్ఠికి వినియోగము జరుగును. పిమ్మట కైంకర్యపరులు శ్రీవారి సన్నిధానమునకు వచ్చెదరు.

## 20. గోకులాష్టమీ ఆస్థానోత్సవము

చరమపురుషార్థ ప్రధానచతురుడై శ్రీవేంకటమహీధరమునందు అర్చావతారమున వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామివారి సన్నిధానమున ప్రతి సంవత్సరము శ్రావణ బహుళ అష్టమీ శుభవాసరమున గీతాప్రదాతయగు శ్రీ కృష్ణస్వామివారికి ఆస్థానము జరుగును.

ఈ దినమున సాయంకాలమున శ్రీ కృష్ణస్వామివారు శ్రీవారి సువర్ణద్వారము ముందుసర్వభూపాల వాహనములో వేంచేసెదరు. అచ్చట శ్రీ కృష్ణస్వామివారు రత్నాభరణములతోను,

కౌశేయములతోను పుష్పసరములతోను, అతిమనోహరముగా అలంకరింపబడెదరు. వెంటనే శ్రీవారికి ఆరాధనము, ఆస్థాన తళిగలు నివేదనము జరుగును. పిమ్మట జియ్యంగారువారికి మర్యాద జరిగి ప్రబంధ శాత్తుమొర జరుగును. వెంటనే ఆరాధకులకు మర్యాదలు జరిగి శ్రీవారికి అక్షతారోపణము జరుగును. ఆరాధకులు శ్రీవారి పాదారవిందములయందుంచిన శ్రీభాగవతమును పౌరాణికులకిచ్చెదరు. వారు శ్రీకృష్ణావతార ఘట్టమును అతిమనోహరముగా ఆస్థానమందు ఏకాగ్రచిత్తముతో శ్రీకృష్ణధ్యానము చేయుచున్న భక్తజనము ఆనందము నొంద పురాణ కాలక్షేపము చేయుదురు. తరువాత పౌరాణికులకు మర్యాదలు జరుగును. తరువాత శ్రీవార్లకు హారతులు జరిగి శ్రీ జియ్యంగార్లకు సర్కారుకు మర్యాదలు జరుగును. వెంటనే స్థానబహుమానపూర్వకముగా ప్రసాదములు పణ్యారములు గోష్ఠికి వినియోగము జరుగును. తరువాత శ్రీ స్వామి వారు సన్నిధి కి వేంచేయుదురు. తరువాత పౌరాణికులును మర్యాదలతో విడిదికి వెళ్లెదరు.

## 21. (శిక్య) ఉట్ల ఉత్సవము

అఖిల వేదవేదాన్తవేద్యుడై (తిరుమల) వేంకటశైలాగ్రమున వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారికి ప్రతిసంవత్సరము శ్రావణ బహుళాష్టమి దినమున గోకులాష్టమీ ఆస్థానమునకు మరుదినమునందు (ఉట్లు) శిక్యోత్సవము జరుగును.

శ్రీ స్వామివారికి ప్రాతఃకాలారాధనము, మాధ్యాహ్నికారాధనము అయిన తరువాత ఉత్సవమూర్తులగు శ్రీమలయప్పస్వామివారు ఒక తిరుచ్చిమీదను, శ్రీకృష్ణస్వామివారు మరియొక తిరుచ్చిమీదను వేంచేసి

విమాన ప్రదక్షిణముగా ధ్వజస్తంభమువద్ద నుంచి యమునోత్తరములో శ్రీమలయప్పస్వామి వారును, పడిపోటువద్దనుండు చతుస్తంభమండపము నందు శ్రీకృష్ణస్వామివారును వేంచేసెదరు. పిమ్మట శ్రీవార్లకు దోశవళ్ళు ఆరగింపు జరిగి హారతిఅయి ఏకాంగివారికిని యమునోత్తరం వారికిని మర్యాదలుజరిగి దోశపళ్ళు స్థాన బహుమాన పూర్వకముగా గోష్ఠికి వినియోగము జరుగును. ఇట్లుగా అనాది ఆచారముగా వచ్చు చున్న పెద్దజియ్యంగారు మఠం వగైరా 16 స్థలములలో శ్రీ స్వామి వార్ల వేంచేసి ఆరగింపు హారతి బహుమానం వినియోగములు జరుగుచు తిరువీథుల ఉత్సవము జరుగును. చతుర్వీథ్యుత్సవములో మధ్యమధ్యన వీథులలో యేర్పరచిన ఉట్లు కూడా భక్తజనమునకు ఆ యాత్రికజనమునకు ఆనందము కలుగునట్లు కొట్టుచు ఉత్సవమును జరిపెదరు.

## 22. అనంతపద్మనాభ చతుర్దశీ ఉత్సవము

భక్తజనకల్పమహీరుహమై ప్రణతార్తిహరుడై వేదాద్రియని పేరు కాంచిన తిరుమలయందు అర్చావతారమున వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధానము ప్రతి సంవత్సరము భాద్రపద శుద్ధ చతుర్దశీదినమున శ్రీవారి చక్రత్తాళ్వారు వారికి ఉత్సవము జరుగును.

ఈ దినమునందు శ్రీస్వామివారికి ప్రాతఃకాలారాధనము పూర్తి అయిన పిమ్మట శ్రీచక్రత్తాళ్వారు తిరుచ్చిలో అధివసించి మహాప్రదక్షిణముగా తిరువీథుల ఉత్సవముతో వేంచేయుచు శ్రీవరాహస్వామివారి దేవస్థానమునకు ముందుగల మండపమునందు వేంచేయుదురు. అచ్చట వారికి అభిషేకము అయి పుష్కరిణిలో స్నానము జరుగును. పిమ్మట

వారికి పుష్పాద్యలంకారము ఆరాధనము దోశెపడినివేదనము జరిగి హారతి అగును. తరువాత ఏకాంగులకు మర్యాద జరిగి క్రమముగా ఉత్సవములో శ్రీస్వామివారి సన్నిధానమునకు వేంచేయుదురు. అనంతరము అనంతపద్మనాభ వ్రతమునకు సంబంధించిన పట్టుతోరము లను శ్రీస్వామివారికి సమర్పణము చేయుదురు. అనంతరము అర్చకులు, ఏకాంగులు, ఉద్యోగస్థులు వగైరాలు ఆపట్టు తోరములను ధరించెదరు.

శ్రియైనమః
శ్రీ శ్రీనివాసాయనమః
శ్రీ వేంకటాద్రి నిలయః కమలాకాముకః పుమాన్,
అభంగుర విభూతి ర్న స్తరంగయతు మంగళమ్.

## 23. బ్రహ్మోత్సవము

శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడై (తిరుమల) శ్రీ శేష పర్వతమునందు భక్తజన కామితార్థప్రదుడై అర్చావతారమున వేంచేసి యున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారికి ప్రతి సంవత్సరము కన్యామాసము నందు (ఆశ్వీయుజ మాసమునందు) శుక్లపక్షమున శ్రవణ నక్షత్రము నందు అవభృథమును (చక్రస్నానమును) సంకల్పించి తొమ్మిది దినములు ముందుగా ధ్వజారోహణము చేయబడును. అందుకు పూర్వదినమున అంకురార్పణము చేయబడును. ఈ దినమున సాయం కాలము శ్రీ విష్వక్సేనులవారికి (సేనాధిపతివారికి) చతుర్వీథుల ఉత్సవము చేయబడును. మృద్గ్రహణము కూడా జరుగును. దేవాలయ

మునకు వేంచేసిన తరువాత యాగశాలయందు అంకురార్పణము జరుగును. తరువాత తొమ్మిది దినములలో మొదటిదినము సాయంకాలము ధ్వజారోహణము జరిగి ప్రతిదినము ఉదయము రాత్రి ఆయా నిర్ణీత వాహనములతో శ్రీ స్వామివారికి ఉత్సవములు జరుగును. ఇదియే బ్రహ్మోత్సవము, విశేష మేమన - మూడు సంవత్సరములకొక పర్యాయము అధిక మాసము వచ్చినప్పుడు రెండు ఉత్సవములు జరుగును. మొదటి ఉత్సవము మామూలు బ్రహ్మోత్సవము ప్రకారము జరుగును. రెండవ నవరాత్రి ఉత్సవములయందు ధ్వజారోహణము, రథము ధ్వజావరోహణములేకనేజరుగును. నవరాత్రి ఉత్సవములయందు ప్రతిదినము పగలు రాత్రి రంగమండపమునందున్న పెద్దశేషవాహనముపై శ్రీ మలయప్ప స్వామివారిని ఉభయనాంచార్లను ఉత్సవానంతరము వేంచేపుచేసి ఆస్థానము జరుగును.

భవిష్యోత్తర పురాణము శ్రీస్వామివారి బ్రహ్మోత్సవమును గూర్చి ఇట్లు చెప్పుచున్నది. బ్రహ్మదేవుడు ఉత్సవమునకు ఆహూతులైన మహర్షులతోటి, మహారాజులతో, భక్తజనకోటితో, చతురంగబలములతో నిబిడీకృతమైన శ్రీ వేంకటాద్రియందు కన్యా మాసమున ప్రతిపద్దినమునందు శ్రీ వైఖానసులచే బ్రహ్మోత్సవమునకు అంకురార్పణము చేయించి ద్వితీయదినమునందు రత్నమయమగు నరయానమున ఉత్సవ శ్రీనివాసస్వామివారిని వేంచేపు చేయించి చైత్య ప్రదక్షిణము కావించి ధ్వజారోహణము నిర్వర్తించెను.

ప్రథమ దినమున :- మనుష్యాందోళికా, (పల్లకి)
(ధ్వజారోహణమునకు)
రాత్రి - శేషవాహనము.

ద్వితీయ దినమున :- ఉదయం -శేషవాహనము
రాత్రి - హంసవాహనము.

తృతీయ దినమున :- ఉదయం - సింహవాహనము
రాత్రి - మౌక్తికమండపము.

చతుర్థ దినమున :- ఉదయం - కల్పవృక్షము
రాత్రి - సర్వభూపాలవాహనము.

పంచమ దినమున :- ఉదయం - ఆందోళికా (పల్లకి) (అమృత ప్రదానము చేయు మోహినీ అవతారమునకు).
రాత్రి - గరుడవాహనము.

షష్ఠ దినమున :- ఉదయం - హనుమద్వాహనము సాయం - మంగళగిరి వాహనము (పట్టమహిషీయుతుడైన శ్రీస్వామివారికి వసంతోత్సవానురాగవుచే) రథరంగడోలోత్సవము.
రాత్రి - గజవాహనము.

సప్తమ దినమున :- ఉదయం - సూర్యమండల వాహనము
సాయం - మంగళగిరి వాహనము (ఉద్యాన విహారానురాగముచే)
రాత్రి - చంద్రమండలవాహనము.

అష్టమ దినమున :- రథవాహనము (నానాలంకారభూషితము)
రాత్రి - అశ్వవాహనము.



శ్రీ వేంకటేశ్వరస్వామి వారి శేషవాహనము



శ్రీ వేంకటేశ్వరస్వామి వారి హంసవాహనము



శ్రీ వేంకటేశ్వరస్వామి వారి చక్రస్నానము



శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సర్వభూపాలవాహనము

నవమ దినమున :- ఆందోళికా -మంగళగిరి వాహనము
హరిద్రాభి షిక్తుడై అవభృథస్నానలోలువుడైన శ్రీవారికి
రాత్రి - మంగళగిరి వాహనము
(ధ్వజావరోహణమునకు)

పరదినమున:- పుష్పయాగమహోత్సవము ఇట్లుగా బ్రహ్మదేవుడు శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి పదకొండు దినములు ఉత్సవము జరిపించెను. బ్రహ్మదేవుడు ఈ ఉత్సవములు జరిపించుటచేత నీ ఉత్సవమును బ్రహ్మోత్సవము అనుచున్నారు. ఇందులకు తార్కాణముగా ప్రతిదినమునందును ప్రతి ఉత్సవములోను ముందుగా బ్రహ్మరథము అను పేరుతో నానావిధాలంకార భూషితమును మనోహరమును అగునొక చిన్నరథము బయలుదేరుచుండును.

ఆగమ శాస్త్రము:- ఈ ఉత్సవము బ్రహ్మసంఖ్యాకమగు తొమ్మిది దినములు జరుగుటచేత సర్వకామ ప్రదమగు బ్రహ్మోత్సవము అని చెప్పుచున్నది.

పరంబ్రహ్మయగు సర్వేశ్వరుని ఉత్సవమగుటచేత నీ ఉత్సవ మును బ్రహోత్సవమని సంప్రదాయ వేత్తలు చెప్పుచున్నారు.

ఇప్పుడు బ్రహ్మోత్సవానంతరము పరదినమున పుష్పయాగ మహోత్సవము జరుగుటలేదు.

## 24. డోలోత్సవము (ఊంజలి సేవ)

అఖిల భువన జన్మస్థితి లయకర్తయై చేతన సంరక్షణార్థము

(తిరుమల) శేషాద్రియందు అర్చావతారమున వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి ప్రతి సంవత్సరము కన్యామాసము నందుగాని, ఆశ్వయుజమాసమున నవరాత్రులు యందుగాని జరుగు బ్రహ్మోత్సవము నందు ప్రతిదినము రాత్రులయందు వాహనోత్సవము జరుగుటకు ముందుగా శ్రీవారి ఆలయమునకు ముందుగల తూర్పు వీథిలోని డోలామండపము నందు, సువర్ణ రత్నాభరణకౌశేయాదివిభూషితులై పుష్పమాలాలంకృతులైన ఉత్సవ శ్రీనివాసమూర్తి యగు శ్రీ మలయప్పస్వామివారు దివ్యాలంకార విభూషితులగు పట్టమహిషులతో కూడుకుని, ప్రాగ్దక్షిణవీథుల యందున సోపానములయందును ఉండి వేలాది యాత్రికభక్తజనులు బంధు మిత్ర కళత్రాదులతో నిర్నిమేషులై ఆనందపరిపూర్ణులై తదేకదృష్టితో సేవించుచుండ డోలావిహారము చేయుదురు. ఇది డోలోత్సవము (ఊంజలి సేవ) లీలారసాస్వాదన లోలుపులైన పట్టమహిషులతో కూడుకొనిన శ్రీ స్వామివారి ముఖోల్లాసార్థము చేయు నీ డోలోత్సవము (ఉయ్యాల సేవ) దిదృక్షువులగు భక్తజన సముదాయములకు ఆనందాతిరేకమును, భక్తి పరాకాష్ఠను, శ్రద్ధాతిశయమును, వాంఛితార్థ సిద్ధిని కలుగచేయునని శాస్త్రములు చెప్పుచున్నవి.

## 25. విజయదశమీ పార్వేట ఉత్సవము

అఖిల బ్రహ్మాండచక్రవర్తియగు తిరుమలయందు వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారికి ప్రతిసంవత్సరము విజయదశమీ దినమునందు పార్వేట (పారువేట) ఉత్సవము జరుగును.

శ్రీస్వామివారికి ప్రాతఃకాలారాధనము, మాధ్యాహ్నికారాధనము

పూర్తి అయిన పిమ్మట, శ్రీమలయప్పస్వామివారు తిరుచ్చియందు వేంచేసెదరు. శ్రీవారికి విశేషాభరణముల చేతను విశేషదుకూలముల తోను, పుష్పసరములతోను అలంకారము జరిగి హారతి జరుగును. వెంటనే నేరుగా పరివారముతో తాళ్ళపాకవారి పార్వేట మండపమునకు వేంచేయుదురు. అచ్చట శ్రీస్వామివారికి ఆరాధనము తలియలు నివేద నవము జరుగును. పిమ్మట తాళ్ళపాకంవారి హారతి జరిగి తాళ్ళపాకం వారికి మర్యాదలు జరుగును. పిమ్మట శ్రీవారికి ఆరగింపు జరిగి ప్రసాదములు స్థానబహుమాన పూర్వకముగా గోష్ఠికి వినియోగము చేయబడును. శ్రీస్వామివారు పార్వేటపూర్తి యొనరించు కుని నేరుగా మహాద్వారము వద్దకు వేంచేయుదురు. అచ్చట హత్తీరాంజీ మఠంవారి హారతి జరిగి ఆ తిరుచ్చిలోనే పరివారములతో తిరువీథులు ఉత్సవముగా వేంచేసి మహాద్వారమునకు వచ్చి సన్నిధికి వేంచేయుదురు.

## 26. దీపావళీ ఆస్థానోత్సవము

అఖిల బ్రహ్మాండనియన్తయై, (తిరుమల) శ్రీ శేషశైలమునందు భక్తజన రక్షణార్థమై వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి, ఆశ్వయుజ బహుళ అమావాస్యా (దీపావళీ) దినమున ప్రతి సంవత్సరము ఆస్థానోత్సవము జరుగును. శ్రీ స్వామివారికి ప్రాతఃకాలారాధనము జరిగిన వెనుక బంగారువాకిలివద్దగల ఆస్థానమండపములోని సర్వభూపాలవాహనమందు శ్రీమలయప్ప స్వామివారు ఉభయనాంచార్లతో సహా వేంచేసెదరు. అచ్చట శ్రీవార్లకు విశేష రత్నాభరణములతోను విశేషములగు పట్టువస్త్రములతోను పుష్పమాలలతోను మనోహరముగా అలంకారము జరుగును. పిమ్మట శ్రీమూలస్వామివారి సన్నిధికి

మాధ్యాహ్నికారాధనమునకు తళియలు సన్నిధికి చేర్చెదరు. తరువాత ఆస్థాన ప్రసాదములు పరిచారకులు శిరస్సున ధరించి, జియ్యంగార్లతోను పాచక పరిచారకులతోను, అధికార్లతోను, శ్వేతచ్ఛత్రములతోను, మంగళవాద్యములతోను ఆనందనిలయ విమానము నకు ప్రదక్షిణముగా ధ్వజస్తంభ ప్రదక్షిణముగా ఆస్థానమునకు శ్రీవారి సన్నిధానమునయుంచెదరు. అప్పుడు మాధ్యాహ్నిక నివేదనము జరుగును. పిమ్మట ఉద్యోగస్థులు శ్రీ స్వామివార్లకు యేర్పరచియున్న నూతన వస్త్రములతో జియ్యంగార్లు శిరస్సున పెట్టుకుని శ్వేతచ్ఛత్రము లతోను, మంగళ వాద్యములతోను, అధికార్లతోను, పరివారములతోను విమాన ప్రదక్షిణముగా ధ్వజస్తంభమునకు ప్రదక్షిణముగా శ్రీ స్వామివారి సన్నిధానమునకు, గర్భాలయమునకు వెళ్ళి శ్రీ వేంకటేశ్వరస్వామివారికి కిరీటవస్త్రం, కఠారివస్త్రం, ఆదితోమాల, ఉత్తరీయం, ఈ నాలుగువస్త్రములను శ్రీదీక్షితులవారి ద్వారా సమ ర్పణ జరిగి, గోష్ఠికి తీర్థచందనాది మర్యాదలు జరుగును. తరువాత మిగిలిన రెండు వస్త్రములు వెండితట్టలో పెట్టి జియ్యంగారు శిరస్సున పెట్టుకుని ఆస్థానమునకు వచ్చి, శ్రీమలయప్పస్వామివారికి ఒకటి ఈ శ్రీవిష్వక్సేనులవారికి- ఒకటి రెండు వస్త్రములు శ్రీ దీక్షితులవారి ద్వారా సమర్పణము జరుగును. పిమ్మట శ్రీవారికి అక్షతా రోపణము జరుగును. తరువాత శ్రీ సేనాధిపతి వారికి అర్చకులకు మర్యాద జరుగును. పిమ్మట కొలువు మాత్రాదానము జరుగును. పిదప హారతులు జరిగి, శ్రీజియ్యంగారువారికి సర్కారు వారికి మర్యాదలు జరిగి ఆస్థాన బహుమాన పూర్వకముగా గోష్ఠికి ప్రసాద వినియోగము జరుగును. శ్రీవారు సన్నిధికి వేంచేయుదురు.

# 27. చక్రతీర్థ ముక్కోటి ఉత్సవము

అఖిల చరాచర నియన్తయై (తిరుమల) శ్రీ శేషపర్వతమునందు అర్చావతారమున వేంచేసి యున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధానముకు (మైళ్ళ) దూరములోగల చక్రతీర్థమున ముక్కోటి వృశ్చిక మాసమున శుద్ధద్వాదశి యందు జరుగును.

ఆ దినమున శ్రీ స్వామివారికి ప్రాతఃకాలారాధనము మాధ్యాహ్నికారాధనము పూర్తి అయిన పిమ్మట అర్చకులు, పాచకులు, పరిచారకులు, ఉద్యోగస్థులు, ఏకాంగి, భక్తులు, యాత్రికులు మంగళ వాద్యములతో దేవస్థానము నుంచి మహాప్రదక్షిణముగా చక్రతీర్థమునకు వెళ్ళెదరు. అచ్చట నుండు శ్రీచక్రత్తాళ్వారువారికిని, శ్రీ నృసింహస్వామి వారికిని, శ్రీ ఆంజనేయస్వామి వారికిని అభిషేకము పుష్పాలంకారము ఆరాధనము జరిగి నివేదనము, హారతి అయిన పిమ్మట ఇష్ట వినియోగపూర్వకముగా గోష్ఠికి వినియోగము జరుగును. తరువాత మంగళ వాద్యములతో అందరు శ్రీవారి సన్నిధానమునకు వచ్చెదరు. ఈ చక్రతీర్థమును గూర్చి స్కందపురాణ మిట్లు చెప్పుచున్నది. పూర్వకాలమున శ్రీవత్సగోత్రుడును జితేంద్రియుడును దయామయుడునగు పద్మనాభ మహర్షి ఈ చక్రతీర్థతీరమున పండ్రెండు సంవత్సరములు, కొంతకాలము పర్ణాహారుడై, కొంతకాలము జలాహారుడై, కొంతకాలము వాయుభక్షకుడై, భగవంతుని గూర్చి గాఢమైన తపస్సును చేసెను. ఆ తపస్సునకు సంతోషించి శ్రీవేంకటేశ్వరస్వామివారు ఆ పద్మనాభ మహర్షికి శంఖచక్రాది దివ్యాభరణ భూషితుడై ప్రత్యక్షము నిచ్చి, ఓ పద్మనాభ మహర్షీ! ఈచక్రతీర్థమున కల్పాంతమువరకు నన్ను పూజించుచునుండుము. అని చెప్పి అంతర్ధానమునొందిరి. ఆ పద్మనాభమహర్షి శ్రీస్వామివారి

ఆజ్ఞను శిరసావహించి ఆ చక్రతీర్థతీరమున తపస్సు చేయుచుండెను. ఇట్లుండ నొకనాడు రాక్షసుడు ఆ మహర్షిని భక్షించుటకు వచ్చెను. ఆ మహర్షి భయము నొంది శ్రీస్వామివారిని రక్షించమని ప్రార్థించెను. శ్రీస్వామివారు తమ చక్రాయుధమును పంపిరి. ఆ చక్రాయుధము ఆ దుష్టరాక్షసుని శిరస్సు ఖండించివైచెను. ఆ మహర్షికి రాక్షసబాధ విముక్తి ఆయెను. పిమ్మట ఆ మహర్షి చక్రరాజమునుస్తోత్రము చేసి ఓ చక్రరాజమా! నీవు భక్త రక్షణార్థమై ఈ తీర్థమున ప్రవేశించుము అని కోరెను. ఆ చక్రరాజము అట్లే చేసెను. అప్పటినుంచి ఈ తీర్థము చక్రతీర్థమని ప్రఖ్యాతి గాంచినది. ఈ చక్రతీర్థమున స్నానము చేసిన వారికి భూత రాక్షసబాధలు తొలగిపోవును.

## 28. కైశిక ద్వాదశీ ఆస్థానోత్సవము

అఖిలభువనరక్షణదక్షుడై (తిరుమల) ఈ వృషాద్రి యందు నిఖిల చేతనోజ్జీవనార్థము వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధానమున ప్రతి సంవత్సరము కార్తీక శుద్ధ ద్వాదశి (క్షీరాబ్దిద్వాదశి) యందు (కైశిక ద్వాదశి యందు) ఉత్సవము ఆస్థానము జరుగును.

శ్రీవారికి ప్రాతఃకాలారాధనము అయిన వెంటనే అపరావతారమగు ఉగ్రశ్రీనివాసమూర్తివారు ఉభయ నాంచార్లతోకూడ బంగారు తిరుచ్చిలో వేంచేయుదురు. విశేష తిరువాభరణములు సమర్పించెదరు. విశేష పుష్పమాలికలచేతను అతి రమణీయముగా అలంకరించబడినవారలై అరుణోదయ కాలముననే ఆనందనిలయ విమాన ప్రదక్షిణముగా చతుర్వీథుల ఉత్సవమునకు సర్వపరివారముతో వేంచేయుదురు. చతుర్వీథుల

ఉత్సవము పూర్తి అయి సూర్యోదయము కాకముఋపే మండపమున గల, సర్వభూపాల వాహనమున వేంచేయుదురు. పిమ్మట శ్రీవారికి ఆస్థానాలంకారము జరిగి ఆరాధనము అయి తళియలు నివేదన జరుగును. కైశిక ద్వాదశీ ఆస్థానము ప్రారంభమగును. శ్రీ స్వామివారికి అక్షతారోపణవు జరిగిన మీద శ్రీవారిపాదవుల యందు సమర్పింపబడి యున్న కైశికపురాణమును కాలక్షేపము చేయుటకే కోటి కన్యాదానం వారికి పరివట్టం కట్టి యిచ్చెదరు. వారు భక్త జనమునకు ఆనందతరంగములుగా కైశికభక్త చరిత్రమును కాలక్షేపము చేసెదరు. పూర్తి అయిన వెంటనే వారికి బహుమానము జరుగును. తరువాత పంచముఖాల కొల్వు అయి హారతులు అయి జియ్యంగారు వారికి సర్కారు వారికి మర్యాదలు జరిగిన వెనుక గోష్ఠికి స్థాన బహువూన పూర్వకవుగా శ్రీవారి ప్రసాదవు వినియోగవు చేయబడును. ఆరాధనము అయిన తరువాత శ్రీ తాతాచార్యుల వారికి శ్రీ స్వామివారి సన్నిధానమున మర్యాదలు జరిగి మర్యాదలతో వారిని విడిదికి పంపించెదరు. శ్రీవారు సన్నిధానమున ప్రవేశించెదరు.

## 29. కార్తిక దీపోత్సవము

అఖిల సత్వదయైకసాగరుడై, ఆపత్సఖుడై ఆనందాద్రియని పురాణ ప్రఖ్యాతికాంచి మానవులకు పరబ్రహ్మదర్శనానందమును సమకూర్చు తిరుమల యందు, మానుషానందమును, దేవానందమును, నిత్యానందమును కూడా ప్రదానము చేయ అర్చావతారమున వేంచేసి యున్న శ్రీవేంకటేశ్వరస్వామివారి సన్నిధానమున ప్రతిసంవత్సరము కార్తిక మాసమున పర్వమగు పూర్ణిమయందు అజ్ఞానాంధకారనివర్తక మగు దీపోత్సవము జరుగును.

ఆ పర్వదినమున శ్రీ స్వామివారికి సాయంకాలారాధనములో తోమాల, అర్చనము నివేదనము జరిగి శ్రీ భాష్యకారులవారికి నివేదనము జరిగిన పిమ్మట పర్వదీపోత్సవము ప్రారంభమగును.

అంతట శ్రీవారి ప్రథమ ప్రాకారములో ఈశాన్యభాగమునయున్న పరిమళం అరయందు అధికారులు, జియ్యంగార్లు, ఏకాంగులు, పరిచారకులు అందరు సమావేశమయ్యెదరు.

అచ్చట అంతకు పూర్వమే పరిచారకులువచ్చి యేర్పాటుచేసి యున్న నెయ్యితోనిండి వత్తులుగల 35 కుంపట్లు 35 మూకుళ్ళు 30 అరకంచట్లు ఈ మొత్తము నూరు దీపపాత్రములయందును శ్రీ జియ్యంగార్లు దీపారాధనము చేసెదరు.

పిమ్మట జియ్యంగార్లు, పారుపత్యదారు ఇతర ఉద్యోగస్థులు, భక్తులు అందరు భక్తిశ్రద్ధలతో ఆ దీపపాత్రములను తీసుకుని, మంగళవాద్యములతో, పంచముఖాలతో వెండిబెత్తాలతో శ్వేతచ్ఛత్రములతో చామరములతో ఇతర మర్యాదలతో భక్తజనముతో ధ్వజప్రదక్షిణముగా విమాన ప్రదక్షిణముగా వచ్చి శ్రీవారి సన్నిధానమునకు వెళ్ళెదరు.

ఆలయమునందవకాశము లభించనివారు ఆస్థానమండపమునందును పార్శ్వములయందును నిలుచుకొని అత్యుత్సాహముతో దర్శించుచుందురు.

శ్రీవార్ల సన్నిధానమున అర్చకులు పుణ్యాహవాచనముచేసి ఆ దీపపాత్రములను శుద్ధియొనరించి, అయిదు దీపపాత్రములను (కుంపట్లను) క్రమముగా తీసుకుని, మంత్రములతోను, దివ్యప్రబంధ పాశురములతోను శ్రీవారికి హారతి చేయుదురు.

పిమ్మట కుంపట్లు, మూకుళ్ళు, అరకంచట్లు ఈ క్రింద వివరించిన విధముగా ఆయా స్థానములయందు ఉంచెదరు.

## ఆ వివరము

1. బ్రహ్మఖండము 2. కులశేఖరపడి 3. శ్రీరాములవారి మేడ 4. బంగారువాకిలి 5. ద్వారపాలకులు 6. గరుడాళ్వారు 7. విమానము గరుడాళ్వారు సన్నిధి 8. శ్రీవరదరాజస్వామి సన్నిధి 9. పోటు అమ్మవారు 10. బంగారుబావి 11. కళ్యాణమండపము 12. బొక్కసపు అర 13. పరకాల అర 14. వాహనము అర 15. రికార్డు అర 16. కైకాల అర 17. వగపడి అర 18. తాళ్ళపాకం అర 19. తొట్టితీర్థము 20. శ్రీసేనాధిపతి 21. సభ 22. శ్రీ భాష్యకారులవారి సన్నిధి 23. మంచం అర 24. చందనం అర 25. శ్రీనృసింహస్వామి సన్నిధి 26. పరిమళము అర 27. మధ్యపడికావలి 28. ధ్వజస్తంభము 29. బలిపీఠము 30. తిరుమలరాయమండపము 31.తేరుబొమ్మల అర 32. ఉగ్రాణం 33. పడిపోటు 34. పిండిపోటు 35. పూలబావి 36. యమునోత్తర 37. క్షేత్రపాలకులు 38. రంగనాయకమండపము 39. మహాద్వారము 40. పెద్దస్వాముల వారికి 41. చిన్నస్వాములవారికి 42. ఏకాంగి వారికి 43. అర్చకులకు 44. బ్రహ్మతంత్రంవారికి 45. గమేకార్ 46. దోవభాష్యకార్ల 47. గోగర్భ క్షేత్రపాలకులు 48. బేడి ఆంజనేయులు 49. పుష్కరిణీ ఆంజనేయులు 50. శ్రీ వరాహస్వామి 51. భాష్యకార్ల 52. స్వామి పుష్కరిణి ఇవి యేబది రెండు స్థానములుగా గ్రహించవలెను. శ్రీవారి విమానంవద్ద పెట్టు కుంపట్ల దీపములు అయిదున్నూ అర్చకులు ఏకాంగి గొల్లమాత్రము తీసుకొని

వెళ్ళి పెట్టెదరు. తరువాత మంగళ వాద్యములతో అందరు విమాన ప్రదక్షిణముగా సంపంగి ప్రాకారములో ప్రదక్షిణముగా శ్రీవరాహ స్వామివారి సన్నిధానమునకు వెళ్ళెదరు. అచ్చట అర్చకులు, ఏకాంగి, పారుపత్యం, ఇతర ఉద్యోగస్థులు సన్నిధి లోనికి వెళ్ళి, రెండు కుంపట్ల దీపములతో శ్రీ వరాహస్వామివారికి హారతి చేసి సన్నిధి యందు ఉంచెదరు. పిమ్మట శ్రీస్వామి పుష్కరిణియందు రెండు అరకంచట్లు విడిచెదరు.

శ్రీజియ్యంగారు ప్రారంభమున దీపారాధనము చేసిన వెంటనే, పరిచారకులు పరివారములు బంగారు వాకిలివద్దను, విమాన ప్రదక్షిణ పార్శ్వముల యందును, ధ్వజ పార్శ్వములయందును పడికావలి పార్శ్వముల యందును తైలముతో ప్రమిదలయందు ఆరువందల దీపారాధనములు చేయుదురు. ఇటుల పర్వమునందు యేడువందల దీపారాధనములు జరుగును. ఈ మహత్తర విషయమును చూచి ''ప్రబోధానురక్తులగు శ్రీకృష్ణస్వామివారు భీష్మపర్వమునందు అజ్ఞాన నివర్తకములగు యేడువందల గీతాశ్లోకములచేత ప్రకాశించుచూ తమ తత్త్వమును ప్రకాశింపచేసిరి. అటులనే మౌనముద్రానురక్తులగు శ్రీవేంకటేశ్వరస్వామివారు ఈ కార్తికిక పర్వమునందు అంధకార నివర్తకములగు యేడువందల ఆగమిక దీపములచేత ప్రకాశించుచూ తమ తత్త్వమును ప్రకాశింపచేయుచున్నారు.'' అని విజ్ఞానవేత్తలు ఆనందపడుచున్నారు.

ఇటుల దీపములన్నియు ఉచిత స్థానములలో ఉంచిన తరువాత అందరు మంగళవాద్యములతో శ్రీవారి సన్నిధికి వచ్చి పరిమళం అరలో సభవారు ఉంచిన తైలపాత్రమును శ్రీజియ్యంగార్లు తీసుకుని వాద్యములతో అందరు విమాన ప్రదక్షిణముగా శ్రీవారి సన్నిధి లోనికి వెళ్ళెదరు.

అచ్చట అర్చకులు ఆ తైలమును తీసుకుని శ్రీవారి పాదములకు సమర్పించెదరు. శేషించిన తైలమును ఏకాంగి వారు తీసుకుని వాద్యములతో విమాన ప్రదక్షిణముగా శ్రీభాష్యకారుల వారి సన్నిధికి వచ్చి వారికి సమర్పించెదరు. శేషించిన తైలమును అచ్చటనే గోష్ఠికి స్థానబహుమాన పూర్వకముగా వినియోగము చేయుదురు.

పిమ్మట క్రమముగా శ్రీవారికి నివేదింపబడిన అప్పంపడి ప్రసాదమును శ్రీభాష్యకారులవారి సన్నిధినుంచి మంగళ వాద్యములతో పెద్ద జియ్యంగారి మఠమునకు పంపెదరు.

ఇదియే కార్తికపర్వ దీపోత్సవ వైభవము.

## 30. దీపావళీ దీపోత్సవము

శ్రియఃపతియై, అవాప్తసమస్తకాముడై ఆశ్రితజనరక్షణార్థము వరాహాద్రియని పురాణ ప్రఖ్యాతిగాంచిన తిరుమలయందు శ్రీ వరాహ స్వామివారి సన్నిధానమునందు అర్చావతారమున వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధానమున ప్రతి సంవత్సరము ఆశ్వయుజ బహుళామావాస్యా పర్వదినమున దీపావళీదీపోత్సవము జరుగును.

ఈ దినమున శ్రీస్వామివారికి సాయంకాలారాధనమునకు పూర్వముగా శ్రీవారి విమాన ప్రదక్షిణపార్శ్వములయందును, కల్యాణమండపమునందును, రంగమండపమునందును, ధ్వజస్తంభ పార్శ్వముల యందు తండ్లు కట్టియు పడికావలి పార్శ్వములయందు తండ్లు కట్టియు శ్రీవరాహస్వామివారి సన్నిధానమునందును ప్రమిదలు పెట్టి తైలముతో అనేకములైన దీపముల వెలిగించి ఆరాధించెదరు.

ఆ సమయమున దీపావళీనామము సార్థకమై శ్రీస్వామివారి సన్నిధానమందును శ్రీవరాహస్వామివారి సన్నిధానమందును అనేక దీపపంక్తులతో విరాజిల్లు నా అమావాస్యా పర్వము పూర్ణిమా పర్వ ముగా నుండుటచే, భక్తజనము పరమానందము నొందుదురు.

అనేకములగు ఆ దీపపంక్తుల యొక్క తేజః పుంజములచేత దేదీప్యమానముగా ప్రకాశించుచు శ్రీవరాహస్వామివారు ''నా సన్నిధాన మునన్న తమ సన్నిధానమునందువలె దీపారాధనాది సర్వకైంకర్యము లును చేయించుచూ తన మహోత్సవాన్తమునందు నా సన్నిధానమునకు వచ్చి అవభృథమును చేసుకొనుచూ తన కృతజ్ఞతను ప్రకటించుచున్నాడు శ్రీ వేంకటేశ్వరస్వామివారు'' అని వారి కృతజ్ఞతను గమనించి తమరు ఆనందమును వెల్లడించుచున్నారు అనునట్లు వేంచేసియుందురు.

తరువాత శ్రీ స్వామివార్ల సన్నిధానములయందు సాయంకాలా రాధనములు ప్రారంభమై సర్వోపచారములు జరిగి కోవెలలో తీర్మానము చేయబడును.

## 31. ధనుర్మాస ప్రారంభోత్సవము

అనాలోచిత విశేషాశేషలోకశరణ్యుడై, ఆశ్రిత వాత్సల్యైకమహో దధియై ఈ శేష పర్వతమునందు (తిరుమలయందు) అర్చావతారమున స్థానకముగా వేంచేసి యున్న శ్రీవేంకటేశ్వరస్వామి వారి సన్నిధానమున ప్రతి సంవత్సరము ధనుర్మాస ప్రారంభమున ప్రారంభోత్సవము జరుగును.

ఆ దినమున ఉషఃకాలమునకు పూర్వమే అర్చకస్వాములు జియ్యంగార్లు, ఏకాంగులు, పరిచారకులు శ్రీవైష్ణవస్వాములు భాగవతోత్తములు, భక్తులు అందరు సుప్రభాతమునకు విమాన

ప్రదక్షిణము చేయుచు వచ్చి శ్రీస్వామివారి సువర్ణ ద్వారము ముందు చేరెదరు. అర్చక స్వాములు మామూలుగా సుప్రభాతము చేయుచు గొల్ల తాళములు తీసి కవాటములను తెరువగానే జియ్యంగార్లు ఏకాంగులతో సహా ఆలయమున శ్రీవారి సన్నిధానమున ప్రవేశించెదరు - శ్రీవైష్ణవస్వాములు అచ్చటనే యుండి శ్రీస్వామివారికి మామూలుగా మేలుకొలుపు, సుప్రభాతములను పఠించక శ్రీ తొండర డిప్పొడి యాళ్వారు సాయించిన ద్రావిడ భాషామయములగు తిరుప్పళ్ళి ఎళుచ్చి దివ్యప్రబంధ పాశురములను సుప్రభాత స్థానములో పఠించెదరు. తరువాత క్రమముగా ఆరాధనము ప్రారంభమగును. అర్చన సమయములో ఆరాధకులు సంసారసముద్ర సముత్తరణ సాధనములను శ్రీవారి పాదాబ్జములను మిరాశీదార్లు సహస్రనామములు చెప్పుచుండ బిల్వదళములతో నర్చించెదరు. తరువాత నివేదన సమయములో మామూలు ప్రసాదములుగాక ధనుర్మాస ప్రయుక్తములగు విశేష ప్రసాదములు శ్రీస్వామివారికి నివేదనము చేయబడును, పిమ్మట శ్రీ వైష్ణవస్వాములు జియ్యంగార్లు భాగవతోత్తములు శాత్తుమొర సమయములో శ్రీకృష్ణస్వామివారిని గూర్చి గోపికలొనరించిన మాసవ్రతములనే ధనుర్మాసవ్రతమాచరించుచూ శ్రీ ఆండాళ్ సాయించిన తిరుప్పావు ముప్పది పాశురములలో మొదటి పాశురమును అనుసంధానముచేసి శాత్తుమొర పూర్తి యొనరించెదరు. తరువాత శ్రీవారికి ఆరగింపు జరిగిన పొంగలి మొదలగు విశేష ప్రసాదములు శ్రీ భాష్యకారులవారి సన్నిధానమున స్థానబహుమాన పూర్వకముగా గోష్ఠికి వినియోగము చేయుదురు. తరువాత క్రమముగా నేకాంత సమయమురాగా ఆ ఏకాంత సమయములో ప్రపంచమునుద్ధరింపబూని ద్వాపరాన్తమున దయావాత్సల్య ప్రేమాతిశయములుప్పతిల శపథమాచ రించి చరమ సందేశమును ప్రసాదించిన శ్రీ గోదాదేవీ ప్రియులగు

శ్రీ కృష్ణస్వామి వారికి ఉష్ణోదకముచే అభిషేకమొనరించి అలంకరించి శయనమును చేయుదురు. ఇటులనే ధనుర్మాసము ముప్పది దినములు శ్రీ స్వామివారికి సుప్రభాత సమయమున ద్రావిడ భాషామయమగు 30 పాశురములచే సుప్రభాతమును అర్చన సమయములో బిల్వదళము లతో శ్రీవారి పాదార్చనమును నివేదన సమయములో, విశేషప్రసాదని వేదనమును, శాత్తుమొర సమయములో శ్రీ ఆండాళ్ సాయించిన తిరుప్పావుముప్పది పాశురములలో దినమున కొక్కొక్క పాశురము చొప్పున అనుసంధానముచేసి శాత్తుమొరయు, శ్రీ భాష్యకారులవారి సన్నిధానమున శ్రీభాగవతగోష్ఠికి విశేష ప్రసాద వినియోగమునారాత్రి ఏకాంత సమయములో శ్రీకృష్ణస్వామివారికి శయనమును విశేషములుగా జరుగును.

## 32. అధ్యయనోత్సవము

ప్రపన్నజనపారిజాతమై (తిరుమల) వేదగిరి యందు అర్చావ తారమున వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధానమున ధనుర్మాసమున శ్రీ వైకుంఠైకాదశికి పూర్వమునను, పరమునను దివ్యప్రబంధాధ్యయనోత్సవము జరుగును.

అధ్యయనోత్సవము శ్రీవైకుంఠైకాదశికి పదకొండు దినములు పూర్వముగా ప్రారంభమగును. ప్రారంభ దినమున శ్రీస్వామివారికి సాయంకాలారాధనములో తోమాలసేవా అర్చనానంతరము దోశపడి ఆరగింపు అయిన తరువాత శ్రీ మలయప్పస్వామివారు శ్రీ భూదేవు లతో సహా సేనాధిపతి వారితో సహాబయలుదేరి శ్రీవారి ఆలయము నకు దక్షిణ భాగమున యున్న కల్యాణమండపమునకు వేంచేసెదరు. అచ్చట సువర్ణ సింహాసనమును శ్రీభూదేవులతో సహా ప్రాఙ్ముఖముగా

నలంకరించెదరు. శ్రీ సేనాధిపతివారు వెనుక పీఠమునందు దక్షిణాభి ముఖముగా వేంచేయుదురు. తరువాత శ్రీవారిసన్నిధానమున శాత్తుమొర కాగానే శ్రీ భాష్యకారుల వారు తమ ఆలయము నుండి శ్వేతచ్ఛత్రాది మర్యాదలతో మంగళ వాద్యములతో బయలుదేరి శ్రీవారు వేంచేసి యున్న కల్యాణమండపమున వేరొక సింహాసనము నలంకరించెదరు. తరువాత శ్రీవారి పరివారము క్రమముగా బంగారు వాకిలి బీగములు వేసి ఆ బీగములు పట్టుకుని వచ్చి శ్రీ సేనాధిపతివారి వద్ద వప్పగింత చేసెదరు, తరువాత శ్రీవార్లకు ప్రసాదములు నివేదనము జరిగి శ్రీ సేనాధిపతివారి కిన్ను, శ్రీభాష్యకారుల వారికిన్నీ తిరు పరివట్టం కట్టిన మీదట దివ్యప్రబంధాధ్యయనము (పగల్పత్తు) ప్రారంభమగును. తరువాత శ్రీమలయప్పస్వామివారికి హారతి అయి శ్రీసేనాధిపతివారికి పుష్పమాలాసమర్పణము జరిగి మర్యాదలు జరుగును. అటులనే శ్రీభాష్యకారుల వారికి పుష్పమాలా సమర్పణము జరిగి మర్యాదలు జరుగును. తరువాత శ్రీ జియ్యంగారు వారికి సర్కారు వారికి మర్యాదలు జరిగి గోష్ఠికి స్థానబహుమాన పూర్వకముగా చందన తాంబూలప్రసాద వినియోగము జరుగును. పిమ్మట శ్రీమలయప్పస్వామి వారు, శ్రీభూదేవులు, సేనాధిపతివారు కల్యాణ మండపమునందే వేంచేసి యుందురు. శ్రీభాష్యకారులవారు శ్వేతచ్ఛత్రాది మర్యాదలతో తమ ఆలయమునకు వేంచేయుదురు. పిదప బంగారు వాకిలి తెరచి తీర్మానము జరుగును. ఇట్లుగా పదిదినములు దివ్యప్రబంధాధ్యయనము జరిగి పదకొండవ దినమునందు పగల్పత్తు చిన్నశాత్తుమొర జరుగును. ఇరువదిమూడు వేల పాశురములు దివ్య ప్రబంధము అధ్యయనము చేయబడును - మరుదినమగు శ్రీ వైకుంఠైకాదశి దినమునందు దివ్య ప్రబంధాధ్యయనము రాపత్తు ప్రారంభము. వేదపారాయణ ప్రారంభము జరుగును. ఇట్లుగా దివ్య ప్రబంధాధ్యయనము

అయిదు దినములు జరిగి ఆరవదినమునందు శ్రీస్వామివారికి శ్రీభూదేవులకు ప్రణయకలహోత్సవము జరుగును. తరువాత నాలుగు దినములు దివ్యప్రబంధాధ్యయనము ఇటులనే జరుగగా ఈ రాపత్తు పదిదినములు పది వందల పాశరములు పూర్తి జరిగి దివ్య ప్రబంధము పూర్తిగా అధ్యయనము జరుగును. గాన రాపత్తు పదవదినమునందు పెద్దశాత్తుమొర జరుగును.

## 33. శ్రీ వైకుంఠ ఏకాదశీ ఉత్సవము

సకల జగన్నియన్తయై (తిరుమల) సప్తగిరుల యందు అర్చావ తారమున వేంచేసి యున్న శ్రీవేంకటేశ్వరస్వామివారికి ధనుర్మాసమున శుద్ధైకాదశి యందు ముక్కోటి ఏకాదశీ ఉత్సవము జరుగును.

ఈ దినమున శ్రీస్వామివారికి ప్రాతఃకాలారాధనము పూర్తిగా అయిన పిమ్మట కల్యాణమండపమునందు శ్రీమలయప్పస్వామివారు వజ్రకవచాది విశేష తిరువాభరణములు సమర్పించబడి సువర్ణతిరుచ్చి యందు ఉత్తరాభిముఖముగా వేంచేయుదురు. పిమ్మట ముక్కోటి ఏకాదశి ఆస్థానమున జరుగును. శ్రీవారికి ఆరాధనము జరుగును. తళియల నివేదనము అయి స్థాన బహుమాన పూర్వకముగా గోష్ఠికి ప్రసాద వినియోగము జరుగును. పిమ్మట శ్రీవారు సమస్తపరివారములతో మంగళవాద్యములతో తిరువీధులలో ఉత్సవము జరిగి, కల్యాణమండపమునకు వేంచేయుదురు. ఈ దినమున అరుణోదయమునకే వైకుంఠద్వారము తెరువబడును.

## 34. శ్రీ స్వామి పుష్కరిణీతీర్థ ముక్కోటి ఉత్సవము

అనాలోచిత విశేషాశేషలోకశరణ్యుడై ఈ శేషాచలమునందు



శ్రీ వేంకటేశ్వరస్వామి వారి పుష్కరణీ పుణ్యతీర్థము



శ్రీ ఉత్సవ శ్రీనివాసస్వామివారు

(తిరుమలయందు) అర్చావతారమున వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్యాలయమునకు ఈశాన్య భాగమున స్వామి పుష్కరిణీయను పుణ్య తీర్థరాజము కలదు. ప్రతి సంవత్సరము ధనుర్మాసమున శుక్ల పక్షద్వాదశి దినమునందు అరుణోదయ సమయమున భువనత్రయమందును ప్రసిద్ధమైన మూడుకోట్లయేబది లక్షల పుణ్య తీర్థములన్నియు వత్సరమంతయు తమయందు పాపాత్ములు స్నానము చేయుటచేత తమకు సంక్రమించిన పాపజాలము నంతయు తొలగించుకొనుటకుగాను ఈ స్వామి పుష్కరిణియందు సాన్నిధ్యమును చేయగలవు. పాపవిముక్తిని బడయగలవు గనుక ఆ దినమున అరుణోదయకాలమున శ్రీస్వామిపుష్కరిణియందు పాప విముక్తికై స్నానము చేసిన మాత్రమున మానవులకు మూడుకోట్ల యేబది లక్షల పుణ్యతీర్థ స్నానఫలములభించును: మరియు ఆదినమున శ్రీ స్వామి పుష్కరిణియందు స్నానము చేసి దాన, జప, హోమములు జరిపిన మానవులకు, మేరుశృంగాగ్రమునందును కైలాసమునందును, మందరపర్వతమునందును, పాతాళమునందును, ద్వీపాన్తరముల యందును యెన్ని పుణ్యతీర్థములు కలవో అన్ని పుణ్యతీర్థములస్నానమాచరించి, షోడశ మహాదానములు జపములు హోమములుచేసిన మానవులకు యెంత పుణ్యములభించునో అంతపుణ్యము లభించ గలదు, అన్ని తీర్థములకు స్వామిని యగుటచే, నీ తీర్థమునకు స్వామిపుష్కరిణియను నామధేయము లభించినది. ఈ పుణ్యదినమున శ్రీస్వామిపుష్కరిణిలో స్నానమాచరించి ఆశ్రిత వాత్సల్యజలధి యగు శ్రీ స్వామివారిని సేవించి తీర్థప్రసాదములను స్వీకరించిన వారికి సకల కామితార్థసిద్ధియెగాక, చరమ పురుషార్థము కరతలగతమని వామన పురాణము చెప్పుచున్నది.

## 35. పార్వేట ఉత్సవము

జగన్నియమనలీలారసికుడై (తిరుమల) శ్రీశేషశైలమునందు అర్చావతారములో వేంచేసి యున్న శ్రీవేంకటేశ్వరస్వామి వారికి పార్వేట ఉత్సవము మకరసంక్రమణమునకు పరదినమునందు జరుగును.

ఆ దినమున శ్రీస్వామివారికి ప్రాతఃకాలారాధనము మాధ్యాహ్ని కారాధన పూర్తి అయిన తరువాత శ్రీమలయప్పస్వామివారు వెండి తిరుచ్చిలో వేంచేయుదురు. శ్రీకృష్ణస్వామివారు, మరియొక తిరుచ్చిలోను వేంచేయుదురు. వెంటనే ప్రదక్షిణము లేకనే పార్వేట మండపమునకు వెళ్ళి, ఆ మండపమునందు పుణ్యాహము జరిగిన పిమ్మట మంచెలో వేంచేయుదురు. శ్రీస్వామివారికి ఆరాధనము, నివేదనము జరిగి హారతులు అయిన పిమ్మట ఉభయదార్లకు తాళ్ళపాకంవారికి, మఠంవారికి మర్యాదలు జరిగి స్థాన బహుమాన పూర్వకముగా గోష్ఠికి వినియోగము జరుగును. తరువాత శ్రీమలయప్ప స్వామివారు శ్రీకృష్ణస్వామి వారు మండపమును వదలి ప్రాంగణమునకు వచ్చెదరు. శ్రీకృష్ణస్వామివారిని మాత్రము సన్నిధి గొల్లపూజ చేసిన చోటుకు వేంచేపుచేసి పాలువెన్న ఆరగింపు అయి హారతి జరిగిన పిమ్మట శ్రీమలయప్పస్వామివారి సన్నిధి కి వెళ్ళెదరు. తరువాత ఆ గొల్ల సమర్పించిన పాలు వెన్న శ్రీమలయప్పస్వామివారికి నివేదనము హారతిఅయి గొల్లకు బహుమానము జరుగును. తరువాత శ్రీమలయప్ప స్వామివారు ముందునకు కొంత దూరము పరుగెత్తి వారి తరపున అర్చకులు బాణమువేసిన పిమ్మట వెనుకకు వచ్చెదరు. ఇట్లు మూడు సార్లు జరుగును. తరువాత శ్రీవారు మహాద్వారమునకు వేంచే యుదురు. అచ్చట హత్తీరాంజీ మఠమువారికి బెత్తముఇచ్చి తిరువీధుల ఉత్సవములో వేంచేయుదురు. ఈ సమయములో శ్రీకృష్ణస్వామివారు

సన్నిధి కి వేంచేయుదురు. శ్రీమలయప్పస్వామివారు ఉత్సవము పూర్తి అయి మహాద్వారమునకు వచ్చి హత్తీరాంజీవారి బెత్తమును తీసుకుని సన్నిధి లోనికి వేంచేయుదరు.

## 36. శ్రీరామకృష్ణతీర్థ ముక్కోటి

అపార కరుణా సముద్రుడై (తిరుమల) శ్రీ వేంకటభూధరము నందు అర్చావతారమున వేంచేసియున్న శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధాన మునకు ఆరు మైళ్ళ దూరములోగల రామకృష్ణ తీర్థమున ముక్కోటి ప్రతిసంవత్సరము మకర మాసమున పుష్యమీ నక్షత్రయుక్తమగు పూర్ణి మాశుభపర్వదినమునందు జరుగును.

ఆదినమున శ్రీ వేంకటేశ్వరస్వామివారికి ప్రాతఃకాలారాధనము మాధ్యాహ్నికారాధనము పూర్తి అయిన తరువాత, అర్చకులు పాచకులు పరిచారకులు, ఉద్యోగస్థులు, ఏకాంగి, భక్తులు, యాత్రికులు అందరు మంగళవాద్యములతో దేవస్థానము నుండి శ్రీరామకృష్ణ తీర్థమునకు వెళ్ళెదరు. అచ్చట గల శ్రీకృష్ణస్వామివారికి అభిషేకము పుష్పాలంకారము ఆరాధనము తయారొనరించిన తళియ నివేదనము హారతి అయి గోష్ఠికి మామూలు ప్రకారం చందన తాంబూల ప్రసాద వినియోగము జరుగును. పిమ్మట అందరు శ్రీరామకృష్ణ తీర్థము నుండి వాద్యములతో శ్రీవారి సన్నిధానమునకు వచ్చెదరు.

ఈ రామకృష్ణ తీర్థమునుగూర్చి స్కంద పురాణమిట్లు చెప్పు చున్నది. పూర్వకాలమున ఈ వేంకటాద్రియందు రామకృష్ణుడను ఒక మహర్షి తపస్సుచేయుచూ స్నానార్థమై ఒక తీర్థమును కల్పించుకొనెను. అచ్చట ఆ మహర్షి అనేక వందల సంవత్సరములు గాఢమైన తపస్సు చేయుచుండ శరీరమందు పుట్టలు పెట్టెను. ఆ మహర్షి అది గుర్తించకనే

తపస్సు చేయుచుండెను. అది చూచి దేవేంద్రుడు మేఘములను పంపి వర్షింపచేసెను. అట్లు గాఢముగా యేడు దినములు వర్షించినను ప్రబలమైన గర్జితములు బయలుదేరినను పిడుగులు కూడా వల్మీక ప్రాంతమున పడినను, వీటిని గుర్తింపకనె ఆ మహర్షి తపస్సు చేయుచుండెను. అప్పుడు శ్రీస్వామివారు శంఖచక్రగదాధరుడై గరుడ వాహనారూఢుడై ఆ మహర్షి తపస్సుకు సంతసించి ప్రత్యక్షమై ఓ తపోనిధీ! రామకృష్ణ, ఈనా ఆవిర్భావదినమగు మకర మాసము నందలి పుష్యమీ నక్షత్రయుక్త పూర్ణిమా పర్వదినమునందు దేవతలు దిక్పాలకులు స్నానార్థమై వచ్చి స్నానముచేసి పవిత్రులగుచున్నారు. ఈ దినమున యే మానవులు ఈ తీర్థమునందు స్నానము చేయు చున్నారో వారలు సర్వపాప విముక్తులగుటయేకాక సర్వాభీష్టములను పొందగలరు. నీ పేరుతో ఈ తీర్థము ఖ్యాతినొందలగదు. అని శ్రీరామకృష్ణ మహర్షికి చెప్పి శ్రీస్వామివారు అంతర్ధానమునొందిరి. అట్లు మహాతీర్థమున నిరుక్త పుణ్యకాలమునందు స్నానముచేసి శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించిన వారు అనంతపుణ్యఫలములను బడయగలరు.

## 37. ప్రణయకలహోత్సవము

ఆశ్రితరక్షాపరాయణుడగు శ్రీ వేంకటేశ్వరస్వామివారికి మధ్యాహ్ని కారాధనము జరిగిన పిదప శ్రీ మలయప్పస్వామివారు తిరుచ్చిలో వేంచేసి మహాప్రదక్షిణముగా సకల పరివారములతో ఏకాంగి మఠము ముందుకు వేంచేయుదురు. తరువాత ఉభయనాంచార్లు మరియొక తిరుచ్చిలో వేంచేసి అప్రదక్షిణముగా శ్రీస్వామివారి ఎదుటకు వేంచేయుదురు. జియ్యంగారువారికి పౌరాణికులకు తిరుపరివట్టం

కట్టెదరు. పౌరాణికులు పురాణమును చదువుదురు. జియ్యంగారు వారు, ఉభయనాంచార్ల వద్ద నుండి శ్రీమలయప్పస్వామివారి మీదుగా శ్రీస్వామివారి వెనుకకు మూడు పూలచెండ్లు వేయవలయును. అందుమీద శ్రీస్వామివారు వెనుకకు కొంచెము దూరము వెళ్ళెదరు. (పరిగెత్తెదరు) తరువాత ప్రబంధపారాయణం సంగీతము వగైరాలతో యథాప్రకారము వేంచేయుదురు. ఈ ప్రకారము మూడు పర్యాయములు జరుగును. పురాణము పూర్తి అగును. పిమ్మట క్రమముగా శ్రీస్వామివారికి ప్రదక్షిణముగా ఉభయనాంచార్లు ఎడమ పార్శ్వమునకు వేంచేసెదరు. పిమ్మట శ్రీవారు శ్రీభూదేవులు పుష్పమాలికలను మార్చుకొనెదరు. పిమ్మట ఏకాంగికి, పౌరాణికులకు మర్యాదలు జరుగును. శ్రీవారు తాయార్లు కల్యాణమండపమునకు వేంచేయుదురు.

## 38. రథసప్తమీ ఉత్సవము

ఆశ్రితమనోరథపరిపూరణ కాముడై (తిరుమల) శ్రీవేంకటశైలమునందు అర్చావతారముగా నవతరించిన శ్రీ వేంకటేశ్వరస్వామివారికి ప్రతి సంవత్సరము మాఘ శుద్ధసప్తమీ శుభదినమున రథసప్తమీ వర్షయుక్తములగు ఉత్సవములు జరుగును.

ఆ రథసప్తమీ దినమున అరుణోదయ కాలమునకు ప్రాతఃకాలారాధనము పూర్తి అయి శ్రీమలయప్పస్వామివారు, ఆలయము నుంచి వాహన మండపమునకు వేంచేసి సూర్యప్రభ వాహనము నధిష్ఠించి వజ్రకవచాద్యలంకార భూషితులై సర్వ పరివారములతోటి వేంచేయుదురు. శ్రీస్వామివారు ఉత్సవములో వాయువ్య భాగమునకు వేంచేయు సమయమునకు సహస్రకిరణుడగు సూర్యుడు, "భీషోదేతి సూర్యః" అను వేదశాసన ప్రకారము ఉదయించి తన

సహస్రకరములను శ్రీస్వామివారి వజ్రకవచాలంకృతమగు పాదార విందముల యందు అర్పించును. ఈ వైభవమును సేవించుటకు వేలాది ప్రజలు అధికారులు నిర్నిమేషులై సేవించి అవాఙ్మానస గోచరమగు యానందమును పొంది పరస్పరము అమందానంద విశేషములను వాకొనుచు ఉత్సవములో పాల్గొనెదరు. అంత శ్రీస్వామి వారు ఆ ఉత్సవములో వాహన మండపమునకు వేంచేయుదురు. అచ్చట శ్రీవారు ఆ వాహనమును వీడి తమ ప్రేమ పాత్రమగు శేషవాహనమునధిష్ఠించి సమస్త పరివారములతో చతుర్వీథులలో ఉత్సవ మును జరుపుచు తిరుగ వాహనమండపమునకు వేంచేయుదురు. అచ్చట శ్రీవారు ఆ వాహనమును వదలి వేదమయమగు గరుత్మంతుని యధిష్ఠించి చతుర్వీథులలో ఉత్సవముతో తిరుగ వాహనమండపమునకు వేంచేయుదురు. అచ్చట శ్రీవారు ఆ వాహనమును విడనాడి తమ త్రేతావతార ప్రేమపాత్రమగు హనుమద్వాహనమునధిష్ఠించి సకల పరివారములతో ఆనంద పూర్ణులగు భక్తజనముతో చతుర్వీథుల ఉత్సవమునకు వేంచేసి తిరుగ వాహనమండపమునకు వేంచేయుదురు. అచ్చట హనుమద్వాహనమును వీడి మధ్యాహ్నకాలమగుటచే శ్రీవారు ఆలయమునకు వేంచేయుదురు. ఆ సమయమున శ్రీచక్రత్తాళ్వారు సర్వపరివారములతో చతుర్వీథులలో ఉత్సవమునకు బయలుదేరి శ్రీ వరాహస్వామివారి మండపమునకు వేంచేసి అచ్చట పంచామృ తాభిషేకమును స్వీకరించి, భక్తులను తరింపజేయుటకు శ్రీ పుష్కరిణి యందు అవగాహన మొనరించెదరు. ఈ చక్రస్నానమునకై కాచుకుని యున్న వేలాది భక్తజనులందరు అదే సమయమున ఆ పుష్కరిణి యందవగాహన స్నానమొనరించి ధన్యవాదములతో ఆనందాతిరేకముతో నుండ పుష్కరిణి యంతయు మనోహరమై చక్షుస్సాఫల్య మొనరించు చుండును. తరువాత శ్రీచక్రత్తాళ్వారు ఉచితాలంకారములను

బొంది ఉత్సవములో ఆలయమును ప్రవేశించెదరు. శ్రీస్వామి వారికి మాధ్యాహ్నికారాధనము పూర్తియగును. వెంటనే ఆశ్రిత కల్పవృక్షమగు శ్రీస్వామివారు వాహనమండపమునకు వేంచేసి రత్నభరణాద్యలంకృతులై కల్పవృక్ష వాహనము నధిష్ఠించి, సర్వపరివారములతో చతుర్వీథులలో ఉత్సవముగా వాహన మండపమునకు వేంచేయుదురు. వెంటనే శ్రీస్వామివారు కల్పవృక్ష వాహనము వదలి సర్వభూపాల వాహనము నధిష్ఠించి సర్వపరివారములతో చతుర్వీథుల యందు ఉత్సవమును పూర్తిచేసి వాహనమండపమునకు వేంచేయుదురు. పిమ్మట ఆ భూపాల వాహనమును వదిలివేసి శ్రీవారు ముక్తారత్న కవచాలంకార (ముత్తియంగి) భూషితుడై చంద్రప్రభా వాహనము నధిష్ఠించి సకల పరివారములతో చతుర్వీథులు ఉత్సవము జరిపి వాహనమండపమునకు చంద్రప్రభతో కూడా చంద్రప్రభ నధిష్ఠించి వేంచేయుదురు. ఇట్లు సప్తగిరి నాథుడగు శ్రీ మలయప్పస్వామివారు రథసప్తమీ దినమునందే శ్రమయనక సప్తవాహనోత్సవములతో భక్తజనకాంక్షలను పూర్ణించి వాహన మండపమునుంచి ఆలయమునకు వేంచేయుదురు. వెంటనే శ్రీ వారికి సాయంకాలారాధనము జరిగి వేణువీణాగానములతో ఏకాంతోత్సవము జరుగును. ఇది యంతయు రథసప్తమీ పర్వదిన సమాసన్న భక్త జన సముదాయాదృష్ట పరంపరాఫలవిశేషముగా భావింపబడుచున్నది.

## 39. కుమారధారాతీర్థ ముక్కోటి ఉత్సవము

అపారకారుణ్యసాగరుడై తిరుమలయందు అర్చావతారమునవేంచేసి యున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధికి ఎనిమిది మైళ్ల దూరమున గల కుమారధారాతీర్థమున ముక్కోటి ప్రతి సంవత్సరము కుంభమాసమున మఖా నక్షత్రయుక్తపూర్ణిమా పర్వదినమున జరుగును.

శ్రీస్వామివారికి ప్రాతఃకాలారాధనము మాధ్యాహ్నికారాధనము పూర్తి అయిన పిదప అర్చకులు వగైరా యావత్తు కైంకర్యపరులు యాత్రికులు, భక్తాగ్రేసరులు వెళ్లెదరు. అచ్చట ఇచ్ఛానుసారముగా స్నానాది కృత్యములను నిర్వహించుకుని పరిపూత గాత్రులై శ్రీ స్వామివారి దర్శనమునకు వచ్చెదరు. దర్శనము చేసినవారు సర్వాభీష్టములను బడయగలరు. ఈ కుమారధారాతీర్థమాహాత్మ్యమును గూర్చి మార్కండేయ పురాణమిట్లు చెప్పుచున్నది. పూర్వమొక బ్రాహ్మణుడు దారిద్ర్యముచే కుటుంబ భారమును మోయలేక భృగు పతనముచే ఆత్మత్యాగము మంచిది అని నిశ్చయించుకుని, భృగుపతనమునకై ఈ వేంకటాచలశిఖరమునకు వచ్చి, పతనమునకుద్యుక్తుడై, ఓ దేవతలారా! ''పతిష్యే పతిష్యే'' అని పెద్దగా కేకలు వైచెను. అప్పుడు శ్రీ వేంకటేశ్వరస్వామివారు రాజకుమార వేషముతో ప్రత్యక్షమై, ఓ బ్రాహ్మణుడా! నీకు సాహసము వలదు. భృగుపతనము మంచిదికాదు అని వారించెను. అది విని బ్రాహ్మణుడు రాజకుమారు నివద్దకు మెల్లగా వెళ్లెను. ఆ రాజకుమారుడు ఆ బ్రాహ్మణుని చేతపట్టుకుని పాపనాశనతీర్థమునకు ఉత్తరముగా నున్న ఈ తీర్థమును చేర్చెను. ఓ విప్రా! నీ దీనదశాన్తమునకై ఈ తీర్థములో స్నానము చేయుము అని చెప్పెను. ఆ విప్రుడు ఆ తీర్థమున స్నానము చేయగానే యువకుడుగా మారెను. శ్రీ స్వామివారు అంతర్ధానమైరి. ఆకాశవాణి ఆ విప్రునకు ఇట్లుగా చెప్పెను. ''ఓ విప్రుడా? ఆ రాజకుమారుడు శ్రీ వేంకటేశ్వరస్వామివారు, నీకు కుమారత్వమును ఐశ్వర్యమును ఇచ్చినారు. నీవు నీ దేశమునకు వెళ్లి సమస్తైశ్వర్యములను పొంది నీకుటుంబముతో ధర్మాచరణము చేసుకొనుచూ సుఖముగా కాలమును వెళ్లించి అనంతరము నిరతిశయ సుఖమును బడయగలవు'' అని ఇటుల స్నానమాత్రముచేతనే కుమారత్వమును ఐశ్వర్యములు మొదలగు

కామితములను సమకూర్చు నీ కుమారధారా తీర్థములో స్నానమాచ రించి శ్రీస్వామివారి దర్శనముచేసి తీర్థప్రసాదములను స్వీకరించినవారు ఐహికైశ్వర్యమును ఆముష్మికైశ్వర్యమును సర్వమును బడయగలరు. ఇందువలననే ఈ తీర్థమునకు కుమారధారా తీర్థమనునామము కలిగినది.

## 40. క్షేత్రపాలక పూజోత్సవము

ఆర్తత్రాణపరాయణుడై, ఆపద్బంధువై, జ్ఞానాద్రియని ప్రఖ్యాతి గాంచిన తిరుమల యందు అర్చావతారమున వేంచేసియున్న శ్రీవేంకటేశ్వరస్వామివారి క్షేత్రపాలకుడగు రుద్రునకు మహాశివరాత్రి దినమున పూజోత్సవములు జరుగును.

మహాశివరాత్రి దినమగు మాఘబహుళ చతుర్దశీ రోజున సాయంకాలము అయిదు గంటలకు తీర్థవాసులు వచ్చి దేవస్థానం ఉద్యోగస్థులను పరివారములను గోగర్భతీరమునందు ప్రభూత శిలారూపముగానున్న క్షేత్రపాలకుని వద్దకు పిలుచుకుని వెళ్ళెదరు. అచ్చట ఏకాదశరుద్రముతో ఆ క్షేత్ర పాలకునకు అభిషేకము జరుగును. పిమ్మట వెండి ఊర్ధ్వపుండ్రమును నేత్రములను పెట్టి అలంకారము ఆరాధనము, నివేదనము చేసి హారతి చేయుదురు. అనంతరము ఆ నివేదితమైన, వడపప్పు, ఫలములు, టెంకాయలు, చందనము, తాంబూలము, మంత్రాక్షతలు, భూరిదక్షిణలు, అర్చకులకు, ఏకాంగులకు, స్థానబహుమాన పూర్వకముగా వినియోగము జరిగి ఇతర భక్తులకు వినియోగము జరుగును. తరువాత అర్చకులు ఇతర కైంకర్యపరులు, ఉద్యోగస్థులు మంగళ వాద్యములతో శ్రీవారి దేవస్థానము మహాద్వారమునకు వచ్చి చేరెదరు.

ఈ క్షేత్ర పాలకుడగు రుద్రుడు శ్రీస్వామివారి క్షేత్రమును చాలా కాలము పరిపాలించి పిమ్మట కారణాన్తరమున గోగర్భ తీరమున శిలారూపముగా నున్నాడని సంప్రదాయ వేత్తలు చెప్పుచున్నారు.

## 41. ప్లవోత్సవము (తెప్పఉత్సవము)

అపారకారుణ్య జలధి యై శేషాచలమునందు (తిరుమల) ఆశ్రిత రక్షణార్థమై అర్చావతారమున వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి పుష్కరిణియందు ప్రతిసంవత్సరము ఫాల్గుణశుద్ధ ఏకాదశి ప్రారంభ ముగా పూర్ణిమ వరకు అయిదుదినములు శ్రీ స్వామివార్లకు ప్లవోత్సవములు (తెప్ప ఉత్సవములు) జరుగును. చేతనరక్షణార్థమై త్రేతాయుగాలంకారముగా అవతరించి ధర్మరక్షణముకావించిన శ్రీరామ చక్రవర్తిస్వామివారు ప్రథమదినమున సాయంకాలము శ్రీ సీతాలక్ష్మణు లతో రత్నాభరణాద్యలంకృతులై సువర్ణ తిరుచ్చియందు వేంచేసి చతుర్వీథులు ఉత్సవము జరిగి శ్రీస్వామి పుష్కరిణియందుగల చిత్రాతి చిత్రమై అనేక విద్యుద్దీప భాస్వరమగు ప్లవమందు (తెప్పయందు) గల పీఠము నలంకరించెదరు. మంగళవాద్యములతోను, వేద ఘోషలతోను ఆ ప్లవ(తెప్ప)ము పుష్కరిణిలో ప్రదక్షిణముగా మూడు పర్యాయములు సంచారముచేసిన తరువాత హారతి అయి శ్రీ కోదండరామస్వామివారు శ్రీవారి సన్నిధానమునకు వేంచేయుదురు.

ధర్మరక్షణార్థమై ద్వాపరయుగాలంకారముగా నవతరించి చేతనో జ్జీవనార్థమై గీతోపదేశమొనరించిన శ్రీకృష్ణస్వామివారు శ్రీరుక్మిణీఅమ్మ వారు రత్నాభరణాద్యలంకృతులై రెండవ దినమున తిరుచ్చియందు

వేంచేసి చతుర్వీథుల ఉత్సవము జరిగి శ్రీస్వామి పుష్కరిణియందుగల అతి రమణీయమగు ప్లవము (తెప్ప) యందు వేంచేసెదరు. వెంటనే మంగళవాద్యములతోను వేదపారాయణములతోను ఆ ప్లవము (తెప్ప) మూడు పర్యాయములు ప్రదక్షిణముగా సంచారము చేయును. తరువాత శ్రీస్వామివారికి హారతి అయి శ్రీవారి సన్నిధానమునకు వేంచేయుదురు.

కలియుగ ప్రత్యక్ష దైవమై మానవులకు కామితార్థ ప్రదానము చేయ నర్చావతారమున యవతరించిన శ్రీ వేంకటేశ్వరస్వామివారు మూడవదినమున సాయంకాలము తిరుచ్చిలో శ్రీ భూదేవులతోసహా వేంచేసి చతుర్వీథులు ఉత్సవము జరిగి పుష్కరిణియందుగల అతి భాస్వరమగు ప్లవము నలంకరించెదరు. ఆ పుష్కరిణియందు ప్రదక్షిణ ముగా మూడు పర్యాయములా ప్లవము (తెప్ప) సంచారము చేయును. శ్రీస్వామివారికి హారతి అయి శ్రీవారి సన్నిధి కి వేంచేయు దురు. ఇటులనే శ్రీమలయప్పస్వామివారు శ్రీభూదేవులతోను నాలుగవ దినమున తిరువీథులు ఉత్సవము జరిగి తెప్పయందు వేంచేయుదురు. 5 అయిదు పర్యాయములు ప్లవము (తెప్ప) మంగళాశాసనములతో వేదారావములతో పుష్కరిణిలో ప్రదక్షిణముగా సంచారము చేయును. శ్రీవారికి హారతి జరిగి ఆలయమునకు వేంచేయుదురు.

ఇటులనే అయిదవదినమున శ్రీ భూసమేతులైన శ్రీమలయప్పస్వా మివారికి తిరువీథులు ఉత్సవము జరిగి ప్లవమునందు వేంచేసెదరు. ఆ ప్లవము (తెప్ప) యేడు పర్యాయములు పుష్కరిణియందు మామూలు మర్యాదలతో సంచారముచేయును. ప్రతి దినము ప్లవము (తెప్ప) పుష్కరిణిలో సంచారము చేయు సమయమున వేలాది యాత్రిక భక్తజనులు పుత్రమిత్రకళత్రాది పరివారములతో పుష్కరిణికి నాలుగు

పార్శ్వములయందున్న సోపానములయందు చేరి పరస్పరము ఆనంద సంభాషణములు చేయుచు ఆనందపారవశ్యమును పొంది యుందురు. శ్రీవారికి హారతి జరిగి క్రమముగా బంగారు వాకిలి వద్దకు వేంచేయగా ఆస్థానము జరుగును. తరువాత శ్రీస్వామివారు సన్నిధి లోనికి వేంచేయుదురు.

## 42. తుంబురు తీర్థముక్కోటి

అశేషచిదచిద్వస్తు శేషిభూతుడై (తిరుమల) ఈ వేదపర్వతమున అర్చావతారమున వేంచేసి యున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధి కి 11 మైళ్ళ దూరములోనున్న తుంబురు తీర్థమున ముక్కోటి ప్రతి సంవత్సరము మీనమాసము నందు శుక్ల పక్షమున ఉత్తరా నక్షత్ర యుక్తమగు పూర్ణిమా పర్వదినమునందు అపరాహ్ణకాలమున జరుగును.

ఈ దినమున శ్రీస్వామివారికి ప్రాతఃకాలారాధనము మాధ్యాహ్ని కారాధనము పూర్తి అయిన పిమ్మట, అర్చకులు మొదలగు యావత్తు కైంకర్యపరులు, యాత్రికులు, భక్తాగ్రేసరులు భగవన్నామధ్యానములతో బయలుదేరి తుంబురుతీర్థమునకు వెళ్ళెదరు. అచ్చట అపరాహ్ణకాలమున స్నానమాచరించి పూతాత్ములై శ్రీవారి సన్నిధానమునకు వచ్చి శ్రీవారిని దర్శించి తీర్థప్రసాదములను స్వీకరించిన వారు సర్వకామములను అనుభవించి అంతమున విష్ణులోకముచేరి నిరతిశయైశ్వర్యమును బడయగలరు. ఈ తుంబురు ఘోణ తీర్థమాహాత్మ్యములను గూర్చి స్కాందపురాణ మిట్లు చెప్పుచున్నది.

పవిత్రాతి పవిత్రములగు గంగాదిసార్ధ త్రికోటి తీర్థరాజముల న్నియు, పాపాత్ములగు మానవులందరు మనయందు స్నానము చేసి

పాపజాలమును మనకు వదిలివేసి పూతాత్ములై కృతాం వెళ్ళుచుండిరి. మనకు సంక్రమించిన ఆ పాపజాలమెట్లు శమించగలదు అని ఆ తీర్థములన్నియు ఆలోచించుకుని బ్రహ్మపుత్రుడై త్రికాలజ్ఞుడైన నారదమహర్షికి ఈ విషయమును చెప్పగా ఆ నారదమహర్షి తీర్థముల కిట్లు సమాధానము చెప్పెను. ఓ తీర్థరాజములారా! మీరు బ్రహ్మహత్యాది సర్వదోషనివారకమగు శ్రీవేంకటాద్రికి వెళ్ళి అచ్చట శ్రీస్వామి పుష్కరిణియందు స్నానమాచరించి, అనన్తరము మీన మాసమున ఉత్తరా నక్షత్ర యుక్తపూర్ణిమా దినమునందు అపరాహ్ణకాలమున అతిపావనమగు తుంబురు ఘోణ తీర్థమునందు స్నానము చేసిన మీకు సంక్రమించిన పాపములన్నియు శమించిపోగలవు అని చెప్పెను. అందుచే మూడు కోట్ల యేబది లక్షల తీర్థరాజములు తుంబుర ఘోణ తీర్థములందు సంక్రమించియుండును. అందుచే ఆ దినము తుంబురు ఘోణ తీర్థమునందు స్నానమాచరించిన మానవులకు సార్థ త్రికోటి తీర్థరాజ స్నానఫలము లభించును. సమస్త పాపనివృత్తియగును. తుంబురుడు, అనుగంధర్వుడు ఆ పర్వదినమున అపరాహ్ణమున స్నానమాచరించి విష్ణులోకము చేరెను. అందుచే నీ తీర్థమునకు తుంబురుఘోణ తీర్థము అను నామము కలిగినది.

## 43. దర్పణభవనములో డోలోత్సవము

పరమయోగివాఙ్మనసాఽపరిచ్ఛేద్యస్వరూపస్వభావుడైనను ఆశ్రితులకు కామితార్థప్రదానము చేయతలంచి తిరుమలయందు అర్చావతారమున వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారికి ప్రతిదినము సాయంకాలమునందు దర్పణభవనములో (అద్దముల మహల్‌లో) డోలోత్సవము (ఊంజలి సేవ) ప్రార్థనాపరుల ప్రార్థనలను కూడా తీర్చుచుజరుగును.

ప్రతిదినము శ్రీస్వామివారికి మాధ్యాహ్నికారాధనము పూర్తి అయిన పిమ్మట శ్రీ మలయప్పస్వామివారు శ్రీ భూదేవులతో రంగమండపమునకు వేంచేయుదురు. అచ్చట ప్రార్థనాపరుల ప్రార్థనానుగుణముగా కల్యాణోత్సవములు, వాహనోత్సవములు పూర్తియగును.

పిదప శ్రీస్వామివారు దేవులతో డోలావిహారమునకై బంగారు తిరుచ్చిలో వేంచేసి మంగళవాద్యములతో ఛత్రచామరాది మహారాజ మర్యాదలతో విద్యుద్దీపసహస్ర విభూషితమై అతిమనోహరమగు దర్పణ భవనమునందు ప్రవేశించెదరు.

అచ్చట అతి రమణీయ విచిత్రశిల్పకల్పనా విశేషవిభూషితములగు శిలామయత్రిపీఠములచే ప్రకాశించు దర్పణసంకలిత చతుస్తంభ డోలామండపమునందుగల బంగారుడోలయందు వేంచేయుదురు.

అంతట అర్చకులు శ్రీస్వామివారి సన్నిధానమునందు డోలోత్సవ ప్రార్థనాపరులగు గృహస్థులకు దత్తమును యథావిధి గా చేయించెదరు.

వెంటనే లీలావిలాసరసికుడగు శ్రీస్వామివారికి వారి ప్రేమ సర్వస్వభూతులగు శ్రీభూదేవులకు విహారోచితములగు ఉపచార ములను సమర్పించి మధురపదార్థములను నివేదనమును కావించి ముఖవాసమును (తాంబూలమును) సమర్పించెదరు.

పిమ్మట వేదనాదములు, సామగానములు, దివ్యప్రబంధగానములు శ్రవణాతిథ్యము నొందుచుండ శ్రీస్వామివారు పట్టమహిషులతో డోలావిహారము చేయుచుందురు.

అట్టిసమయమున ఆ భవనములో నాలుగుదిక్కులయందును మధ్యగల నాలుగుస్తంభములయందును అంతట అమర్చబడియున్న

అద్దముల సమూహములలో అతి రమణీయములైన సరిగంచు పట్టు వస్త్రములచేతను, విచిత్రములైన రత్నాభరణములచేతను, మనోహర సంనివేశవముగల పుష్పమాలాదులచేతను అలంకరింపబడియున్న శ్రీస్వామివారు అట్లుగా నలంకరింపబడియున్న శ్రీభూదేవులతో డోలావిహారము చేయుచూ ప్రతిబింబించెదరు.

అత్తరి ఆ పట్టమహిషులగు శ్రీభూదేవులయొక్కయు ఆ శ్రీనివాసమహాప్రభువుయొక్కయు దివ్యస్వరూప ప్రతిబింబసహస్రపరంపరలను, విద్యుద్దీపసహస్ర ప్రతిబింబపరంపరలను, భక్త జనప్రతిబింబసహస్ర పరంపరలను, స్వాత్మప్రతిబింబసహస్రపరంపరలను కన్నులారాగాంచి దిఙ్ముఖములు కానకయున్న దర్పణభవన డోలావిహారమహోత్సవ సందర్శనసేవాపరాయణులగు భక్తజనులయొక్క - మానసముల నొకే పర్యాయముగా శ్రీస్వామివారు చూరగొనుచుందురు. భక్తజనులు మైమరచియుందురు.

ఈ వైభవమును చూచుచున్న ఇతిహాసవేత్తలు ''పూర్వము శ్రీ మన్నారాయణుడు త్రేతాయుగమునందు శ్రీరామస్వామివారుగానై సీతామహాదేవితో కల్యాణసమయమునందు రత్నభవనముననో, దర్పణ భవనముననో తమ దివ్యాద్భుతస్వరూపప్రతిబింబసహస్రపరంపరలను చూపినారని మహర్షులనుచున్నారు. ఈనాడు శ్రీవేంకటేశ్వరస్వామి వారు గానై పట్టమహిషులతో డోలావిహారసమయమున దర్పణభవనమునందు తమ దివ్యాద్భుత స్వరూపప్రతిబింబ సహస్రపరంపరలను చూపుచున్నారు. చూచుచున్నాము. ధన్యతను కలుగచేయుచున్నారు. ధన్యులమగుచున్నాము'' అనుచూ అతిముగ్ధులై ఆనందసముద్రములో మునిగిపోవుచున్నారు.

అట్టి సమయమున లక్ష్మీవినోదము జరుగును. ఈ వినోదముతో

దివ్యప్రబంధగానముతో చతుర్వేదపఠనధ్వానములతో శ్రీస్వామివారి డోలావిహారము పూర్తియగును.

వెంటనే అర్చకులు శ్రీస్వామివారికి శ్రీభూదేవులకు శ్రమాపనోద నకరములగు ఉపచారముల నర్పించి నివేదించి ముఖవాసమును (తాంబూలమును) సమర్పించెదరు. కర్పూరహారతి జరుగును. ప్రార్థనా పరులగు గృహస్థులకు మామూలుమేరకు శఠారి, చందనము, తాంబూలము, ప్రసాదము వస్త్రబహుమానము జరుగును.

ఇంతియేకాక దర్పణభవన డోలావిహారమహోత్సవ భాసుర మూర్తులగు శ్రీ మలయప్పస్వామివారు ఉత్సవకర్తయగు యజమానుని గూర్చి

''అయి వత్స- సురూపాం ప్రతిమాం విష్ణోః ప్రసన్న వదనేక్షణామ్।
కృత్వాఽఽత్మనః ప్రీతికరీం సువర్ణరజతాదిభిః॥
తా మర్చయేత్ తాం ప్రణమేత్ తాం జపేత్ తాం విచిన్తయేత్।
విశత్యపాస్తదోషస్తు తా మేవ బ్రహ్మరూపిణీమ్॥ ఇతి

తా॥ ఏ మానవుడు ప్రసన్నమగువదనము, ప్రసన్నమగుచూపు, మంచిరూపకముకల విష్ణువు యొక్క ప్రతిమను సువర్ణముచేతనుగాని, రజతాదులచేతనుగాని తనకు ఇష్టమగు నరసింహ, రామ, కృష్ణ వేంకటేశాదిరూపములతో చేయించుకొని ఆ ప్రతిమను పూజించునో, నమస్కరించునో, జపించునో, ధ్యానించునో ఆ మానవుడు సమస్త దోషములను తొలగించుకొని పరబ్రహ్మయగు విష్ణువుయొక్క సాయుజ్యమును పొందును.

అను శాస్త్రమునననుసరించి నీవు శరణ్యదంపతులమగు మా యొక్క సువర్ణప్రతిమను గూర్చి శ్రమను పొందవలదు. మేము

ఏతద్రూపముగా నీ గృహమునకు వచ్చుచున్నాము. నీవు మమ్ములను శ్రద్ధతోనుపాసించుము భక్తితో భజింపుము. మేము నీ యోగక్షేమములను వహించెదము. మత్ప్రాప్తి సాధనమగు బుద్ధియోగము నిచ్చెదము. రక్షించెదము'' అనునట్లుగా తమ సువర్ణప్రతిమను సంసారసాగరసంత రణభీరువై తమను ఆశ్రయించిన ప్రార్థనాపరుడగు యజమానుని యొక్క అంజలిబంధమునందు అనుగ్రహించెదరు. ఇది జన్మసాఫల్య దాయకమగు విశేషము.

పిమ్మట భక్తులకు చందన తాంబూల ప్రసాదాది వినియోగము జరుగును. శ్రీస్వామివారు శ్రీభూదేవులతో తిరుచ్చినధిష్ఠించి మంగళ వాద్యములతో, మహారాజమర్యాదలతో, వేదధ్వానములతో శ్రీవారి సన్నిధికి వేంచేయుదురు.

శ్లో॥ ఆర్తా విషణ్ణా శ్శిథిలాశ్చ భీతాః ఘోరేషు చ వ్యాధి షు వర్తమానాః।
సంప్రార్థ్య శేషాచలమౌళిరత్నం నిరస్తదుఃఖా స్సుఖినో భవన్తి॥

ఓమ్

# శ్రీ వేంకటేశ్వర వైభవము

★

# 3

తిరుమల

శ్రీ వేంకటేశ్వరస్వామివారి

## పుణ్యతీర్థములు



పాపవినాశన పుణ్యతీర్థము

# 3

## పుణ్యతీర్థములు

శ్లో॥ మాయావీ పరమానందం, త్యక్త్వా వైకుంఠ ముత్తమమ్।
స్వామిపుష్కరిణీ తీరే, రమయాసహ మోదతే॥

అఖిల బ్రహ్మాణ్డకోటి నాయకుడై సకల చరాచర సృష్టికర్తయగు శ్రీమన్నారాయణుడు అపార కారుణ్య సాగరుడగుటచే శ్రీవైకుంఠమును వదలి ఈ కలియుగమునందు కర్మయోగముకూడా లేని మానవులకు ప్రార్థనామాత్రము చేతనే పురుషార్థ ప్రదానము చేయనాలోచించి ఈ శేషపర్వతమునందు (తిరుమలయందు) శ్రీ వేంకటేశార్చావతారమున వేంచేసియున్నాడని ఇదివరలో చెప్పబడియున్నది.

శ్రీ వైకుంఠమునందు శయనముగానున్న శేషుని ఇచ్చట స్వయంవ్యక్త స్థానములో శేషుని శేషత్వమును పరిపాలింప పీఠముగా యేర్పాటుచేసుకుని, ''విగ్రహారాధనము, పీఠారాధన పూర్వకము'' అనుశాస్త్రమును పరిపాలించుచూ శేషపర్వతమునందు శ్రీ స్వామివారు అవతరించినారు అని సంప్రదాయవేత్తలు పరమానందము నొందుచున్నారు.

సర్వేశ్వరునకు పీఠముగా ప్రకాశించుచున్న ఈ శేషపర్వతము

ముప్పది ఆమడలు (రెండువందల నలుబదిమైళ్లు) పొడుగు, మూడు ఆమడల (ఇరువది నాలుగుమైళ్లు) వెడల్పు కలిగియున్నదని పురాణములు చెప్పుచున్నవి. లౌకికులు మూడువేల అడుగుల యెత్తున్నూ కలిగి యున్నదని అంచనా వేయుచున్నారు.

ఈ శేషపర్వతముయొక్క ముఖభాగము వేంకటాద్రి అనియు మధ్యభాగము నృసింహాద్రి అనియు, పుచ్ఛభాగము శ్రీశైలము అనియు పురాణములచే వ్యవహరించబడుచున్నది.

ఈ పర్వతము అనేక పుణ్యతీర్థములు కలదియై ''తీర్థాద్రి'' అను నామముతో కూడా వ్యవహరింపబడుచున్నది.

## పుణ్యతీర్థ నామ నిర్వచనము

పుణ్యతీర్థము అనుపదము ''పుణ్య'' ''తీర్థ'' అను రెండు పదములతో కలిసియున్నది. పుణ్య పదమునకు ''పుణాతి = శుభం కరోతి'' అను వ్యుత్పత్తిచేత శుభమును చేయునది అని అర్థము. తీర్థపదమునకు ''తరన్త్యనేన'' అను వ్యుత్పత్తివలన దీనిచేత తరించు-చున్నారు అని అర్థము. మరియు నిఘంటుకారులు తీర్థశబ్దము = ''ఋషిజుష్ట జలమునందు'' వర్తించును అని చెప్పుచున్నారు. ''జుష = ప్రీతి సేవనయోః'' అను ధాతుపాఠమువలన మహర్షుల చేత సేవింపబడిన, ప్రేమింపబడిన జలమునకు తీర్థము అని పేరు. రామకృష్ణ తీర్థము = రామకృష్ణుడను మహర్షి తపస్సుచేయుచూ తన స్నానార్థమై కల్పించుకుని సేవించిన తీర్థము. ఇటులనే కాయ రసాయన తీర్థము = శరీర శుద్ధిని, శరీర దార్ఢ్యమును, మహాత్మ సందర్శనమును కలుగజేయు జలముతో విరాజిల్లు తీర్థము. ఈ తీర్థము మహర్షులచేతను, యోగాభ్యాసపరులచేతను సేవింపబడుతూ

ప్రీతిపాత్రమైయున్నది. అందుచే మహర్షులు సేవించుటచేతను ప్రేమించుటచేతను శుభమును కలుగజేయు జలములు పుణ్యతీర్థములు అని తాత్పర్యము.

అట్టి పుణ్యతీర్థములు ఈ శేషపర్వతమునందు (66) అరువది ఆరు కోట్ల తీర్థములు ప్రకాశించుచున్నవి అని బ్రహ్మపురాణము, స్కందపురాణము చెప్పుచున్నవి. ఆ అరువది ఆరుకోట్ల పుణ్య తీర్థములలో ముఖ్యములగు పుణ్యతీర్థములను తెలుసుకొనుట అవసరమైయున్నది.

సర్వతీర్థములలోను ముఖ్యములగు పుణ్యతీర్థములు

1. ధర్మరతి ప్రదములు,

2. జ్ఞానప్రదములు,

3. భక్తివైరాగ్యప్రదములు,

4. ముక్తిప్రదములు

అను నాలుగు విధములుగా నిర్ణయింపబడియున్నవి.

## ధర్మరతిప్రదములగు పుణ్యతీర్థములు

1. తమను తీరవాసముచేతను, స్నానములచేతను, పానముల చేతను సేవించిన మానవులకు ధర్మాసక్తిని కలుగజేసి కర్మయోగాది సంపాదన ద్వారా క్రమముగా కృతార్థత కలుగచేయు పుణ్యతీర్థములు (1008) పదివందల యెనిమిదిగా నిర్ణయించబడినవి. ఈ తీర్థములు ముఖ్యములుగా తెలియవలెను.

## జ్ఞానప్రదములగు పుణ్యతీర్థములు

2. తమను సేవించిన మానవులకు సద్జ్ఞానమును కలుగచేసి భక్తియోగసంపాదన ద్వారా క్రమముగా కృతార్థతను కలుగచేయు పుణ్యతీర్థములు (108) నూటయెనిమిదిగా నిర్ణయింపబడినవి. ఇవి పూర్వము చెప్పిన పదివందల యెనిమిది పుణ్యతీర్థములకంటే ముఖ్యములుగా గ్రహింపవలెను.

## జ్ఞానప్రదములగు పుణ్యతీర్థముల నామములు

1. మనుతీర్థము, 2. ఇంద్రతీర్థము, 3. వసుతీర్థము, 4. రుద్రతీర్థములు 11, 5. ఆదిత్య తీర్థములు 12, 27. ప్రజాపతి తీర్థములు 9, 36. అశ్వినీతీర్థము, 37. శుక్రతీర్థము, 38. వారుణ తీర్థము, 39. జాహ్నవీతీర్థము, 40. కాపేయతీర్థము, 41. కాణ్వతీర్థము, 42. ఆగ్నేయతీర్థము, 43. నారదతీర్థము, 44. సోమతీర్థము, 45. భార్గవతీర్థము, 46. ధర్మతీర్థము, 47. యజ్ఞతీర్థము, 48. పశుతీర్థము, 49. గణేశ్వర తీర్థము, 50. భౌమాశ్వ తీర్థము, 51. పారిభద్రతీర్థము, 52. జగజ్జాడ్యహర తీర్థము, 53. విశ్వకల్లోల తీర్థము, 54. యమతీర్థము, 55. బ్రాహ్మస్ప త్యతీర్థము, 56. కామహర్ష తీర్థము, 57. అజామోదతీర్థము, 58. జనేశ్వర తీర్థము, 59. ఇష్టసిద్ధితీర్థము, 60. కర్మసిద్ధితీర్థము, 61. వటతీర్థము, 62. ఔదుంబర తీర్థము, 63. కార్తికేయ తీర్థము, 64. కుబ్జతీర్థము, 65. ప్రాచేతస తీర్థములు 10, 75. గరుడతీర్థము, 76. శేషతీర్థము, 77. వాసుకీతీర్థము, 78. విష్ణువర్ధన తీర్థము, 79. కర్మకాండతీర్థము, 80. పుణ్య వృద్ధితీర్థము, 81. ఋణవిమోచన తీర్థము, 82. పార్జన్య తీర్థము,

83. మేఘతీర్థము, 84. సాంకర్షణ తీర్థము, 85. వాసుదేవతీర్థము, 86. నారాయణతీర్థము, 87. దేవతీర్థము, 88. యక్షతీర్థము, 89. కాలతీర్థము, 90. గోముఖతీర్థము, 91. ప్రాద్యుమ్న తీర్థము, 92. అనిరుద్ధతీర్థము, 93. పితృతీర్థము, 94. ఆగ్నేయతీర్థము, 95. వైశ్వదేవతీర్థము, 96. స్వధాతీర్థము, 97. స్వాహాతీర్థము, 98. అస్థితీర్థము, 99. ఆంజనేయ తీర్థము, 100. శుద్ధోదక తీర్థము, 101. అష్టభైరవ తీర్థములు 8, (108 పుణ్యతీర్థములు)

## భక్తివైరాగ్యప్రదములగు పుణ్యతీర్థములు

(3) ఈ నూటయెనిమిది పుణ్యతీర్థములకంటె ముఖ్యములైన పుణ్యతీర్థములు (68) అరువదియెనిమిదిగా పరిగణింపబడియున్నవి. ఈ తీర్థములు తమను సేవించిన మానవులకు పాపప్రశమనము చేయుటయేకాక సంసారమందు వైరాగ్యమును, పరమేశ్వరునియందు భక్తిని కలుగచేసి ఆ భక్తియోగముద్వారా క్రమముగా కృతార్థతను కలుగచేయును.

## భక్తివైరాగ్యప్రదములగు పుణ్యతీర్థముల నామములు

1. చక్రతీర్థము, 2. వజ్రతీర్థము, 3.విష్వక్సేన తీర్థము, 4. పంచాయుధ తీర్థము, 5. హలాయుధతీర్థము, 6. నారసింహ తీర్థము, 7. కాశ్యపతీర్థము, 8. మాన్మథతీర్థము, 9. బ్రహ్మతీర్థము, 10. అగ్నితీర్థము, 11. గౌతమ తీర్థము, 12. దైవతీర్థము, 13. దేవల తీర్థము, 14. విశ్వామిత్ర తీర్థము, 15. భార్గవతీర్థము, 16. అష్టావక్రతీర్థము, 17. దురారోహణ తీర్థము, 18. భైరవతీర్థము (పిశాచవిమోచనము), 19. మేహతీర్థము (ఉదరవ్యాధి నాశనము),

20. పాండవ తీర్థము, 21. వాయుతీర్థము, 22. అస్థితీర్థము (పునర్జీవన సాధనము), 23. మార్కండేయ తీర్థము (ఆయుష్య వర్ధనము), 24. జాబాలితీర్థము, 25. వాలఖిల్యతీర్థము, 26. జ్వరహర తీర్థము (సర్వజ్వరనాశనము), 27. విషహరతీర్థము (తక్షక విషవ్యాధి నివారకము), 28. లక్ష్మీతీర్థము, 29. ఋషితీర్థము, 30. శతానంద తీర్థము, 31. సుతీక్ష్ణక తీర్థము, 32. వైభాండక తీర్థము, 33. బిల్వతీర్థము, 34. విష్ణుతీర్థము, 35. శర్వతీర్థము, 36. శారభతీర్థము, 37. బ్రహ్మతీర్థము, 38. ఇంద్రతీర్థము, 39. భారద్వాజతీర్థము, 40. ఆకాశగంగాతీర్థము, 41. ప్రాచేతస తీర్థము, 42. పాపవినాశనతీర్థము, 43. సారస్వతతీర్థము, 44. కుమారధారాతీర్థము, 45. గజతీర్థము, 46. ఋశ్యశృంగ తీర్థము, 47. తుంబురు తీర్థము (నారదాది సేవితము), 48. దశావతార తీర్థములు 10, 58. హలాయుధ తీర్థము, 59. సప్తర్షితీర్థములు 7, 66. గజకోణతీర్థము, 67. విష్వక్సేన తీర్థము, 68. యుద్ధసరస్తీర్థము (జయదాయకము) (68 పుణ్యతీర్థములు).

## ముక్తిప్రదములగు పుణ్యతీర్థములు

(4) ఈ భక్తి వైరాగ్య ప్రదములగు అరువది యెనిమిది పుణ్య తీర్థములకంటె ముఖ్యములైన పుణ్యతీర్థములు సప్త తీర్థములు (7) ఈ తీర్థములు తమను సేవించిన మానవులకు సర్వపాపములను నివర్తింప చేసి ముక్తిసాధనములను సమకూర్చి ముక్తిప్రదములగుటచే అన్ని పుణ్య తీర్థములకంటెను పరమోత్తమములగు తీర్థములుగా పరిగణింప బడియున్నవి.

## ముక్తిప్రదములై, సర్వతీర్థములలోను ముఖ్యములగు పుణ్యతీర్థముల నామములు

1. శ్రీస్వామిపుష్కరిణీ తీర్థము, 2. కుమారధారా తీర్థము, 3. తుంబురు తీర్థము, 4. రామకృష్ణ తీర్థము, 5. ఆకాశగంగా తీర్థము, 6. పాపవినాశన తీర్థము, 7. పాండవ తీర్థము (గోగర్భ తీర్థము) ఇవి అత్యన్త ముఖ్యములుగా గ్రహించవలెను.

## పురాణభేదము – సమన్వయము

ఇవియే ముక్తిప్రదములగు సప్తతీర్థములు అని బ్రహ్మపురాణము నాలుగవ అధ్యాయము చెప్పుచున్నది. ఈ సప్తతీర్థములలో రామకృష్ణ తీర్థమును వదలిపెట్టి, తక్కిన ఆరు తీర్థములే ముక్తి ప్రదములగు పుణ్యతీర్థములు, అని స్కంద పురాణములో పదునేడవ అధ్యాయము చెప్పుచున్నది. అటులతీసివేసిన రామకృష్ణ తీర్థస్థానములో దేవ తీర్థమును చేర్చి సప్తతీర్థములు ముఖ్యములు, ముక్తిప్రదములు అని వరాహ పురాణము ద్వితీయభాగములోని ప్రథమాధ్యాయముచెప్పుచున్నది. మరియు పాఠాన్తరములచేత చక్రతీర్థము సప్తతీర్థములలో చేరి ముక్తిప్రదమగుచున్నది. యెట్లున్నను ఆరు తీర్థములు ముక్తి ప్రదములు. సర్వతీర్థములలో ముఖ్యములు. అని అన్ని పురాణములు చెప్పుచున్నవి గాన ఆ ఆరు తీర్థములు ముక్తి ప్రదములు అనుటలో విప్రతిపత్తి యేమియులేదు. యేడవ తీర్థము రామకృష్ణ తీర్థమా? దేవతీర్థమా? చక్రతీర్థమా? అని సందేహము కలుగవచ్చును. అందుచేత పూర్ణముగా సప్తతీర్థములను సేవించదలచినవారు అన్నియు వ్యాసాభిమతములుగా తలంచి యథాభిరుచిగా నా మూడింటిలో ఇష్టమైన తీర్థమును యేడవ తీర్థముగా భావించి ఆ పుణ్య తీర్థమును సేవించి

కృతార్థులయ్యెదరుగాక! లేదా ఆ మూడు తీర్థములను సేవించినందు వలన సప్తతీర్థములను సేవించుట లభించును. అభ్యుచ్ఛ్రయము కూడా లభించును అని తెలియదగియున్నది.

ఇటుల సర్వపుణ్య తీర్థములలో ముఖ్యములై పరమపావనములై ముక్తిప్రదములగు ఈ సప్తతీర్థములు కూడా విశేష సమయములు కలిగియున్నవి. ఆ విశేష సమయములు పర్వదినములు అనబడుచున్నవి.

## పర్వ వివరణము

పర్వదినము అనగా - మూడుకోట్లల యేబదిలక్షల పుణ్యతీర్థములు తమయందు పాపులు స్నానము చేయుటచేత తమకు సంక్రమించిన పాపములను తొలగించుకొనుటకై అతిశక్తియుతములగు ఈ తీర్థముల యొక్క పర్వదినములయందు ఆ తీర్థములన్నియు సాన్నిధ్యమును సంపాదించుకొని తమ పాప నివృత్తిని కూడా చేసుకొనుచుండును. అందుచే శక్తియుతములైన ఈ తీర్థముల పర్వదినములయందు స్నానమాచరించినవారు మూడుకోట్ల యేబదిలక్షల పుణ్యతీర్థముల యందును స్నానమాచరించిన వారలగుదురు. తత్ఫలములను పొందగల వారగుదురు. ఇదియే విశేషము.

## పర్వసమయములు

ఈ సప్తతీర్థములయందు స్నానవిశేష సమయములగు పర్వదినములను చూడుము.

1. <u>శ్రీ స్వామిపుష్కరిణీ తీర్థము:-</u> ధనుర్మాసములో శుద్ధ ద్వాదశీదినమున అరుణోదయ కాలమునందు ఆరుఘడియల సమయము పర్వసమయము.

2. కుమారధారా తీర్థము:- కుంభమాసమునందు మఖా నక్షత్రముతో కూడిన పూర్ణిమా దినము పర్వదినము.

3. తుంబురు తీర్థము:- మీనమాసమునందు ఉత్తర ఫల్గునీ నక్షత్రముతో కూడిన పూర్ణిమా అపరాహ్ణ కాలము పర్వకాలము.

4. రామకృష్ణ తీర్థము:- మకరమాసమునందు పుష్యమీ నక్షత్రముతో కూడిన పూర్ణిమా దినము పర్వదినము.

5. ఆకాశగంగాతీర్థము:- మేషమాసమునందు చిత్రా నక్షత్రముతో కూడిన పూర్ణిమా దినము పర్వదినము.

6. పాపవినాశనతీర్థము:- ఆశ్వయుజమాసమునందు శుక్ల పక్షమున ఉత్తరాషాఢా నక్షత్రముతోకూడిన సప్తమీ ఆదివారముగాని లేక ఉత్తరాభాద్రా నక్షత్రముతో కూడిన ద్వాదశిదినముగాని పర్వదినము.

7. పాండవతీర్థము:- వృషభమాసమునందు శుద్ధ ద్వాదశీ ఆదివారముగాని లేక బహుళ ద్వాదశీ మంగళవారముగాని పర్వదినము. ఉభయత్ర సంగమకాలము పర్వకాలము. సంగమ కాలము అనగా ఉదయము ఆరు ఘడియలనుంచి 12 ఘడియల వరకుగల కాలము.

ఈ పై చెప్పిన సప్తతీర్థములయందు పర్వదినములలో స్నానమొనరించి విధ్యుక్త కర్మానుష్ఠానమాచరించి అన్నదానము, సువర్ణ దానము, గోదానము, కన్యాదానము, సాలగ్రామదానము మొదలగు దానములు చేయవలయుననియు అందులకు రాజసూయాది ఫలములు లభించుననియు పురాణములు చెప్పుచున్నవి. అట్లు చేయుట ఆచారము కూడా అయియున్నది.

# తీర్థ పర్వోత్సవములు

ఇంతియేకాక, ముక్తిప్రదములగు ఈ సప్త తీర్థములలో పైన ఉదాహరించిన నాలుగు పుణ్యతీర్థములు, ముక్తిదాతయగు శ్రీస్వామి వారితో ఆ పర్వదినములయందు నియతసంబంధముకలవైయుండి

1. శ్రీ స్వామిపుష్కరిణీతీర్థ ముక్కోటి
2. కుమారధారాతీర్థ ముక్కోటి
3. తుంబురుతీర్థ ముక్కోటి
4. రామకృష్ణతీర్థ ముక్కోటి

అను నామములతో ప్రకాశించుచూ ఉత్సవములు జరుగుచున్నవి.

ఆ దినములయందు శ్రీస్వామివారి ఆరాధనానన్తరము అర్చకులు, అధికారులు, ఏకాంగులు, పాచకులు, పరిచారకులు, పరివారములతో మంగళవాద్యములతో శ్రీ స్వామివారి ప్రసాదములను తీసుకొనివెళ్లిగాని, పదార్థములను తీసుకుని ఆ తీర్థముల తీరములకు వెళ్ళి, పాకము లొనరించిగాని, అచ్చటగల శ్రీకృష్ణాది శిలావిగ్రహము లకు పూజలొనరించి ఇంతకుపూర్వమే ఆ తీర్థముల తీరములకు వెళ్లి, పర్వ స్నానమాచరించి ధౌత వస్త్రధారులై పుండ్రధారులై విధ్యుక్త ధర్మ ముల నాచరించి తమ ఆగమనమును నిరీక్షించుచున్న ధర్మానుష్ఠాన పరులగు వందలకొలది భక్తజనములకు ప్రసాదముల నొసగి వారలను పరిపూత హృదయులను చేయుచున్నారు.

అటుల పరిపూతగాత్రులై పరిపూత హృదయులైన ఆ భక్తజన ములు వెంటనే శ్రీ స్వామివారి సన్నిధానమునకు వచ్చి శ్రీవారిని దర్శించి తీర్థప్రసాదముల స్వీకరించి కృతార్థులై వెళ్ళుచున్నారు.

ఇది గొప్ప విశేషముగా భావించవలసి యున్నది.

ఈ సప్తతీర్థములలో పై నాలుగు తీర్థములు (అనగా శ్రీస్వామి పుష్కరిణీ తీర్థము, కుమారధారా తీర్థము, తుంబురు తీర్థము, రామకృష్ణ తీర్థము) శ్రీస్వామివారితో సంబంధము కలిగియున్నవి. తక్కిన మూడు తీర్థములు. (అనగా ఆకాశగంగాతీర్థము, పాపవినాశన తీర్థము, పాండవ తీర్థము) అటుల సంబంధము లేకయున్నవి. పూర్వులు అటుల యెందుకు సంబంధమును కలుగచేయలేదో తెలుసు కొనవలసియున్నది.

## ఉత్ప్రేక్షణము

శ్రీస్వామివారికి ఈ మూడు తీర్థములు సన్నిహితములుగా నుండుటచేత, అనుదినము శ్రీవారి దర్శనార్థమై, పర్వతారోహణముచేసి శ్రమయనక అత్యుత్సాహముతోవచ్చు యాత్రికులకు భక్తులెల్లరు ఈ తీర్థములయందు స్నానమాచరించి పవిత్రులై శ్రీవారిని దర్శించి తీర్థప్రసాదముల స్వీకరించి కృతార్థులై వెళ్ళుట ఆచారమైయున్నది. అందుచే అనుదినము శ్రీవారితో సంబంధముగల ఈ మూడు తీర్థములు పర్వదినములయందు కూడా శ్రీ స్వామివారితో సంబంధము కలిగియుండుటచే సర్వదినములు పర్వదినములుగా ఊహించవలసి యున్నది. మహనీయులగు పూర్వుల భావములు అనూహ్యములుగా నుండును.

## 1. శ్రీ స్వామిపుష్కరిణీ పుణ్యతీర్థము

(సర్వతీర్థ ప్రధానములై ముక్తిప్రదములైన ఈ సప్తపుణ్యతీర్థముల యొక్క శక్తివిశేషములు పూర్వానుభవ విశేషములు, వైభవములు

పౌరాణికభాగ లబ్ధములగు విషయములు వివరింపబడుచున్నవి గమనించుదురుగాక.)

అఖిల పురుషార్థ ప్రదాతయై ఈ శేషభూధర శిఖరమున ఆనందనిలయ విమానమునందు వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధానమునకు ఈశాన్యభాగమున ముక్తిప్రదములగు సప్తతీర్థములలో మొదటిదియగు ''శ్రీ స్వామిపుష్కరిణీతీర్థము'' అను పుణ్యతీర్థము కలదు. ఈ తీర్థము ముల్లోకములయందుగల సమస్త పుణ్యతీర్థములకు స్వామినియగుటచే, ''స్వామిపుష్కరిణీ'' అని ప్రఖ్యాతిగాంచి సర్వకామ దానశక్తికలదై ప్రకాశించుచున్నది. ఈ తీర్థమునకు ప్రతి సంవత్సరము ''మాసానాం మార్గశీర్షోఽస్మి'' అని గీతా ప్రదాతచే ప్రశంసింపబడిన మార్గశీర్షమాసమునందు కలావృద్ధియగు శుక్లపక్షములో విష్ణుదేవతాకమగు ద్వాదశీదినమునందు అరుణోదయ సమయము అభిగమన సమయము పర్వకాలము అని ఇదివరలో చెప్పియున్నాము. ఈ పర్వకాలమున ముక్తిప్రద తీర్థరాజమగు నీ తీర్థమందు స్నానమాచరించి విధ్యుక్త ధర్మముల ననుష్ఠించి ముక్తిదాతయగు శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శన మొనరించి శ్రీవారి తీర్థ ప్రసాదములను స్వీకరించిన అదృష్టవంతులకు సర్వవాంఛితములు కరతలామలకములుగా నగుచున్నవి.

సర్వతీర్థ స్వామినియగు ఈ స్వామి పుష్కరిణీ తీర్థమును గూర్చి పురాణములు, మహర్షులు బహువిధములుగా ప్రశంసించుచున్నారు.

వామన పురాణము:

పూర్వము మార్కండేయమహర్షి లోకపితామహుడగు బ్రహ్మను

గూర్చి అభీష్టసిద్ధికై ఘోరమైన తపస్సు నాచరించెను. ఆ మార్కండేయుని నియమబద్ధమగు ఆ చిరకాల తపస్సునకు సంతసించి చతురాననుడు ప్రేమచే సాన్నిధ్యమునుచేసి ఓ మహామునీ! మార్కండేయా! వరమును కోరుకొనుము అని పలికెను. అంత నా మార్కండేయుడు సంతుష్టుడై తన కభీష్టమగు సమస్త తీర్థయాత్రాశక్తిని వరముగానిమ్మని కోరెను. చతుర్ముఖుడగు నా బ్రహ్మ నవ్వుచూ సర్వతీర్థ ఫలప్రాప్తి కాముకుడవగునో మార్కండేయ మహామునీ! సర్వతీర్థములయందు స్నానము చేయుట వర్ష శతములకైనను నాచేతనుగాని రుద్రాదుల చేతనుగాని కాని కార్యము. గాన సర్వతీర్థ ఫలప్రాప్తి సాధకమగు నుపాయమును చెప్పెద వినుము.

ఇచ్చటికి దక్షిణ దిగ్భాగమున రెండునూరుల ఆమడల దూరమున, దేవానుభావ్యమగు వేంకటాద్రి యను పర్వతరాజము కలదు. ఆ పర్వతశిఖరమునందు స్వామిపుష్కరిణీ యను తీర్థరాజము కలదు. ఆ తీర్థమునందు ప్రతిసంవత్సరము మార్గశీర్షమాసమునందు శుక్లపక్షమున ద్వాదశీ దినమునందు అరుణోదయ సమయమున త్రిలోక విశ్రుతములగు సమస్తపుణ్యతీర్థములు తమయందు పాపాత్ము లగు వారలు పుణ్యసంపాదనమునకై స్నానము చేయుటచే తమకు సంక్రమించిన పాపజాలమును తొలగించుకొనుటకు సాన్నిధ్యముచేసి ఈ తీర్థ సమన్వయమువలన తమపాపములను తొలగించుకొని వెళ్ళుచుందురు.

అందుచే నీవు ఆ సర్వతీర్థసమన్వయకాలమున శ్రీ స్వామి పుష్కరిణీతీర్థమందు స్నానము చేయుము. అందువలన నీకు సర్వతీర్థ యాత్రాసిద్ధి. సర్వతీర్థ స్నానఫలప్రాప్తి కలుగును అని చెప్పి చతుర్ముఖుడంతర్ధానమాయెను. మార్కండేయ మహర్షి సంతసించి

ఆ చతుర్ముఖుడు చెప్పిన ప్రకారము వేంకటాద్రికి వెళ్ళి ఆ పర్వదిన మున శ్రీ స్వామిపుష్కరిణి యందు స్నానముచేసి సకలతీర్థయాత్రా ఫల సిద్ధిని పొందకలిగెను.

(మరియు) వామనపురాణము:

ఈ స్వామి పుష్కరిణీతీర్థము యొక్క తీరమునందు కుబేరుడు, చంద్రుడు, కాముడు, ఇంద్రుడు మొదలగు దేవతలు సువర్ణదానము, కన్యాదానము, భూవ్యాది దానములు చేసి ధనేశత్వమును, లావణ్యమును, కామత్వమును, దుర్జయ విజయశక్తిని, ఇతర దుష్ప్రాప్య ములగు సంపదలను పొందిరి గాన, ఈ తీర్థమున స్నానమా చరించి తీరమునందు షోడశ మహాదానములుచేయు అదృష్టముకల మహానుభావులు అనంతములగు వాంఛితములను పొందగలరు. అనియు చెప్పుచున్నది.

భవిష్యోత్తర పురాణము:

ఈ స్వామిపుష్కరిణీ తీర్థమునందు పర్వదినమున స్నానము చేసి తీరమునందు పితృభక్తి కర్మశ్రద్ధగల యే మానవులు పితృశ్రాద్ధముల నాచరించెదరో వారి పితృదేవతలు సంతుష్టులై హరిమందిరమునకు చేరి పరమానంద పరవశులై నృత్యములు చేయుచుందురు.

పూర్వకాలమునందు శంఖుడను ఒక క్షత్రియుడు శ్రీ స్వామి పుష్కరిణియందు స్నానము చేసినంత మాత్రముననే రాజ్యమును పొంది చక్రవర్తియై సర్వసుఖముల ననుభవించెను.

మరియు పూర్వము నారాయణుడను ఒక బ్రాహ్మణోత్తముడు శ్రీస్వామి పుష్కరిణీ తీర్థస్నాన మహిమచేతనే భగవత్సాక్షాత్కారము

కలవాడై భగవంతునివలన వరమునుపొంది హరిమందిరమునుచేరి అవాఙ్మానసగోచరమగు నిత్యానందము ననుభవించకలిగెను.

పూర్వమునందు దశరథపుత్రుడగు శ్రీరాముడు ఈ స్వామి పుష్కరిణియందు స్నానమాచరించి ఆ స్నానమహిమచేతనే అపహరింపబడిన సీతను విజయలక్ష్మితోసహా పొందకలిగెను.

అందుచే తీరమునందు సమస్త కామప్రదాతయగు శ్రీస్వామి వారితో ప్రకాశించు నీ స్వామిపుష్కరిణీతీర్థము కామధేనువుగానై సర్వమానవులకు సమస్త కామ్యములను కూడా సమకూర్చుచున్నది. అజ్ఞానమును తొలగించుచున్నది. విజ్ఞానమును ప్రసాదించుచున్నది.

(మరియు) భవిష్యోత్తర పురాణము:

''స్వామి పుష్కరిణీ స్నానం, వేంకటేశ్వరదర్శనమ్.
మహాప్రసాదస్వీకారః, త్రయం త్రైలోక్యదుర్లభమ్॥''

తా॥ ముల్లోకములయందు శ్రీ స్వామి పుష్కరిణీ స్నానము, శ్రీవేంకటేశ్వర దర్శనం, మహాప్రసాదలాభము ఈత్రయము మానవులకు పూర్వజన్మార్జిత సుకృత సముదాయముచేత లభించవలసియున్నది కాని అన్యథా దుర్లభమగుచున్నది. అనగా, మానవులలో విదేశీయులు, దూరదేశీయులు, ప్రాంతీయులు కూడా కొందరు ఈ తీర్థమును, ఈ దైవమును, ఈ ప్రసాదమును అనుభవించి కడతేరుటకు రాలేకపోవుచున్నారు. ఇది తెలియని విషయముకాదు. యేదో నిర్బంధముచేత వచ్చియు శ్రీ స్వామివారి దర్శనముకాక, మహాప్రసాదము లభించక శ్రీ స్వామి పుష్కరిణీస్నానము చేయలేక, ప్రకృతివాసనాబద్ధులై అదృష్టములేక ప్రతిబంధకము లెదురేగ అన్నియు విరమించుకుని మరియొక

పర్యాయము రాగలము. అప్పుడన్నియు సాధించగలము అని తృప్తి పడుచు వెళ్ళుచున్నారు. గాన ఈ తీర్థస్నానాదిత్రయము దైవప్రసాద లభ్యము, అన్యథా దుర్లభమేనని తెలియదగియున్నది.

స్కందపురాణము:

పూర్వము చంద్రవంశీయుడగు నందరాజు ధర్మగుప్తుడను కుమారునకు రాజ్యభారమునందజేసి తాను రేవానదీ తీరమున వాన ప్రస్థాశ్రమమును స్వీకరించి ఆత్మావలోకనము చేయుటకై నివసించి యుండెను. తన కుమారుడగు ధర్మగుప్తుడు కారణాంతరమున శాపగ్రస్తుడై ఉన్మాదమును పొంది దేశభ్రమణము చేయుచుండెను. నందరాజు ఈ విషయమును తెలుసుకుని కుమారుని చేరవచ్చి దుఃఖించి ఈ దోషనివృత్తి మార్గము నరయుటకై కుమారుని వెంట బెట్టుకుని జైమిని మహర్షి ఆశ్రమమునకు వెళ్ళెను. నందరాజు ఆ మహర్షి పాదములవ్రాలి తన కుమారునివృత్తాంతము నంతయు చెప్పి ఈ దోష పరిహారోపాయమును చెప్పి రక్షింపుమని ప్రార్థించెను.

ఆ మహర్షి ధ్యానమార్గముచే నంతయు తెలుసుకుని, ఓ రాజా! నీవు ఇచ్చటి కనతిదూరములో, శ్రీవేంకటభూధర శిఖరమునందు పవిత్రాతి పవిత్రమగు స్వామిపుష్కరిణీ తీర్థముకలదు. అచ్చటికి నీ కుమారునితో సహా వెళ్ళి, పుణ్యపురుషులతో క్రిక్కిరిసి ప్రకాశించు నా స్వామి పుష్కరిణీ తీర్థమునందు నీ కుమారుని స్నానము చేయించుము. స్నానమాత్రముననే ఉన్మాదము తొలగి స్వస్థచిత్తుడు కాగలడు అని చెప్పెను. ఆ మహర్షి వచనముల కానందరాజు సంతసించి, తన కుమారునితో శ్రీ వేంకటాద్రికి వెళ్ళి శ్రీ స్వామి పుష్కరిణియందు కుమారుని స్నానముచేయించెను. వెంటనే

ధర్మగుప్తుడు ఉన్మాదము తొలగినవాడై స్వస్థచిత్తుడాయెను. పిమ్మట చాలాకాలము రాజ్యపరిపాలన మొనరించెను.

ఇంతియేకాక శ్రీ స్వామి పుష్కరిణీ స్నానము అపస్మారము, భూతావేశము మొదలగు సర్వదోషములను నివర్తింపచేయును. మరియు నియమ పూర్వకముగా ఈ స్వామిపుష్కరిణీ స్నానమాచరించిన మానవులు ఇరువదియెనిమిది విధములగు తామిస్ర అంధతామిస్రాది నరకములతో సంబంధములేని వారలగుటయేకాక అశ్వమేధఫలమును, తులాపురుషదానఫలమును, గోసహస్రదానఫలమును, బ్రహ్మ జ్ఞానమును ప్రజ్ఞాపాటవమును, యశస్సంపదను, లక్ష్మీవైభవమును, వైరాగ్యమును, ధర్మబుద్ధిని, మనశ్శుద్ధిని మొదలగు సుఫలములను, చతుర్విధపురుషార్థములను సంకల్ప నియమానుగుణముగా బడయ గలరు అనియు చెప్పుచున్నది.

(మరియు) స్కందపురాణము:

పూర్వకాలమున మహర్షి శాపగ్రస్తుడైన అభిమన్యుకుమారుడగు పరీక్షిత్తు రాజు ''తక్షక దష్టుడై ఏడవ దినమున మరణించెదవు'' అను ఆ శాపమునకు భయపడి గంగా మధ్యమునందు ఏకస్తంభ మండపమును నిర్మించుకొని అచ్చట యుండెను. ఆ రాజును తక్షక మహావిషము వలన రక్షించి ధనమార్జింపదలచిన మహామంత్ర వేత్తయగు కాశ్యపుడను బ్రాహ్మణోత్తముడు ఆ రాజు సమీపమునకు వెళ్ళుచుండ మార్గ మధ్యమునందు తక్షకునితో సమావేశము కలిగెను. వారిరువురు తమ తమ విషయములను తెలుపుకుని తమ తమ బలాబలములను నిర్ణయించుకొనసాగిరి.

అప్పుడు తక్షకుడు తన సామర్థ్యమును చూపుటకై యెదుటగల

మానవాధిష్ఠితమైన మహావృక్షమును తన విషజ్వాలలచే భస్మము కావించెను. మానవుడున్నూ భస్మమాయెను.

అంతట మాంత్రికుడగు నా కాశ్యపుడు తన సామర్థ్యమును చూపుటకై మానవునితో సహా భస్మీభూతమైన ఆ మహావృక్షమును తన మంత్రశక్తిచే మానవునితో సహా ఉజ్జీవింపచేసెను.

తక్షకుడు ఆ కాశ్యపుని మహామంత్రశక్తి కచ్చెరునొంది ఓ ద్విజోత్తమా! మహర్షిశాపము రిత్తచేయుట పాడికాదు. నీవు నా విషముచే మరణించిన రాజును బ్రతికించి యెంత ధనమును ఆ రాజు వలన పొందగలవో, అంతకురెట్టింపు ధనమును నీకు ఇచ్చెదను. స్వస్థానమునకు వెళ్ళుము అని చెప్పి ఆ మూల్యములగు రత్నముల నివ్వ ధనలుబ్ధుడగు నాకాశ్యపుడు తక్షకుడిచ్చిన రత్నములను తీసుకుని సంతోషముతో స్వస్థానమును చేరెను.

తక్షకుడు వెళ్ళి మహర్షి శాపమును నెరవేర్చెను. రాజు మరణించెను. ఈ కాశ్యపుడు ధనాశచే విష్ణుభక్తుడైన రాజును బ్రతికింప సమర్థుడై యుండియు బ్రతికింపని కారణముచే మహాజనులు ఈ కాశ్యపుని ''పాతకి'' యని నిశ్చయించి ఆ కాశ్యపునితో సహాసన శయనాదులను మానివేసిరి. అందులకు ఖిన్నుడైన ఆ కాశ్యపుడు, తన గురువుగారగు శాకల్య మహర్షి వద్దకు వెళ్ళి ప్రణమిల్లి తన యుదంతము నంతయుచెప్పి ఈ మహాపాతకమును తొలగించి రక్షింపుమని కోరెను.

త్రికాలజ్ఞుడగు నా శాకల్య మహర్షి ''ఓ కాశ్యపా! నీవు రక్షణ సమర్థుడవై యుండియు రక్షింపని కారణముచేత విష్ణుభక్తుడైన ఆ రాజు మృతిచెందెను. అందుచే నీకు పాతకము సంభవించినది. ఈ పాతకము తొలగు ఉపాయము శ్రీ వేంకటాద్రియందు మహా పవిత్రమగు స్వామి

పుష్కరిణీ తీర్థము కలదు. అచ్చటకు నీవు వెళ్ళి ఆ తీర్థమునందు నియమపూర్వకముగా స్నానమాచరించి భగవద్దర్శనము చేయుము. నీకీ పాతకము తొలగగలదు. మరియొక విధముగా తొలగనేరదు'' అని చెప్పెను.

అందులకు కాశ్యపుడు సంతసించి శ్రీ వేంకటాద్రికి వచ్చి అచ్చటగల శ్రీ స్వామి పుష్కరిణియందు నియమ పూర్వకముగా స్నాన మాచరించి భగవద్దర్శనముచేసి మహాపాతకమును తొలగించుకొనెను. ద్విజోత్తములచే మహా పవిత్రతముడుగా కొనియాడబడెను.

(మరియు) స్కందపురాణము:

మహర్షికులశేఖరుడగు శ్రీ వేదవ్యాసులవారు ''యే జలాశయ మందైనను'' ''స్వామితీర్థం, స్వామి తీర్థం, స్వామితీర్థం'' అని ముమ్మారు పఠించి స్వామితీర్థమును స్మరించి స్వామితీర్థ భావనచే స్నానము చేసినంతమాత్రముచేతనే మానవులకు సర్వతీర్థరాజమగు శ్రీ స్వామిపుష్కరిణీతీర్థము, సకలవాంఛితములను ప్రసాదించుటయే గాక పుణ్యతీర్థస్నాన పరమఫలమగు బ్రహ్మపదమును కూడా ప్రసాదించుచున్నది'' అని శ్రీ స్వామి పుష్కరిణీ పుణ్యతీర్థముయొక్క మహత్తరశక్తిని మహావైభవమును చాటుచున్నారు.

బ్రహ్మపురాణము:

పూర్వమునందు సరస్వతీదేవి గంగాది సర్వతీర్థములకంటె గౌరవమును పొందవలెనను కోరికచేత బ్రహ్మావర్తము అను దేశము నందు సరస్వతీనదిగా ప్రవహించియూ కారణాన్తరముచే శాపగ్రస్తురాలై గంగాది నదులకంటె అధిక గౌరవమును పొందలేకపోయెను.

ఆ సర్వతీర్థోత్కృష్టత్వకాంక్ష ఆమెను వదలకపోవుటచే భగవంతుని గూర్చి ఘోరముగా తపస్సుచేసెను. అంత భగవంతుడు ప్రత్యక్షము కాగా, ఆ సరస్వతి ఓ దేవాదిదేవా! నేను సర్వతీర్థోత్కృష్టకామనచే సరస్వతీ నదిగా ప్రవహించియు పులస్త్య బ్రహ్మశాపమువలన సర్వతీర్థ గౌరవమును పొందలేక పోతిని. నాకు సర్వతీర్థగౌరవముండునట్లు వరమివ్వమని ప్రార్థించెను.

అతివాత్సల్యముతో భగవంతుడిట్లు పలికెను! ఓ సరస్వతీ! ఆ పులస్త్యబ్రహ్మశాపము గంగానదీ గౌరవమును తొలగించును కాని, పుష్కరిణీగౌరవమును తొలగించనేరదు. గాన నీవు పవిత్రాతిపవిత్రమగు వేంకటాద్రియొక్క శిఖరమునందు పుష్కరిణీ రూపముగా నివసించుము. నేను నీకు దక్షిణభాగమున నివసించగలను.

భువనత్రయముందుగల మూడుకోట్ల యేబదిలక్షల గంగాది తీర్థములన్నియు, సంవత్సరకాలము పాపిసంసర్గముచే తమకు సంక్రమించిన పాపజాలమునంతయు నివృత్తి చేసుకొనుటకై నన్ను యాచింపగలవు. నేను సర్వతీర్థములయొక్క పాపనివృత్తికై, ''ధనుర్మాసమున శుక్ల పక్షమునందు ద్వాదశీ దినమున అరుణోదయ సమయమునందు నీయందు సాన్నిధ్యము చేయవలెను. అప్పుడు మీ పాపజాలమంతయు నివృత్తి కాలగదు'' అని సర్వతీర్థములకు చెప్పెదను. అందుచే తీర్థములన్నియు తీర్థాధిరాజ్యమునందు నిన్ను అభిషేకము చేయగలవు అని వరమిచ్చెను.

అందువలన త్రైలోక్య విశ్రుతములగు తీర్థములన్నియు స్వామి పుష్కరిణీ తీర్థమును తీర్థాధిరాజ్యమునందభిషేకము చేసినవి. అందుచే తీర్థములన్నియు ఆ పర్వదినమునవచ్చి స్వామిపుష్కరిణీ సాన్నిధ్యమును పొంది తత్సమన్వయముచే పాపనివృత్తిని చేసుకొని వెళ్ళుచుండును.

అటుల తీర్థాధిరాజ్యస్థానమునలంకరించిన శ్రీ స్వామి పుష్కరిణి యొక్క తీరమునందు దురత్యయ మాయావిమోచనకర్తయగు శ్రీనివాస ప్రభువు శ్రీ లక్ష్మీదేవితోసహా పరమానంద స్థానమగు శ్రీ వైకుంఠమును కూడా వదలి దాస్యభూషణాలంకృతులగు వారలకు తీర్థప్రసాదాది ప్రదానము చేయించి మాయావిమోచనమును చేయుటకై వేంచేసియున్నాడు అందుచే నిది కలియుగ వైకుంఠమనియు ఈ స్వామిపుష్కరిణి శ్రీ భూదేవీలాలితమగు భగవత్క్రీడావాపియనియు వ్యాసులవారభి ప్రాయపడుచున్నారు.

(మరియు) బ్రహ్మపురాణము:

అమోఘశక్తులు కలిగి తీర్థజాలముచే తీర్థాధిరాజ్యమునందభి షేకము చేయబడి శ్రీ స్వామి సాన్నిధ్యమును సంపాదించుకొనిన సర్వ తీర్థస్వామినియగు శ్రీ స్వామి పుష్కరిణియందు మహాశక్తిమంతములగు నవతీర్థములు కలవు.

ఆ తీర్థములు: 1. పూర్వభాగమున ఆయుఃప్రదమగు మార్కండేయ తీర్థము, 2. ఆగ్నేయభాగమున పాపవిమోచకమగు ఆగ్నేయ తీర్థము, 3. దక్షిణభాగమున నరకోత్తారకమగు యామ్యతీర్థము, 4. నైర్ఋతి భాగమున ఋణవిమోచకమగు వశిష్ఠతీర్థము, 5, 6. పశ్చిమ, వాయవ్య భాగములయందు కైవల్యదాయకములగు వారుణవాయు తీర్థములు, 7. ఉత్తరభాగమున ధనసంపత్ప్రదమగు ధనదతీర్థము, 8. ఈశాన్యభాగమున భక్తిముక్తి ప్రదాయకమగు గాలవతీర్థము, 9. మధ్యభాగమున మహాపాతక నాశకమగు సరస్వతీతీర్థము. ఈ నవ తీర్థములతో కూడిన శ్రీ స్వామి పుష్కరిణియొక్క స్నానపానాది సేవనము మానవులకు సర్వపురుషార్థ సాధకము అని చెప్పుచున్నది.

వరాహపురాణము:

పూర్వకాలమున సాంకాశ్య దేశమునందు చంద్రవంశీయుడగు శంఖణుడనురాజు పితృపితామహప్రాప్తమగు రాజ్యమును పరిపాలించు చుండ సామంతరాజులు బలవంతులై అతని రాజ్యము నపహరించిరి. రాజ్యభ్రష్టుడైన శంఖణుడు ఆ అవమానమును సహింపలేక భార్యతోను మంత్రులతోను దక్షిణ దిక్కుకు ప్రయాణముచేసి తీర్థయాత్రలను చేయుచూ రామసేతువును దర్శించెను. అచ్చట సేతుస్నానముచేసి మరలివచ్చుచూ మార్గమధ్యమున సువర్ణముఖరీనదీ స్నానమును, పద్మ సరోవరస్నానమును విధి ప్రకారము నిత్యముచేయుచు అచ్చట నిలిచి యుండెను. ఒక్కనాడు శంఖణుడు తన రాజ్య భ్రంశమును స్మరించి దుఃఖించి భగవంతుని ప్రార్థించుచూ నిదురించెను.

అప్పుడు అశరీరవాణి ''ఓ రాజా! దుఃఖింపకుము. ఇచ్చటికి క్రోశమాత్రములో, ఆపన్న కామధేనువగు వేంకటాద్రికలదు. అచ్చట నిర్హేతుక దయా పూర్ణుడగు కమలాపతికలడు. వారికి ప్రేమ పాత్రమగు తీర్థరాజము కలదు. నీవు అచ్చటికి వెళ్లి ఆ తీర్థరాజమగు పుష్కరిణి యందు స్నానము చేయుచు శ్రీ స్వామిని దర్శించుచు ఆ తీరమున నివసించుము. ఇష్టసిద్ధిని బడయగలవు'' అని పలికెను. ఆ శంఖణ రాజు భగవదనుగ్రహమునకు సంతసించి స్వామి పుష్కరిణీ తీరమునకు వచ్చి కుటీరమును యేర్పరచుకుని తీర్థస్నానము, దేవదర్శనము చేయుచు నియతవ్రతుడై ఆరు మాసములను గడపెను.

అంతనొక్కనాడు స్వామి సరోవరమధ్యమున శ్రియఃపతి శ్రీ, భూదేవులతో విమానారూఢుడై సపరివారముతో ప్రత్యక్షమై ''ఓ రాజా! నీవు శోకింపకుము. నీ రాజ్యమును పొందగలవు. ఈ స్వామి పుష్కరిణీ తీర్థమునందు స్నానముచేసి వారు నియమవ్రతానుగుణ్యముగా

స్వామిత్వమును పొందగలరు'' అని చెప్పి అంతర్ధానమాయెను.

అంత శంఖణుడు సంతసించి స్వదేశమునకు ప్రయాణము చేసెను. సామంతరాజులు పరస్పరము భేదవృత్తికలవారలై రాజ్యమును పరిపాలించలేక శంఖణునకు రాజ్యమునర్పించు భావముతో మార్గమధ్యమున ఎదురుగావచ్చి, ''ఓ రాజా! మీ రాజ్యమును మీరే పాలించుకొందురుగాక'' యని చెప్పి స్వదేశమునకు తీసుకునివెళ్ళి పట్టాభిషిక్తునిచేసిరి. గాన స్వామిత్వ ప్రదానముచేయ శక్తిగల ఈ తీర్థరాజము, స్వామిపుష్కరిణియని అన్వర్థ నామధేయము కలదై ప్రకాశించుచున్నది.

(మరియు) వరాహపురాణము:

శ్రీ స్వామి పుష్కరిణిని గూర్చి, శ్రీవైకుంఠమునందు పట్టమహిషులగు శ్రీ, భూదేవులచేత లాలింపబడు అఖిలభువనైక చక్రవర్తియగు శ్రీ స్వామి వారి యొక్క క్రీడావాపిగా గ్రహించవలసియున్నదని చెప్పుచున్నది.

పద్మపురాణము:

''విష్ణుపాదోద్భవమై బ్రహ్మకరస్పర్శపవిత్రతమై ఈశాన పవిత్రీకరణ సమర్థమైన తీర్థముచే పూర్ణ మీ స్వామితీర్థము అని సనన్దనయోగియు,

''తీరమున పరాత్పరుడగు శ్రీనివాసుని ప్రేమనివాసముచే ధన్యమైన ఈ స్వామి సరసియొక్క సేవనమే ఆత్మసత్తానిదానము అని సనకయోగియు,

''కీర్తన స్నాన పానములచేత ఆధ్యాత్మిక, ఆధిభౌతిక ఆధిదైవిక రూపతాపత్రయ నివారిణి ఈ స్వామి పుష్కరిణి అని శౌనక మహర్షియు,

‘‘సురులకు, నరులకు, తిర్యగ్జంతువులకు ఆత్మశోధిని ఈ స్వామి పుష్కరిణి అని శుకమహర్షియు,

ఇటుల ఆత్మవేత్తలై అనుభవ సంతృప్తులైన మహర్షులు, యోగులు యేబదిమంది శ్రీస్వామి పుష్కరిణీ తీర్థమును గూర్చి బహువిధములుగా ప్రశంసించుచున్నారు.

## శ్రీ స్వామిపుష్కరిణీ పుణ్యతీర్థరాజమునుగూర్చి ప్రశంసించిన పంచాశన్మహర్షుల పవిత్ర నామధేయములు

1. అత్రిమహర్షిః, 2. వ్యాసః, 3. వసిష్ఠః, 4. పరాశరః, 5. గౌతమః, 6. భరద్వాజః, 7. మనుః, 8. యమః, 9. యాజ్ఞవల్క్యః, 10. హారీతః, 11. అంగిరసః, 12. ఉశనాః, 13. సంవర్తః, 14. ఆపస్తంబః, 15. మరీచిః, 16. మృకణ్డుః, 17. పులస్త్యః, 18. కాత్యాయనః, 19. బృహస్పతిః, 20. భృగుః, 21. వాల్మీకిః, 22. శంఖః, 23. లిఖితః, 24. శాతాతపః, 25. బోధాయనః, 26. మార్కణ్డేయః, 27. మాండవ్యః, 28. శాండిల్యః, 29. కాశ్యపః, 30. కణ్వః, 31. అగస్త్యః, 32. దుర్వాసః, 33. విశ్వామిత్రః, 34. శక్తిః, 35. శుకః, 36. శౌనకః, 37. నారదః, 38. క్రతుః, 39. సత్యాషాఢః, 40. కుణ్డినః, 41. హారితః, 42. జైమినిః, 43. జాబాలిః, 44. పితామహః, 45. సనకః, 46. సనందనః, 47. సనత్కుమారః, 48. వామదేవః, 49. సనాతనః, 50. దేవదర్శనః.

ఇటుల అనేక మహర్షులచేతను, అనేక పురాణములచేతను, పలు తెరంగులుగా ప్రశంసింపబడినట్టియు, సర్వతీర్థాధి రాజ్యమునంద

భిషేకమును పొందబడినట్టియు శ్రీ స్వామి పుష్కరిణీ సరోవరము విశ్వప్రభువగు శ్రీ వేంకటేశ్వరస్వామివారిని ఆశ్రయించుకొని ఉపనిషత్ర్పతిపాద్యమగు ఐరమ్మదీయ సరోవరమువలె నిరుపమాన మహిమ కల్గదై ప్రకాశించు చున్నది.

## 2. కుమారధారా పుణ్యతీర్థము

శ్రీతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి సన్నిధానమునకు వాయవ్య దిగ్భాగవములో అయిదుమైళ్ళ దూరవములో మహాపవిత్రమగు ''కుమారధారా'' యను పుణ్యతీర్థముకలదు. ఈ తీర్థము ముక్తి ప్రదములగు సప్తతీర్థములతో నొకటియై ప్రకాశించుచున్నది. ఈ తీర్థమునకు మాఘమాసమునందు మఘా నక్షత్రముతో కూడిన పూర్ణిమా దినము యొక్క మధ్యాహ్న కాలము పర్వకాలము అని చెప్పియున్నాము.

ఈ కుమారధారా పుణ్యతీర్థమహత్త్వము పురాణములు అనేక విధములుగా ప్రకాశించుచున్నవి.

వరాహ పురాణము:

ఈ తీర్థమునందు పర్వకాలమున స్నానముచేసిన అదృష్టవంతులు పరాత్పరుని యొక్క స్థానమగు పరమపదమును అనాయాసముగా బడయగలరు అని ఆముష్మికఫలమును చెప్పుచున్నది.

(మరియు) వరాహ పురాణము:

ఈ తీర్థస్నానము వృద్ధుని కుమారునిగాచేయగల ఐహికఫల సంపాదనశక్తి కూడా కల్గదైయున్నది.

పూర్వకాలమున వృద్ధుడగు బ్రాహ్మణుడు వనమున మార్గభ్రంశము నుందెంది కుమారుడగు కౌండిన్యుని, ''కుమారా! కుమారా!'' యని విలపించుచుండ నిర్హేతుక దయానిధి యగు శ్రీ వేంకటేశ దైవము కుమార రూపములో వచ్చి, ''ఓ బ్రాహ్మణుడా! నీ వెవ్వరవు?'' అని అడిగెను. నేను శత వృద్ధుడనగు బ్రాహ్మణుడను ఆశ్రమమునకు పోలేక యున్నాను. నన్ను పరమేశ్వరుడు ఎందులకీ లోకమున అట్టెపెట్టెనో తెలియక యున్నది అని విచారపడెను.

ఆ కుమారరూపధారియగు దైవము, సోపహాసముగా ''తాతా! నీ కోరిక జీవించవలెననియా? జీవితము చాలించవలెననియా?'' అని అడిగెను. అందులకా బ్రాహ్మణుడు నాకు జీవనేచ్ఛలేదు. కాని దేవతల యొక్కయు, ఋషుల యొక్కయు, పితృ దేవతలయొక్కయు ఋణమును ఇంతవరకు తీర్చుకొనలేకపోయినాను అందులకై శరీరమం దిచ్ఛకలదు అని చెప్పెను. భగవంతుడందులకు సంతసించి చేయిపట్టు కుని రమ్ము అశ్రమమునకు పోవుదము అని చెప్పెను. భగవంతుని చేయిపట్టుకుని బ్రాహ్మణుడు మెల్లగా వెళ్ళుచుండెను. అప్పుడు భగవం తుడు ఓ బ్రాహ్మణోత్తమా! ఇది తీర్థప్రవాహము. దీని యందు స్నానము చేయుము. పిదప ఆశ్రమమునకు వెళ్లుదము అని చెప్పెను.

ఆ బ్రాహ్మణుడు ఆ తీర్థమున మునిగి లేవగానే పదనారు వత్సరముల వయస్సుగల కుఱ్ఱవాడుగా నాయెను. ఆ బ్రాహ్మణునకు కుమార రూపధారియగు దైవము విశ్వరూపుడై ప్రత్యక్షమయ్యెను. దేవత లందరు ప్రత్యక్షమైరి. పుష్పవృష్టి కురిసెను. దేవదుందుభులు మ్రోగెను. దేవతలు భగవంతుని స్తుతించిరి. బ్రాహ్మణుడు భగవంతుని స్తుతింప, బ్రాహ్మణునకు కర్మానుష్ఠానశక్తినే కాక అందులకు వలయు ధనసంపత్తిని

కూడా ఇచ్చి కర్మానుష్ఠానము చేసుకొనుము, కృతార్థుడవగుము అని చెప్పి భగవంతు డంతర్ధానమాయెను.

దేవతలందరు ఈ తీర్థము వృద్ధుని కుమారుని చేయశక్తి కలది గాన ''కుమారధార'' యని ప్రఖ్యాతినొందకలదు. వలీపలితకాయు డగు నే మానవుడు ఈ తీర్థమునందు మాసత్రయదీక్షతో త్రికాలము లయందు స్నానము చేయునో ఆ మానవుడు వజ్రకాయుడగుటయేకాక అతి మనోహర రూపముకలవాడగును. మరియు సర్వపాపములను తొలగించుకొని విష్ణుపదమును పొందగలడు అని చెప్పి స్వస్థానములకు వెళ్ళిరి.

అందుచే నీ కుమారధారాతీర్థము ఐహికాముష్మికములను ప్రసాదించుచున్నది.

## మార్కండేయ పురాణము:

పూర్వము దేవసేనాపతియగు కుమారస్వామి దేవతల రక్షణా ర్థమై తారకాసురుని వధించుటచే బ్రహ్మహత్యాదోషము సంభవించెను. ఆ బ్రహ్మహత్యాదోష నివృత్తి చేయుమని తన తండ్రియగు శంకరుని ప్రార్థించెను. ఆ శంకరుడు ఓ కుమారా! నీ హృదయమున సదా నారాయణస్మరణముండు గాక! ఇది రహస్యము! మరియు లక్ష్మీ పతినివాసమగు శ్రీ వేంకటాద్రికి వెళ్లి అచ్చట పుణ్యతీర్థమున స్నానము చేసి శ్రీ వేంకటేశ్వరునకు ప్రణమిల్లి కుమారధారాతీర్థమునకు వెళ్ళుము. అచ్చట స్నానము చేసి వేంకటేశ్వర మహామంత్రమును ప్రణవపూర్వక ముగా జపించుచూ తపస్సుచేయుము అని చెప్పెను.

అంత దేవసేనాపతి పితృవాక్యానుసారముగా వేంకటాద్రికి వచ్చి అచ్చట చక్రతీర్థమున స్నానముచేసి స్వామిపుష్కరిణికి చేరెను.

ఆ బ్రహ్మహత్య దేవసేనాపతిని పర్వతారోహణమునకు పూర్వమే వద లిపెట్టి వేంకటాద్రికి క్రోశమాత్రములో దుఃఖించుచూ నిలువంబడి పోయెను.

అంతట కుమారస్వామి స్వామిపుష్కరిణియందు స్నానమాచ రించి శ్రీ స్వామివారికి ప్రదక్షిణ ప్రణామములు చేసి పాపవినాశనము నకు వెళ్ళి స్నానను చేసి కుమారధారా తీర్థమునకు వెళ్ళెను. అచ్చట కుమారధారా తీర్థస్నానము చేయుచు నిరాహారదీక్షతో వేంకటేశ మహామంత్రమును జపించుచూ తపస్సు చేయు చుండెను.

అంతనొక్కనాడు మాఘపూర్ణిమా బుధవారము మఘానక్షత్ర మున మధ్యాహ్న సమయమునందు శ్రీ వేంకటేశ్వరస్వామివారు శంఖచ క్రములతో వైకుంఠకటిహస్తములతో జగన్మోహనరూపముతో ధ్యానాను గుణముగా సాక్షాత్కరించెను. శ్రీ స్వామివారిని సేవించుటకు బ్రహ్మేం ద్రాదులందరు వచ్చి స్తుతించిరి. కుమారస్వామియు నతిభక్తితో శ్రీ స్వామివారిని స్తుతించెను.

భగవంతుడు సంతుష్టుడై ఓ మహాదేవకుమారా! నీవు నా మంత్రమును సదా జపించుచు సుఖముగా నుండుము. ఈ తీర్థము ''కుమారధారికా'' యని నీ పేరుతో ప్రఖ్యాతినొందగలదు. మదావిర్భావదినమగు ఈ మాఘపూర్ణిమాదినమునందు సర్వతీర్థముల కంటె ఉత్తమమైన స్వామిపుష్కరిణి తీర్థముకంటె ఈ తీర్థము శ్రేష్ఠమై నది. ఈ నాడు ఈ తీర్థస్నానము బ్రహ్మహత్యాది దోషనివారకము. గో, భూ, సువర్ణ వస్త్రాన్నాది దానములు అనంతఫలదాయకములు అగుచున్నవి. అని దేవతలందరు వినుచుండ చెప్పి భగవంతుడు అంతర్ధానమాయెను.

## 3. తుంబురు పుణ్యతీర్థము

శ్రీ వేంకటాద్రియందు వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సన్నిధానమునకు ఏడున్నర మైళ్ళ దూరములో మహాపవిత్రమగు తుంబురు తీర్థము కలదు. ఈ తీర్థము ముక్తిప్రదములగు సప్తతీర్థము లలో నొకటియైయున్నది. ఫాల్గుణమాసమున ఉత్తరఫల్గునీ నక్షత్రము లలో నొకటియైయున్నది. ఫాల్గుణమాసమున ఉత్తరఫల్గునీ నక్షత్రముతో కూడిన పూర్ణిమా దినమున మధ్యాహ్నకాలము ఈ తీర్థమునకు పర్వకాలము. ఆ పర్వకాలమున ఈ తీర్థమందు స్నానము మాన వులకు సర్వదోషములను, సర్వపాపములు, నివృత్తిచేసి సర్వవాంఛితము లను సమకూర్చును.

ఈ తుంబురుతీర్థ మాహాత్మ్యమును గూర్చి పురాణములు బహువిధములుగా ప్రశంసించుచున్నవి.

బ్రహ్మోత్తర ఖండము:

పూర్వమొక సమయమున వీణావాదనతత్పరులగు తుంబురు నారదులు ఆకాశమార్గమున సంచరించుచుండ నారదుడు తుంబురుని అపూర్వమైన వీణనుచూచి, మిత్రమా! నీకు ఈ వీణ యెక్కడ లభించెను అని ప్రశ్నించెను. ఒక మహారాజ సభయందు మహారాజును స్తుతించగా బహూకరించెను అని చెప్పెను. అందులకు నారదుడు కోపావిష్టుడై సర్వ పురుషార్థ ప్రదాతయగు శ్రీ మహావిష్ణు వుండగా నరస్తుతిచేసితివి గాన నీ వసత్పురుషుడవు. అసత్సంగము పనికిరాదు "నీవు ఖేచరత్వము నశించి అవాక్ఛిరస్సుకలవాడవై భూమి యందు పడుదువుగాక" యని శపించెను.

ఆ తుంబురుడు భూమియందు పడుటలో హరికీర్తనాలాపాది పుణ్యభాగమువలన శ్రీ వేంకటాద్రి మధ్యముగా ఘోణతీర్థభాగమునందు పడెను. పడిన ఆ తుంబురుడు ఇది శ్రీ వేంకటాద్రి యని తెలుసుకుని, ఆ తీర్థమునందు స్నానముచేసి, ''వేంకటేశో మాం రక్షతు'' అని నిశ్చయించుకుని తత్తీరమున ఒక సంవత్సర కాలము కఠినదీక్షతో శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని గూర్చి తపస్సు చేయుచుండెను.

అట్లుండ ఫాల్గునమాస పూర్ణిమాతిథియందు దయామయుడైన శ్రీ వేంకటశైలనాథుడు లక్ష్మీసమేతుడై, అనంతగరుడవిష్వక్సేనాది పరివారములతో తుంబురునకు దర్శనిమిచ్చెను. స్వామిని సేవించుటకు బ్రహ్మాదులు వచ్చిరి. అందరిని తీర్థమందు స్నానముచేయ స్వామి యాజ్ఞాపింప అట్లుచేసి కృతకృత్యులైరి. తుంబురుడు ఈ తీర్థము నా పేరుతో ప్రసిద్ధినొందుగాక యని భగవంతుని ప్రార్థింపగా అట్లు వరమిచ్చి వాంఛితముల నిచ్చి భగవంతుడంతర్హితుడాయెను. అందుచేనీ తీర్థమునకు తుంబురు తీర్థమను పేరు కలిగినది. తుంబురుడా తీర్థస్నానము చేసి భగవదనుగ్రహమును పొందుటచే పూర్వమువలె నారదునితోసహా కీర్తనాలాపములు చేయకలిగియుండెను.

(మరియు) బ్రహ్మోత్తర ఖండము:

ఈ తీర్థము ప్రాయశ్చిత్తములకు సాధ్యపడని మహాపాపములను కూడా తొలగించును.

పూర్వమొక గ్రామమున సర్వాబద్ధుడను బ్రాహ్మణుడు దురాచారుడై, నాస్తికుడై ద్రిమ్మరుచు దక్షిణాపేక్షచేత యజ్ఞాదులకు వెళ్ళి బ్రాహ్మణ సభల యందు కూర్చునుచుండ ఆద్విజోత్తములు ''వశిష్ఠవత్తిష్ఠసి సభాసు'' అని అధిక్షేపించుచూ తొలగించుచుండిరి. అందుచే

దుఃఖితుడై, మహనీయమూర్తియగు నా వసిష్ఠుడే నన్ను రక్షించునుగాక యని వసిష్ఠునియందతిభక్తి కలవాడయ్యెను. మహర్షియగు వసిష్ఠుడు ఆ సర్వాబద్ధుని విషయమును తెలుసుకుని అతని యందు కృపకల వాడయ్యెను.

పిమ్మట నా వశిష్ఠుడు తాను రాజ పురోహితుడగుటచే తనకు సంక్రమించిన పాపములను, తనను ఆశ్రయించుకుని యున్న సర్వాబద్ధుని పాపములను తొలగించుకొనుటకు బ్రహ్మలోకమునకు వెళ్ళి బ్రహ్మ సభయందుగల బ్రహ్మకు నమస్కరించి ఇట్లు విన్నవించెను.

ఓ లోక పితామహా! నేను రాజపురోహితుడనగుటచే నాకు సంక్రమించిన పాపములను ఆశ్రయించిన సర్వాబద్ధుని పాపములను తొలగించు మార్గమును చెప్పుమని ప్రార్థించెను.

అందులకు బ్రహ్మ ''పాపములను ప్రాయశ్చిత్తములచేతనే తొలగించుకొనవలెను'' అని చెప్పగా వసిష్ఠుడు నా యొక్కయు నన్ను ఆశ్రయించిన సర్వాబద్ధుని యొక్కయు పాపములు ప్రాయశ్చిత్తములచే నశింపవని తెలుసుకొని మిమ్ములను శరణమొందినాను అందులకు తగు నుపాయము చెప్పి రక్షింపుము అని ప్రార్థించెను.

బ్రహ్మ కొంచెమాలోచించి శ్రీ వేంకటాద్రి యొక్క మధ్యభాగమునందు పవిత్రమైన ఘోణతీర్థము కలదు. మీన పూర్ణిమయందు ఆ తీర్థమున స్నానము చేయుటచేత దురుర్ధరములగు దురితములు కూడా నశించగలవు'' అని చెప్పెను.

అంత వసిష్ఠుడు బ్రహ్మలోకమునుంచి వచ్చి సర్వాబద్ధుని వెంట బెట్టుకొని ఆ పర్వదినమున ఘోణతీర్థమునందు ఇరువురు స్నానము చేసి ప్రాయశ్చిత్తములచే నశింపని మహాపాతకములను నశింపచేసుకొనిరి.

వసిష్ఠమహర్షి శ్రీ వేంకటశైలనాథుని స్తుతింప, జగన్మోహన రూపముతో జగత్పతియగు నా స్వామి ప్రత్యక్షమై వసిష్ఠమహర్షి యొక్క ఆశ్రిత వాత్సల్యమునకు సంతసించి సర్వాబద్ధుని సర్వసిద్ధునిగాను, సర్వసంపన్నునిగాను కరుణించి, ఈ ఘోణతీర్థమునకు మహావైభవశక్తిని ప్రసాదించి అంతర్ధానమాయెను.

స్కందపురాణము:

పూర్వకాలమున తుంబురుడనుగంధర్వుడు పతివ్రతయగు తన సతీలలామకు ''ఈ మాఘత్రయమందు నాతో స్నానమాచరించి విష్ణుపూజను చేయుము'' అని ఉపదేశించెను. అందులకా గంధర్వవల్లభ శీతభీతయై పత్యుపదేశము నంగీకరించకపోయెను. తుంబురుడు శాన్తచిత్తుడైనను ఆమె అప్రియవాదము వలన కోపము కలవాడై

''పుత్రం చ ధర్మవిముఖం, భార్యాం చాఽప్రియవాదినీమ్।
అబ్రహ్మణ్యం చ రాజానం సద్య శ్శాపేన దండయేత్''॥

అను శిక్షాస్మృతి ననుసరించి, ఓ అప్రియవాదినీ! నీవు వేంకటాద్రియందు ఘోణతీర్థసమీపమునగల అశ్వత్థము (రావిచెట్టు) యొక్క తొఱ్ఱయందు నిర్జల దేశమున మండూకమై యుండుము అని శపించెను. అందులకామె భయపడి పతిపాదముల వ్రాలి శాపాన్తము ననుగ్రహింపుమని కోరెను. అంత గంధర్వుడు ''అగస్త్యమహర్షి ఘోణతీర్థమున స్నానము చేసి అశ్వత్థవృక్షచ్ఛాయయందు ఘోణతీర్థ మాహాత్మ్యమును శిష్యులకుపదేశించును. ఆ ఘోణతీర్థ మాహాత్మ్యమును విన్న నీకు శాపాన్తమై నన్ను చేరగలవు'' అని శాపాన్తమును చెప్పెను.

వెంటనే ఆమె వేంకటాద్రియందు మండూక శరీరమును పొంది

మెల్లమెల్లగా అశ్వత్థవృక్షము యొక్క తొఱ్ఱలో ప్రవేశించి శాపానుభవ మును చేయుచుండెను. ఇట్లుండ అగస్త్యమహర్షి కొంతకాలమునకు వేంకటాద్రియందు శ్రీ స్వామిని దర్శించి తుంబురుతీర్థమునకు వచ్చి అచ్చట స్నానము చేసి ఆ అశ్వత్థవృక్షచ్ఛాయయందు తుంబురు లకు ఉపదేశించెను.

ఆ మాహాత్మ్యమును విన్న గంధర్వవల్లభ శాపాన్తమై మండూక శరీరమును వదలి నారీరూపము ధరించెను. శాపవిముక్తయగు ఆమె ఆ మహర్షిని దర్శించి ప్రణమిల్లి తన వృత్తాంతమునంతయు చెప్పెను. ఆ మహర్షి దయామయుడై, ఆమెకు పతివ్రతాధర్మములను చక్కగా నుపదేశించెను. ఆమె విజ్ఞానము కలదై పతి సమీపమునకు చేరి సుఖించెను.

ఈ తుంబురుతీర్థమునకు, తుంబతీర్థము అనియు ఘోణతీర్థము అనియు పురాణములు చెప్పుచున్నవి.

## 4. ఆకాశగంగా పుణ్యతీర్థము

శ్రీ వేంకటేశ్వరస్వామివారి అవతారస్థానమగు శ్రీ వేంకటాద్రి యందు పరమేశ్వరుని ఆనందనిలయవిమానమునకు రెండుమైళ్లదూర ములో ఆకాశగంగాతీర్థము ప్రకాశించుచున్నది. ఈ తీర్థము ముక్తి ప్రదములగు సప్తతీర్థములలో నొకటిగా నున్నది. ఈ తీర్థమునకు మేషమాసమునందు చిత్తా నక్షత్రముతోకూడిన పూర్ణిమాదినము పర్వ దినము . అమృతపానము చేయు నిలింపులకు (దేవతలకు) సైతము అమృతము మరిపింపజేయు మధురాతిమధురమగు తీర్థముతోను ''అమృత''మను జలనామమును సార్థకముచేయుశక్తితోను ప్రవహించు చున్నది.

హిమాచలమున ప్రవహించిన గంగ మూడు పాయలుగా స్వర్గమర్త్యపాతాళములయందు ప్రవహించుచూ 'త్రిపథగా' యని కీర్తింప బడుచున్నది.

ఈ గంగ ఆకాశభాగమున ప్రవహించుచూ 'ఆకాశగంగ' యని కీర్తింపబడుచున్నది. శంకరుని శిరస్సు నందు ప్రవహించిన గంగవలె నీ గంగ శ్రీ శ్రీనివాసభక్తుల శిరస్సులయందు ప్రవహించి అభిషేకము చేయుచూ వారలను పవిత్రాతిపవిత్రులనుగా చేయుచున్నది.

మరియు మర్త్యగంగ కాశీవిశ్వేశ్వరుని సన్నిధానమున ప్రవహించుచూ శ్రీ విశ్వేశ్వరస్వామివారి యొక్క అభిషేకారాధనాది కైంకర్యములకు ఉపయోగపడుచున్నది.

ఈ ఆకాశగంగ సర్వేశ్వరుడైన ఆత్మేశ్వరుడైన శ్రీ శ్రీవేంకటేశ్వర స్వామివారి యొక్క అభిషేకారాధనాది కైంకర్యములకు ఉపయోగ పడుచున్నది.

ఈ ఆకాశగంగా తీర్థముయొక్క మహత్తరశక్తిని పురాణములు అనేక విధములుగా ప్రశంసించుచున్నవి.

### భవిష్యోత్తరపురాణము:

పూర్వము కేసరి యొక్క భార్య అంజనా యను వనితా రత్నము సంతానము లేని కారణముచే మతంగమహర్ష్యాశ్రమమునకు వెళ్లి ఆ మతంగమహర్షికి ప్రణమిల్లి, తన దుఃఖమును నివేదించెను. ఆ మహర్షి ఆమెయందు దయకలవాడై ఇట్లు చెప్పెను.

''ఓ వనితారత్నమా! పంపాసరోవరమునకు తూర్పుగా (50) యేబది ఆమడలదూరంలో నరసింహాశ్రమము కలదు. దానికి

దక్షిణముగా నారాయణగిరియందు స్వామి తీర్థము కలదు. అందుకు ఉత్తరముగా క్రోశ మాత్రములో ఆకాశగంగాతీర్థమను మహత్తర శక్తిసంపన్నమైన తీర్థము కలదు. నీవు అచ్చటికి వెళ్ళి ఆకాశగంగయందు స్నానము చేయుచూ, ఆ తీర్థతీరమున పండ్రెండు సంవత్సరములు తపస్సును చేయుము. అప్పుడు నీకు లోకోత్తరశక్తి సంపన్నమైన సంతానము కలుగును'' అని చెప్పెను.

ఆ అంజనాదేవి మహర్షి చెప్పిన ప్రకారం నారాయణగిరికి వెళ్లి అచ్చట స్వామి తీర్థమున స్నానముచేసి, స్వామిదర్శనముచేసి ఆకాశ గంగా తీరమునకు వెళ్ళెను. అచ్చట ఆకాశగంగయందు స్నానము చేయుచు భక్ష్యవర్జితురాలై తపస్సును ప్రారంభించెను. అట్లు ఒక సంవత్సరము గడచిన పిదప వాయుదేవత ఆమెకు ప్రతిదినమును ఒక ఫలమును ఇచ్చుచూ వచ్చెను. ఒక దినమున వీర్యగర్భమగుఫలమును ఆమె దోసిలియందుంచెను. క్షుధార్తురాలగు నామె ఆ ఫలమును భక్షించెను.

అంత ఆమె గర్భవతియై పదవమాసమునందు లోకైకవీరుడు అపారశక్తి సంపన్నుడు హనుమంతుడను పుత్రరత్నమును కని వీరమాత అయ్యెను.

స్కాందపురాణము:

ఈ ఆకాశగంగా మాహాత్మ్య ప్రకరణములో పై విషయమునే మార్పుగా సర్వమును చెప్పుచున్నది.

స్కందపురాణము:

పూర్వము గోదావరీ తీరమున గుణసంపన్నుడైన పుణ్యశీలుడను

ద్విజోత్తముడు తన తండ్రి ప్రత్యాబ్దికము దినమున దైవికముగా వేదవేదాంగపారగుడగు నతిథి లభింప, ఆయనను పితృస్థానమున నిమంత్రణము చేసి శ్రాద్ధమును పూర్తిచేసెను.

పిమ్మట కొంత కాలమునకు ఆ పుణ్యశీలుని ముఖమునందు వైరూప్య మేర్పడి గార్ధభముఖముగా మారెను. అందులకా పుణ్యశీలుడు ఖిన్నుడై ఆ వైరూప్యమును తొలగించుకొనుటకు సువర్ణముఖరీ తీరమునందు గల అగస్త్యాశ్రమునకు వెళ్లి, అగస్త్యమహర్షి యొక్క పాదముల వ్రాలి నా ముఖమున కీవైరూప్యము యే దోషముచే సంభవించినదో, ఆ దోష మెట్లు తొలగగలదో చెప్పి నన్ను రక్షింపుమని ప్రార్థించెను.

త్రికాలవేత్తయగు నా మహర్షి ''ఓ పుణ్యశీలా! నీవు పితృ శ్రాద్ధమునందు వంధ్యాపతి (గొడ్రాలు భర్త) యగు వేదవేత్తను పితృస్థానము నందు నిమంత్రణముచేసి శ్రాద్ధమాచరించితివి గాన ఆ మహాదోషముచే నీ ముఖమున కీ వైరూప్యము తటస్థించినది.

అందుచే నీవు వేంకటాద్రికి వెళ్ళి స్వామిపుష్కరిణి తీర్థమున స్నానముచేసి అచ్చట కనతిదూరములోగల ఆకాశగంగా తీర్థమునందు విధి విధానముగా స్నానము చేయుము ఆ వియద్గంగాస్నాన మాత్రము చేతనే నీ ముఖవైరూప్యము తొలగిపోవును'' అని చెప్పెను.

వెంటనే పుణ్యశీలుడు వేంకటాద్రికివెళ్ళి స్వామిపుష్కరిణీ స్నానము చేసి ఆకాశగంగా తీర్థమునకు చేరి ఆ తీర్థమున విధి ప్రకారము స్నానముచేయగా ముఖవైరూప్యము తొలగిపోయెను. సుందరమైన ముఖము కలవాడయ్యెను.

(మరియు) స్కందపురాణము:

శ్లో॥ పుష్ప మూల ఫలైర్వాపి కేవలై ర్వర్తయే త్సదా।
కాలపక్వై స్స్వయం శీర్ణై ర్వైఖానసమతే స్థితః॥

అని మను, వ్యాసాదులు చెప్పిన ప్రకారం ''కాలముచేత పండి స్వయముగా రాలిన కేవలమగు పుష్పములచేతనుగాని, మూలములచేత నుగాని, ఫలములచేతనుగాని, జీవించుచూ వైఖానస శాస్త్రోక్త ధర్మాను ష్ఠానము చేయువాడు ''వానప్రస్థుడు''. అట్టి వానప్రస్థాశ్రమము నందుండి కాలము గడపుచుండిన రామానుజుడను నొక విష్ణుభక్తుడు ఆకాశగంగా తీరమునందు చాలా కాలము ఘోరమైన తపస్సును చేయగా పరమప్రీతుడైన శ్రీనివాసదైవము గరుడవాహనారూఢుడై విష్వక్సేనాది పరివారములతో సర్వవైభవములతో నా రామానుజునకు దర్శనమిచ్చి వరములను కోరుకొనుము'' అని చెప్పెను.

ఆ రామానుజమహర్షి, ''ఓ వేంకటేశప్రభో! బ్రహ్మరుద్రాదుల కలభ్యమైనట్టియు, యోగిపుంగవుల కదృశ్యమైనట్టియు నీ దివ్య స్వరూపమును నేను చూడ గలిగితిని. కృతార్థుడనైతిని, ఇంతకంటె మిన్నయగు వరమేమి కలదు అనుచూ సంసారసాగరసముత్తరణ సేతువులగు నీ దివ్యపాదారవిందములయందు నాకు నిశ్చలమైన భక్తి యుండునుగాక'' యని ప్రార్థించెను.

శ్రీ స్వామి ''తథాస్తు'' అని చెప్పుచూ ''మేష మాసమున చిత్రానక్షత్రముతో కూడిన పూర్ణిమా దినమునందు ఈ ఆకాశగంగా తీర్థమునందు స్నానము చేయువారలు పునరావృత్తి రహితమైన వైష్ణవ స్థానమును బడయగలరు'' అని చెప్పి అంతర్ధానము నొందెను.

కావున, ఆకాశగంగా తీరవాసము చేయుచు, ఆ తీర్థ

స్నానపానాదులు చేయుచూ తపస్సు చేయువారలకు ముక్తి కరతలా మలకమే నని కైముతికన్యాయము చెప్పుచున్నది.

## 5. పాపవినాశన పుణ్యతీర్థము

శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధానమునకు రెండున్నరమైళ్ళ దూరములో అతి పవిత్రమైన ''పాపవినాశనము'' అను అన్వర్థనామధే యముకల పుణ్యతీర్థము పాపవినాశనమును ఋజావు చేయుచూ అపార శక్తికలదై ప్రవహించుచున్నది. ఈ తీర్థము ముక్తిప్రదములగు సప్త తీర్థము లలో నొకటిగా ప్రకాశించుచున్నది. ఈ తీర్థమునకు ఆశ్వయుజ మాస మునందు శుక్లపక్షమున ఉత్తరాషాఢానక్షత్రముతో కూడిన సప్తమీ ఆది వారముగాని లేక ఉత్తరాభాద్రా నక్షత్రముతోకూడిన ద్వాదశిదినముగాని పర్వదినము.

ఈ పాపవినాశన పుణ్యతీర్థము యొక్క మహత్తరశక్తిని గూర్చి పురాణములు అనేకవిధములుగా ప్రశంసించుచున్నవి.

స్కాందపురాణము:

హిమగిరి పార్శ్వమునం దతిపవిత్రమైన బ్రహ్మాశ్రమముకలదు. అచ్చటి కొకనాడు దృఢమతియను చతుర్థవర్ణస్థుడు వచ్చి అచ్చట తపస్సు చేయువారలను యజ్ఞము చేయువారలను చూచి సంతసించి తాను కూడా తపస్సును యజ్ఞములను చేయవలెను అను కోరిక కల వాడయ్యెను. పిమ్మట కులపతియను మునివద్దకు వెళ్లి నమస్కరించి తన కోరికను విశదము చేయగా ఆ కులపతి నీకు తగదని నివారిం చెను. ఆ దృఢమతి తనకోరికెను నివారించుకొనలేక ఒక పర్ణశాలను నిర్మించుకొని అచ్చట తపస్సును చేయ నారంభించెను.

ఒకనాడు గర్గకులీనుడగు సుమతి యను ద్విజుడు ఆ దృఢ మతి కుటీరమునకు వచ్చి అతనిచే సత్కరింపబడి అతనియందు ప్రేమకలవాడై అనుదినము వెళ్ళుచుండెను. అంత నాధృడమతి క్రమ ముగా నా సుమతివలన వైదిక ధర్మములను తెలుసుకొనుచు కర్మలను చేయించుకొనుచూ పూర్ణుడాయెను.

పిదప కొంతకాలమునకు ఆ సుమతి యను ద్విజుడు కాలధ ర్మము నొంది అనేక నరకముల ననుభవించి క్రమముగా స్థావరపశు పక్ష్యాది జన్మలనెత్తి చివరకు బ్రాహ్మణజన్మ నొందెను.

పిమ్మట ఉపనీతుడై ధర్మాచరణము చేయుచుండ నొకనాడు గహనము నందు బ్రహ్మరక్షస్సుచే గ్రహించబడెను. అంత కర్మభ్రష్టుడై బాధలు పడుచుండ తండ్రి చూచి సహించలేక ఆ కుమారుని అగస్త్యాశ్రమమునకు తీసుకునివెళ్ళి ఆ మహర్షికి ప్రణమిల్లి వృత్తాం తము నంతయు చెప్పి బ్రహ్మరక్షస్సుబాధను తొలగించి రక్షింపుమని ప్రార్థించెను.

ఆ అగస్త్యమహర్షి ధ్యానముచే సర్వమును తెలుసుకొని, "ఓ ద్విజోత్తమా! నీ కుమారుడు పూర్వజన్మమున బ్రాహ్మణుడుగానై అయాజ్యయాజనమును, అధర్మాచరణమునుచేయుటచే నరకబాధల ననుభవించి హీనజన్మలనెత్తి చివరకు నీ పుత్రుడుగా జన్మించి పూర్వ దోషముచే బ్రహ్మరక్షస్సుకు గురియైనాడు. ఇది తొలగునుపాయము, ఇచ్చటికి సమీపమున శ్రీ వేంకటాద్రియందు సర్వపాపనివారకమగు పాపవినాశన తీర్థముకలదు. ఆ తీర్థమునందు మూడు దినములు నియమపూర్వకముగా స్నానము చేయించుము. బ్రహ్మరక్షోబాధ తొలగి స్వస్థచిత్తుడగును" అని చెప్పెను.

వెంటనే తండ్రి కుమారుని వెంటబెట్టుకొని శ్రీ వేంకటాద్రికి వెళ్ళి అచ్చట పాపవినాశన తీర్థమున కుమారుని మూడు దినములు స్నానము చేయించ బ్రహ్మరక్షస్సు తొలగిపోయెను. కుమారుడు స్వస్థ చిత్తుడై దేహాంతమువరకు సర్వసంపదల ననుభవించి ముక్తినొందెను.

(మరియు) స్కందపురాణము:

పూర్వకాలమున భద్రమతియను వేదవేదాంగపారగుడగు నొక బ్రాహ్మణుడు 1. కృప, 2. సింధు, 3. యశోవతి, 4. కామినీ, 5. మాలినీ, 6. శోభ అను నామధేయములు గల ఆరుగురు భార్యలు కలవాడై గృహస్థాశ్రమము ననుభవించుచుండెను. క్రమముగా రెండు నూరుల కుమారులు కలవాడాయెను. తానుదారిద్ర్యముగల వాడగుటచే వారలను పోషించలేక బాధపడుచుండెను.

పతిబాధను చూచి సహించలేని కామినీ యను నొకభార్య పతితో ''ఓ నాథా! మా తండ్రి దారిద్ర్యముచేత బాధపడుచూ నార దమహర్ష్యుపదేశముచేత వేంకటాద్రియందలి పాపవినాశన తీర్థ తీరమున భూదానమును చేసి సమస్తైశ్వర్యముల ననుభవించి అంతమున విష్ణుపదమును చేరెను. మనము అట్లు భూదానమును చేసిన సుఖులము కాగలము'' అని చెప్పెను. అంత పతి సంతసించి కలత్ర సహితుడై వేంకటాద్రికి ప్రయాణము చేయుచూ మార్గమధ్యమున సుశాలియను నగరమునందు సర్వైశ్వర్య సంపన్నుడగు సుఘోషుడను ద్విజోత్తముని ఆశ్రయించెను.

ఓ ధర్మిష్ఠా! ద్విజోత్తమా! నేను దారిద్ర్యదోషముచే బాధపడుచు న్నాను. పంచహస్త ప్రమాణమగు భూమిని నాకు దానమివ్వమని కోరెను.

అందులకా సుఘోషుడు సత్పాత్రము లభించినదని సంతసించి పంచహస్త ప్రమాణమగు భూమిని విష్ణుస్వరూపుడగు నా భద్రమతికి దానము నిచ్చెను.

అంతట భద్రమతి సంతసించి వేంకటాచలమునకు వచ్చెను. శ్రీస్వామిని దర్శించి పాపవినాశనమునకు వెళ్ళి ఆ తీర్థమున స్నానము చేసి తీరమున శ్రోత్రియుడు విష్ణుభక్తుడగు నొక బ్రాహ్మణునకు విష్ణు బుద్ధ్యా ఆ పంచహస్త ప్రమాణమగు భూమిని దానము చేసెను. శ్రీ మహావిష్ణువు వినతానందనారూఢుడై ప్రత్యక్షమై వాత్సల్యముచే ''ఓ ద్విజోత్తమా! నేను సంతుష్టుడనైతిని. నీవు సర్వభోగ సమాయుక్తుడవై ఇహలోకమున సర్వసుఖముల ననుభవించి దేహాన్తమున ముక్తిని పొందగలవు'' అని చెప్పి అంతర్ధానము నొందెను.

## 6. పాణ్డవ పుణ్యతీర్థము

శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధానమున కతి సమీపమున అర మైలు దూరములో, ముక్తిప్రదములగు సప్తతీర్థములలో నొకటి యగు పాణ్డవ తీర్థము కలదు. ఈ తీర్థమునకు వృషభమాసమునందు శుద్ధ ద్వాదశీ ఆదివారము సంగవకాలముగాని లేక బహుళ ద్వాదశి మంగళవారము సంగవకాలముగాని పర్వకాలము.

ఈ పాండవ తీర్థము ఐహిక ఫలప్రదాన శక్తిని ఆముష్మిక ఫల ప్రదాన శక్తిని కలిగి ప్రకాశించుచున్నదని పురాణములు అనేక విధములుగా ప్రశంసించుచున్నవి.

వరాహపురాణము:

సాధుసంరక్షణమును ప్రధానముగా తలంచి ధర్మ సంస్థాపనము

చేయ నవతరించిన శ్రీకృష్ణపరమాత్మచేత ప్రాణతుల్యులుగా భావింపబడు పాండుపుత్రులగు ధర్మచారులైన ధర్మరాజాదులు ఆ పరమాత్మచే నుపదేశింపబడి ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక రూపతాపత్రయ నివారకమై సకలపుణ్యతీర్థ విరాజితమైన వేంకటాచలమునకు వచ్చిరి.

అచ్చట క్షేత్రపాలునిచే రక్షింపబడుచున్న నొక పుణ్యతీర్థ తీరమున నివసించి ఆ తీర్థమును స్నానపానాదులుచేయుచు భగవంతుని ఆరాధించుచు ఒక సంవత్సరకాలమును గడిపిరి.

ఒకనాడు ధర్మరాజునకు "మీరు ఈ తీర్థ సేవనము చేయుచూ సంవత్సరకాలము గడిపిన పుణ్యయోగముచేత క్షయించిన కల్మషము కలవారైతిరి. యుద్ధమందు విజయమును, క్రమాగతమగు రాజ్యమును పొందగలరు" అని ఉత్తమమైన స్వప్నము కలిగెను.

తరువాత క్రమముగా శ్రీకృష్ణపరమాత్మ యొక్క దౌత్యమును, సారథ్యమును, ఉపదేశమును సంపాదించుకొని, యుద్ధవిజయమును రాజ్యలాభమును పొందగలిగిరి. అది మొదలు ఈ తీర్థము పాణ్డవ తీర్థము అని ప్రఖ్యాతి కాంచినది.

పద్మపురాణము:

పూర్వము పాండవులు అరణ్యవాసమును, అజ్ఞాతవాసమును చేసి, అల్ప జీవనమునకైనను సంతోషించి శ్రీకృష్ణపరమాత్మను సంధికై పంపభగవదుపదేశమును కూడా వినని జ్ఞాతులతో క్షాత్ర ధర్మమగు యుద్ధమే రాగా ప్రచండ విక్రములై జ్ఞాతులను తొలగించి రాజ్యమును పొందకలిగిరి కాని జ్ఞాతి వధముచే లభించిన పాపమును నివారించుకొనలేక, దీనమానసులై తమకు సర్వవిధబంధువగు శ్రీవాసుదేవుని ఉపదేశమున ఈ తీర్థమున స్నానమాచరించి నిష్పాపులైరి. పిదప

శ్రీస్వామి పుష్కరిణీ తీరమున ప్రకాశించు శ్రీ స్వామిని అర్చించి యథాగతముగా వెళ్ళిరి. అప్పటి నుంచియు ఈ తీర్థమును పాండవతీర్థము అని చెప్పుచున్నారు.

అందుచే నీ తీర్థము సర్వపాపములను తొలగింపశక్తి, సర్వపుణ్య ఫలములను సమకూర్చుశక్తి కలదిగానున్నది. మరియు శ్రీ స్వామి సన్నిధికి సన్నిహితమై భక్తజనకోటి కశ్రమలభ్యమై, కాలత్రయసేవన యోగ్యమై విరాజిల్లుచున్నది.

ఈ ఆరు తీర్థములే ముక్తిప్రదములు అని స్కందపురాణము చెప్పుచున్నది అని ఇదివరలో చెప్పియున్నాము.

## 7. రామకృష్ణపుణ్యతీర్థము

శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధానమునకు ఆరుమైళ్ళదూర ములో శ్రీ వేంకటాచలమునందు పరమ పవిత్రమగు రామకృష్ణ తీర్థమను పుణ్యతీర్థము కలదు.

ఈ తీర్థమునకు మకర మాసమునందు పుష్యమీ నక్షత్రముతో కూడిన పూర్ణిమా దినము పర్వదినము.

ఈ తీర్థము యొక్క శక్తిని గూర్చి పురాణములు అనేకవిధము లుగా ప్రశంసించుచున్నవి.

స్కందపురాణము:

పూర్వకాలమున రామకృష్ణుడను మహర్షి ఈ వేంకటాచలమున తపస్సు చేయుచూ స్నానర్థమై కల్పించుకున్న తీర్థము.

ఈ తీర్థ తీరమున నివసించుచూ ఈ తీర్థమున స్నానపానాదులు

చేయుచు శ్రీ మహావిష్ణువును గూర్చి చాలా కాలము తపస్సు చేసెను. శ్రీ మహావిష్ణువు సాక్షాత్కరించెను. అందుచే నీ తీర్థము అపారశక్తికలదై యున్నది. ఏ మానవులైనను అజ్ఞానముచే పితృమాతృ గుర్వాద్యుపకారములను స్మరింపక మరచి వారల నవమానముచేయుట మొదలగు కృతఘ్నతాది దోషములుకూడా ఈ తీర్థమందు స్నాన మాత్రముచే శమించి నిర్దోషులగుదురు. పూజ్యులగు పితృమాతృ గుర్వాదుల అనుగ్రహమునకు పాత్రులు గూడా అగుదురు. సర్వసుఖ ములను బడయగలరు.

ఈ తీర్థమును గురించి విశేషములను ఉత్సవ భాగములో చెప్పి యున్నాము.

## 8. దేవ పుణ్యతీర్థము

శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధానమునకు వాయవ్య భాగములో శ్రీ వేంకటాద్రి యొక్క గుహాప్రదేశమునందు అతిపావనమై అతి శుభంకరమైన దేవతీర్థమను పుణ్యతీర్థము కలదు. ఈ తీర్థమును దేవతలు అధికముగా ప్రేమించుటచేతను సేవించుటచేతను ఈ తీర్థము నకు దేవతీర్థమను నామము కలిగినది.

ఈ తీర్థమును ముక్తిప్రదములగు సప్త తీర్థములలో నొకటిగా స్కందపురాణము, బ్రహ్మపురాణము చెప్పక పోయిననూ వరాహ పురాణము ముక్తిప్రదమగు తీర్థముగా చెప్పుచున్నది.

ఈ తీర్థమునకు పుష్యమీ నక్షత్రముతో కూడిన గురువారము వ్యతీపాతయోగము, శ్రవణ నక్షత్రముతో కూడిన సోమవారము పర్వ సమయములు.



వజ్రకవచ విభూషితులగు
శ్రీ ఉత్సవ శ్రీనివాసస్వామివారు



శ్రీ రామానుజాచార్యులు

వరాహపురాణము:

ఈ దేవతీర్థముయొక్క మహత్తరశక్తిని ఇటుల ప్రబోధించు చున్నది.

ఈ దేవతీర్థమునందు పర్వయోగమున స్నానము చేసిన మహాపురుషులకు అజ్ఞానకృతములగు పాపములు, జ్ఞానకృతములగు పాపములు నశించి పోవుటయేగాక, పుణ్యమభివృద్ధి చెందును, దీర్ఘాయుష్యము లభించును. పుత్రపౌత్రాది సంపదలు కలుగును. ఐహికములగు సకల భోగముల ననుభవించి దేహపాత సమయమునందు కూడా భగవద్దర్శన చింతకలవారలై, జీర్ణ వస్త్రమునువలె, నీ ప్రకృతిని విడనాడి దేవయాన మార్గముచేత బ్రహ్మాండకటాహమును దాటి విష్ణులోకమునకువెళ్ళి అచ్చట నిత్యానందమును బొందగలరు.

## 9. చక్రపుణ్యతీర్థము

శ్రీ వేంకటేశ్వరస్వామివారి నివాసస్థానమై యలరారు శ్రీ వేంకటాద్రియందు దక్షిణభాగమున మహాపవిత్రమగు చక్రతీర్థముకలదు.

స్కందపురాణము:

ఈ తీర్థముయొక్క శక్తివైభవములను గూర్చి ఇట్లు చెప్పుచున్నది.

భగవాను డొకప్పుడు తన భక్తుని బాధించు రాక్షసుని సంహరించుటకు వలసిన చక్రాయుధముతో ఆ రాక్షస సంహార మొనర్చి భక్తునిచే స్తుతింపబడి సంతోషించి లోకరక్షణార్థమై ఈ తీర్థమునందు సన్నిధానము చేయుటచేత ఈ తీర్థమునకు చక్రతీర్థము అను నామము కలిగినది.

ఈ తీర్థము స్నానపానాదులచే తీరవాసముచే రాక్షస బాధలను తొలగించును. సర్వపాపములనశింపచేయును. పుత్ర పౌత్రాది సంపత్తిని కలుగజేయును. దేహాంతమునందు విష్ణులోకమును సమకూర్చును.

వరాహపురాణము ఈ తీర్థమును కూడా సప్తతీర్థములలోచేర్చి ప్రవరతీర్థముగా చెప్పుచున్నది. ఈ తీర్థమాహాత్మ్యము ఉత్సవభాగములో వ్రాయబడియున్నది.

## 10. సనకసనందన పుణ్యతీర్థము

(అఖిల పాపాపనోదన క్షమమగు శ్రీ వేంకటాచలమునందుగల అనేక కోట్ల పుణ్యతీర్థములలో కొన్ని పుణ్యతీర్థములు ప్రధానములుగా నున్నను ఆ పుణ్యతీర్థములలో ముక్తిప్రదములగు పుణ్యతీర్థములయొక్క శక్తి మహత్వములు వివరింపబడినవి. ఇతర పుణ్యతీర్థముల యొక్క శక్తి మహత్త్వములను తెలియుటకై స్థాలీపులాకన్యాయముగా కొన్ని పుణ్యతీర్థములు మాత్రమే వివరింపబడుచున్నవి.)

శ్రీ వేంకటేశ్వరస్వామివారి అవతారస్థానమైన శ్రీ వేంకటాద్రి యందు శ్రీస్వామివారి సన్నిధి కి మూడున్నరమైళ్ళ దూరములో ఈ సనకసనందన పుణ్యతీర్థము కలదు.

ఈ తీర్థము సనకసనందనాది యోగివర్యులకు ప్రేమపాత్రమగుటచేతను, వారితో సంబంధము కలదగుటచేతను సనకసనందన తీర్థము అను నామము కలదై యున్నది.

ఈ తీర్థము పాపవినాశన తీర్థమునకు ఉత్తరముగా నొక మైలు దూరములో యోగిసిద్ధులచే సేవింపబడుచు నతిపవిత్రమై అతిరహస్యముగానున్నది.

యోగాదృష్టముగల పుణ్యపురుషులు తెలుసుకొని తీర్థ సంబంధము కలవారలై యోగమును అవిఘ్నముగా సాధించుకొనగలుగుచున్నారు. సామాన్య మానవులకు గోచరముగాక అజ్ఞాతముగానున్నది. అని విజ్ఞానిలోకములో వాడుకగలిగియున్నది.

వరాహపురాణము:

యోగకాముకుడు మార్గశీర్ష శుద్ధ ద్వాదశీ దినమున అరుణోదయ సమయమునందు శ్రీ స్వామిపుష్కరిణీ స్నానమాచరించి త్రయోదశీ దినము మొదలు నియమబద్ధుడై ఈ సనకసనందన తీర్థమునందు స్నానము చేయుచు వేంకటాద్రిపతియగు శ్రీ స్వామివారియొక్క అష్టాక్షరీ మహామంత్రమును ప్రతిదినమునందును పదివేలు జపించుచుండవలయును. ఇటుల కొంతకాలము నియమబద్ధుడై నియమమును పూర్తియొనరించుకొని పిదప యోగము సాధింపవలసియున్నది.

ఇటుల నియమానుష్ఠానము చేసిన వారలు శ్రీ వేంకటాద్రి పతియొక్క అనుగ్రహబలముచే, అచిరకాలముననే అవిఘ్నముగా యోగానుష్ఠాన సమర్థులగుచున్నారు. వారు ప్రాణాయామముచేత వాయుజయమును, ప్రత్యాహారముచేత నింద్రియ జయమును పొందిన వారలై చిత్తమును శుభాశ్రయమునందు బంధించి తదేకధ్యానమందు అనగా విజాతీయ ప్రత్యయములచే నడ్డుపడని సజాతీయ ప్రత్యయముల యొక్క ప్రవాహరూపమగు ధ్యానమునందు నిమగ్నులై పరమఫలమగు సమాధిని పొంది యోగసిద్ధిని అందుకొనగలవారగుచున్నారు.

వీరిని ''సంయమధనులు'' అనుచున్నారు. సంయమము అనగా ''ధారణ, ధ్యానము, సమాధి ఈ మూడు అంగములకు నామము అని పాతంజల శాస్త్రము చెప్పుచున్నది.

సంప్రదాయవేత్తలు ఆధారశక్తి, తీర్థశక్తి, మంత్రశక్తి - త్రితయ లభ్యమైన భగవదనుగ్రహమునకు అడ్డుయేమి కలదు. గాన పూర్ణయోగ సిద్ధితో సంయమధనులు అగుటలో నాక్షేపము లేదు అని చెప్పు చున్నారు.

## 11. కాయరసాయన పుణ్యతీర్థము

శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధానమునకు మూడున్నరమైళ్ల దూరములోనున్న సనకసనందన తీర్థమున కతిసమీపములో ప్రత్యక్ష ఫలప్రదమగు ''కాయరసాయన పుణ్యతీర్థము'' కలదు.

ఈ తీర్థముయొక్క శక్తి అపారమైయున్నది. పాండురవర్ణముగల ఆకును ఈ తీర్థమందుంచిన క్షణకాలములో పాండురవర్ణము తొలగి పోయి శ్యామవర్ణముగల ఆకుగా మారిపోవును. అందుచే యోగాభ్యా సపరులు ఈ తీర్థమును ఉపయోగించుకొని శరీరదార్ఢ్యమును, మనో దార్ఢ్యమును సంపాదించుకొని యోగసిద్ధిని బడయగలరు.

మరియు నీ తీర్థస్నానముచే మహాత్ములయొక్కయు; పుణ్యాత్ముల యొక్కయు దర్శనము బడయగలరు. అందుచే విజ్ఞాన సంపన్నులు కాగలరు.

ఈ తీర్థము యోగిపుంగవులవలన పాషాణములచేత మూయబడి అతిరహస్యముగా దుర్లభముగా నున్నది. ఏవిధముగానైనను మహా శ్రమ చేసి ప్రతిమానవుడు కాయరసాయన తీర్థముతో సంబంధముకలవాడై కాని లేక ఇతర మార్గముచేతకాని శరీరదార్ఢ్యమును, మనోదార్ఢ్యమును సంపాదించుకుని సర్వశేషియగు శ్రియఃపతియొక్క కైంకర్యమును శేషభూ తుడగు తాను చేయవలసియున్నది. అటుల స్వామికైంకర్యమును చేయక స్వకైంకర్యమును చేసుకొనువాడు స్వామిద్రోహియగుచున్నాడు. స్వామి

ద్రోహము అధఃపతనమునకు కారణమగుచున్నది. అని శాస్త్రములు చెప్పుచున్నవి.

అందుచే మనోవాక్కాయములయందు పూర్ణశక్తిని సంపాదించుకుని, అనాలోచిత విశేషాశేషలోకశరణ్యుడై ముక్తి ప్రదాతయగు శ్రీ వేంకటేశ్వరస్వామివారి కైంకర్యము ననుదినమును చేసుకుని తరించుటకై ఈ తీర్థము ఒక పెన్నిధి గా భావించవలసియున్నది.

మానవులకు మానసికశక్తి లాభము వలన భగవద్ధ్యానములో ఇతర విషయముల కవకాశములేక తదేకతారూపము లభించును.

వాచికశక్తి లాభమువలన మంత్రముల జపముచే సిద్ధి లభించును. కాయికశక్తి లాభముచే, అడ్డులేని భగవత్కైంకర్యము లభించును.

కాన ఈ కాయరసాయన పుణ్యతీర్థము పెన్నిధి యగుటలో నాక్షేపములేదు.

## 12. ఫల్గునీ పుణ్యతీర్థము

శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధానమునకు ఉత్తరదిగ్భాగములో శ్రీ వేంకటాచలమునందు అతిశక్తియుక్తమైన ఫల్గునీ పుణ్యతీర్థము కలదు.

ఈ ఫల్గునీతీర్థ మహావైభవమును గూర్చి ఇట్లు చెప్పుచున్నది.

వరాహపురాణము:

ఉత్తరఫల్గునీ నక్షత్రముతోకూడిన ఫాల్గునపూర్ణిమయందు నియమపూర్వకముగా ఈ తీర్థస్నానమాచరించినవారలయొక్క గృహములయందు పరమప్రీతురాలైన లక్ష్మీదేవి సర్వకామముల నిచ్చుచు నివాసముచేయుచుండును.

పూర్వమొకప్పుడు బ్రహ్మరుద్రేంద్రాది దేవతలు సనకసనందనాది యోగివర్యులు వసిష్ఠాది మహర్షులు సకలజగన్నియన్తయై వైకుంఠమును వీడి అతిప్రీతితో వేంకటాచలమున వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి యొక్క అశ్రుతపూర్వము అదృష్టపూర్వము అగు మహోత్సవ వైభవమును దర్శించుటకై శ్రీ వేంకటాచలమునకు వచ్చి శ్రీ స్వామి వారిని, ఉత్సవములను దర్శించిరి.

పిమ్మట శ్రీవారి ఆజ్ఞగైకొని, బ్రహ్మ హంసవాహనారూఢుడై సత్యలోకమునకు వెళ్లెను. దేవేంద్రుడు విమానమునధిష్ఠించి అమరావతిని ప్రవేశించెను, పార్వతీపతి ప్రమథగణ పరివృతుడై వేంకటాచలమునకు ప్రదక్షిణ మొనర్చుచూ వేంకటాద్రికి ఆగ్నేయభాగమున అధఃప్రదేశ మందు కల కాపిలసరస్తీరము తనకు వాసయోగ్యముగా నిశ్చయించు కొని రజతాచలమునకు వెళ్లెను. సనకసనందనాది యోగివర్యులు పాపవినాశన తీర కాననములయందు అతిప్రీతికలవారై నివాసము చేయతలంచిరి. సప్తమహర్షులు అచ్చటికి ఉత్తర పూర్వమందుగల ఫల్గునీ తీర్థతీరము నందు ఆశ్రమములను కల్పించుకొని నివసించుచూ తపస్సును చేయుచుండిరి.

అరున్ధతీదేవి కూడా ఆ తీర్థమున స్నానము చేయుచూ తపస్సు చేయుచుండ ఆమె తపస్సుకు సంతసించిన జగన్మాతయగు లక్ష్మి ఫాల్గుణ పూర్ణిమనాడు ఆ తీర్థతీరమున ప్రత్యక్షమై ఆమెకు ఇష్టములగు వరముల నిచ్చెను. మరియు ఈ తీర్థమునందు ఉత్తరఫల్గునీ నక్షత్రముతో కూడిన ఫాల్గుణపూర్ణిమాదినమునందు యే మానవులు స్నానమాచరింపగలరో వారి గృహములయందు నేను సర్వకామముల నిచ్చుచూ నివసించగలను. అని వరమిచ్చి లక్ష్మీదేవి అంతర్ధాన మాయెను.

అందుచే మహర్షులు కొందరు శ్రీ వేంకటేశ్వరస్వామివారిని సేవించుచూ ఈ తీర్థతీరమునందే నివసించగలము అని నిశ్చయించుకొనిరి. కావున ఈ ఫల్గునీతీర్థము పరమశక్తియుక్తమైనదిగా భావించవలసియున్నది.

ఉత్తర ఫల్గునీ నక్షత్రమున లక్ష్మీదేవి ఈ తీర్థతీరమున ప్రత్యక్షమైనదిగాన ఈ తీర్థమునకు "ఉత్తర ఫల్గునీతీర్థము" అని పేరు వచ్చినది. "ఫల్గునీతీర్థము" అనియు వ్యవహరించబడుచున్నది.

## 13. జాబాలి పుణ్యతీర్థము

శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధానమునకు ఒక మైలు దూరములో పశ్చిమోత్తర ప్రదేశమునందు మహా పవిత్రమగు పుణ్యతీర్థము కలదు. ఆ తీర్థమును కర్మ సాధనమును నిర్ణయించుకొని జాబాలి మహర్షి తత్తీరమున ఆశ్రమమును కల్పించుకొని నివసించుచూ తపస్సు చేయుచుండెను. అందుచే ఆ తీర్థము "జాబాలి పుణ్యతీర్థము" అని ప్రఖ్యాతిని కాంచినది.

ఈ తీర్థమునందు స్నానముచేసిన మానవులకు పంచమహాపాతకములు, (అనగా 1. బ్రహ్మహత్య, 2. సురాపానము, 3. స్వర్ణస్తేయము, 4. గుర్వంగనాగమనము, 5. పాతకిసంసర్గము.) ఈ ఐదు మహాదోషములు నశించిపోవును. ఇతర దోషముల నివృత్తి గూర్చి చెప్పనవసరములేదు.

స్కందపురాణము:

పూర్వము కావేరితీరమునందు దురాచారుడను బ్రాహ్మణుడు పాపరతుడై మహాపాతకులతో సహాసన, భోజన, శయనాదులు

చేయుటచే నా మహాపాతకి సంసర్గమువలన మహాపాతకుడుగా మారెను. పూర్ణముగా బ్రాహ్మణ్యము నశించిపోయి బలవత్తరమైన భేతాళునిచే ఆవేశింపబడి బాధపడుచు నిలుకడలేక దేశములు ద్రిమ్మరుచుండెను.

ఇటులుండ భేతాళునిచేత తరుమబడినవాడై పూర్వపుణ్య విశేషము చేత దైవయోగమున వేంకటాచలముచేరి జాబాలి తీర్థమందు మునిగెను. ఆ దురాచారుని మహాపాతకములు వెంటనే నశించిపోయెను. భేతాళుడు దురాచారుని వదలిపోయెను. దురాచారుడు స్వస్థచిత్తుడాయెను.

అంత పూర్వజ్ఞానముకలవాడై ''కావేరీ తీరవాసినగు నేను ఈ వేంకటాచలమునకేల వచ్చితివి'' అని చింతించుచు ఆ తీరమునందుగల ఆశ్రమమునకువెళ్ళి అచ్చట బ్రహ్మతేజస్సుతో ప్రకాశించుచున్న జాబాలి మహర్షికి ప్రణమిల్లి, ''ఓ మహర్షివర్యా! నేను కావేరీ తీరవాసిని. దురాచారుడను. బ్రాహ్మణుడను. ఎందుల కిచ్చటికివచ్చినది తెలియుట లేదు. ఇందులకు కారణమునుచెప్పి నన్ను రక్షింపమని ప్రార్థించెను.

ఆ జాబాలి మహర్షి ''ఓ దురాచారా! నీవు మహాపాతకుల సంబంధముచే మహాపాతకి వైతివి. అందుచే నిన్ను భేతాళుడు గ్రహించి దేశములెల్ల త్రిప్పెను. దైవయోగముచే నీ వేంకటాచలముచేరి ఈ తీర్థమును మునిగితివి. మునుగగనే భేతాళుడు నిన్ను వదిలిపోయెను. అందుచే నీకు పూర్వజ్ఞానము కలిగినది.''

''మరియు ఆ భేతాళుడు పూర్వము బ్రాహ్మణుడుగా యుండి, తండ్రికి పార్వణ శ్రాద్ధముచేయని కారణముచేత పితృదేవతలచే శపింపబడి భేతాళజన్మమెత్తెను. ఆ భేతాళుడు పాతకివైన నిన్ను ఆవేశించి దైవయోగముచేత వేంకటాచలముచేరి ఈ తీర్థమునందు స్నానముచేయ

ఈ తీర్థ మాహాత్మ్యముచే భేతాళత్వము తొలగి విష్ణులోకమును పొందెను. నీవును స్నానమాత్రముచేత పరిపూతుడవైతివి. దేహాన్తము నందు విష్ణులోకము నందగలవు. మరియు ప్రాయశ్చిత్తములు లేని మహా పాపములు అన్నియు ఈ తీర్థస్నానమాత్రముచేతనే నశించిపోవును'' అని చెప్పెను.

కనుక జాబాలి తీర్థస్నానము మానవులను సర్వపాపముల వలనను తొలగించి పరిశుద్ధులను చేయును.

## 14. వరాహ పుణ్యతీర్థము

శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధానము ననుసరించియున్న స్వామి పుష్కరిణీ తీర్థమునకు వాయువ్య భాగమున ఉత్తమోత్తమమైన వరాహ పుణ్యతీర్థము కలదు.

ఈ వరాహపుణ్యతీర్థము యొక్క అవతరణ మహావైభవములను గూర్చి పురాణములు అనేక విధములుగా ప్రశంసించుచున్నవి.

బ్రహ్మపురాణము:

పూర్వము దైత్యులు భూమిని అపహరించి పాతాళమునకు కొని పోయిన సమయములో బ్రహ్మదేవుడు శ్రీమహావిష్ణువును స్తుతించి భూమ్యుద్ధరణమును ప్రార్థించెను. ఆ మహావిష్ణువు వరాహరూపమును దాల్చి రసాతలమునకేగి మహాబలుడగు హిరణ్యాక్షుని సంహరించి భూదేవిని తన దంష్ట్రాగ్రమునదాల్చి తెచ్చి స్వస్థానమున ప్రవేశపెట్టెను.

బ్రహ్మ లోకరక్షార్థమై ఆ భగవద్రూపమును వేంకటాచలమునందు స్వామిపుష్కరిణీతీరమున ప్రతిష్ఠించెను. ఆ ప్రతిష్ఠాకాలమున ప్రతిష్ఠాంగ

మగు జలాధి వాసమును స్వామిపుష్కరిణీతీర్థవాయవ్యభాగమున యేర్ప రుపబడెను. ప్రతిష్ఠానంతరమందు బ్రహ్మదేవుడు ఆహూతులైన దేవతలతో, పితృదేవతలతో, మహర్షులతో సహా ఆ జలాధి వాసస్థానమగు తీర్థమందు స్నానముచేసి సంతుష్టుడయ్యెను.

పిదప నా బ్రహ్మదేవుడు సర్వలోకము చూచుచుండ ఈ భాగము వరాహతీర్థమను పేరుతో ప్రఖ్యాతిని కాంచునుగాక. శ్రీనివాస దర్శనకాముకులై వచ్చిన వారందరు ముందు ఈ వరాహ తీర్థ స్నానమును, శ్రీవరాహ స్వామి దర్శనమును చేయుదురుగాక! ముందుగా శ్రీ వరాహస్వామి పూజనము జరుగును గాక! అని వ్యవస్థను యేర్పరచి అటుల శ్రీనివాసుని అంగీకారమును అనుగ్ర హమును పొందెను.

అప్పటినుంచి వరాహతీర్థస్నానము, వరాహస్వామి దర్శనము, వరాహస్వామి పూజనము ముందుగా జరుగుచున్నవి.

శ్రీ వరాహస్వామివారి సన్నిధి కి ముందుభాగమునందలి తీర్థము అప్పటినుంచి వరాహతీర్థము అని ప్రశంసింపబడుచున్నది. శ్రీస్వామి తీర్థము వరాహతీర్థము ఏకాకారముగానున్నను అనుష్ఠాన సమయముల యందు ప్రత్యేక నామములచే కీర్తింపబడుచూ ప్రఖ్యాతి కలవైయున్నవి.

మరియు శ్రీ స్వామితీర్థము దక్షిణభాగమున శ్రీనివాస తీర్థము అనియు, ఉత్తరభాగమున వరాహతీర్థము అనియు కూడా వ్యవహరించ బడుచున్నది.

## 15. కాపిల పుణ్యతీర్థము

శ్రీ వేంకటేశ్వరస్వామివారి ప్రేమస్థానమగు నీ వేంకటాచలమున

కాగ్నేయ భాగమున క్రింది ప్రదేశమున కాపిలతీర్థము అను పుణ్య తీర్థము కలదు.

ఈ తీర్థమునందు కార్తిక పూర్ణిమాదినమున మధ్యాహ్న సమయమునందు పదిఘడియలకాలము త్రైలోక్య విశ్రుతములగు పుణ్యతీర్థములన్నియువచ్చి సాన్నిధ్యమును పొందగలవు. ఆ సమయము ఈ తీర్థమునకు పర్వసమయము.

ఈ తీర్థము దర్శనమాత్రముచేతనే మానవుల పాపములను తొలగించు శక్తికలదై యున్నది.

వామనపురాణము:

పూర్వము పాతాళమునందు శివలింగము కపిలమహర్షిచే పూజింపబడుచుండెను. కామధేనువు యొక్క క్షీరములచే అభిషేకము చేయబడుచుండెను. ఒకప్పుడు ఆ శివలింగము భూమిని ఛేదించుకుని భూమి పైకి వచ్చెను. అందులకా కామధేనువు కోపగించి ఆ శివలింగమును పెరుగకుండ శిరస్సునందు తనగిట్టెయుంచి "మావర్ధస్వ" అని శాసించెను. ఖురాంకితమైన ఆ శివలింగము పెరుగుట మానివేసెను.

ఆ శివలింగము మూలభాగమున రజతవర్ణముగాను, మధ్యభాగమున సువర్ణ వర్ణముగాను, అగ్రభాగమున అరుణవర్ణముగాను యుండి పంచవక్త్రము, పంచవర్ణము త్రినేత్రముగా ప్రకాశించుచున్నది.

ఆ శివలింగము కృతయుగమున పాతాళమునందు కపిల మహర్షిచే పూజింపబడుటచేత కపిలేశ్వరుడు అను నామము కలిగెను. త్రేతాయుగమున అగ్నిదేవుడు పూజించుటచేత, ఆగ్నేయమను నామము కలిగెను. ద్వాపరయుగమున అనాద్యనన్తమగు నా మహాలింగమును

చక్రదేవుడు పూజించెను. కలియుగమునందు ఆ శివలింగము కపిల మహర్షిచే పూజింపబడగలదు.

ఆ కాపిలలింగము యొక్క ముందుభాగమునగల సరోవరము పాతాళమునుంచి కపిలమహర్షి వచ్చుటకు మార్గముగానైన రహస్యమగు బిలము. అది జలపూరితమై కాపిలతీర్థమని వ్యవహరింపబడు చున్నది.

''ఈ కాపిలతీర్థము దర్శనమువలన సర్వపాపములను తొలగిం చును. పర్వకాలమునందు ఈ తీర్థమున స్నానముచేసిన మానవులు సర్వపాపములను తొలగించుకొని బ్రహ్మలోకమునకు వెళ్ళుచున్నారు. ఈ తీర్థమునందు స్నానముచేసి తీర్థతీరమున కన్యాదానమును, గోదానమును, భూదానమును, అన్నదానమును, విద్యామంత్రోప్రదేశ మును యథాభిరుచిగా చేసినవారు స్వర్గ, కైలాస, వైకుంఠ, బ్రహ్మ లోకములను పొందగలరు'' అని చెప్పుచున్నది.

## 16. పద్మసరోవర పుణ్యతీర్థము

శ్రీ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి యొక్క పట్టమహిషియై శుకపురము (తిరుచానూరు) నందు వేంచేసియున్న శ్రీ పద్మావతీ దేవి వార్ల దివ్యసన్నిధానమునకు పశ్చిమోత్తరభాగమునందు పద్మసరోవర మును పుణ్యతీర్థముకలదు. ఈ తీర్థము సకలసంపదలను, దీర్ఘాయుష్య మును, నిత్యానందమును కలుగచేయుగల శక్తికలదై ప్రకాశించు చున్నది.

ఈ పద్మసరోవరతీర్థము యొక్క మహత్తరశక్తి వైభవములను పురాణములు బహువిధములుగా ప్రశంసించుచున్నవి.

వరాహపురాణము:

పూర్వకాలమున కోపాక్రాన్తచిత్తుడగు దుర్వాస మహర్షి యొక్క శాపముచేత శ్రీదేవి తన ప్రియుడగు శ్రీనాథునితోసహా దేవావాసమును వదలి పద్మములతో పరిపూర్ణమై ప్రకాశించు నీ పద్మసరోవరమునకు వచ్చి దేవమానముచేత అనేక సంవత్సరములు తపస్సు చేయు చుండెను.

దేవతలు సమస్తైశ్వర్య ప్రదాయినియగు లక్ష్మీదేవిని, లక్ష్మీనాథుని కానక తమ కధి కారియగు పురందరునితో కూడుకున్నవారలై సమస్త ప్రపంచమును వెదకి ఈ పద్మసరోవరమున కాంచనపద్మము నందు అంబుజధారిణియై ప్రకాశించు పద్మాలయనుచూచి ప్రణమిల్లి బహుభా వగుంభి తములై ఆనందసంధాయకములగు చతుర్వింశతినామములచే స్తోత్రము చేసిరి.

లోకమాతయగు నా పద్మాలయ అందులకు సంతోషించి ఆ దేవతల ననుగ్రహించి ''తనకు ప్రేమపాత్రమగు ఈ పద్మసరోవర తీర్థమున విష్ణువల్లభయగు నన్ను సంస్తుతించి స్నానము చేయువారలు సకలసంపదలను, సకలభోగములను, దీర్ఘాయుష్యమును అనుభవించి దేహాన్తమునందు నిత్యానందమును పొందగలరు'' అని వరమిచ్చి తన వల్లభునితోసహా వేదమయుడగు వైనతేయునధి ష్ఠించి నిజావాసమగు శ్రీ వైకుంఠమును ప్రవేశించెను.

పద్మపురాణము:

పూర్వమొకప్పుడు లక్ష్మీనాథుడు ప్రణయకలహముచే వైకుంఠ మును వదలి భూలోకమునకు వచ్చిన లక్ష్మీదేవిని గూర్చి చాలా కాలము వెదకి అశరీరవాక్కు యొక్క నియోగముచే ఈ పద్మ

సరస్సును నిర్మించి తీరమునందు ఏకాక్షరాది మహామంత్రములచే తపస్సును చేయుచుండెను.

అటుల పండ్రెండు సంవత్సరములు తపస్సుచేయగా కార్తిక శుక్ల పంచమీ శుక్రవారము ఉత్తరాషాఢానక్షత్రయుక్తమైన మైత్ర ముహూర్తము నందు ఆ పద్మసరోవర మధ్యమున బాలభాను సహస్రముల యొక్క కాంతుల సమూహముతో సదృశమైన ఒక మహత్తరమగు తేజోరాశి బయలుదేరెను.

ఆ తేజోరాశిమధ్యమున కాంచన పద్మనిర్మితమగు రథమును, ఆ రథ మధ్యమున సహస్రదళ సంశోభితమగు సువర్ణపద్మమును, ఆ పద్మముయొక్క కర్ణికామధ్యభాగమునందు పద్మాసన సమన్వితయై పద్మ హస్తయై, పద్మపాదయై, పద్మముఖియై, పద్మనేత్రియై, పద్మమాలా ధరయై, పద్మగంధినియై, పద్మసుందరియైన పద్మాదేవి ఆవిర్భవించెను. దేవదుందుభులుమ్రోగెను. తూర్య ఘోషములు జగత్తును పూరించెను. పద్మావతార సందర్శనలాలసులగు బ్రహ్మరుద్రేంద్రాది దేవతలు అందరు పద్మసరోవరమునకు విచ్చేసిరి.

అటుల అవతరించిన పద్మాదేవి బ్రహ్మాది సకల దేవతలు చూచు చుండ స్మితపూర్వకముగా ఆనంద, రస, భావము లుప్పతిల పద్మ నాభుని కంఠమున అనురాగముతో కల్హారమాలనర్పించి వక్షఃపీఠము నలంకరించెను.

పద్మనాభుడు పద్మాప్రీతికరమగు పద్మసరోవరము ననుగ్రహించి పతగరాజు నధిష్ఠించి పన్నగరాజగిరిని ప్రవేశించి పద్మాలయతో సుఖముగా నుండెను.

లక్ష్మీ, లక్ష్మీనాథులయొక్క ప్రణయకలహ నివృత్తిస్థానమై,

ఆనందానుభావ, రస, భావప్రవృత్తిస్థానమై, పరమానుగ్రహపాత్రమైన ఆ పద్మసరోవరతీర్థమందు స్నానమాచరించిన పుణ్యమూర్తులను గూర్చి, ప్రశంసించిన అష్టమహర్షులలో నారద, వసిష్ఠ, మరీచి, అత్రి మహర్షులు ''అనేక జన్మార్జితములగు పాపములను తొలగించుకొని సమస్తైశ్వర్యములను పొందగలరు'' అనియు,

అంగిరోమహర్షి ''రాజ్యభ్రష్టులైనవారలు మరల రాజ్యములను పొంది సమస్త భోగముల ననుభవించగలరు'' అనియు,

పులస్త్య, పులహ, క్రతు మహర్షులు ''మహాపాతకముల నశింప చేసుకొని ఉత్తరోత్తరములైన ఉత్తమోత్తమ జన్మములను పొందగలరు'' అనియు ప్రశంసించిరి.

అందుచే నీ పద్మసరోవర తీర్థమునందు పద్మాలయా ప్రాదుర్భావ సమయమగు కార్తీకశుద్ధపంచమీ దినమున ''పంచమీ తీర్థము'' అను పేరుతో ప్రతిసంవత్సరము శ్రీ పద్మావతీ తాయార్లవారికి బ్రహ్మోత్సవాన్తమున అవభృథోత్సవస్నానము జరుగుచుండును.

ఆ దినమున ఆ సమయమున ఈ పద్మసరోవర తీర్థమునందు, జగన్మాతయై పురుషకారభూతురాలగు పద్మాదేవీ అనుగ్రహమును కాంక్షించుచూ వేలాది ప్రజలు క్రిక్కిరిసి అత్యుత్సాహముతో స్నానము చేయుచుండ పద్మసరోవరము పద్మపూరిత సరోవరమై ప్రకాశించుచుండును.

ఆ దినమున శ్రీలక్ష్మీనాథుని తపశ్శక్తిచేతను, శ్రీలక్ష్మీ అవతార శక్తిచేతను, శ్రీపద్మావతీదేవీ అవభృథస్నానశక్తిచేతను ముమ్మడింపబడిన తీర్థ శక్తితో విరాజిల్లు నీ పద్మసరోవరతీర్థమందు స్నానమాచరించిన పుణ్యమూర్తుల అదృష్టము మనోవాక్కుల కవిషయముగా భావించవలసియున్నది.

## నిగమనము

అఖిలభువనైక నియన్తయగు శ్రీవేంకటేశ్వర స్వామివారికి ప్రేమపాత్రమై శ్రీవారి సాన్నిధ్యముచే పర్వతరాజమని పేరుకాంచిన శ్రీ వేంకటాద్రిని, శ్రీ వేంకటాద్రి ప్రభువగు శ్రీస్వామివారిని ఆశ్రయించుకొని

శ్లో॥ ''సర్వతీర్థజలం పుణ్యం పావనం సర్వకారణమ్।
విష్ణుపాదోద్భవం శుద్ధం సర్వమంగళదాయకమ్॥''

అనునట్లు అతిపావనములై సర్వమంగళదాయకములగు షట్షష్టి కోటి (అరవై ఆరుకోట్లు) పుణ్యతీర్థములు ప్రకాశించుచున్నవి అని బ్రహ్మపురాణము చెప్పుచూ ప్రధాన తీర్థములకు మాత్రమే నామసంకీర్తనమును చేసినది. ఇతర తీర్థములకు నామ సంకీర్తనమును చేయలేదు.

అటుల నామసంకీర్తనముచేయు నా ప్రధాన పుణ్యతీర్థములలో సప్తర్షితీర్థములు, అష్టభైరవతీర్థములు, నవప్రజాపతి తీర్థములు, దశావతారతీర్థములు, ఏకాదశ రుద్రతీర్థములు, ద్వాదశాదిత్య తీర్థములు, ఇత్యాదులు కొన్ని పుణ్యతీర్థములు సంఖ్యాపూరక సహచర తీర్థములుగా నుండి వివిధ శక్తియుతములైయున్నవి.

మరియు పంచతీర్థములు, నవతీర్థములు, సప్తదశతీర్థములు ఇత్యాదులు కొన్ని పుణ్యతీర్థములు సంఖ్యాపూరకములగు తీర్థములతో కలసి వివిధ శక్తులతో కూడియున్నవి.

మరియు, బ్రహ్మతీర్థము, విష్ణుతీర్థము, రుద్రతీర్థము, నారసింహ తీర్థము, ఇంద్రతీర్థము, అగ్నితీర్థము, యమతీర్థము, వరుణతీర్థము, వాయుతీర్థము, కుబేరతీర్థము, కార్తికేయతీర్థము, దేవతీర్థము ఇత్యాదులు కొన్ని పుణ్యతీర్థములు దేవతలతో పరిపూర్ణ సంబంధము కలవై ప్రబల శక్తులతో ప్రకాశించుచున్నవి.



శ్రీపద్మ సరోవర పుణ్యతీర్థము



శ్రీ కపిల పుణ్య తీర్థము

మరియు భృగుతీర్థము, కాశ్యపతీర్థము, భారద్వాజతీర్థము, కాణ్వతీర్థము, నారదతీర్థము, మార్కండేయతీర్థము, జాబాలితీర్థము, వాలఖిల్యతీర్థము, విశ్వామిత్రతీర్థము, గౌతమతీర్థము, ఋశ్యశృంగతీర్థము ఇత్యాదులు కొన్ని పుణ్యతీర్థములు మహర్షులతో నధిక సంబంధముకలవై మహాశక్తియుతములుగా ప్రకాశించుచున్నవి.

మరియు జ్వరహరతీర్థము, విషహరతీర్థము, ఇష్టసిద్ధితీర్థము, కర్మసిద్ధితీర్థము, పుణ్యవృద్ధితీర్థము, పాపవినాశనతీర్థము, జరాహరతీర్థము, ఋణవిమోచనతీర్థము, పవిఘ్నతీర్థము, రసాయనతీర్థము, శుద్ధోదకతీర్థము ఇత్యాదులు కొన్ని పుణ్యతీర్థములు అన్వర్థనామధేయములు కలవై ప్రత్యక్షఫలములను చూపుచు లోకప్రఖ్యాతిని కాంచియున్నవి.

శ్రీవేంకటేశ్వరస్వామివారి దివ్యాలయమునకు పూర్వభాగమునందు ''అస్థిసరోవరము'' అను అపమృత్యునివారకమగు మహాశక్తి సంపన్నమైన పుణ్యతీర్థము కలదు. అని వరాహపురాణము, బ్రహ్మాండపురాణము స్పష్టముగా చెప్పుచున్నది.

ఇటులనే ప్రధాన తీర్థముల యొక్క శక్తి వైభవములను గూర్చి పది లేక పంద్రెండు పురాణములు పూర్వుల యొక్క ఫలసిద్ధి పర్యన్తమగు అనుభవముతో చెప్పుచు, అస్మదాదుల ప్రవృత్తికి తోడ్పడుచు ప్రపంచ క్షేమమునకు సహకరించుచున్నవి.

ఈ పుణ్యతీర్థములను అదృష్టవంతులైనవారు, తీర్థస్నానశ్రద్ధ కలవారు, యోగకాంక్షకలవారు, వనసంచారవాంఛకలవారు, పర్వతారోహణమునుచేసి యథాశక్తిగా గహనముల సంచరించి ఆ తీర్థముల వెదకి యథామతిగా తెలుసుకొని యథాలాభముగా అనుభవించి ఫలశుద్ధి బడసి కృతార్థులగుచున్నారు.

శ్లో॥ శ్రీ వైకుంఠ విరక్తాయ స్వామిపుష్కరిణీ తటే।
రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్॥

ఓమ్

# శ్రీ వేంకటేశ్వర వైభవము

★

## 4

తిరుమల

శ్రీ వేంకటేశ్వరస్వామివారి

## ఉత్సవాది సమయములు

# 4

## శ్రీ స్వామివారల ఉత్సవాది సమయములు

అఖిల బ్రహ్మాణ్డనాయకుడై తిరుమలయందు అర్చావతారమున వేంచేసియున్న 1. శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవస్థానమందును, శ్రీ స్వామివారిచే పరిపాలింపబడు, 2. తిరుమల శ్రీవరాహస్వామివారి దేవస్థానమందును, 3. తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి దేవస్థాన మందును, 4. తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి దేవస్థాన మందును, 5. తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి దేవస్థానమందును, 6. తిరుచానూరు శ్రీపద్మావతీతాయారువారి దేవస్థానమందును, 7. నారాయణవనం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి దేవస్థాన మందును, 8. నాగులాపురం శ్రీ వేదనారాయణస్వామివారి దేవస్థాన మందును, 9. మంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి దేవస్థానమందును, 10. హృషీకేశం శ్రీ వేంకటేశ్వరస్వామివారి దేవస్థాన మందును, 11. హృషీకేశం శ్రీ చంద్రశేఖర స్వామివారి దేవస్థాన మందును ప్రతిసంవత్సరము చైత్రాది మాసములలోను, మేషాది మాసములలోను జరుగు ఉత్సవాదుల సమయముల వివరణము:-

## 1. చైత్రమాసము:

చాంద్రమానసిద్ధములగు ప్రభవాది షష్టి సంవత్సరములలో ప్రతి సంవత్సరమునకు మొదటిదియగు మాసము చైత్రమాసము. చిత్రా నక్షత్రముతో కూడిన పూర్ణిమకల మాసమగుటచే నిది చైత్రమాసము అని వ్యవహరింపబడుచున్నది.

## 2. చాంద్ర సంవత్సరాది, శ్రీస్వామివారి ఆస్థానం:

ఈ చైత్ర మాసమునందు మొదటి దినమగు ప్రతిపత్ తిథి సంవత్సరాది, ఈ తిథి సూర్యోదయ వ్యాప్తికలదై యుండవలయును. ఈ చాంద్ర సంవత్సరాది పండుగయందు శ్రీ వేంకటేశ్వరస్వామివారికి ఆస్థానము జరుగును. మరియు నింబకుసుమ భక్షణము, నూతనవస్త్ర ధారణము, నూతన పంచాంగ శ్రవణము జరుగును. శ్రీ స్వామివారికి నిత్యోత్సవము ప్రారంభమగును. ఈ సంవత్సరాదిని చాంద్రవత్సరాది అని, ఆంధ్రవత్సరాది అని ఉగాది అని వ్యవహరించెదరు.

ఈ చైత్రమాసము అధికమాసము అయిన పక్షమున సంవత్సరాది నిమిత్తకములగు తైలాభ్యంగమును, సంకల్పాదుల యందు నూతన సంవత్సర సంకీర్తనము జరుగవలెను. శుద్ధమాస ప్రారంభమున ధ్వజారోపణమును, నింబకుసుమ భక్షణమును, నూతన సంవత్సర ఫలశ్రవణమును, వసంతనవరాత్రారంభమును జరుగవలెను.

## 3. శ్రీమత్స్య జయన్తి:

చైత్రమాసమున శుక్ల పక్షమునందు తృతీయాతిథి

## 1 చైత్రమాసము:

చాంద్రమానసిద్ధములగు ప్రభవాది షష్టి సంవత్సరములలో ప్రతి సంవత్సరమునకు మొదటిదియగు మాసము చైత్రమాసము. చిత్రా నక్షత్రముతో కూడిన పూర్ణిమకల మాసమగుటచే నిది చైత్రమాసము అని వ్యవహరింపబడుచున్నది.

## 2. చాంద్ర సంవత్సరాది, శ్రీస్వామివారి ఆస్థానం:

ఈ చైత్ర మాసమునందు మొదటి దినమగు ప్రతిపత్ తిథి సంవత్సరాది, ఈ తిథి సూర్యోదయ వ్యాప్తికలదై యుండవలయును. ఈ చాంద్ర సంవత్సరాది పండుగయందు శ్రీ వేంకటేశ్వరస్వామివారికి ఆస్థానము జరుగును. మరియు నింబకుసుమ భక్షణము, నూతనవస్త్ర ధారణము, నూతన పంచాంగ శ్రవణము జరుగును. శ్రీ స్వామివారికి నిత్యోత్సవము ప్రారంభమగును. ఈ సంవత్సరాదిని చాంద్రవత్సరాది అని, ఆంధ్రవత్సరాది అని ఉగాది అని వ్యవహరించెదరు.

ఈ చైత్రమాసము అధికమాసము అయిన పక్షమున సంవత్సరాది నిమిత్తకములగు తైలాభ్యంగమును, సంకల్పాదుల యందు నూతన సంవత్సర సంకీర్తనము జరుగవలెను. శుద్ధమాస ప్రారంభమున ధ్వజారోపణమును, నింబకుసుమ భక్షణమును, నూతన సంవత్సర ఫలశ్రవణమును, వసంతనవరాత్రారంభమును జరుగవలెను.

## 3. శ్రీమత్స్య జయన్తి:

చైత్రమాసమున శుక్ల పక్షమునందు తృతీయాతిథి

యొక్క అపరాహ్ణసమయమునందు భగవంతుడు ధర్మరక్షణార్థమై దశావతారములలో మొదటిదియగు మత్స్యావతారమును స్వీకరించెను. అందుచేత తదుపాసకులగువారు చైత్ర శుద్ధ తృతీయాదినమున అపరాహ్ణసమయమునందు మత్స్యభగవానుని పూజించెదరు. కొందరు చైత్రశుక్ల పంచమీ దినమున భగవంతుడు మత్స్యావతారమును స్వీకరించెను అని చెప్పుచున్నారు.

## 4. శ్రీరామనవమి - శ్రీరామస్వామివారి ఆస్థానం:

చైత్రమాసమునందు శుక్లపక్ష నవమీ దినమున జరుగును. మహర్షికులశేఖరుడగు వాల్మీకి మహర్షి శ్రీమద్రామాయణమున

"తతశ్చ ద్వాదశేమాసే చైత్రే నావమికే తిథౌ।
నక్షత్రేఽదితిదైవత్యే స్వోచ్చసంస్థేషు పంచసు॥
గ్రహేషు కర్కటే లగ్నే వాక్పతావిందునా సహ।
ప్రోద్యమానే జగన్నాథం సర్వలోక నమస్కృతమ్।
కౌసల్యాఽజనయద్రామం సర్వలక్షణ సంయుతమ్॥"

"శ్రీ మహావిష్ణువు లోకరక్షణార్థమై దశావతారములలో సప్తమావతారమగు శ్రీరాముడుగా చైత్ర శుక్లనవమీ దినమునందు పునర్వసు నక్షత్రముతో కూడిన కర్కట లగ్నమున మధ్యాహ్న సమయమునందు గ్రహపంచకము ఉచ్చస్థితియందుండ మేషమాసమున గురుచంద్ర సమావేశమునందు జననమొందెను." అని చెప్పుచున్నాడు.

మహర్షి శ్రీరామ జననసమయమునందు రవి, గురు, చంద్ర, శని, కుజ, శుక్రస్థానములను తన శ్రీసూక్తిచే

ప్రబోధించినను, బుధ, రాహు, కేతువులను గూర్చి చెప్పకపో వుటచేత కొందరు జ్యోతిశ్శాస్త్రవేత్తలు శాస్త్రపర్యాలోచనముచేసి బుధ, రాహు, కేతువుల స్థానములతోను, విశేషములతోను చేర్చి ఇటుల చెప్పుచున్నారు.

చైత్ర శుద్ధ నవమీ శుభదినమున రవి, గురు, శని, కుజ, శుక్రగ్రహములు తమకు ఉచ్చస్థానములగు మేష, కర్కట, తులా, మకర, మీనములయందుండగా చంద్రుడు స్వక్షేత్రమగు కర్కటమందుండగా బుధుడు తనకు నీచస్థానమగు మీనమందుండగా పునర్వసు నక్షత్ర చతుర్థ చరణమున కర్కట లగ్నమునందు శ్రీరామచంద్రుడు జననము నొందెను.

| | | | |
|---|---|---|---|
| శు బు | ర | | |
| కే | జననకాల | | ల గు చం |
| కు | రాశిచక్రము | | రా |
| | | శ | |

| | | | |
|---|---|---|---|
| శు శ | | కే | ర కు |
| | జననకాల | | చం |
| | అంశచక్రము | | గు |
| | రా | బు | ల |

## జననకాల గ్రహసంచారము:

| | | |
|---|---|---|
| అశ్వనీ | 3 | చరణే, మేషే ఉచ్చస్థానస్థో రవిః |
| పునర్వసు | 4 | చరణే, కర్కటే స్వక్షేత్రస్థ శ్చంద్రః |
| శ్రవణ | 3 | చరణే, మకరే ఉచ్చస్థానస్థః కుజః |
| ఉత్తరాభాద్రా | 4 | చరణే, మీనే నీచస్థానస్థః బుధః |

| | | |
|---|---|---|
| పుష్యమీ | 1 చరణే, | కర్కటే ఉచ్ఛస్థానస్థః గురుః |
| రేవతీ | 4 చరణే, | మీనే ఉచ్ఛస్థానస్థ శ్శుక్రః |
| స్వాతీ | 4 చరణే, | తులాయాం ఉచ్ఛస్థానస్థ శ్శనిః |
| పూర్వఫల్గునీ | 4 చరణే, | సింహే రాహుః |
| పూర్వాభాద్రా | 2 చరణే, | కుంభే కేతుః |

| | |
|---|---|
| జననకాల గురుమహాదశా వర్షములు | 16 |
| గర్భభుక్తి వర్షములు | 12 |
| ఏష్య వర్షములు | 4 |
| శనిమహాదశా వర్షములు | 19 |
| మొత్తము | 23 |
| బుధమహాదశా వర్షములు | 17 |
| బుధమహాదశా పూర్తి | 40 |

24 నుండి 40 వరకు నీచస్థితియందున్న బుధుని యొక్క మహాదశయందు శ్రీరామునకు రాజ్యభ్రంశాదులు, వనవాసాదులు జరుగవచ్చును అని అభిప్రాయపడుచున్నారు.

24 నుండి 40 వరకుగల బుధమహాదశయందు శ్రీరామునకు అవతార ప్రయోజనమగు అసంఖ్యాకులైన సాధు జనుల సమ్మానన పరిరక్షణాదులు, అసంఖ్యాకులైన లోకకంట కులగు రాక్షసాది మహావీరుల విజయాదులు, రాజ్య ప్రదానములు, సన్మిత్రలాభము, రాజ్యపట్టాభిషేకాదులు,

దిగంత విశ్రాన్త కీర్తిలాభాదులు లభించుటచేతను వాల్మీకి మహర్షి బుధునియొక్క నీచస్థితిని చెప్పకపోవుటచేతను, బుధుడు రవికి పూర్వ, ఉత్తర, సహసంచార స్వభావము కలవాడగుటచేతను, రాజ్యస్థానమగు మేషమందుండవచ్చును లేక లాభస్థానమగు వృషభమందుండవచ్చును. అని కొందరు శాస్త్రవేత్తలు అభిప్రాయపడుచున్నారు.

శ్రీరామావతార కాలవిమర్శకులు వాల్మీకి మహర్షిచే చెప్పబడిన మాస, పక్ష, తిథి, నక్షత్ర లగ్నాదుల నంగీకరించుచూ యే సంవత్సరము, యే యుగము, యే మన్వంతరము అనునంత వరకు మాత్రమే వెళ్ళి వితర్కించి వైవస్వతమన్వంతరము, త్రేతాయుగము, విలంబి సంవత్సరము అని నిర్ణయించుచున్నారు.

ఆ విమర్శకులలో కొందరు త్రేతాయుగ విషయములో మాత్రము యే త్రేతాయుగము అని వితర్కించుచూ భేదాభిప్రాయములు పడుచున్నారు.

సృష్టి అనాదియగుటచే ఒక సృష్టి సమయమునుంచి దేవమానముచేత నూరు సంవత్సరములు ఆయుఃప్రమాణము గల ఆరుగురు బ్రహ్మలు ఇప్పటికి గడచిపోగా సప్తమ బ్రహ్మయగు పద్మజుడు అను బ్రహ్మకు తనుచేయు సృష్టి కార్యములో యేబది సంవత్సరముల పరిమాణముగల ప్రథమ పరార్థము గడచి అంత పరిమాణముగల ద్వితీయ పరార్థములో మొదటి సంవత్సరము, మొదటి మాసము, మొదటి దినములో పగటిభాగమున ఉదయము నుంచి 13 పదమూడు ఘడియల (42) నలుబదిరెండు విఘడియల సమయముగా నున్నది.

ఈ పగటి భాగములోని 13 ఘడియల 42 విఘడియల సమయములోపల (71) డెబ్బదియొక్క మహాయుగముల పరిమాణము కలిగినట్టి (మహాయుగము అనగా కృతయుగము, త్రేతాయుగము, ద్వాపరయుగము, కలియుగము అను నాలుగు యుగముల మొత్తము). మన్వంతరములు ఆరుగడచి యేడవది యగు వైవస్వతమన్వంతరములో (27) ఇరువదియేడు మహాయుగములు గడచి (28) ఇరువదియెనిమిదవ మహాయుగము నడుచుచున్నది. ఈ మహాయుగములో కృతయుగము, త్రేతాయుగము, ద్వాపరయుగము గడచి కలియుగములో నిప్పటికి 5077 సంవత్సరములు గడిచినవి అని జ్యోతిశ్శాస్త్రవేత్తలు నిర్ణయించుచున్నారు.

అందుచే నీ వైవస్వతమన్వంతరములోనే 28 త్రేతాయుగములు గడచినవి. కాన యే త్రేతాయుగములో శ్రీరామావతారము అను విషయములో కొందరు విమర్శకులు "ఈవైవస్వత మన్వంతరములో 5 అయిదవ మహాయుగమునందు గడచిన త్రేతాయుగమున నాల్గవ భాగమున ముప్పదివేల సంవత్సరములుండుతరి విలంబిసంవత్సర చైత్రశుద్ధనవమీ సౌమ్యవాసరమున మధ్యాహ్నము కర్కటక లగ్నమున శ్రీరాముడు అవతరించెను" అని చెప్పుచున్నారు.

మరికొందరు విమర్శకులు – "వర్తమాన సృష్టికాలమునందు స్వాయంభువ మన్వంతరాదిగా యేడు మన్వంతరములలో నేటికి 454 త్రేతాయుగంబులు గడిచెను. ఇందులో యే త్రేతాయుగములో శ్రీరామావతారము" అని వితర్కించి

"త్రేతాయుగే చతుర్వింశే"

"చతుర్వింశే యుగే రామః"

"చతుర్వింశే యుగే రామః"

"చతుర్వింశే యుగే చాపి"

ఇత్యాది వాయుపురాణ, స్కాందపురాణ, మత్స్యపురాణాది వచనముల సాహాయ్యముచే – "ఈ యేడవది యగు వైవస్వత మన్వంతరములోని (24) ఇరువది నాల్గవ మహాయుగమునందలి త్రేతాయుగము (6 X 71 = 426 + 24 = 450 ఈ సృష్ట్యాది త్రేతాయుగము) యొక్క అంతిమ భాగమున విలంబినామ సంవత్సర చైత్రశుద్ధ నవమీ బుధవాసరంబున పునర్వసు నక్షత్రంబున అభిజిత్ ముహూర్తంబునందు కర్కాటక లగ్నంబున శ్రీరాముడు అవతరించెను" అని చెప్పుచున్నారు.

మరికొందరు విమర్శకులు–

"ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే"

అను గీతావచన సాహాయ్యముచే "ఈ వైవస్వతమన్వంతరము నందలి ఈ 28వ మహాయుగములోని త్రేతాయుగము నందు మహర్షిచే చెప్పబడిన సమయమున శ్రీరాముడు అవతరించెను" అని చెప్పుచున్నారు.

ఈ విమర్శన పద్ధతి విజ్ఞాన నైపుణ్య ప్రబోధకమగుచున్నది కాని "తర్కాऽప్రతిష్ఠానాత్" అను వ్యాససూత్రమునకు గురియగుచున్నది. సిద్ధపరమార్థ బోధనములోగాని పరమార్థ సంపాదనములో గాని వాల్మీకి మహర్షి శ్రీసూక్తియే సాహాయ్య మొనరించుచున్నది.

లిఖించతగిన ఆ శ్రీరామజనన సమయములో కూడా చైత్ర మాసమునందు మేషమాసము అనుకూలముగా లభించకను, నవమీతిథి యందు పునర్వసునక్షత్రము లభించకను, ఉచ్చ గ్రహపంచకము లభించకను, గురుచంద్ర సమావేశము లభించకను, విజ్ఞానసంపన్నులగు మన పూర్వుల ఆచారముల ననుసరించి కొందరు తిథి ప్రాధాన్యమును పురస్కరించుకుని చైత్రశుక్ల నవమీ దినమునందును, మరికొందరు నక్షత్ర ప్రాధాన్యమును పురస్కరించుకుని చైత్రశుక్లమున పునర్వసు నక్షత్రము నందును, మరికొందరు మేషమాస ప్రాధాన్యమును పురస్కరించుకుని మేష మాసమున శుక్లనవమీ దినమునందును మరి కొందరు మేష మాసమున పునర్వసు నక్షత్రమునందును, శ్రీరామావతార సమయోత్సవ వ్రత పూజనాదులను జరుపుకొనుచు కృతార్థులగుచున్నారు.

మాస, పక్ష, తిథి, నక్షత్ర, లగ్న, సమయ, ఉచ్చ గ్రహపంచక గురుచంద్ర సమావేశాది సర్వగుణములతో కూడిన దినము నందు శ్రీరామావతారోత్సవ, వ్రత, పూజనాదులు చేయతగియున్నను చేయుదమన్నను ఇప్పుడు అట్టి సర్వగుణ విశిష్టమగు దినము దుర్లభమగుటచే శ్రీరామావతారోత్సవ వ్రత పూజనాదికము లేకపోవలసివచ్చును.

అందుచే శ్రీరామభక్తి నిష్ఠాగరిష్ఠులై విజ్ఞాన సంపన్నులగు మన పూర్వులు త్రేతాయుగ ప్రత్యక్షదైవమగు శ్రీరామచంద్రుని అవతారోత్సవమును కలియుగ ప్రత్యక్షదైవమగు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధానమును ''చైత్రే నావమికే తిథౌ'' అను వాల్మీకి మహర్షి శ్రీసూక్తి ననుసరించి చైత్ర

మాసమున శుక్ల పక్షమునందలి నవమీ తిథి యందు యేర్పాటు చేసిరని తలంచవలసియున్నది.

అందుచే ప్రతి సంవత్సరము చైత్రమాసమునందు శుక్లపక్షమున అష్టమీ వేధములేని నవమీ దినమునందు శ్రీరామస్వామి వారికి అవతార వైభవోత్సవము ఆస్థానము అతివైభవముగా జరుగును.

## 5. శ్రీరామపట్టాభిషేకము - ఆస్థానము:

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధానమున చైత్ర శుద్ధ దశమీ దినమునందు శ్రీరామపట్టాభిషేక మహోత్సవము అతి వైభవముగా జరుగును.

శ్రీరామకాల విమర్శకులలో కొందరు పూర్వము ధాతృ సంవత్సర చైత్రశుద్ధ సప్తమీ గురువారం పుష్యనక్షత్రయోగము నందు శ్రీరామపట్టాభిషేకము జరిగెననియు,

మరికొందరు యువసంవత్సర ఆశ్వయుజ కృష్ణపక్షము నందు పుష్య నక్షత్రముతో కూడిన సప్తమీ దినమునందు శ్రీరామపట్టాభిషేకము జరిగెననియు విభేదముగా నభిప్రాయపడుచున్నారు.

### కాల విభాగము

శ్రీరాముడు విలంబి సంవత్సర చైత్ర శుద్ధ నవమీ శుభ దినము నందు జననమొందెను.

8వ సంవత్సరము పరాభవ చైత్రమున - ఉపనయనము

12వ సంవత్సరము సౌమ్యఫాల్గుణమున – సీతావివాహము

24వ సంవత్సరమునకు – అయోధ్యా నగరమునందు సీతామహాదేవితో సుఖవాసము

దుందుభి చైత్ర శుక్ల దశమీ – శ్రీరాముని వనవాస ప్రయాణ దినము అని కొందరి అభిప్రాయము.

దుందుభి చైత్ర శుక్ల పంచమీ – వనవాస ప్రయాణ దినము అని అనేకుల అభిప్రాయము.

దుందుభి చైత్ర శుక్ల పంచమీ దినము రాత్రి – సరయూ తీరవాసము

దుందుభి చైత్ర శుక్ల షష్ఠీ దినమున – గంగాతీరవాసము, గుహ సమావేశము

దుందుభి చైత్ర శుక్ల సప్తమీ దినమున – జటాధారణము, గంగాతరణము, వనస్పతివృక్ష మూలవాసము

దుందుభి చైత్ర శుక్ల అష్టమీ దినమున – భారద్వాజాశ్రమ ప్రవేశం

దుందుభి చైత్ర శుక్ల నవమీ దినమున – యమునా తీరవాసము

దుందుభి చైత్ర శుక్ల దశమీ దినమున – చిత్రకూట ప్రవేశము

ఆ చిత్ర కూటమున –24 దినములు నివసించిరి అని కొందరు

34 దినములు నివసించిరి అని కొందరు

40 దినములు నివసించిరి అని కొందరు

10 1/2 మాసము నివసించిరి అని కొందరు

విభేదముగా నభిప్రాయపడుచున్నారు.

తరువాత చిత్రకూటమును వదలి దండకారణ్యములో అత్ర్యాదిమహర్షుల ఆశ్రమములయందు క్రమముగా నివసించుచూ పది సంవత్సరములు గడపి సీతారామలక్ష్మణులు పంచవటికి చేరిరి.

ఆ పంచవటియందు 14వ సంవత్సరమగు యువ చైత్రము వరకు సీతారామలక్ష్మణులు నివసించియుండిరి.

| | |
|---|---|
| యువ చైత్ర మాసమున | – సీతాపహారము అని కొందరు |
| యువ జ్యేష్ఠ మాసమున | – సీతాపహారము అని కొందరు |
| యువ వైశాఖ మాసమున | – సుగ్రీవసమావేశము |
| యువ ఆషాఢ మాసమున | – వాలివధము |
| యువ మార్గశీర్ష మాసమున | – సీతాన్వేషణము |
| యువ ఫాల్గుణ శుద్ధత్రయోదశి | – ఆంజనేయుని సముద్రలంఘనము, సీతాసంభాషణము. |
| యువ ఫాల్గుణ శుద్ధ చతుర్దశీ | – లంకాదహనము |
| యువ పూర్ణిమా | – శ్రీరాముని దండయాత్ర |
| యువ బహుళ 1, 2, 3 దినములు | – సముద్ర తీరము నందు దర్భశయనము. |

| | |
|---|---|
| యువ 4, 5, 6, 7, 8 దినములు | సేతుబంధము |
| యువ అష్టమీ దినమున | లంకాప్రవేశము |
| యువ బహుళామావాస్యా | రావణవధము |
| ధాతృ చైత్ర శుద్ధప్రతిపత్ | రావణసంస్కారము |
| యువ ద్వితీయా | విభీషణ పట్టాభిషేకము |
| యువ తృతీయా | సీతాసమావేశము |
| యువ చతుర్థీ | కిష్కింధావాసము |
| యువ పంచమీ | భారద్వాజాశ్రమవాసము |

''పూర్ణే చతుర్దశే వర్షే పంచమ్యాం లక్ష్మణాగ్రజః।
భారద్వాజాశ్రమం ప్రాప్య వవందే నియతో మునిమ్॥''

అను వాల్మీకి మహర్షి శ్రీసూక్తి శ్రీరాముని వనవాసాన్త దినమును తెలియజేయుచున్నది.

ఆ శ్రీసూక్తి ననుసరించి కొందరు విమర్శకులు

ధాతృ చైత్రశుద్ధ పంచమీ దినమును వనవాసాన్తదినము నుగా నిర్ణయించి ఆ పంచమీ దినమున భారద్వాజాశ్రమమునకు చేరిరి అనియు,

ఆ శ్రీసూక్తిననుసరించియే మరికొందరు విమర్శకులు

వనవాసకాలమగు పదునాలుగు సంవత్సరములను అధిక మాసములతో లెక్కించి, యువ సంవత్సర ఆశ్వయుజ బహుళ పంచమీ దినమును వనవాసానమగు పంచమీదినమునుగా

నిర్ణయించి ఆ పంచమీ దినమున భారద్వాజాశ్రమమును చేరిరి అనియు పరస్పరము విభేదముగా నభిప్రాయపడుచున్నారు.

ఇంతియేకాక చాలామంది విమర్శకులు శ్రీరాముని వన వాస సంచార ప్రారంభములోని భారద్వాజాశ్రమ ప్రవేశకాలము నకు వనవాసాన్తములోని భారద్వాజాశ్రమ ప్రవేశకాలమునకు మధ్యగల వనసంచారకాలములో పరస్పరము భేదాభిప్రాయములు పడుచూ, శ్రీరామాయణ వ్యాఖ్యాతలతో వ్యతిరేకించుచూ వనవా సాన్తదినముగా మహర్షి చేత నిర్దిష్టమైన పంచమీదినముతో నందరు స్వాశయానుగుణముగా సమన్వయమును చేయుచూ స్వాభిమతార్థసిద్ధిని పొందుచున్నారు.

యువసంవత్సర ఆశ్వయుజబహుళ పంచమీ దినము నందు భారద్వాజాశ్రమమును ప్రవేశించిరి. అనువారు

షష్ఠీదినమున – నందిగ్రామప్రవేశము, జటాశోధనము,
అయోధ్యాపుర ప్రవేశము.

ఆశ్వయుజ బహుళ సప్తమీ పుష్య నక్షత్రమునందు –
శ్రీరామపట్టాభిషేక మహోత్సవము
అని నిర్ణయించుకున్నారు.

ధాతృచైత్ర శుద్ధ పంచమీ దినమున భరద్వాజాశ్రమమును ప్రవేశించిరి. అను పెక్కండ్రు విమర్శకులు.

షష్ఠీదినమున – ఉదయం నంది గ్రామ ప్రవేశము,
జటాశోధనము సాయంకాలము
అయోధ్యా ప్రవేశము.

చైత్ర శుద్ధ సప్తమీ గురువారం పుష్యనక్షత్రమునందు - శ్రీ సీతారామ పట్టాభిషేక మహోత్సవము. అని నిర్ణయించుచున్నారు.

శ్రీరాముడు పితృభక్తియుక్తుడై, ధర్మబద్ధుడై చతుర్దశవర్ష వనవాసదీక్షను పరిపూర్తి యొనరించుకొని చైత్రశుద్ధ పంచమీ దినమున మహర్ష్యాశీర్వచనాభిలాషచే భారద్వాజాశ్రమమును ప్రవేశించియుండవచ్చును ఆ శ్రీరాముడు భ్రాతృభక్తియుక్తుడై రాజ్య తృష్ణాపరాఙ్ముఖుడై

శ్లో॥ ''చతుర్దశే హి సంపూర్ణే వర్షేఽహని రఘూత్తమ।
నద్రక్ష్యామి యది త్వాం తు ప్రవేక్ష్యామి హుతాశనమ్॥'' ఇతి.

తా॥ రఘూత్తమ! చతుర్దశవర్ష వనవాసాన్త దినమున నేను నిన్నుచూడనేని అగ్నిని ప్రవేశించెదను అని ఘోర ప్రతిజ్ఞకావించిన భరతునియందలి ప్రేమపారవశ్యముచే షష్ఠీదినమైనను భారద్వాజాశ్రమమునుండి నందిగ్రామమును ప్రవేశించినను ప్రవేశించి యుండవచ్చును కాని, ఆనాడు పంచమీదినమున వనవాసము ప్రారంభించియు దీక్షాధారణరూపమగు జటాధారణమును చైత్ర శుద్ధషష్ఠిదినమున యుక్తము కాదని మానివేసి మరుదినమగు సప్తమీ దినమున దీక్షాధారణరూపమైన జటాధారణమును చేసిన శ్రీరాముడు ఈనాడు షష్ఠీదినమున జటావిశోధనరూపమగు దీక్షావిసర్జనము చేయుట యుక్తము కానేరదు.

చిరకాల విప్రోషితుడగు నా శ్రీరాముడు నందతిథి యగు షష్ఠీ దినమున స్వనివాసభూతమగు అయోధ్యా నగరము

నందు సీతాలక్ష్మణులతో ప్రవేశించుటయు యుక్తము కానేరదు.

చిరకాల విప్రోషితుడై చతుర్దశ వనవాసదీక్షను పూర్తి యొనరించుకొని, అసంఖ్యాకులైన సాధువులగు మహర్షులను సన్మానించియు, అసంఖ్యాకులైన దుష్టులగు రాక్షసాదులను సంహరించియు, త్రిభువన విశ్రాన్తకీర్తి నార్జించి విజయలక్ష్మితో మహారాజ, మహావీర పరివారములతో దిక్పాల విమానము నధిష్ఠించి నందిగ్రామమున కేతెంచిన శ్రీరామచంద్రుని, సీతను, లక్ష్మణుని, రాజభార్యలు, రాజబంధువులు, నారీమణులు, మిత్రులు, మహర్షులు, మహారాజులు, గురువులు, వీరులు, పౌరులు, పెద్దలు, వేలకువేలవుంది సన్మానించవలసిన సమయము, సల్లాపించవలసిన సమయము, సందర్శించవలసిన సమయము అగుటచే నా దినము ఇతరముల కవకాశము కలది యున్నా కానేరదు.

మరు దినమగు చైత్ర శుద్ధసప్తమీ దినము జ్యోతిశ్శాస్త్రము ననుసరించియు, అనుభవము ననుసరించియు పుష్య యోగము లేనిదగుటచే నా దినమున శ్రీరామ పట్టాభిషేకము యుక్తము కానేరదు.

ఇతరములగు జటావిశోధనము, అయోధ్యాపుర ప్రవేశము, పట్టాభిషేక మంగళసన్నాహ ప్రారంభముగా ఆహ్వాన పుర పరిష్కారాదులు, యుక్తములు అగుచున్నవి.

అష్టమీ నవమీ దినములు పట్టాభిషేకమునకు యుక్తములు కానివై పట్టాభిషేక సన్నాహమునకు అవకాశదినములగుచున్నవి.

అందుచే చైత్ర శుద్ధ దశమీ దినము అన్నివిధముల అవకాశముకలది యగుచున్నది.

జ్యోతిశ్శాస్త్రము ననుసరించియు, అనుభవము ననుసరించియు పుష్యయోగమున కవకాశము కల దినమగుటచేతను, పూర్ణ తిథి యగుటచేతను చైత్ర శుద్ధ దశమీ దినమున పుష్య యోగమునందు మహావైభవముగా శ్రీసీతారామ పట్టాభిషేక మంగళము జరిగెను అని నిర్ణయించవలసియున్నది.

పక్షాన్తరములో కూడా వాల్మీకి మహర్షి, పంచమీ దినమున వనవాసపూర్తిని చెప్పినటుల సప్తమీ దినమునగాని, పుష్యయోగమునగాని, పట్టాభిషేకమును చెప్పుటలేదు.

భరతుడు మాతుల గృహమునందుండగా స్వదత్త వర భీతుడైన దశరథుడు వేగిరపాటుతో శ్రీరామునకు యౌవరాజ్య పట్టాభిషేకముచేయ తలంచి. కేకయరాజును ఆహ్వానించక కొంత మంది ఇతర రాజుల నాహ్వానించి వారలతోను, శ్రీరామ పట్టాభిషేకదర్శన కాముకులగు పౌరులతోను మంతనము చేసి "శ్వః" రేపే పుష్యయోగమున పట్టాభిషేకము అని నిశ్చయించియు, ఉపయోగించని ఆ పుష్యయోగమును సర్వదా అనుసరించవలయును. అను నియమమున్నూ లేదు.

షష్ఠీ దినమున సాయంకాలము అయోధ్యాపురమున ప్రవేశించిన శ్రీరామునకు సప్తమీ దినమున పుష్యయోగమున్నను, అంగీకారమున్నను పట్టాభిషేక మంగళము జరుగుటకు అవకాశమున్నూ లేదు.

శ్లో॥ "తత స్తయో రభిషేకమంగళం మైత్రేయ వర్షశతేనాపి
వక్తుం నశక్యతే సంక్షేపేణ శ్రూయతామ్॥" ఇతి॥

పరాశరమహర్షి

శ్రీ సీతారామపట్టాభిషేక మంగళమును నూరుసంవత్సరములకైనను చెప్పవీలుండదు సంక్షేపముగా వినుము:

"స్వానుజ, రాక్షసరాజు, వానరరాజు, మహావీరులచేత సేవింపబడు చుండగా, బ్రహ్మేంద్రాది సర్వామరులచేతను, వసిష్ఠ వామదేవాది సకలమునివరులచేతను. సకలవేదముల చేతను స్తోత్రము చేయబడుచుండగా, అఖిలమంగళవాద్యములు మధురముగా మ్రోయుచుండగా, సకల నృత్తగీత వాద్యములు జరుగుచుండగా, సకల మహారాజుల మధ్యమునందు సకలలోక రక్షణార్థము శ్రీరాముడు అభిషిక్తుడయ్యెను." అని మైత్రేయనితో చెప్పెను.

అందుచే నీ సీతారామపట్టాభిషేక మంగళమునకు ప్రధాన పాత్రములగు దేవతలు, మహర్షులు, మహారాజులు మొదలగు సకలమైన వారల ఆహ్వానములు, ఆగమనములు, విచిత్ర పుర పరిష్కారాదులు, సర్వవిధ నృత్తగీత, వాద్యసముదాయములు, వీతరాగుడగు మహర్షికి కూడా విస్మయనీయము, అనిర్వచనీయము అగు సీతారామ పట్టాభిషేక మంగళవైభవసంపత్తి సప్తమీదినమున ఉదయము లభించనేరదు.

అందువలన సప్తమీదినము పట్టాభిషేకవైభవ సంపాదన ప్రారంభదినమగుచుండ అష్టమీ నవమీ దినములు ఆ వైభవ సంపాదనమున కవకాశదినములగుచుండ వాసంతిక చైత్ర శుద్ధ దశమీ దినము పూర్ణ తిథి యగుటయేకాక, మహారాజు పట్టాభిషేకానుకూలమగు విజయదశమీ శ్రేణిలోచేరి రాజపట్టాభిషేక దినమగుచుండ ఆ చైత్ర శుద్ధ దశమీ దినమున విజయ

ముహూర్తమునందు, విజయలక్ష్మీ సమేతుడైన శ్రీరామచంద్రునకు వీర్యశుల్కయగు శ్రీసీతామహాలక్ష్మితో, అయోధ్యానగరమునందు పట్టాభిషేకమంగళమును శ్రీరామభక్తిభరితుడగు భరతుడు తన కోరికతీర జరిపెను.

అట్టి అభిప్రాయముతో విజ్ఞాన సంపన్నులగు మన పూర్వులు శ్రీస్వామివారి సన్నిధానమున శ్రీసీతారామ పట్టాభిషేక మహోత్సవమును చైత్ర శుద్ధ దశమీ దినమున ఏర్పాటుచేసిరి అని తలంచవలసి యున్నది.

అనుదినము శ్రీ సీతారామపట్టాభిషేకమహోత్సవము జరిగినను సకల ఫలప్రదాయకము, పరమానందదాయకము అగుటలో ఆక్షేపమేమియు యుండనేరదు.

## 6. శ్రీ వేంకటేశ్వరస్వామివారికి వసంతోత్సవము:

1. చైత్ర శుద్ధ త్రయోదశీ దినమున శ్రీవేంకటేశ్వర స్వామి వారికి, 2. చైత్ర శుద్ధ చతుర్దశీ దినమున శ్రీవారికి (రజత రథోత్సవము విశేషము), 3. చైత్రపూర్ణిమాదినమున శ్రీవారికి, శ్రీ కృష్ణస్వామివారికి, శ్రీ కోదండరామస్వామివారికి వసంతోత్సవము జరిగి ఆ మహోత్సవము పూర్తియగును.

## 7. తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారికి పొన్నకాలువ ఉత్సవము:

చైత్ర శుద్ధ ద్వాదశి దినమున బుగ్గోత్సవము శ్రీస్వామి వారికి ప్రారంభమై, త్రయోదశీ చతుర్దశీ ఈ మూడు దినములు బుగ్గోత్సవములు జరిగి చైత్ర పూర్ణిమా దినమున పొన్నకాలువ ఉత్సవము అతివైభవముగా జరుగును.

## 8. మేషసంక్రమణము:

సూర్యుడు మేషాది ద్వాదశరాశులలో మొదటిదియగు మేషరాశియందు ప్రవేశించు సమయము. ఆ ప్రవేశించు సమయమునకు పూర్వము నందు 6 గంటల కాలము, పరమునందు 6 గంటల కాలము విషువపుణ్యకాలముగా తెలియవలెను.

ఈ మేషసంక్రమణము రాత్రి పూర్వభాగమున జరిగిన పూర్వ దినముయొక్క ఉత్తరభాగము పుణ్యకాలము. ఉత్తరభాగమున జరిగిన ఉత్తరదినము యొక్క పూర్వభాగము పుణ్యకాలము. నిశీథమందు జరిగినదినద్వయమునందును పూర్వదిన ఉత్తర భాగము ఉత్తరదిన పూర్వభాగము పుణ్యకాలము.

ఈ రాత్రి పుణ్యకాల నిర్ణయము మకర కటక సంక్రమణములకు కాక తక్కిన రాశిసంక్రమణములయందు తెలియదగియున్నది.

## 9. సౌరసంవత్సరాది:

ఈ మేష సంక్రమణదినము దాక్షిణాత్యులకు సంవత్సరాది పండుగ. దీనియందు అనేక వేడుకలు జరుగును.

## 10. శ్రీభాష్యకారులవారి శాత్తుమొర:

శ్లో॥ "మేషార్ద్రా సంభవం విష్ణో ర్దర్శన స్థాపనోత్సుకమ్।
తుణ్డీరమండలే శేషమూర్తిం రామానుజం భజే॥"

శ్రీ వైష్ణవసిద్ధాన్తనిర్ధారణధురంధరుడై శ్రీభాష్యము నను గ్రహించిన శ్రీరామానుజాచార్యులవారు తుణ్డీర మండలమునందు

పింగళనామ సంవత్సర చైత్ర శుద్ధ పంచమీ గురువారము ఆర్ద్రా నక్షత్రముతో కూడిన కటక లగ్నమునందు మేషమాసమున శేషాంశముచే అవతరించిరి. అందుచే మేషమాసమున ఆర్ద్రా నక్షత్రమునందు శాత్తుమొరను నిశ్చయించి ఆ దినముతో కూడిన పదవ దినమునందు ముందుగా శ్రీభాష్యకారులవారికి ఉత్సవములు ప్రారంభించి చేయుచూ పదవ దినమున ఆర్ద్రా నక్షత్రమున శాత్తుమొర జరిపెదరు.

## 11. శ్రీరామజయన్తి:

మేషమాసమునందు పునర్వసు నక్షత్రమున మధ్యాహ్న సమయమునందు శ్రీరామావతార పూజనము చేయుట.

తిథి ప్రాధాన్యముచే పూజనము జయా అనియు, నక్షత్ర ప్రాధాన్యముచే పూజనము జయన్తి అనియు కొందరి మతము. మధ్యాహ్న సమయమున పూజనము జయా అనియు, నిశీథసమయమునందు పూజనము జయన్తి అనియు కొందరి మతము.

చైత్ర శుద్ధ నవమీ తిథియందు మధ్యాహ్నమున శ్రీరామ పూజనము, శ్రీరామజయన్తి అని వైదిక సార్వభౌముడు మొదలగు నిబంధనకారులు చెప్పుచున్నారు.

## 12. శ్రీముదలియాండాన్ వర్ష తిరునక్షత్రము:

శ్లో॥ ''మేషే పునర్వసు దినే పాంచజన్యాంశ సంభవమ్।
యతీంద్ర పాదుకాభిఖ్యం వందే దాశరథిం గురుమ్॥''

శ్రీయతీంద్ర పాదుకానామమును ధరించిన ఈ దాశ రథుల వారు మేషమాసమునందు పునర్వసు నక్షత్రమున పాంచజన్యాంశముచే జననమొందిరి. అందుచే వీరికి మేషమాస మునందు పునర్వసు నక్షత్రమున వర్షతిరునక్షత్రము జరుగు చుండును.

## 13. శ్రీమధురకవియాళ్వారు శాత్తుమొర:

శ్లో॥ ''మేషే చిత్రా సముద్భూతం పాండ్యదేశే గణాంశజమ్।
శ్రీపరాంకుశ సద్భక్తం మధురం కవిమాశ్రయే॥''

ఈ మధురకవి యాళ్వారు పాండ్యదేశమునందు గణాం శముతో పరాంకుశమునికి భక్తుడుగా మేషమాసమునందు చిత్రా నక్షత్రమున జననమొందిరి. అందుచే మేషమాసమున చిత్రానక్ష త్రమున శాత్తుమొర సంకల్పించి ఆ దినముతో కూడిన పదవ దినమున ముందుగా ఉత్సవములు ప్రారంభించి చేయుచూ ఆ దినమున శాత్తుమొర జరుపుదురు.

## 14. శ్రీ పరాశరభట్టర్ వర్ష తిరునక్షత్రము:

శ్రీ పరాశరభట్టర్ వారు చిత్రి నెల అనూరాధా నక్షత్ర మున జన్మించిరి కావున సంప్రదాయవేత్తలు వీరికి యీ దిన మున తిరునక్షత్రమును జరుపుకొనుచున్నారు.

## 15. నాగులాపురం శ్రీ వేదనారాయణస్వామివారి బ్రహ్మోత్సవము:

ఇది వైఖానస శాస్త్రప్రకారము నవాహ్నికముగా

జరుగును. మేషమాసమునందు శ్రవణ నక్షత్రమున అవభృథము జరుగునట్లు సంకల్పించి ముందుగా ఆ దినముతో కూడిన తొమ్మిదవ దినమున ధ్వజారోహణమును ఆ దినమునకు పూర్వదినమున అంకురార్పణము జరుగును. అంకురార్పణ దినముతో పది దినములు ఉత్సవములు జరుగును.

## ఉత్సవ వివరణము

| | పగలు | రాత్రి |
|---|---|---|
| 1వ దినము | | సేనాధిపతి ఉత్సవము<br>అంకురార్పణము |
| 2వ దినము | తిరుచ్చి ఉత్సవము<br>ధ్వజారోహణము | పెద్దశేషవాహనము |
| 3వ దినము | చిన్న శేషవాహనము | హంసవాహనము |
| 4వ దినము | సింహ వాహనము | ముత్యపు పందిరి వాహనము |
| 5వ దినము | కల్పవృక్షవాహనము | సర్వభూపాల వాహనము |
| 6వ దినము | పల్లకిలో మోహినీఅవతారోత్సవము | గరుడవాహనము |
| 7వ దినము | హనుమద్వాహనము<br>సాయంకాలము :<br>వసంతోత్సవము | గజవాహనము |
| 8వ దినము | సూర్యప్రభ వాహనము | చంద్రప్రభ వాహనము |
| 9వ దినము | రథోత్సవము | అశ్వవాహనము |

10వ దినము పల్లకీ ఉత్సవము<br>అవభృథోత్సవము<br>(తీర్థవారి) చక్రస్నానము — తిరుచ్చిలో ధ్వజావరోహణోత్సవం

ఇట్లుగా బ్రహ్మోత్సవము పూర్తియగును.

## 16. తిరుపతి గంగజాతర:

మేషమాసమునందు అనగా చిత్రి నెలయందు, తిరుపతి గ్రామ దేవతయగు గంగానమ్మకు నాల్గవ (అంత్య) మంగళవారము జాతర ప్రారంభమై పై మంగళవారము వరకు 7 దినములు జరుగును. ఈ మంగళవారముతో జాతర పూర్తి అగును.

## 17. వైశాఖ మాసము:

చాంద్రమానసిద్ధములగు చైత్రాది ద్వాదశమాసములలో రెండవది యగు మాసము. విశాఖానక్షత్రముతో కూడిన పూర్ణిమగల మాసమగుటచే నిది వైశాఖమాసము అని వ్యవహరింపబడుచున్నది.

## 18. భృగుమహర్షి తిరునక్షత్రము:

శ్రీ విఖనసమహర్షి శిష్యులలో ప్రథములుగ ఖ్యాతి గడించి ఆరాధనా శాస్త్రమును అనుగ్రహించిన మహనీయులు.

వీరు వైశాఖమాసమున రోహిణీ నక్షత్రమున జనన మొందిరని వైఖానసాగమం తెలుపుచున్నది. కావున వీరికి యీదినమున తిరునక్షత్రమును జరుపుచున్నారు.

## 19. శ్రీశ్రీనివాస దీక్షితులవారి తిరునక్షత్రము

అష్టాదశ కల్పసూత్ర ప్రవక్తలలో నొక్కరైన "ఆచార్య భగవాన్ మహర్షి" అని సార్థకతను బొందిన శ్రీవిఖనసమహర్షి అనుగ్రహించిన 'కల్పసూత్రము'నకు భాష్యమును రచించిన మహనీయులు దీక్షితులవారు. అయ్యది శ్రీనివాస దీక్షితీయమను పేరు ప్రఖ్యాతి గాంచినది. ఈ మహనీయుడు ఈ వైశాఖమాసమున రోహిణీ నక్షత్రమున జననమొందిరి గాన వీరికినీ యీ దినముననే తిరునక్షత్రమును జరుపుచున్నారు.

## 20. శ్రీపరశురామజయన్తి:

వైశాఖమాస శుక్ల తృతీయాదినమున మధ్యాహ్నకాలమునందు భగవంతుడు లోకరక్షణార్థమై దశావతారములలో ఆరవదియగు పరశురామావతారమును స్వీకరించెను. అందుచేతత్తదుపాసకులు ఆయా అవతార దినములందు ఆయా అవతారములను ఉపాసించెదరు.

## 21. శ్రీశంకర జయన్తి:

అద్వైతమత భాష్యకర్తలగు శ్రీ శంకరాచార్యులవారు, ఈ కలియుగములో విభవనామ సంవత్సర వైశాఖ శుద్ధ పంచమీ సోమవారము ఆర్ద్రా నక్షత్రమున జనన మొందిరి గాన, వైశాఖ శుద్ధ పంచమీ దినమున తన్మతావలంబులు శ్రీ శంకరజయన్తి అను పేరుతో భాష్యకర్తను పూజించెదరు.

## 22. శ్రీపద్మావతీశ్రీనివాసుల పరిణయమహోత్సవము

కలియుగ వైకుంఠుడని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వాడును సప్తాచలనివాస రసికుడునగు శ్రీశ్రీనివాసస్వామివారి లీలావిభూతి లోకమునకమందానంద కందళిత హృదయారవింద నిష్యంద మకరంద రసాస్వాదన లంపటచంచరీకాయమానమానసు లను జేసి అనుగ్రహింపదలచి శ్రీపద్మావతీ అమ్మవారితో కల్యాణ మహోత్సవమును జరుపుకొనినట్లు శ్రీవేంకటాచలమాహాత్మ్యము తెలుపుచున్నది.

చతుర్యుగములు కలసిన నొక మహాయుగమందురు. అట్టి మహాయుగములు 27 గతించినవి. 28వ మహాయుగమున ద్వాపరాన్తమున మహాభారత యుద్ధము పూర్తియైన పిమ్మట చంద్రవంశమునందు మిత్రవర్మయును మహారాజు తుండీర మండలమునందలి నారాయణపురమును రాజధానిగా నొనర్చి రాజ్య పారిపాలనము చేయుచుండెను. పాండ్య కన్యయగు మనోరమ నుద్వాహమాడి ఆకాశరాజు అను కుమారుని గనెను. ఆతనికి శకవంశజయగు ధరణీ దేవియను కన్యతో వివాహము కావించి రాజ్యభారము నాతని యందు నిచిమిత్రవర్మ వేంకటాద్రి పుణ్యభూములయందు తపముగావింపసాగెను.

ఏకపత్నీవ్రతస్థుడును నియమ నిష్ఠాగరిష్ఠుడునగు నాకాశ మహారాజు యజ్ఞార్థము ఆరణీ నదీతీరభూముల దున్నుచుండ పద్మగర్భమున మనోరమయగు బాలను గాంచి, 'ఈమె నా ముద్దుపట్టియే, యనుకొనగా యశరీరవాణి 'రాజా ఈమె నీ కుమార్తెయే నిజముగ సు, మనిపల్కె. నాటంగోలె నారాజదం పతులు పరమానంద సందోహముతో దైవాంశసంభూతురాలు

పద్మమునందుండుట సాక్షాత్తు లక్ష్మీదేవిగా నెంచి ''పద్మావతి''యని నామమిడి యల్లారుముద్దుగా పోషించుచుండిరి. ఆమెయు శుక్లపక్ష క్షపాకరుని వలె దినదిన ప్రవర్ధమానయై సంచరించుచుండ నాధరణీదేవి గర్భము ధరించి కుమారునిగాంచెను. వసుదానుడను పేర నాతడు ప్రఖ్యాతిగాంచెను.

ఒకనాడు పద్మావతి చెలికత్తెలతో నారామమందు విహరించుచుండ నారద మహర్షి సాక్షాత్కరించి ''అమ్మా నీవు సాక్షాత్తు లక్ష్మ్యంశసంభూతురాలవు శ్రీమన్నారాయణుని దేవేరివి కాగలదానవు. నీ సాముద్రిక లక్షణముల చూడం జూడ నాకట్ల తోచుచున్న''దని పల్కి యంతర్ధానమయ్యె.

సుకుమారియు సఖీ పరివృతయునగు అప్పద్మావతీ ఆ వనములో కొంత తడవు విహరించుచుండ శంఖచక్ర గదాధరుడును పీతాంబరధరుడును నీలమేఘశ్యాముడును ధృతోర్ధ్వపుండ్రధరుడునగుస్వామి మృగయావినోదార్థమై హయమధిరోహించి వారల వద్దకు వచ్చెను. 'ఈహోమృగమిటువచ్చినది మీరలు చూచితి రా'యని ప్రశ్నించెను. ''ఏకాన్తమున స్త్రీజనము విహరించుచుండ పరపురుషులు మృగయార్థము వచ్చుట ఆకాశరాజతనయవిహారస్థలమున సంచరించుట శిక్షార్హులు. ఇటు మృగముల వేటాడనర్హము గాదు పొం''డని వారించిరి.

అంతనా స్వామియు చిరునవ్వుతో ''అటులనా ఆమె యెవరోదెల్పిన నా స్వస్థానమునకు పోగలవాడ''ననెను. వెంటనే ఆ తలోదరి ''నేను ఆకాశరాజతనయను. మీరెవరు? పేరేమి? ఎచ్చటి వారలు?'' అని ప్రశ్నించెను. అంత తనవృత్తాంతమును దెల్పి కామమోహితుడనై యిటకరుదెంచితినని స్వామిపల్కి

చెలికత్తెలు కుపితలై పరుష భాషణముల శిలాతాడనముల వెంటాడిరి. అతి కష్టముతో కొండకుచేరి విరహ వేదనా దోదూయమానమానసుడై శయ్యపై పరుండి

'యశోదావకుళా భూత్వా వర్తతే వేంకటాచలే' అని-కృష్ణావతారమందలి యశోదాపుత్ర వాత్సల్యముచే నిట వకుళా దేవిగానవతరించి స్వామి లాలించుచుండె. ఆమె స్వామి దీనావస్థనుగ్రహించి 'నాయనా! శ్రీనివాసా! ఎవరా భాగ్యవతి? నీ హృదయపీఠినధిష్ఠించగల్గిన' దని యడుగగా శ్రీరామావతారమందలి వేదవతీ వృత్తాన్తమును సవిస్తరముగా విన్నవించెను. సీత కోరికపై ఆమెను ఈ అవతారమున పరిగ్రహింతునని మాట ఇచ్చితిని ఆమెయే ఈమె ఆకాశరాజ తనయ పద్మావతి యని దెల్పె. అంతవకుళాదేవి కుమారుని కోరిక తీర్పనెంచి నారాయణపురమునకు బయలుదేరెను. స్వామియు తనతల్లి ఈ కార్యమును సాధించునో లేదో యను సంశయముతో పులిన్దినీ వేషమున ముందుగా ధరణీదేవి యంతఃపురమునకు వెళ్ళి భవిష్యసూచనల పద్మావతీ యుదన్తమును వివరించి తిరిగివచ్చెను. తదుపరి వకుళాదేవి ధరణీదేవి వద్దకు జని శ్రీనివాసవృత్తాంతమును దెల్పెను. ఆర్య దంపతులను సంతోషముతో బృహస్పతిని రావించి విషయము విన్నవించి

కన్యాయాః జన్మనక్షత్రం మృగశీర్షమితి స్మృతమ్।
దేవస్య శ్రవణర్క్షంతు తయో ర్యోగో విచార్యతామ్॥
అని తెలుపగా-
'తయో రుత్తరఫల్గున్యాం వివాహం క్రియతామితి।'
'వైశాఖమాసే విధివత్ క్రియతామ్'-
అనిపల్కెను.

అంత నా రాజా-

''వైశాఖే శుక్ల దశమీ భృగువారే శుభేదినే
బన్ధుభిః సహ సంప్రాప్య మాముద్ధృత్య గణైస్సహ
హర్షేణ పాణిగ్రహణం కర్తవ్యం మే మనోగతమ్''

అని వర్తమానమును స్వామివారికి తెలిపెను. శ్రీ స్వామివారును 'అంగీకరోతు రాజేంద్ర కన్యాం తవ విశాంపతే' అని తమ యంగీకారము దెల్పెను.

అంత వివాహ కార్యక్రమములు సాగెను. బ్రహ్మాది దేవతలనాహ్వానించి బంధుమిత్ర సపరివార సమేతముగా గరుడ వాహనారూఢుడై స్వామివారు నారాయణపురికి వేంచేయగా చతురంగ బలములతో ప్రత్యుత్థానముచేసి ఆకాశ రాజు వైభవోపేతముగా శ్రీపద్మావతీశ్రీనివాసుల పరిణయుము జరిపించెను. ఇటుల వేంకటాచలమాహాత్మ్యము శ్రీపద్మావతీ శ్రీనివాసుల పరిణయమహోత్సవము దెల్పుచున్నది.

భవిష్యోత్తర పురాణము 9వ అధ్యాయము
వరాహపురాణము ద్వితీయభాగం 7వ అధ్యాయము.

## 23. శ్రీనృసింహ జయన్తి:

వైశాఖ శుక్ల చతుర్దశీ శనివారము స్వాతీ నక్షత్రమున ప్రదోషసమయమునందు, (అనగా సూర్యాస్తమయకాలము నందు) లోక రక్షణార్థమై భగవంతుడు దశావతారములలో నాలుగవదియగు శ్రీ నృసింహావతారమును స్వీకరించెను. అందుచే ఉదయానన్తరం త్రిముహూర్తము అనగా (6 ఘడియలు) త్రయోదశీవేధలేని చతుర్దశీ దినముయొక్క ప్రదోషసమయము

నందు శ్రీ నృసింహస్వామిని పూజించుచున్నారు. స్వాతీ నక్షత్రముతో కూడిన ఆ సమయము ముఖ్యము అనియు, శనివారముతో కూడా కూడియున్న అతిముఖ్యమనియు శాస్త్రకారులు చెప్పుచున్నారు.

## 24. శ్రీకూర్మజయన్తి:

వైశాఖమాస పూర్ణిమాదినమునందు సాయంకాలము భగవంతుడు లోకరక్షణార్థమై దశావతారములలో రెండవదియగు కూర్మావతారమును స్వీకరించెను. గాన తదుపాసకులు ఆ సమయమున కూర్మస్వామిని పూజించుచుందురు. జ్యేష్ఠ శుక్ల ద్వాదశీ దినమున అవతారమని కొందరిమతము.

## 25. శ్రీఅన్నమాచార్య జయన్తి:

వాగ్గేయకారులలో సాటి లేనివేంటి రత్నము. లలితలలితములు మృదుమధురములగు వచన రచన లిరవొందు సులలిత పదజాలముతో 32 వేల కీర్తనలతో ఏడుకొండల రాయని మేలు కొలిపిన సంగీత కళారహస్యనిధి. విద్వన్మణి శ్రీ అన్నమాచార్యులవారు వైశాఖ పూర్ణిమా దినమున విశాఖా నక్షత్రమున జన్మించిరి. కావున వీరికి ఆ దినమున జయన్తి వైభవోపేతముగ జరుపుచున్నారు.

## 26. శ్రీమహీజయన్తి:

వైశాఖమున రేవతీ నక్షత్రమున శ్రీవారి దేవేరులలో ఒకరైన భూదేవి అవతరించిరని పురాణములు చెప్పు

చున్నవి. అందువలన వారికి యీ దినమున జయన్తిని జరుపుచున్నారు.

## 27. శ్రీహనుమజ్జయన్తి:

వైశాఖబహుళ దశమీ హనుమజ్జనన సమయము, అందుచే ఆ సమయమున హనుమత్పూజనము చేయుచున్నారు.

శ్రీహనుమజ్జననము - వైశాఖబహుళ దశమీ శనివారము పూర్వాభాద్ర నక్షత్రమునందని కొందరు ప్రయోగ గ్రంథకారులు అభిప్రాయపడుచున్నారు. మూలానక్షత్రము నందని జ్యోతిశ్శాస్త్రము, అనూరాధ నక్షత్రము నందని పాంచరాత్ర శాస్త్రము ప్రబోధించుచున్నవి కాని మాసాదులను వివరించుటలేదు.

## 28. వృషభ సంక్రమణము:

సూర్యుడు మేషాది ద్వాదశ రాశులలో రెండవదియగు వృషభరాశి యందు ప్రవేశించు సమయము. ఈ ప్రవేశసమయమునకు పూర్వము 16 ఘడియలకాలము, ''అనగా (6-24) ఆరుగంటల ఇరువది నాలుగు నిమిషముల కాలము'' విష్ణుపదము అను పుణ్యకాలము. ఈ పుణ్యకాలమున స్నానదానాదికములు చేయవలసి యున్నవి.

ఈ వృషభ సంక్రమణ మాసమును వృషభమాసమనియు, వైయ్యాశిమాసము అనియు వ్యవహరించుచున్నారు.

## 29. మెయిర్ వరదరాజస్వామివారి వర్ష తిరునక్షత్రము:

శ్రీ తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయ ప్రథ

మావరణములో ఆగ్నేయ భాగమునయున్న శ్రీమెంయ్ఞ వరదరాజస్వామివారు వృషభమాసమున హస్తనక్షత్రమునందు అచ్చుటికి వేంచేసిరి గాన ఆ నక్షత్రమున వారికి తిరునక్షత్రము అను పేరుతో విశేష పూజనము జరుగును.

## 30. తిరుమల నంబివర్ణతిరునక్షత్రము:

వృషభమాసమున స్వాతీ నక్షత్రమున జననమొందిరి. వీరికి యీ దినమున తిరునక్షత్రం జరుపుకొనుచున్నారు.

## 31. శ్రీనమ్మాళ్వార్లవారి శాత్తుమొర:

''వృషభేతు విశాఖాయాం కురుకాపుర కారిణమ్।
పాణ్డ్యదేశే కలేరాదౌ శఠారిం సైన్యపం భజే॥''

ద్రావిడ వేదమును ప్రసాదించిన శ్రీనమ్మాళ్వారు కలి యుగము యొక్క ఆది భాగమున పాండ్య దేశమునందు వృషభ మాసములో విశాఖా నక్షత్రమునందు విష్వక్సేనాంశతో జననమొం దిరి. అందుచే ఆదినముతో కూడిన పదవ దినమునందు ముందుగా వారికి ఉత్సవము ప్రారంభమై పది దినములు ఉత్స వములు జరుగుచూ ఆ దినమున శాత్తు మొరజరుగును. తిరు నక్షత్ర కాలమును సంప్రదాయవేత్తలు ఇట్లు నిర్ణయించుచున్నారు.

నక్షత్రవృద్ధి సమయములో ఆ నక్షత్రము పరదినమున (12) పండ్రెండు ఘడియలు ఉండవలయును. నక్షత్రక్షయసమ యములో ఆ నక్షత్రము పరదినమున (9) తొమ్మిది ఘడియలు ఉండవలెను. షష్టిఘటికాత్మకముగా సమమగు ఆ నక్షత్ర సమయములో పరదినమందు ఆ నక్షత్రము పది

ఘడియ లుండవలయును. ఇది జన్మనక్షత్రము యొక్క సంగవ కాలవ్యాప్తిని చూచి వృద్ధి, క్షయ, సమ సమయములయందు నిర్ణయము.

## 32. శ్రీ తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవము:

వైఖానస శాస్త్రప్రకారము నవాహ్నికముగా జరుగును. వృషభ మాసమునందు అనూరాధ నక్షత్రమున అవభృథము జరుగునట్లు సంకల్పించి, ఆ దినముతో కూడిన తొమ్మిదవ దినమున ముందుగా ధ్వజారోహణము జరుగును. ఆ ధ్వజారోహణ దినమునకు పూర్వదినమున అంకురారోపణము జరుగును.

### ఉత్సవ వివరణము

| | వగలు | రాత్రి |
|---|---|---|
| 1వ దినము | | సేనాధిపతి ఉత్సవము అంకురారోపణము |
| 2వ దినము | తిరుచ్చి ఉత్సవము ధ్వజారోహణము | పెద్ద శేష వాహనము |
| 3వ దినము | చిన్న శేష వాహనము | హంస వాహనము |
| 4వ దినము | సింహవాహనము | ముత్యపుపందిరి వాహనము |
| 5వ దినము | కల్పవృక్షవాహనము | సర్వభూపాల వాహనము |
| 6వ దినము | పల్లకిలో మోహినీ అవతారోత్సవము | గరుడ వాహనము |

7వ దినము హనుమద్వాహనము
సాయంకాలము: గజ వాహనము
వసంతోత్సవము

8వ దినము సూర్యప్రభవాహనము - చంద్రప్రభ వాహనము

9వ దినము రథోత్సవము - అశ్వ వాహనము

10వ దినము పల్లకి ఉత్సవము
అవభృథోత్సవము
తీర్థవారి చక్రస్నానము - తిరుచ్చిలో ధ్వజావరోహణోత్సవము

ఇటుల బ్రహ్మోత్సవము పూర్తి అగును.

## 33. నారాయణవనం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవము:

వైఖానసశాస్త్ర ప్రకారము నవాహ్నికముగా జరుగును. వృషభమాసమునందు శ్రవణనక్షత్రమున అవభృథము సంకల్పించి ఆ దినముతో కూడిన తొమ్మిదవ దినమున ముందుగా ధ్వజారోహణమును, అందులకు పూర్వదినమున అంకురారోపణమును జరుగును. అంకురారోపణముతో పది దినముల ఉత్సవము జరుగును.

ఉత్సవ వివరణము

| | పగలు | రాత్రి |
|---|---|---|
| 1వ దినము | | సేనాధిపతి ఉత్సవము<br>అంకురారోపణము |

| | |
|---|---|
| 2వ దినము తిరుచ్చి ఉత్సవము ధ్వజారోహణము | — పెద్ద శేష వాహనము |
| 3వ దినము చిన్న శేష వాహనము | - హంస వాహనము |
| 4వ దినము సింహ వాహనము | - ముత్యపుపందిరి వాహనము |
| 5వ దినము కల్పవృక్షవాహనము | - సర్వభూపాల వాహనము |
| 6వ దినము పల్లకిలో మోహినీ అవతారోత్సవము | — గరుడ వాహనము |
| 7వ దినము హనుమద్వాహనోత్సవము సాయంకాలము: వసంతోత్సవము | — గజ వాహనము |
| 8వ దినము సూర్యప్రభవాహనము | - చంద్రప్రభ వాహనము |
| 9వ దినము రథోత్సవము | - అశ్వ వాహనము |
| 10వ దినము చూర్ణోత్సవము<br>అవభృథోత్సవము (తీర్థవారి)<br>చక్రస్నానము | — ధ్వజావరోహణము<br>ద్వాదశారాధనము<br>ఏకాంతోత్సవము |

ఇటుల బ్రహ్మోత్సవము పూర్తి అగును.

## 34. శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్ల బ్రహ్మోత్సవం, హృషీకేశ్:

శ్రీ వైఖానస భగవచ్ఛాస్త్ర ప్రకారము నవాహ్నికముగ వృషభమాసమున శ్రవణా నక్షత్రమున వీరికి అవభృథముసంకల్పించి బ్రహ్మోత్సవం జరుపుచున్నారు. అందుకు పూర్వ దినమున అంకురారోపణము. అంకురారోపణముతో పది దినములు ఉత్సవము జరుగును.

## ఉత్సవ వివరణము

| | పగలు | రాత్రి |
|---|---|---|
| 1వ దినము | — | సేనాధిపతి ఉత్సవము<br>అంకురారోపణము |
| 2వ దినము | తిరుచ్చి ఉత్సవము<br>ధ్వజారోహణము | పెద్ద శేష వాహనము |
| 3వ దినము | చిన్నశేషవాహనము | హంస వాహనము |
| 4వ దినము | సింహవాహనము | ముత్యపువందిరి వాహనము |
| 5వ దినము | కల్పవృక్షవాహనము | సర్వభూపాలవాహనము |
| 6వ దినము | పల్లకిలో మోహినీ<br>అవతారోత్సవము | గరుడ వాహనము |
| 7వ దినము | హనుమద్వాహనోత్సవము<br>సాయంకాలము | గజ వాహనము |
| 8వ దినము | సూర్యప్రభవాహనము | చంద్రప్రభ వాహనము |
| 9వ దినము | రథోత్సవము | అశ్వ వాహనము<br>కళ్యాణోత్సవము |
| 10వ దినము | చూర్ణోత్సవము<br>అవభృథోత్సవము<br>(తీర్థవారి) చక్రస్నానము | ధ్వజావరోహణము<br>ద్వాదశారాధనము<br>ఏకాంతోత్సవము |

ఇటుల బ్రహ్మోత్సవము పూర్తి అగును.

## 35. జ్యేష్ఠమాసము:

చాంద్రమాన సిద్ధములగు చైత్రాది ద్వాదశమాసములలో మూడవదియగు మాసము జ్యేష్ఠానక్షత్రముతో కూడిన పూర్ణిమ గల మాసమగుటచే నీ మాసమును జ్యేష్ఠమాసము అని వ్యవహరించుచున్నారు.

## 36. బుద్ధ జయన్తి:

జ్యేష్ఠ మాసమున శుక్లపక్షమున అపరాహ్ణ వ్యాప్తిగల ద్వితీయాతిథి యందు బుద్ధభగవానుడు అవతరించిరి. వీరికి యీ దినమున జయన్తి ఉత్సవమును జరుపుకొనుచున్నారు.

## 37. తిరుచానూరు శ్రీ పద్మావతీ తాయార్లవారి ప్లవోత్సవము (తెప్పఉత్సవము):

శ్రీ తాయార్లవారికి పంచాహ్నికమగు నీ ప్లవోత్సవము జ్యేష్ఠశుద్ధైకాదశి దినమున ప్రారంభమై జ్యేష్ఠపూర్ణిమవరకు అయిదు దినములు అతి వైభవముగా జరుగును.

## 38. ఏఱువాక పూర్ణిమ:

జ్యేష్ఠ పూర్ణిమా దినమును ఏఱువాక పూర్ణిమ యందురు. కృషీవలులు యీ దినమున వైభవోపేతముగ ఉత్సవములు దేశమందంతటను జరుపుకొందురు గావున దీనిని కృషి పూర్ణిమ యనియు అనుచున్నారు.

## 39. మిథున సంక్రమణము:

సూర్యుడు మేషాది ద్వాదశరాశులలో మూడవదియగు

మిథునరాశియందు ప్రవేశించు సమయము. ఈ సమయమునకు పరమునందు పదునారు ఘడియలు అనగా గం. 6.24 నిమిషములు 'షడశీతి' అను పేరుగల పుణ్యకాలము. ఈ పుణ్యకాలమునందు స్నానదానములు చేయతగియున్నవి. రాత్రి సంక్రమణములోని విశేషములు మేష సంక్రమణ నిర్ణయములో చూడదగును. ఈ మాసమును మిథునమాసము అనియు, "ఆనినెల" అనియు వ్యవహరించుచున్నారు.

## 40. శ్రీపెరియాళ్వార్లవారి శాత్తుమొర:

"మిథునే స్వాతిజం విష్ణోః రథాంశం ధన్వినః పురే।
ప్రపద్యే శ్వశురం విష్ణోః విష్ణుచిత్తం పురశ్శిఖమ్॥"

పురశ్శిఖుడై, "విష్ణుచిత్తుడు" అను పేరుగల శ్రీపెరియాళ్వారు ధన్విపురమునందు రథాంశమున మిథునమాసమునందు స్వాతీనక్షత్రమున జననము నొందిరి. గాన ఆ దినముతో కూడిన పదవదినమునందు ముందుగా ఉత్సవము ప్రారంభమై, ప్రతి దినము ఉత్సవములు జరుగుచూ, ఆ దినమున శాత్తుమొర జరుగును. కాలనిర్ణయ విధానము పూర్వము వ్రాయబడియున్నది.

## 41. శ్రీనాథమునులవారి వర్షతిరునక్షత్రము:

"జ్యేష్ఠమాసే త్వనూరాధా జాతం నాథమునిం భజే।
యచ్ఛ్రీశఠారేః శ్రుతవాౕ ప్రబంధ మఖిలం గురోః॥"

దివ్య ప్రబంధమునంతయు గురువుగారైన శ్రీనమ్మాళ్వార్లు వారివలన శ్రవణముచేసిన శ్రీనాథమునులవారు,

జ్యేష్ఠమాసమునందు అనూరాధా నక్షత్రమున జననమొందిరి. గాన ద్రావిడ సంప్రదాయ ప్రకారము శ్రీనాథమునులవారికి మిథున మాసమునందు అనూరాధా నక్షత్రముందు వర్షతిరు నక్షత్రము జరుగును.

## 42. జ్యేష్ఠాభిషేకమహోత్సవము:

జ్యేష్ఠమాసమున జ్యేష్ఠానక్షత్రము నందు జ్యేష్ఠాభిషేక మహోత్సవము శ్రీవారికి వైభవోపేతముగ త్రయాహ్నికముగా జరుగుచున్నది.

1వ రోజు వజ్రకవచము

2వ రోజు ముత్యంగి కవచము

3వ రోజు సువర్ణ కవచము

జ్యేష్ఠా నక్షత్రమున ఈ సువర్ణ కవచ సమర్పణతో ఉత్సవ సమాప్తి జరుగుచున్నది.

## 43. శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివార్ల బ్రహ్మోత్సవము అప్పలాయగుంట:

శ్రీవారి బ్రహ్మోత్సవము జ్యేష్ఠమాసమున శ్రవణనక్షత్రమునకు అవభృథము సంకల్పించి ఆ దినముతో కూడిన 9 రోజులకు ముందుగా ధ్వజారోహణమును అగుచున్నది. తత్పూర్వదినమున అంకురార్పణము జరుపుచున్నారు.

## ఉత్సవ వివరణము

| వగలు | రాత్రి |
| --- | --- |
| 1వ దినము | సేనాధిపతి ఉత్సవము<br>అంకురారోపణము |
| 2వ దినము తిరుచ్చి ఉత్సవము<br>ధ్వజారోహణము | పెద్ద శేషవాహనము |
| 3వ దినము చిన్న శేష వాహనము | హంస వాహనము |
| 4వ దినము సింహ వాహనము | ముత్యపుపందిరి వాహనము |
| 5వ దినము కల్పవృక్ష వాహనము | సర్వభూపాల వాహనము |
| 6వ దినము పల్లకిలో మోహినీ<br>అవతారోత్సవము | గరుడ వాహనము |
| 7వ దినము హనుమద్వాహనము<br>సాయంకాలము:<br>వసంతోత్సవము | గజ వాహనము |
| 8వ దినము సూర్యప్రభ వాహనము | చంద్రప్రభ వాహనము |
| 9వ దినము రథోత్సవము | అశ్వవాహనము<br>కల్యాణోత్సవము |
| 10వ దినము చూర్ణోత్సవము<br>అవభృథోత్సవము (తీర్థవారి)<br>చక్రస్నానము | ధ్వజావరోహణము<br>ద్వాదశారాధనము<br>ఏకాంతోత్సవము |

ఇటుల బ్రహ్మోత్సవము పూర్తి యగును.

## 44. తిరుచానూరు శ్రీసుందరరాజస్వామివారి అవతారోత్సవము:

ఈ ఉత్సవము త్ర్యాహ్నికముగా జరుగును. ఈ స్వామి వారు మిథునమాసమునందు ఉత్తరాభాద్రా నక్షత్రమున ఆవిర్భావమునొందిరి గాన, ఆ దినముతో కూడిన మూడు దినములు ముందుగా ఉత్సవము ప్రారంభమై ఆ దినమున ఉత్సవము పూర్తి అగును.

## 45. ఆషాఢమాసము:

చాంద్రమాన సిద్ధములగు చైత్రాది ద్వాదశ మాసములలో నాల్గవదియగు మాసము ఆషాఢనక్షత్రముతో కూడిన పూర్ణిమ గల మాసమగుటచే నీ మాసము ఆషాఢ మాసము అని వ్యవహరింపబడుచున్నది.

## 46. మరీచిమహర్షి జయన్తి:

శ్రీ విఖనసాచార్యులవారి శిష్యులలో రెండవవారగు మరీచి మహర్షి ఆషాఢ మాసమున శుక్ల పక్షము పూర్వఫల్గునీ నక్షత్రమున జన్మించిరని వైఖానసాగమము తెలుపుచున్నది. తిరుమల శ్రీవారి ఆరాధనాదులన్నియు మరీచి మహర్షి యను గ్రహించిన విధానమునే ప్రమాణముగ నెంచి జరుపుచున్నారు. వీరికి యీ దినమున జయన్తిని జరుపుచున్నారు.

## 47. శయనైకాదశీ:

ఈ దినమునందు శ్రీమన్నారాయణుడు క్షీరసాగరము

నందు శేషతల్పమున యోగనిద్రకై శయనించును గాన ఈ ఏకా దశి శయనైకాదశీ అని వ్యవహరింపబడుచున్నది.

''శేతే విష్ణు స్సదాషాఢే భాద్రే చ పరివర్తతే।
కార్తికే చ ప్రబుధ్యేత శుక్ల పక్షే హరే ర్దినే॥''

అను మత్స్యపురాణ వచనమువలన ఆషాఢ శుద్ధైకాదశీ, శయనైకాదశీ అనియు, భాద్రపదశుద్ధైకాదశీ, పరివర్తనైకాదశీ అనియు, కార్తీక శుద్ధైకాదశీ, ప్రబోధనైకాదశీ అనియు తెలియదగియున్నది.

ఏకాదశీ ఉపవాసవ్రతమునకు దశమీ వేధము పనికిరాదు అని

''అష్టమీ సప్తమీవిద్ధా రోహిణీ కృత్తికాన్వితా।
దశమ్యైకాదశీవిద్ధా హంతి పుణ్యం పురాతనమ్॥''

ఇత్యాది ప్రమాణవచనములు చెప్పుచున్నవి.

ఆ వేధము అరుణోదయవేధము, సూర్యోదయవేధము అని రెండు విధములు. అరుణోదయవేధము అనగా, సూర్యోదయమునకు 4 ఘడియలు ముందుగా అరుణోదయమగును. ఆ సమయమున దశమి ఉండకూడదు. అనగా 56 ఘడియలకు పైన 1 విఘడియ దశమియున్నను అరుణోదయవేధ కలుగుచున్నది. ఈ వేధము వైష్ణవ విషయము.

సూర్యోదయవేధము అనగా, సూర్యోదయమునకు పైన 1 విఘడియ దశమియున్నను సూర్యోదయవేధ కలుగుచున్నది. ఈ వేధము స్మార్తవిషయము.

గాన వారి వారి సంప్రదాయ ప్రకారము దశమీవేధగల ఏకాదశిని వదలి పరదినమున ఏకాదశీవ్రతము నాచరించుచున్నారు.

## 48. శ్రీవిఖనసాచార్యులవారి శాత్తుమొర:

శ్రావణ మాసమున పూర్ణిమాదినమున శ్రీవిఖనసాచార్య స్వామివార్ల జయన్తి జరుపుచుండగా తిరుపతిలో నొక మాసము ముందుగ శ్రీవిఖనసాచార్యులవారి శాత్తుమొర అనగా ఆషాఢ మాసమున శ్రవణ నక్షత్రమునకు మొరగా నిర్ణయించి ఆదినముతో కూడిన 10 రోజులు ముందుగా ఉత్సవమును జరుపుచున్నారు.

## 49. చాతుర్మాస్య వ్రతారంభము:

ఈ ఆషాఢ శుద్ధైకాదశీ మొదలు కార్తీక శుద్ధైకాదశివరకు గల కాలమును చాతుర్మాస్య అని వ్యవహరించుచున్నారు. ఈ చాతుర్మాస్య కాలమునందు సన్న్యాసులు యుక్తమగు ప్రదేశమున ఒకేచోట నివసించి దేవతాపూజనము చేయుచుండవలెను. ఇదియే చాతుర్మాస్య వ్రతము. ఈ వ్రతము ఏకాదశీదినమున ప్రారంభము అని కొందరు, ద్వాదశీదినమున ప్రారంభము అని కొందరు శాస్త్రకారులు చెప్పుచున్నారు.

## 50. శ్రీ గోవిందరాజస్వామివారి జ్యేష్ఠాభిషేకోత్సవము:

ఆషాఢమాసమున జ్యేష్ఠా నక్షత్రమున తిరుపతి శ్రీగోవింద రాజస్వామివార్లకు జ్యేష్ఠాభిషేకమహోత్సవం త్రయాహ్నికముగ జరుగును.

## 51. వ్యాసపూజ:

సన్న్యాసులు చాతుర్మాస్య వ్రతాంగముగా ఆషాఢపూర్ణిమా దినమున వ్యాసపూజ అను పేరుతో, శ్రీకృష్ణాది దేవపంచకమును, వ్యాసాది మహర్షి పంచకమును, స్వభాష్యకారాది ఆచార్య పంచకమును, సనకాది యోగిపంచకమును, స్వగుర్వాది గురుపంచకమును, మరియు బ్రహ్మవశిష్ఠాది బ్రహ్మనిష్ఠులను, ఇతర దేవతలను లోకపాలకులను వారి వారి సంప్రదాయానుసారముగా పూజించుచుందురు. ఈ పూజాకర్మ యందు పూర్ణిమా ఉదయము నుండి ఆరు ఘడియలు వ్యాప్తికల్దై యుండవలెను.

## 52. మంగాపురం శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కార వైభవోత్సవము:

ఆషాఢమాసమునందు శుక్లపక్షమున ఉత్తర ఫల్గునీ నక్షత్రము నందు శ్రీవారు సాక్షాత్కరించిరి గాన ఆదినమున శ్రీవారికి ఉత్సవము జరుగును.

## 53. కటకసంక్రమణము:

సూర్యుడు మేషాది ద్వాదశరాశులలో నాలుగవదియగు కటకరాశియందు ప్రవేశించు సమయము. ఈ సమయమునకు పూర్వము 30 ఘడియల కాలము అనగా 12 గంటల కాలము ''అయనము'' అను పేరుగల పుణ్యకాలము, రాత్రియందు పూర్వభాగమునందుగాని, ఉత్తరభాగమునందుగాని, నిశీథమునందుగాని కటకసంక్రమణము జరిగిన పూర్వదినము పుణ్యకాలము.

సూర్యోదయమునకు పూర్వము మూడు ఘడియల కాలము ప్రాతస్సంధ్యాకాలము, ఆ కాలమున కటక సంక్రమణము జరిగిన పరదినము పుణ్యకాలము అని జ్యోతిశ్శాస్త్రము చెప్పుచున్నది.

ఏ సంక్రమణమునందైనను సంక్రమణ సమయమునకు అతి సన్నిహితములైన ఘడియలకాలమును పుణ్యతమమునుగాను, సన్నిహితములైన ఘడియలకాలమును పుణ్యతరముగాను, వ్యవహితములైన ఘడియల కాలమును పుణ్యకాలముగాను ధర్మవేత్తలు చెప్పుచున్నారు. సూర్యుడు ఈ సమయమునుండి దక్షిణముగా సంచరించుటకు సంకల్పించును గాన దీనిని దక్షిణాయన మనుచున్నారు. ఈ పుణ్యకాలమునందు స్నాన, దాన, జప తర్పాణాదులు చేయతగియున్నవి. ఈ మాసమున కటకమాసము అనియు, ఆడినెల అనియు వ్యవహరించుచున్నారు.

## 54. శ్రీస్వామివారికి ఆణివర ఆస్థానము:

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారికి ఈ కటక సంక్రమణ దినమున ఆణివర ఆస్థానము అనుపేరుతో, పుణ్యకాలమున అతివైభవముగా ఆస్థాన మహోత్సవము జరుగును.

## 55. నాగచతుర్థి:

ఈ కటక మాసమునందు శుక్ల పక్షమున చతుర్థీ

8 దినమునందు నాగములను పూజించెదరు.

## 56. గరుడపంచమి:

ఈ కటక మాసమున శుక్లపక్షమునందు పంచమీ దినమున గరుడుని పూజించెదరు.

## 57. నారాయణగిరిలో ఛత్రస్థాపనోత్సవము:

కటక మాసమునందు శుక్లద్వాదశీ దినమున నారాయణ గిరిలో ఛత్రస్థాపనోత్సవ మతివైభవముగా జరుగును.

## 58. తులసీమాహాత్మ్యం ఆస్థానం:

కటకమాసమున శుక్లపక్ష ద్వాదశీ దినమునందు జరుగును. ఈ దినము తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారు ప్రాతఃకాలారాధనము కాగానే గరుడవాహనారూఢులై తిరువీధుల ఉత్సవమునకు వేంచేసెదరు. తిరిగి ఆలయమునకు రాగానే బంగారు వాకిలి ముందు శ్రీవారికి ఆస్థానము జరుగును. ఆస్థానములో తులసీమాహాత్మ్యము పురాణమును పఠించెదరు. పిమ్మట ఆస్థానము పూర్తిఅయి సన్నిధికి వేంచేయుదురు. మామూలుమేరకు నిత్యకైంకర్యములు జరుగును.

## 59. శ్రీచక్రత్తాళ్వార్లవారి వర్షతిరునక్షత్రం:

కటక మాసమునందు పుష్యమీనక్షత్రమున శ్రీచక్రత్తాళ్వార వారికి తిరునక్షత్రము ఉత్సవము జరుగును.

## 60. శ్రీఆండాళ్ తిరువాడిప్పూరం శాత్తుమొర:

''కర్కటే పూర్వఫల్గున్యాం తులసీకాననోద్భవామ్।
పాండ్యే విశ్వంభరాం దేవీం వందే శ్రీరంగనాయకీమ్॥''

పాండ్యదేశమునందు శ్రీ విష్ణుచిత్తులవారి తులసీవనములో ఆషాఢ శుక్ల చతుర్థీ మంగళవారము, పూర్వఫల్గునీ నక్షత్రయుక్తమగు తులాలగ్నము నందు తులసీ మూలమున భూతలము నుండి భూదేవి అంశము వలన ఆండాళ్ (గోదాదేవి) ఆవిర్భవించెను. అందుచే కటక మాసమున పూర్వఫల్గునీ నక్షత్రము నందు శాత్తుమొర నిర్ణయించి ఆ దినముతో కూడిన పదవదినమునందు ముందుగా ఉత్సవము ప్రారంభించి ప్రతిదినము ఉత్సవములు జరుపుచూ ఆ పూర్వ ఫల్గునీ యుక్తదినమునందు శాత్తుమొర తిరుపతి దేవస్థానంలో జరుగును.

## 61. తిరుమల శ్రీవారు పుర్శైవారి తోటకు వేంచేయుట:

ఈ శాత్తుమొర దినమున తిరుమల శ్రీవారు పుర్శైవారి తోటకు వేంచేయుదురు. అనగా ఈ కటకమాసము పూర్వ ఫల్గునీ నక్షత్రమున సాయంకాలము శ్రీమలయప్ప స్వామివారు ఒక కొయ్య తిరుచ్చియందును, పట్టమహిషులగు శ్రీ, భూదేవులు ఒక తిరుచ్చియందును వేంచేసి మహాప్రదక్షిణముగా పుర్శైవారి తోటలోని మండపమునకు వేంచేయుదురు. అచ్చట తళిహలు నివేదనము జరిగి మామూలు మేరకు గోష్ఠి వినియోగము జరుగును. పిమ్మట శ్రీవారు బయలుదేరి పొగడ చెట్టు వద్దకు రాగానే శ్రీవారికి హారతి అయి ఆ శేషహారతి, పుష్పసరము, శ్రీ శఠారి ఆ పొగడచెట్టునకు సాయించెదరు.

అర్చకులు ఆ శఠారిని తిరుచ్చిలో పెట్టకనే తీసుకొని వచ్చెదరు. శ్రీవారు గజేంద్రమోక్ష మండపముదాటి వీథిలోనికి రాగానే శ్రీవారికి హారతి అయి శ్రీశఠారికి ప్రోక్షణరూపముగా

అభిషేకము జరుగును. తిరిగి శ్రీవారికి హారతిచేసి ఆ శఠారిని తిరుచ్చిలో ఉంచెదరు. పిమ్మట శ్రీవారు క్రమముగా సన్నిధిలోనికి వేంచేయుదురు.

## 62. కశ్యపమహర్షి జయన్తి:

శ్రావణ మాసమున హస్త నక్షత్రమున వీరు జన్మించిరని వైఖానసాగమం చెప్పుచున్నది. అందువలన వీరికి యీ దినమున జయన్తి జరుపుచున్నారు. వీరు శ్రీవిఖనసాచార్య స్వామివారి శిష్యులలో నాల్గవవారుగా గణుతికెక్కియున్నారు.

## 63. తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారు అహోబల మఠమునకు వేంచేయుట:

కటక మాసమున స్వాతీనక్షత్రమునందు శ్రీ గోవింద రాజస్వామివారు అహోబల మఠమునకు వేంచేయుదురు.

## 64. శ్రీ ఆళవందార్లవారి వర్షతిరునక్షత్రము:

''శుచౌమా స్యుత్తరాషాఢా జాతం యామున దేశికం।
శ్రీరామమిశ్రచరణ సరోజాశ్రిత మాశ్రయే॥

శ్రీరామమిశ్రులవారి ప్రియశిష్యులును, శ్రీభాష్యకారులగు శ్రీరామానుజాచార్యులవారికి మార్గప్రదర్శకులును అగు శ్రీయామునాచార్యులవారు ధాత సంవత్సరము కటక మాసములో పూర్ణిమా శుక్రవారము ఉత్తరాషాఢా నక్షత్రమునందు సింహాసనాంశ వలన జననమొందిరి. అందుచే వారికి కటక మాసమున ఉత్తరాషాఢా నక్షత్రమునందు వర్షతిరునక్షత్రము జరుగును.

## 65. శ్రావణమాసము:

చాంద్రమాన సిద్ధములగు చైత్రాది ద్వాదశ మాసము లలో అయిదవ మాసము, శ్రవణనక్షత్రముతో కూడిన పూర్ణిమ కల మాసమగుటచే నీ మాసము శ్రావణమాసము అని వ్యవహరింపబడుచున్నది.

## 66. కల్కిజయన్తి:

శ్రావణశుద్ధ షష్ఠీదినమున సాయంకాలము భగవంతుడు ధర్మస్థాపనార్థమై దశావతారములలో పదవదియగు కల్కి అవతా రమును స్వీకరించగలడు గాన ఆ దినమున భగవంతుని పూజించెదరు - జ్యేష్ఠ శుక్ల ద్వితీయయందు కల్కి అవతా రము రాగలదని కొందరి అభిప్రాయము - ఇట్టి విరోధములు కల్పభేదముచేత తొలగించవలయును అని శాస్త్రకారులు చెప్పుచున్నారు.

## 67. వరలక్ష్మీవ్రతము:

శ్రావణమాసములో పూర్ణిమకు ముందుగా వచ్చెడు శుక్రవారమున లక్ష్మీవ్రతమును చేయుచున్నారు. ఈ మాసములో కొందరు అన్ని శుక్రవారములయందును లక్ష్మీవ్రతమును చేయుదురు.

ఈ దినమున తిరుమల శ్రీవారికి సాయంకాలారాధనములో రాత్రి ఘంటాకాలమున సుగియంపళ్లు (బెల్లముతో చేసిన సుగీల పడులు) నివేదనము జరిగి బంగారు వాకిలి ముందు స్థాన బహుమాన పూర్వకముగా గోష్ఠికి ప్రసాదవినియోగము జరుగును.

పిమ్మట మామూలు మేరకు కోవెల తీర్మానం జరిగిన తరువాత అర్చకులు, ఏకాంగి వగైరాలు శ్రీ పాకలక్ష్మి (పోటు తాయారు) వారి సాన్నిధ్యమునకు వెళ్ళి, తాయార్లవారికి అభిషేకాలంకారములు సమర్పించి సుగియపళ్లు, పాయసము నివేదనముచేసి, హారతి సమర్పించెదరు. సర్కారువారికి మర్యాద జరుగును.

## 68. తిరుమల శ్రీవారి పవిత్రోత్సవము:

ఈ ఉత్సవము శ్రావణ శుద్ధదశమీ దినమున ప్రారంభమై త్రయోదశి వరకు నాలుగు దినములు జరుగుచున్నది.

ఇందులకు వివరణము:-

1వ దినమున అంకురారోపణము

2వ దినమున పవిత్ర ప్రతిష్ఠ

3వ దినమున పవిత్ర సమర్పణము

4వ దినమున పూర్ణాహుతి

ఆర్జితముగాను జరుగుచున్నవి.

ఈ పవిత్రారోపణ మహోత్సవము ప్రతి దేవాలయమందును శ్రీస్వామివారలకు ప్రతి సంవత్సరము చేయవలసియున్నది.

అఖిల జగత్ప్రభువగు శ్రీస్వామివారికి ఆరాధనాది కైంకర్యములు విధిపూర్వకముగా బ్రహ్మాదులకు కూడా చేయుట కశక్యములు కాన, అల్పజ్ఞులు అల్పశక్తులగు మానవులు ఆ కైంకర్యములను చేయుటలో అశక్యాకరణదోషములు,

న్యూనాతిరిక్త దోషములు సంభవించగలవు. అట్టి దోషముల నివృత్తికై ఈ మహోత్సవమును చేయవలయును.

ఇంతియెకాక ఈ పవిత్రారోపణ మహోత్సవము దేశక్షేమమును, సర్వలోక శాన్తిని, సర్వదోష నివృత్తిని, సర్వకామప్రాప్తిని, కామనానుగుణముగా కలుగచేయును అని ఆగమశాస్త్రములు చెప్పుచున్నవి.

## 69. శ్రీవైఖానస మహర్షి జయన్తి:

"శ్రవణే శ్రావణే శుక్ల పూర్ణిమా సోమవాసరే।
సింహలగ్నేన సంయుక్తే, భజే నైమిశ మాగతమ్॥"

శ్రీ వైఖానస మహర్షి శ్రావణపూర్ణిమా సోమవారం శ్రవణ నక్షత్రముతో కూడిన సింహలగ్నమునందు నైమిశారణ్యమునకు వేంచేసిరి. అందుచే శ్రావణ పూర్ణిమా దినమును మహర్షి జయన్తి దినముగా నిశ్చయించి పూజనము చేయుచున్నారు.

## 70. కార్వేటినగర వేణుగోపాలస్వామివారి ప్లవోత్సవము:

శ్రావణ శుక్ల త్రయోదశి చతుర్దశీ మాసమున మూడు దినములు శ్రీ వేణుగోపాలస్వామివారి ప్లవోత్సవము జరుగుచున్నది.

## 71. హయగ్రీవ జయన్తి:

శ్రావణ మాసమున పూర్ణిమా దినము విభవావతారములలో నొకరైన శ్రీ హయగ్రీవ స్వామివారికి జయన్తి వేడుకలు జరుపుచున్నారు.

## 72. శ్రావణోపాకర్మ:

ఈ ఉపాకర్మ శ్రావణ పూర్ణిమయందు జరుగును.

ఈ దినమున తిరుమల శ్రీవారికి ప్రాతఃకాలారాధనము నివేదనము అయిన తరువాత, శ్రీ కృష్ణస్వామివారు తిరుచ్చిలో వేంచేసి మహా ప్రదక్షిణముగా తిరువీథుల ఉత్సవములో శ్రీవరాహస్వామివారి సన్నిధానమునకు వేంచేయుదురు. అచ్చట వారు పంచామృతాభిషేకము అయి వాద్యారి యిచ్చిన యజ్ఞోప వీతమును ధరించెదరు. పిమ్మట దోసెపడి ఆరగింపు అయి హారతి మామూలు మర్యాదలు జరిగి శ్రీ స్వామివారు తిరు వీథి ప్రదక్షిణముగా శ్రీవారి సన్నిధికి వేంచేయుదురు. పిమ్మట మామూలు మేరకు దేవస్థాన కార్యములు నడుచును.

## 73. ఋగ్వేదినా ముపాకర్మ:

ఉపాకర్మ అనగా ఉపక్రమము, వేదాధ్యయనారంభము అని అర్థము. ఇందులకు ఋగ్వేదులకు శ్రావణ మాసమున శుక్ల పక్షమునందు శ్రవణనక్షత్రము, పంచమీ, హస్త అను మూడు కాలములుగా నిర్ణయింపబడి యున్నవి. ఆ మూడు కాలములలో శ్రవణనక్షత్రము ముఖ్యకాలము. అది లభించ నప్పుడు పంచమి యుక్తకాలము. అదియు లభించినప్పుడు హస్త నక్షత్రము యుక్తకాలము అని తెలియదగినది. సామాన్యముగా ఈ కాలములు ఉదయము నుండి త్రిమూహూర్త వ్యాప్తి కలవిగా నుండవలయును అనగా సంగవ కాలమును స్పృశించి యుండవలయును. ఋగ్వేదులకు పూర్వాహ్ణము ఉపాకర్మ కాలము.

సర్వశాఖలవారికి స్వస్వగృహ్య సూత్రకారులు శ్రావణ భాద్రపద మాసములలో చెప్పిన కాలముల యందు గ్రహణము, సంక్రాన్తి, ఆశౌచవము మొదలగు దోషములు సంభవించే పక్షమున సర్వవిధముల కర్మలోపము వచ్చునుగాన అటుల కర్మ లోపము రాకుండా శాఖాన్తరములలో చెప్పిన కాలములను గ్రహించుట ఆవశ్యకము లేదా జ్యోతిశ్శాస్త్ర విహితకాలాన్తరము లలోనైనా కర్మను ఆచరించవలయును. కర్మలోపము రానీయ కూడదు.

## 74. యజుర్వేదినా ముపాకర్మ:

ఋగ్వేదులకు శ్రవణనక్షత్రమువలె సర్వ యజుర్వేదులకు శ్రావణ పూర్ణిమ ముఖ్యకాలము.

## 75. హిరణ్యకేశియోపాకర్మ:

ఈ హిరణ్యకేశీయులకు శ్రావణ పూర్ణిమ ముఖ్యకాలము. ఆ కాలము లభించనప్పుడు శ్రావణశుక్ల పక్షమున హస్త నక్షత్రము గ్రహించవలెను. శ్రవణనక్షత్రము కూడా ఉదయము నుండి సంగవ కాలమును స్పృశించియుండవలయును.

## 76. ఆపస్తంబోపాకర్మ:

ఆపస్తంబులకు శ్రావణపూర్ణిమ ముఖ్యకాలము, అది లభించనప్పుడు భాద్రపదపూర్ణిమ గ్రహించవలయును ఇదియే విశేషము.

## 77. బౌధాయనోపాకర్మ:

బౌధాయనులకు శ్రావణ పూర్ణిమ ముఖ్యకాలము. దోష సంభావనచే అది లభించనప్పుడు ఆషాఢ పూర్ణిమ గ్రహించవలెను ఇదియే విశేషము.

## 78. కాణ్వమాధ్యందినోపాకర్మ:

కాణ్వ, మాధ్యందినాది కాత్యాయనులకు శ్రవణనక్షత్ర ముతో కూడిన శ్రావణపూర్ణిమ కాని, కేవలపూర్ణిమకాని హస్త నక్షత్రముతో కూడిన శ్రావణశుద్ధ పంచమిగాని, కేవలపంచమి కాని ముఖ్యకాలము. కేవలమగు శ్రవణము, కేవలమగు హస్త యుక్తములు కానేరవు. శ్రావణ మాసమునందు యేదోవిఘ్నదో షము సంభవించినప్పుడు భాద్రపదపూర్ణిమా, భాద్రపదశుక్ల పంచమీ గ్రహించవలసియున్నది. తిథి ఖండతిథియై షణ్ముహూ ర్తాధికముగా నున్న పరదినము, షణ్ముహూర్త (ఆరుఘడి యలు) న్యూనముగానున్న పూర్వదినము గ్రహించవలసియున్నది. ఇతర నిర్ణయములు శాస్త్రములయందు చూడనగును.

## 79. సామవేదినాముపాకర్మ:

సామవేదులకు భాద్రపదమాసమున శుక్లపక్షమునందు హస్త నక్షత్రము ముఖ్యకాలము. సంక్రాన్త్యాది దోషములచే నచ్చుట సంభవించనప్పుడు శ్రావణమాసమునందు హస్తనక్షత్ర మును గ్రహించవలయును - అని కొందరి అభిప్రాయము. ఇత రులు భాద్రపద హస్తయందు దోషము సంభవించినప్పుడు శ్రావణ పూర్ణిమయందు ఉపాకర్మను చేసుకొని భాద్రపద హస్త

పర్యన్తము పఠించకూడదు. తరువాత పఠించవలసియున్నది అని అభిప్రాయపడుచున్నారు. సామవేదులకు అపరాహ్ణకాలము ఉపాకర్మకాలముగా గ్రహించవలెను.

## 80. అథర్వవేదినాముపాకర్మ:

అథర్వవేదులకు శ్రావణమాసమునందుగాని భాద్రపదమాసమునందుగాని పూర్ణిమ ముఖ్యకాలము తిథి ఖండతిథి గానున్న యెడల ఉదయమునుంచి సంగవకాలమును వ్యాపించియున్న తిథి గ్రహించవలసియున్నది.

## 81. నూతనోపనీతానాముపాకర్మ:

నూతనముగా ఉపనయనముజరిగిన వారలకు ప్రథమోపాకర్మ గుర్వస్తమయమందుగాని, శుక్రాస్తమయముందుగాని మలమాసాదులయందుగాని, గురువు సింహమునందుండగా గాని చేయరాదు.

ద్వితీయాద్యుపాకర్మలు ఈ అస్తమయాదుల యందైనను చేయవచ్చును. మలమాసమందైతే ద్వితీయాద్యుపాకర్మయు చేయరాదు. ఈ ఉపాకర్మలయందు ఇతర విషయములు శాస్త్రముల వలన గ్రహింపవలయును.

## 82. గాయత్రీజపము:

ఉపాకర్మ జరిగిన పరదినమున ప్రాతఃకాలమునందు సహస్ర గాయత్రీ జపము చేయతగియున్నది.

## 83. శ్రీకృష్ణజన్మాష్టమి:

భగవంతుడు గడచిన ద్వాపరయుగాన్తమునందు సాధుప రిత్రాణార్థమై, దుష్టవినాశార్థమై, ధర్మసంస్థాపనార్థమై దశావతార ములలో తొమ్మిదవదియగు శ్రీకృష్ణావతారమును స్వీకరించెను.

స్వస్తిశ్రీ విజయనామసంవత్సర శ్రావణబహుళాష్టమీ బుధవారమురాత్రి నిశీథసమయమునందు రోహిణీ నక్షత్రయుక్త వృషభలగ్నమున.

| | | | |
|---|---|---|---|
| | గు | ల చం | రా |
| | రాశిచక్రము | | కు బు |
| | | | ర శ |
| కే | | | శు |

ఇట్లు, గ్రహసంనివేశ సమయము నందు శ్రీకృష్ణుడు ఆవిర్భవించెను. అని జ్యౌతిషిక సంప్రదాయము.

ఆగమములు: ధర్మశాస్త్రములు, పురాణములు శ్రీకృ ష్ణావతార సమయములో

శ్రావణ మాసము

కృష్ణ పక్షము

అష్టమీ తిథి

బుధ వారము

రోహిణీనక్షత్ర చతుర్థచరణము

హర్షణ యోగము

కౌలవ కరణము

నిశీథ సమయము

చంద్రోదయము

వృషభ లగ్నము

ఈ పది విషయములను చెప్పుచున్నవి కాని విజయనామ సంవత్సరమును చెప్పుటలేదు.

ఇతిహాసవేత్తలు కొందరు – శ్రీకృష్ణునకు అర్జునునితో సాహచర్యముచేతను, సమానవయస్కత్వము చేతను స్వస్తిశ్రీ విజయనామ సంవత్సర కార్తీకబహుళ దశమీ సోమవారము ధనుర్లగ్నమునందు.

| | | | |
|---|---|---|---|
| | గు | | రా |
| | రాశిచక్రము | | |
| | | | |
| ల కే శు | ర | బు | చం శ కు |

ఇట్లు గ్రహసంనివేశ సమయమున లోకైకవీరుడగు అర్జునుడు జన్మించెను అను జ్యౌతిషిక సంప్రదాయముచేతను

శ్రీకృష్ణునకు కూడా విజయసంవత్సరమే జన్మ సంవత్సరమని నిర్ణయించుచున్నారు.

శాస్త్రవేత్తలు కొందరు – ఈ నిర్ణయము దృఢతర ప్రమాణసిద్ధము కాకపోవుటచేతను, వారు చెప్పిన హేతువులు నియమ బలవిహీనములగుటచేతను, సంప్రదాయములు సమసత్తా

కములగుట చేతను పరముఖ నిరీక్షకములగుటచేతను యుక్తము కానేరదని అభిప్రాయపడుచున్నారు.

విమర్శకారులు కొందరు - శ్రీకృష్ణుని జన్మసంవత్సరము శ్రీముఖ సంవత్సరము అని చెప్పుచూ తృప్తిపడుచున్నారు.

పరమపురుషార్థ ప్రదాయకములగు శ్రీకృష్ణపూజా వ్రతోత్సవాదులను చేయుటకు చిరకాల లభ్యమును దుర్లభమును అగు సంవత్సర విషయములో నిర్ణయము లేకున్నను అచిరకాల లభ్యములు సులభములు అగు మాస, పక్ష, తిథి నక్షత్రాది విషయములో సర్వాంగీకారముకలదు. అందుచే శ్రావణ బహుళాష్టమీ దినమున రాత్రి నిశీథసమయములో రోహిణీ నక్షత్రమునందు నిరుక్తకాలాదులలో శ్రీకృష్ణుడవతరించెను - అనుట నిర్వివాదము. అయినను ఇప్పుడు ఏకకాలమునందు శ్రీకృష్ణావతార సమయసిద్ధములగు తిథి వారనక్షత్రాదులన్నియు లభించక పోవుటచేత కొందరు మహాత్ములు తిథికి ప్రాధాన్యము ననుసరించి నిశీథవ్యాపినియగు శ్రావణబహుళాష్టమీదినమున శ్రీకృష్ణ పూజనమును చేయుచున్నారు. వీరు తిథికి సమయమునకు ప్రాధాన్యము నంగీకరించియున్నారు.

(స్మార్తవిషయము)

## 84. గోకులాష్టమీ ఆస్థానము:

కొందరు మహాత్ములు పై చెప్పిన సమయములో శ్రీకృష్ణజననము నంగీకరించి సూర్యోదయానంతరము కలామాత్రమైనా సప్తమీ వేధములేక శుద్ధయగు శ్రావణబహుళాష్టమి యందు నిశీథవ్యాప్తిని గణించక వృషభలగ్నమునందు శ్రీకృష్ణపూజనమును చేయుచున్నారు.

"అష్టమీ సప్తమీవిద్ధా, రోహిణీ కృత్తికాన్వితా।
దశమ్యైకాదశీవిద్ధా హంతి పుణ్యం పురాతనమ్॥"

అను నిషేధమును పాటించుచున్నారు.

ఈ అష్టమిని గోకులాష్టమి అని వ్యవహరించుచున్నారు.

ఈ దినమున తిరుమల శ్రీవారి సన్నిధానమున సర్వ భూపాల వాహనమందు శ్రీకృష్ణస్వామివారికి మహావైభవముగా ఆస్థానముజరుగును. ఇది ఆగమసిద్ధము.

## 85. తిరుమల శ్రీవారి దేవస్థానమున శిక్యోత్సవము (ఉట్లు):

తిరుమలలో గోకులాష్టమి ఆస్థానము జరిగిన దినమునకు పరదినమునందు జరుగును.

## 86. తిరుపతి శ్రీకోదండరామస్వామివారి దేవస్థానమున శిక్యోత్సవము (ఉట్లు):

తిరుమల శ్రీవారి దేవస్థానములోని శిక్యోత్సవమునకు పరదినము నందు తిరుపతిలో (ఉట్లు) జరుగును.

## 87 తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి దేవస్థానమున చిన్నవీధి శిక్యోత్సవము (ఉట్లు):

తిరుపతి శ్రీకోదండరామస్వామివారి దేవస్థానములోని శిక్యోత్సవమునకు పరదినమునందు చిన్నవీధి లో శ్రీ గోవింద రాజస్వామి వారికి శిక్యోత్సవము జరుగును. (ఉట్లు)

## 88. తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి దేవస్థానమున పెద్దవీధి శిక్యోత్సవము (ఉట్లు):

తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి దేవస్థానము చిన్న వీధి శిక్యోత్సవమునకు పరదినమునందు పెద్దవీధి లో శిక్యోత్సవము (ఉట్లు) జరుగును.

## 89. స్వతంత్ర దినము:

భారతదేశ నివాసరసికుడగు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి యొక్క అనుగ్రహబలముచే భారతీయులకు 15-8-1947వ తేదీ స్వాతంత్ర్యము లభించినదినము.

## 90. సింహసంక్రమణము:

సూర్యుడు మేషాది ద్వాదశరాశులలో ఐదవదియగు సింహరాశియందు ప్రవేశించు సమయము - ఈ సమయము నకు పూర్వము గం. 6-24 నిమిషముల కాలము. విష్ణుపదము అను పుణ్యకాలము. ఈ కాలమునందు స్నానదాన జపములు చేయతగియున్నవి. ఈ మాసమును సింహమాసము అనియు ఆవణి మాసము అనియు వ్యవహరించుచున్నారు.

## 91. శ్రీకృష్ణజయన్తి:

''సింహరాశిగతే సూర్యే శ్రావణేమాసి నారద।
కృష్ణపక్షే తథాష్టమ్యాం బుధవారే నిశీథకే॥''

ఇత్యాది ప్రమాణ వచనములు - సూర్యుడు సింహరాశిని పొందిన వాడగుచుండగా శ్రావణ మాసమున నిరుక్త తిథి

వార నక్షత్ర సమయాదులయందు శ్రీకృష్ణుడవతరించెను అని చెప్పుటచేత కొందరు ప్రాజ్ఞులు అభిరుచ్యనుగుణముగా సింహ మాసమునకు ప్రాధాన్యము నంగీకరించి ఆ మాసమున నిరుక్త తిథి నక్షత్ర సమయాదులయందు శ్రీకృష్ణపూజా వ్రతోత్స వాదులను నిర్వర్తించుచున్నారు.

వివరణము:

సింహమాసమున కృష్ణపక్షమునందు సూర్యోదయానంత రము కలామాత్ర సప్తమీ వేధలేని అష్టమితో కూడినట్టి, సూర్యోదయానంతరము కలామాత్ర కృత్తికావేధలేని రోహిణీ నక్షత్రము నందుగాని, అట్టి శుద్ధాష్టమీ సహితశుద్ధ రోహిణి లభించనప్పుడు శుద్ధరోహిణీ సహిత నవమియందుగాని, ఆ రెండు లభించనప్పుడు మృగశీర్షసహిత నవమియందుగాని, దశమియందుగాని నిశీథసమయమున వృషభలగ్నమునందు జయన్తీ పక్షావలంబులు శ్రీకృష్ణస్వామిని విశేషముగా పూజించు చున్నారు. ఇది నక్షత్ర ప్రాధాన్యముననుసరించిన పక్షము. ఈ పూజనమును ''జయన్తీ'' అని వ్యవహరించుచున్నారు.

(వైష్ణవ విషయము)

ఇటుల శ్రీకృష్ణావతార సమయుమగు నిశీథమునందు శ్రీకృష్ణుని పూజించు ఉపాసకులలో కొందరు పంచకాల పరాయ ణులై ఫలాభిసంధి రహితులైనవారు రాత్రియందే చంద్రోదయమున ఉత్సవాన్తమునందు భక్తులతోను భాగవతులతోను పారణమును చేయుచున్నారు. సకాములై జయన్తీ ఫలమును కోరిన వారు తిథ్యం

19 తమునందు (పరదినమునందు) పారణము చేయుచున్నారు.

"జన్మాన్తర సహస్రేషు తపో ధ్యాన సమాధిభిః।
నరాణాం క్షీణ పాపానాం కృష్ణే భక్తిః ప్రజాయతే॥"

అను ప్రమాణవచన ప్రకారము, అనేక వేల జన్మాన్తరముల యందు తపస్సుల చేతను, ధ్యానములచేతను, సమాధుల చేతను ప్రతిబంధకమగు పాపజాలమును తొలగించుకుని నిష్పాపులై శ్రీకృష్ణభక్తిని ఆర్జించుకొనిన పుణ్యశాలులందరు పలువిధములగు రుచిభేదములచే నిటుల శ్రావణమాసమందుగాని, సింహ మాసమందుగాని, అష్టమీ తిథి యందుగాని రోహిణీ నక్షత్రము నందుగాని, నవమియందుగాని, దశమియందుగాని నిశీథములో చంద్రోదయమున వృషభలగ్నము అవతార సమయముగ నిశ్చయించుకుని గీతామృత ప్రదాతయై పరమ కృపావారాశి యగు శ్రీకృష్ణభగవానుని, భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహములతో పూజించుట ఆ ఉపాసకుల అదృష్టరాశులకు మేరలేదనియు, భారతదేశము యొక్క అదృష్టరాశి పరంపరాసహస్రములకు మేర లేదనియు తెలియదగియున్నది.

## 92. భాద్రపద మాసము:

చాంద్రమాన సిద్ధములగు చైత్రాది ద్వాదశ మాసములలో ఆరవదియగు మాసము భాద్రా అను నామాంతరము కల భాద్రపదా నక్షత్రముతో కూడిన పూర్ణిమగల మాసమగుటచే నీ మాసమును భాద్రపద మాసమనియు భాద్రమాసమనియు వ్యవహరించుచున్నారు.

## 93. సామవేదినా ముపాకర్మ:

భాద్రపద శుక్లపక్షమున హస్తనక్షత్రము ముఖ్యకాలము –

విశేషములు శ్రావణమాసములో వ్రాయబడియున్నవి చూడుము.

## 94. శ్రీబలరామ జయన్తి:

భాద్రపద శుక్ల ద్వితీయయందు భగవంతుడు లోక రక్షణార్థమై దశావతారములలో యెనిమిదవదియగు బలరామావ తారమును స్వీకరించెను. అందుచే తదుపాసకులు ఆయా అవతార దినములయందు భగవంతుని ఉపాసించెదరు.

## 95. శ్రీవరాహ జయన్తి:

భాద్రపద శుక్ల తృతీయా దినమున అపరాహ్ణ సమయము నందు భగవంతుడు లోకరక్షణార్థమై దశావతారము లలో మూడవదియగు శ్రీవరాహావతారమును స్వీకరించెను. అందుచే తదుపాసకులు అవతార దినమున శ్రీవారిని విశేషముగా పూజించెదరు.

కొందరు చైత్రబహుళ నవమీ దినమున వరాహావతార మును భూమ్యుద్ధరణార్థము స్వీకరించెను అని చెప్పుచున్నారు. కల్పభేదముచే ప్రామాణికములుగా సమన్వయించుకొనవలయును.

## 96. వినాయకచతుర్థి:

భాద్రపద శుక్ల చతుర్థీ దినమున మధ్యాహ్న సమయ మున వినాయకుని పూజించెదరు. చతుర్థి మధ్యాహ్న వ్యాపినిగా యుండవలయును. తృతీయా యోగమును ప్రశంసించెదరు. ఈ దినమున చంద్ర దర్శనము మిథ్యాభి దూషణదోషమును (అప నిందను) కలుగచేయును అని చంద్రదర్శనము చేయరు.

## 97. శ్రీ కపిలేశ్వరస్వామి సన్నిధానమున వినాయకోత్సవము:

ఈ వినాయక చతుర్థీ దినమున, కపిలతీర్థ తీరమున యున్న శ్రీ కపిలేశ్వరస్వామివారి సన్నిధానమున వినాయకోత్సవము జరుగును.

## 98. ఋషి పంచమి:

భాద్రపద శుక్ల పంచమీ మధ్యాహ్నమున మహర్షులను పూజించి, దున్నని భూములయందు జనించిన శాకముల నాహారముగా తీసుకొనెదరు. ఈ పంచమీ దినద్వయమందు మధ్యాహ్న వ్యాప్తికలదైనను లేకున్నను పూర్వ దినమునందే ఋషి పూజనము చేయవలెను.

## 99. విష్ణుపరివర్తనైకాదశి (భాద్రపదశుద్ధైకాదశి):

శ్రీమహావిష్ణువు క్షీర సముద్రమునందు శేషతల్పమున యోగనిద్రకై ఆషాఢశుద్ధైకాదశీ దినమున శయనించి భాద్రపద శుద్ధైకాదశీ దినమున మరియొక ప్రక్కకు పొర్లును - అని "భాద్రేచ పరివర్తతే" అను మత్స్యపురాణము చెప్పుచున్నది. అందుచే ఈ ఏకాదశిని పరివర్తనైకాదశి అని వ్యవహరించుచున్నారు.

## 100. విష్ణుశృంఖల యోగము:

విష్ణుదేవతాకములగు ఏకాదశీ, ద్వాదశీ తిథులయందు విష్ణుదేవతాకమగు శ్రవణ నక్షత్రముతో యోగము విష్ణుశృంఖల యోగము.

"ద్వాదశీం శ్రవణర్‌క్షం తు స్పృశే దేకాదశీం యది।
స ఏవ వైష్ణవో యోగః విష్ణుశృంఖల సంజ్ఞికః॥"

అని స్మృతులు ఇది వైష్ణవ యోగము అని చెప్పుచున్నవి. పాంచ కాలిక విష్ణుపరాయణులగు ముముక్షువులు పగటి యందీ వైష్ణవయోగమును అధికముగా ప్రశంసించి చిరకాల లభ్యమగుటచే విష్ణు పూజల నధికముగా శ్రద్ధాభక్త్యుత్సాహము లతో నాచరించి, ఉపవాస వ్రతద్వయము ననుష్ఠించుచున్నారు.

ఉదాహరణము - ఏకాదశీ 18 ఘడియలు, ఉత్తరాషాఢ 6 ఘడియలు, ద్వాదశి 20 ఘడియలు, శ్రవణము 12 ఘడియలు అని ధర్మసింధువు చూపుచున్నది. విశేషములు నిబంధన గ్రంథముల యందు చూడతగియున్నవి.

## 101. శ్రవణ ద్వాదశి:

శ్రవణనక్షత్రముతో కూడిన ద్వాదశి.

సూర్యోదయానంతరము ఘటికాద్వయ పరిమితోత్తరాషాఢా వేధములేని, సాయాహ్నవ్యాప్తిగల శ్రవణ నక్షత్రముతో కూడినట్టియు, అస్తమయమునకు ముందు త్రిముహూర్త (ఆరు ఘడియలు) వ్యాప్తిగల త్రయోదశీ వేధములేనట్టియు సాయాహ్నవ్యాప్తి గల ద్వాదశి శ్రవణద్వాదశి అని శాస్త్రకారులు, మహర్షుల ప్రమాణ వచనముల ననుసరించి నిర్ణయించి యున్నారు.

ఇటుల నక్షత్రవేధములేని సాయంవ్యాప్తిగల శ్రవణ నక్షత్రము, తిథి వేధములేని సాయంవ్యాప్తిగల ద్వాదశి తిథియు

దుర్లభముగా యుండును. భాద్రపద ఫాల్గుణ మాసములయందు దైవ యోగమున లభించగలవు. అందుచే ముముక్షువులు, ఈ శ్రవణ ద్వాదశీ వ్రతమునందధికాదరము కలవారలై లభించిన సమయమున ఉపవాస వ్రతమునాచరించి శ్రీమహావిష్ణువును శ్రద్ధా భక్తులతో నధికముగా పూజించి త్రయోదశీ దినమున పారణము కావించి కృతార్థులగుచున్నారు. ఈ దినమున శ్రీస్వామివారికి సాయంకాలము తిరువీధుల ఉత్సవము ఆస్థానము జరుగును.

## 102. శ్రీవామన జయన్తి:

భాద్రపదశుక్ల ద్వాదశీ దినమున శ్రవణ నక్షత్రమునందు మధ్యాహ్న సమయమున భగవంతుడు లోకరక్షణార్థమై దశావతారములలో అయిదవదియగు వామనావతారమును స్వీకరించెను. అందుచే తదుపాసకులు అవతారదినమునందు శ్రీస్వామివారిని విశేషముగా పూజించెదరు. ఈ ద్వాదశీ మధ్యాహ్న వ్యాప్తికలదిగాను శ్రవణ నక్షత్రముతో కూడినదిగాను ఉండవలయును.

## 103. అనంతపద్మనాభ వ్రతము:

భాద్రపదశుక్ల చతుర్దశీ దినమున ఉదయమునందు ఈ వ్రతము జరుగును. ఈ వ్రతమునకు ఉదయమునందు త్రిముహూర్త వ్యాప్తిగల చతుర్దశీ తిథిని గ్రహించుట ముఖ్య పక్షము. ముఖ్య పక్షము లభించనప్పుడు ద్విముహూర్తవ్యాప్తిగల చతుర్దశిని గ్రహించుట అనుకల్పముగా తెలియవలెను. ఈ దినమున అనంతపద్మనాభస్వామిని పూజించెదరు.

## 104. మహాలయ పక్షారంభము:

భాద్రపద బహుళపక్షమునందలి మొదటి దినము మొదలు అమావాస్యవరకుగల 15 దినములు మహాలయ పక్షము. ఈ పక్ష ప్రారంభదినమగు ప్రతిపత్ అనగా పాడ్యమి అపరాహ్ణమును వ్యాపించి యుండవలయును. పితృ దేవతలనుగూర్చి ఈ 15 దినములు శ్రాద్ధముల నాచరించ తగి యున్నది.

## 105. బృహత్త్యుమా వ్రతము:

భాద్రపద మాసమున బహుళ పక్షమున తృతీయాదిన మున ఉమావ్రతమును జరుపుదురు. ఈ తృతీయ చంద్రోదయవ్యాపిని గ్రహించదగియున్నది. దీనినే ఉండ్రాళ్ల తద్దె అని తెలుగువారు నోరార పిలుచుచున్నారు.

## 106. మహాభరణి:

భాద్రపదబహుళ పక్షమునందు వచ్చిన భరణినక్షత్రము. ఇది అపరాహ్ణవ్యాప్తికలదై యుండవలయును. దీనియందు మహాలయ శ్రాద్ధమాచరించిన గయాశ్రాద్ధా ఫలము లభించును.

## 107. మధ్యాష్టమి:

భాద్రపద బహుళపక్షమునందలి అష్టమి. ఇది అపరాహ్ణ వ్యాప్తి కలదిగా యుండవలయును. దీనియందు మహాలయ శ్రాద్ధకరణము అనంతఫలప్రదము.

## 108. గజచ్ఛాయా:

"కృష్ణపక్షే త్రయోదశ్యాం మఘాస్విందుః కరే రవౌ।
యథాతథా గజచ్ఛాయాశ్రాద్ధే పుణ్యమవాప్యతే॥"

హస్తా నక్షత్రమున రవి యుండ చంద్రుడు మఘానక్షత్ర మందుండ కృష్ణపక్షత్రయోదశీ తిథిని గజచ్ఛాయ అందురు. ఇది పితృదేవతలకు ప్రీతిపాత్రమైనది. కావున శ్రాద్ధము పుణ్యప్రద మైనది.

## 109. మహాలయామావాస్యా:

భాద్రపదబహుళామావాస్యా. ఇది అపరాహ్ణవ్యాప్తికలదై యుండవలయును. ఈ అమావాస్యయందు పిత్రాదులను గూర్చి శ్రాద్ధమాచరించిన పితృదేవతలు తృప్తులై ఊర్ధ్వలోకములను పొందగలరు.

## 110. కన్యాసంక్రమణము:

సూర్యుడు మేషాది ద్వాదశరాశులలో ఆరవరాశియగు కన్యారాశియందు ప్రవేశించు సమయము - ఈ సమయమునకు పరము నందు గల 6-24 నిమిషములకాలము షడశీతి పుణ్య కాలము. ఈ సమయమున స్నానదాన జపాదులు చేయతగి యున్నవి. ఈ మాసమును కన్యామాసము అనియు పెరటాశి నెల అనియు వ్యవహరించుచున్నారు.

## 111. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవము:

కన్యామాసము ఆశ్వయుజమాసమగునప్పుడు ఆశ్వయుజ మాసమునందు విజయదశమి వరకు నవాహ్నికముగా జరుగు చుండును. ఒకప్పుడు కన్యామాసము భాద్రపదమాసమైనప్పుడు భాద్రపదమాసమునందును ఆశ్వయుజమాసమునందును కూడా రెండు బ్రహ్మోత్సవములు జరుగుచుండును.

బ్రహ్మోత్సవమును గూర్చి పురాణము లిట్లు చెప్పుచున్నవి.

''తత్రాహూయ మునీన్ సర్వాన్, మహీపాలాన్ యథాక్రమమ్।
కన్యామాసం గతే భానౌ ద్వితీయాయాం జగత్పతేః॥

ధ్వజారోహణ మాధాయ సాంకురార్పణమేవ చ।
వైఖానసై ర్మునిశ్రేష్ఠైః పూజామంత్రైః ప్రకల్పితా॥

నరయానం రత్నమయం నిధాయ పురతో హరేః।
వాసుదేవం బభాషేఽథ బ్రహ్మలోకపితామహః॥

నరయానం సమారుహ్య కురు చైత్య ప్రదక్షిణమ్।
ఏవముక్తః ప్రత్యువాచ శ్రీనివాసః పితామహమ్॥''

''శ్రీశ్రీనివాసస్వామివారి బ్రహ్మోత్సవము, సూర్యుడు కన్యారాశిని ప్రవేశించిన తరువాత ద్వితీయమందు అంకురార్పణ పూర్వకముగా ధ్వజారోహణమును బ్రహ్మదేవుడు వైఖానసుల చేత చేయించెను'' –అని చెప్పుచున్నవి. పిదప నవాహ్నికముగా వాహన మహోత్సవమును, పరదినమున పుష్పయాగ మహోత్స వమును జరిపించెను.

బ్రహ్మాది స్తంబపర్యన్త నియన్తయగు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవ వాహనక్రమమును ఉత్సవక్రమమును కూడా భవిష్యోత్తర పురాణము 14వ అధ్యాయము ఇట్లు చెప్పుచున్నది.

"తస్మిన్ మహోత్సవే విష్ణోః ధ్వజారోహణవాసరే।
ప్రథమే ప్రథమం యానం మనుష్యాన్దోలికాఽభవత్॥

ద్వితీయం చ తథా రాత్రౌ వభవ చ్ఛేషవాహనమ్।
శేషే శయనశీలస్య శేషాచలనివాసినః॥
సదా శేషప్రియస్యాస్య శ్రీనివాసస్య శార్జ్గిణః।

ద్వితీయదివసే చాద్యం భూయోఽభూచ్ఛేషవాహనమ్॥
ద్వితీయం చ తథా రాత్రావభవ ద్ధంసవాహనమ్।

తృతీయదివసే చాద్య మభవ త్సింహవాహనమ్॥
ద్వితీయం చ తథా యానం రాత్రౌ మౌక్తిక మండపమ్।

చతుర్థదివసే యానం ఆదిమం కల్పభూరుహః॥
ద్వితీయ మభవ ద్రాత్రౌ సర్వభూపాలవాహనమ్।

పంచమే దివసే చాద్యం యాన మాన్దోలికాఽభవత్॥
హరే రమృతసంధాయి మోహినీ వేషధారిణః।
ద్వితీయం రజనౌ యానం వేదవేద్యస్య వై హరేః॥
బభూవ చ స్వయం సాక్షాత్ ఛందోమూర్తిః ఖగేశ్వరః।

ఆద్యం యానం షష్ఠదినే హనూమా నభవద్ధరేః॥
ద్వితీయం మంగళగిరిః సాయం యాన మభూద్ధరేః।
మహిషీ సంయుతాస్యాస్య వసంతోత్సవ రాగిణః॥

తృతీయం రజనౌ యానం ఆసీద్దైరావతోగజః।
సప్తమేఽభూద్దినే యాన మాద్యం భాస్కరమండలమ్॥

ద్వితీయం మంగళగిరి స్స్యాయమాసీ ద్రమాపతేః।
రమణీయతమోద్యానవిహారోత్సవరాగిణః॥

కుసుమాపచయవ్యగ్ర మహిషీజనశాలినః।
తృతీయం రజనౌ యానః అభవ॥ చ్చంద్రమండలమ్॥

అష్టమేదివసే చాద్య మభవద్వాహనం హరేః।
నానావిధై రలంకారై ర్మండిత స్సుమహాన్ రథః॥

ద్వితీయం రజనౌ యానం అభూ దుచ్చైఃశ్రవాహ్వయః।
నవమే దివసే చాద్యం యాన మాందోళికాఽభవత్॥

ద్వితీయం మంగళగిరిః యాన మాసీ ద్రమాపతేః।
హరిద్రైః పింగళై శ్చూర్ణైః అభిషిక్తస్య మంగళైః॥

సముద్యుక్తస్యావభృథస్నానమాంగళికోత్సవే।
స ఇత్థం మంగళై శ్చూర్ణై ర్హారిద్రై రభిషేచితః॥

సుందర మ్మంగళగిరిం సమారుహ్య సతాం గతః।
చైత్యం ప్రదక్షిణీకృత్య సహస్రైర్వ్వ ర్మహాజనైః॥

జపద్భి ర్వైదికాన్ మన్త్రాన్ సహితశ్చ ద్విజోత్తమైః।
చకారావభృథస్నానం భగవానాదిపూరుషః॥

స్వామిపుష్కరిణీతీర్థే సర్వలోకైకపావనే।
అవతారదినే తస్మిన్ నక్షత్రే శ్రవణే ప్రగే॥

తృతీయం మంగళగిరి ర్యానం రాత్రావభూత్తతః।
ధ్వజావరోహణాభిఖ్యః ఉత్సవోఽభూ త్తదా హరేః॥

తతోఽపరేద్యు రభవత్ పుష్పయాగమహోత్సవః।
దేశాన్తరాదాగతానాం సపర్యాఽఽసీత్తతో నృణామ్॥

దేవా జగ్ము స్స్వకం ధామ రాజానో రాజసత్తమ।
జగ్ముస్స్వనగరం దివ్యం దృష్ట్వా దేవమహోత్సవమ్॥
బ్రహ్మ జగామ స్వకం లోకం నత్వా వేంకటవల్లభమ్॥

ఇటుల బ్రహ్మదేవుడు దేవతలను రాజులను రప్పించి శ్రీస్వామివారికి 10 దినములు ఉత్సవముచేయించెను. వారలను సన్మానించి స్వస్థానములకు పంపెను. తాను శ్రీవారికి నమస్కరించి స్వస్థానమగు సత్యలోకమునకు వెళ్ళెను.

బ్రహ్మ జరిపిన ఉత్సవములో 6వ దినమున సాయంకాలము ఉద్యానవిహారోత్సవము పదవదినమున పుష్పయాగమహోత్సవ మున్నూ ఇప్పుడు జరుగుటలేదు. కారణము తెలియదు. జరుగతగి యున్నవి.

పూర్వము శ్రీస్వామివారికి సర్వకామప్రదమగు నవాహ్నిక బ్రహ్మోత్సవమును బ్రహ్మదేవుడు కన్యామాసమునందు జరిపించియుం డెను. ఇప్పటికిని అటులనే కన్యామాసమున శ్రీస్వామివారి అవతార నక్షత్రమగు శ్రవణనక్షత్రమునందు, వైఖానసశాస్త్ర ప్రకారము అవ భృథమును సంకల్పించి ఆ దినముతోకూడిన తొమ్మిది దినములు ముందుగా ధ్వజారోహణమును అందులకు పూర్వదినమున అంకు రార్పణమును చేయించి బ్రహ్మదేవుని యేర్పాటు ప్రకారం తొమ్మిది

దినములు ఉత్సవములు జరుపుచూ తొమ్మిదవదినమున శ్రవణనక్షత్రము నందు అవభృథమును జరుపుచున్నారు.

ఈ కన్యామాసము సౌరమానము ననుసరించి యేర్పడినది. ఇది చాంద్రమానము ననుసరించిన భాద్రపదమాసమందును, ఆశ్వయుజ మాసమందును వచ్చుచుండును. ఏలయన సౌరమానప్రకారము సంవత్సరమునకు 365 దినములు అధికమాసములుండవు. చాంద్రమాన ప్రకారము సంవత్సరమునకు 354 దినములు. అధిక మాసము లుండును. అధికమాసము అనగా సూర్యసంక్రమణము లేని మాసముగా తెలియవలెను.

చాంద్ర సంవత్సరము తక్కువదినములు కలదియగుటచేత సూర్యగమనముబట్టి ఒకప్పుడు చాంద్రమాసములలో సూర్యసంక్రాన్తి లేని మాసము కూడా తటస్థించును. అదియే అధికమాసము. ఆ అధికమాసము పూర్వమువచ్చిన అధికమాసమునకు 30 ముప్పదిమాసములకు పైన 38 మాసములు. లేక 39 మాసములకులోగా రాగలదు. అని శాస్త్రము చెప్పుచున్నది. అందుచే సామాన్యముగా మూడు సంవత్సరములకొక పర్యాయము అధికమాసము వచ్చుచుండును. అటుల అధికమాసము రాని సంవత్సరములలో కన్యామాసములో శ్రవణ నక్షత్రము ఆశ్వయుజ మాసములోనే యుండును. అప్పుడు ఆశ్వయుజమాసములోనే బ్రహ్మోత్సవము జరుగుచుండును. అధికమాసమువచ్చిన సంవత్సరములో కన్యామాసములో శ్రవణ నక్షత్రము భాద్రపదమాసమునందు యేర్పడునుగాన అప్పుడు బ్రహ్మ యేర్పాటు ప్రకారం కన్యామాసముతో కలిసిన భాద్రపదమాసమునందు బ్రహ్మోత్సవము జరుగును.

అట్టి సమయమున ఆశ్వయుజమాసములో కూడా రెండవ

బ్రహ్మోత్సవము చేయుచున్నారు. రెండవబ్రహ్మోత్సవముగల విశేషములు ముందు వ్రాయబడును.

కన్యామాసముతో కూడిన భాద్రపదమాసమునందు జరుగు బ్రహ్మోత్సవక్రమము పూర్వము ఉత్సవభాగములో వ్రాయబడినది.

## 112. ఆశ్వయుజమాసము:

చాంద్రమాన సిద్ధములగు చైత్రాది ద్వాదశమాసములలో ఏడవదియగు మాసము. అశ్వాయుక్ అను నామంతరముకల అశ్వనీ నక్షత్రముతోకూడిన పూర్ణిమగల మాసమగుటచేత ఆశ్వయుజమాసమనియు, ఆశ్వినమాసమనియు వ్యవహరించుచున్నారు.

## 113. శరన్నవరాత్రారంభము:

ఆశ్వయుజశుద్ధ ప్రతిపత్ (పాడ్యమి) దినమున ప్రారంభమగును.

ఆశ్వయుజ కార్తికమాసములు శరదృతువు కాన శరదృతువు యొక్క మొదటి తొమ్మిది దినములను శరన్నవరాత్రములు అని వ్యవహరించుచున్నారు. దేవ్యుపాసకులు దేవీనవరాత్రములు అని వ్యవహరించుచున్నారు.

## 114. శ్రీ కపిలేశ్వరస్వామి వారి సన్నిధిలో కలశస్థాపనము:

ఆశ్వయుజ శుద్ధ ప్రతిపత్ దినమున శ్రీ కపిలేశ్వరస్వామివారి సన్నిధిలో కలశపూజ ప్రారంభము.

## 115. శ్రీతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి రెండవ బ్రహ్మోత్సవము:

కన్యాభాద్రమాసమునందును, కన్యా ఆశ్వయుజమాసము నందును జరుగు బ్రహ్మోత్సవములవలె ఈ కేవలాశ్వయుజమాసమునందు జరుగు (రెండవ) బ్రహ్మోత్సవము మామూలు ప్రకారం శ్రవణ నక్షత్రమునందు అవభృథము జరుగు యేర్పాటుతో నవాహ్నికముగా జరుగును.

### ఉత్సవ వివరణము

| | వగలు | రాత్రి |
|---|---|---|
| 1వ దినము | | సేనాధిపతి ఉత్సవము, అంకురార్పణము |
| 2వ దినము | వజ్రకవచా ద్యాభరణములతో బంగారు తిరుచ్చి | పెద్ద శేష వాహనము |
| 3వ దినము | చిన్న శేష వాహనము | హంస వాహనము |
| 4వ దినము | సింహ వాహనము | ముత్యపుపందిరి వాహనము |
| 5వ దినము | కల్పవృక్షవాహనము | సర్వభూపాల వాహనము |
| 6వ దినము | పల్లకీలో మోహినీ అవతారోత్సవము | విశేషాభరణములతో గరుడోత్సవము |
| 7వ దినము | హనుమద్వాహనోత్సవం సాయంకాలము: వసంతోత్సవము | గజ వాహనము |

8వ దినము సూర్యప్రభ వాహనము - చంద్రప్రభ వాహనము

9వ దినము రథోత్సవము - అశ్వ వాహనము

10వ దినము పల్లకీ ఉత్సవము
తీర్థవారి అవభృథము
చక్రస్నానము
} - బంగారు తిరుచ్చిలో శ్రీవారికి ఉత్సవము

ఇటుల పూర్వమువలెనే వాహనోత్సవములు జరుగును. ధ్వజారోహణము, ధ్వజావరోహణము జరుగవు.

విశేషమేమన మొదటి బ్రహ్మోత్సవములో రాత్రి వాహనోత్సవాన్తమునందు తిరుమల రాయమండపములో సామాన్యముగా ఆస్థానములు ప్రతినిత్యము జరుగును. ఈ రెండవ బ్రహ్మోత్సవములో అట్లుకాక ప్రతినిత్యము రాత్రివాహనోత్సవాన్తమున సర్వాలంకారభూషితులగు శ్రీమలయప్పస్వామివారు పట్టమహిషులగు శ్రీ భూదేవులతో సహా, పుష్పమాలసహస్రముల చేతను విద్యుద్దీప సహస్రముల చేతను, సంమర్దకలకలనివారకములగు తర్జనీముద్రలతోకూడి అతిసుందరములగు ద్వారపాలక విగ్రహములచేతను, కన్నులకరువుతీర నలంకరింపబడి శ్రీవారి మహోత్సవానంద పరితృప్తులగు భక్తమానవకోటికి కలియుగ వైకుంఠమునందలి మణిమండప భావమునుప్పతిలచేయునట్టి రంగ మండపమునందు ప్రకాశించు శేషభూతుడైన సౌవర్ణమహాశేషుని యందు వేంచేయుదురు.

వెంటనే శ్రీస్వామివారి కైంకర్యపరుడగు అదృష్టశాలియైన అర్చకుడు, యంత్రికాలంకృతభుజుడై శ్రద్ధాభక్తులతో శ్రీవారి సన్నిధానమునకు చేరి సంకల్పించి శ్రీవారికి ఉత్సవ శ్రమాపనోదనకరములగు నుపచారముల నర్పించును.

పిమ్మట అనేక వేణు పాత్రములయందును (వెదురు గంపలయందు) అనేక గంగాళములయందును నిండియున్న వివిధ భక్ష్యములను వివిధభోజ్యములను, వివిధ ప్రసాదములను, వివిధ ఫలములను నివేదించి ఏలాలవంగ తక్కోల జాజీకర్పూ రాది విమిశ్రితమగు ముఖవాసమును (తాంబూలమును) సమర్పించును. యవనిక (తెర) తొలగును.

అర్చకులు ఆచార్యపురుషులు, అధి కారులు, జియ్యంగార్లు, ఉభయదార్లు, భక్తులు, భాగవతులు, యోగిపుంగవులు పరిచారకులు, పరివారములు మొదలైనవారలతో నిండియున్న పరమవైష్ణవ సభ అంతయు దేవతలవలె రెప్పలువాల్చక మహాశేషునియందు వేంచేసియున్న దివ్యదంపతులగు శేషిదంపతులను దర్శనము చేయుచూ ఆనందసాగరమగ్నులై మైమరచియుందురు.

అంతట భువనైకనాథ మర్యాదలతో శ్రవణపేయములగు మధుర మంజుల వాద్యనాదములతో, బ్రహ్మాండనాయకుడగు మహాప్రభువు యొక్క దివ్యాస్థానము ప్రారంభమగును. మంగళాశాసనము జరుగును. ఆశ్రితులగు మిరాశీదార్లకు మర్యాదలు జరుగును. గోష్ఠీమర్యాదలతో శ్రీ వైష్ణవ, భక్తజనబృందమునకు, పరమేశ్వరానుభూతమగు మహాప్రసాదము వినియోగము చేయబడును.

అంతట శ్రీస్వామివారు ఆశ్రితమానవకోటి ననుగ్రహించి పట్టమహిషులతో బంగారు తిరుచ్చినధిష్ఠించి ఆనందనిలయమున శ్రీస్వామివారి సన్నిధానమునకు వేంచేయుదురు. ఇటుల తొమ్మిది దినములు శ్రీవారికి ఆస్థానములుజరుగును. ఇది రెండవ బ్రహ్మోత్సవ విశేషము.

## 116. సరస్వతీ పూజ:

ఆశ్వయుజమాసమున శుక్లపక్షమునందు మూలా నక్షత్రమున పుస్తకములయందు సరస్వతీదేవికి ఆవాహన పూజన ములను ప్రారంభించి పూర్వాషాఢా, ఉత్తరాషాఢా శ్రవణ నక్షత్రముల యందు పూజించి శ్రవణనక్షత్రమునందు దేవీవిసర్జ నమును చేయుదురు. మూల ప్రథమపాదమునందు సరస్వతీ ఆవాహనమున శ్రవణ ప్రథమపాదమునందు విసర్జనము జరుగ వలెను.

## 117. మహాష్టమి:

ఆశ్వయుజమాసమున శుక్లపక్షమునందలి అష్టమి.

ఈ అష్టమియందు దేవీపూజనము చేయుదురు. ఉదయ కాలమునకు ఘటికామాత్రవ్యాప్తిగల అష్టమి నవమీయుతము ప్రశస్తము. మంగళవారముతో కూడిన అతిప్రశస్తము. సప్తమి వేధము స్వల్పమైనను పనికిరానేరదు.

## 118. మహానవమి:

ఆశ్వయుజమాసమున శుక్ల పక్షమునందలి నవమి.

ఈ నవమియందు దేవీపూజనమును చేయుదురు. ఆశ్వ యుజ శుద్ధ - ప్రతిపత్తునుంచి దేవీనవరాత్రములు అను పేరుతో దేవిని పూజించుచూ ఈ నవమీ దినముతో పూజను సమాప్తిని యొనరించెదరు. అష్టమీవిద్ధయగు నవమి గ్రహించవల సియున్నది. మహాష్టమికి మహానవమికి యోగము మధ్యాహ్న

మందుగాని, అపరాహ్ణమందుగాని కలిగి మహాష్టమీ పూజ, మహానవమీ పూజ, తత్సంధిపూజ ఒక దినమందే చేయవలసివచ్చే యెడల అన్ని పూజలు తంత్రమున చేయవలయును.

ఈ మహానవమియందు ప్రభువులు, ఛత్రచామరాది రాజచిహ్నములను, గజాశ్వాది చతురంగబలమును, చాపాది శస్త్రములను, దుందుభి మొదలగు విజయవాద్యములను పూజించవలెను.

## 119. విజయదశమి:

ఆశ్వయుజమాసమున శుక్ల పక్షమునందుకల దశమి. ఈ దశమికి పరదినమునందు అపరాహ్ణవ్యాప్తి కలిగియున్న పరదినమే గ్రహించవలయును. పూర్వదినమునందును, పరదినము నందును దినద్వయమందును అపరాహ్ణవ్యాప్తి కలిగియున్నను, లేకున్నను, శ్రవణయోగమున్న పూర్వదినమే గ్రహించవలయును. శ్రణయోగము ముఖ్యముగా గ్రహించవలసియున్నది.

ఈ విజయదశమియందు అపరాజితాపూజనము సీమోల్లంఘనము, శమీపూజనము, రాజపట్టాభిషేకము, ప్రస్థానము, సరస్వత్యుద్వాసనము స్వాచారప్రకారము చేయనగును.

రాజ్యపట్టాభిషేకమునకు నవమీవిద్ధయగు ఈ విజయదశమి శ్రవణయోగము కలిగినను పనికిరానేరదు. ఉదయవ్యాప్తిగల దశమి గ్రహించవలసియున్నది. ప్రయాణము విజయ ముహూర్తములో చేయవలయును. విజయ ముహూర్తములు రెండు విధములుగానున్నవి.

1. సంధ్యాకాలమును కొంచెము అతిక్రమించి కొంచెము నక్షత్రోదయముతో కూడిన కాలము.

2. దినభాగవములో 11వ ముహూర్తము అనగా (22 ఘడియల కాలము) ఈ రెండు విజయ ముహూర్తము లలో దశమితో కూడిన విజయముహూర్తమున ప్రయాణము విజయసాధకము, సర్వకార్య సాధకము అగుచున్నది. ఏకాదశీ యోగము యెంత మాత్రము పనికిరాదు. విజయసాధకమగుటచే నీ దశమిని ''విజయదశమి'' అని వ్యవహరించుచున్నారు. ఈ విజయదశమి అన్ని కార్యములయందు శుభకరమైనది. ఈ దశమి యందు విజయ ముహూర్తము అడ్డులేక కార్యమును సాధించగలదు. ప్రయాణము ఉత్తమోత్తమము. ఈ ముహూర్తము శ్రవణనక్షత్రముతో కూడిన కార్యసిద్ధినిగూర్చి చెప్పవలసినదేమున్నది అని శాస్త్రము చెప్పుచున్నది.

శ్రీ వేంకటేశ్వరస్వామివారికి ఈ విజయదశమీ శ్రవణ నక్షత్రమునందు బ్రహ్మోత్సవాన్తమగు అవభృథోత్సవము (చక్రస్నానము) జరుగును.

## 120. శ్రీవారి బాక్సవారీ ఉత్సవము:

బ్రహ్మోత్సవ ధ్వజావరోహణము జరిగిన మరుదినము సాయంకాల మీ ఉత్సవము జరుగును. శ్రీమలయప్పస్వామివారు శ్రీ, భూదేవులతో తిరుచ్చి నధిష్ఠించి వాహన మండపమునకు వేంచేయుదురు. అచ్చట ఆస్థానము జరుగును.

పిమ్మట అప్రదక్షిణముగా తిరువీథ్యుత్సవముతో పుర్శై వారి తోటలోని మండపమునకు వేంచేయుదురు. అచ్చట ఆస్థా

నము జరుగును. వెంటనే శేషించిన వీధ్యుత్సవముతో శ్రీవారి సన్నిధానమునకు వేంచేయుదురు.

## 121. చంద్రోదయోమావ్రతము:

ఆశ్వయుజ బహుళ తృతీయా దినమున ఉమావ్రతమును సలుపుచున్నారు. ఈ తృతీయా చాంద్రోదయోమావ్రతం ఖ్యాతిని శ్రేష్ఠతమమైయున్నది.

## 122. నరకచతుర్దశి:

ఆశ్వయుజమాసమున బహుళపక్షమునందుకల చతుర్దశి.

ఈ చతుర్దశి చంద్రోదయవ్యాప్తికల్దై యుండవలయును. అది ముఖ్యకాలము. ఈ కాలమునందు నరక భయము కలవారు నువ్వులనూనెతో అభ్యంగస్నానము చేయవలయును. ఈ కాలము మూడు విధములుగానున్నది.

1. చతుర్దశి అంత్యయామము మొదలు అరుణోదయము వరకు ఒక కాలము.

2. అరుణోదయము మొదలు చంద్రోదయము వరకు ఒక కాలము.

3. చంద్రోదయము మొదలు సూర్యోదయము వరకు ఒక కాలము.

ఈ మూడు కాలములు ముఖ్యములైనను మొదటిదానికంటె రెండవది, రెండవదానికంటె మూడవది క్రమముగా ఉత్తమోత్తమములుగా గ్రహించవలయును.

కనుక చంద్రోదయోత్తర కాలము అభ్యంగస్నానమునకు ముఖ్యకాలము, ప్రాతఃకాలము గౌణకాలము. ఈ చతుర్దశి పూర్వ దినమునందే చంద్రోదయవ్యాప్తి కలదేని పూర్వదినము, పరదినమునందే చంద్రోదయవ్యాప్తి కలదేని పరదినము - అని గ్రహించవలయును.

తిరుమల శ్రీస్వామివారి దేవస్థానములో ఈ నరకచతుర్దశియందు రాత్రి తీర్మానము అయిన తరువాత దిట్టం ప్రకారం దేవస్థానం ఉగ్రాణంనుండి నూనె, శీకాయ వగైరాలు వచ్చును.

వాటికి శ్రీవారి బంగారు వాకిలిముందు అర్చకులు, ఏకాంగి వగైరా కైంకర్యపరులు, దేవస్థానం ఉద్యోగస్థులు వగైరాల గోష్ఠికి స్థాన బహుమాన పూర్వకముగా వినియోగం జరుగును. పిమ్మట శేషించిన, నూనె, శీకాయ వగైరాలను దేవస్థానం ఉత్తర పారుపత్యదారు నౌకర్ల చేత యెత్తించుకుని దేవస్థానం మంగళవాద్యములతో పెద్ద జియ్యంగారిమఠం, హాత్తీరాంజీ మఠం మార్గముగా వెళ్ళి తిరువీధులలోయుండే గ్రామస్థులకు కొంచెము కొంచముగా యిచ్చును. ఆ భాగవత శేషమును గ్రామస్థులు తీసుకుని చంద్రోదయ కాలమున అభ్యంగస్నానమునుచేసి కృతార్థులయ్యేదరు. ఇది అనాదియగు ఆచారము.

## 123. దీపావళి అమావాస్యా ఆస్థానం:

ఆశ్వయుజ బహుళామావాస్యయందు జరుగును.

ఈ అమావాస్యయందు ప్రాతఃకాలమున అభ్యంగస్నానమును దేవపూజనాదికమును అపరాహ్ణకాలమున తర్పణమును సాయంప్రదోష సమయమున దీపదానమును, ఉల్కా

ప్రదర్శనమును, లక్ష్మీపూజనమును యథాచారముగా చేయనగును. ఈ అమావాస్యా పరదినమందుగాని దినద్వయమందుగాని ప్రదోషసమయమున వ్యాప్తి కలిగియున్న పరదినమే గ్రాహ్యము. ఈ దీపావళి అమావాస్యకు స్వాతీయోగము ప్రశస్తముగా తలంచవలసియున్నది. ఈ దీపావళి దినమున తిరుమల శ్రీ స్వామివారికి ఆస్థానమండపమునందు అతి వైభవముగా ఆస్థానము జరుగును.

## 124. కేదారగౌరీ వ్రతము:

ఈ ఆశ్వయుజ బహుళామావాస్యా పుచ్ఛభాగమును గమనించి గౌరీ వ్రతమును తద్భక్తులు చేయుచుందురు.

## 125. తులాసంక్రమణము:

సూర్యుడు మేషాది ద్వాదశ రాశులలో సప్తమ రాశియగు తులారాశియందు ప్రవేశించు సమయము. ఈ సమయమునకు పూర్వము 6 గంటల కాలమును పరమునందు 6 గంటల కాలమును విషువము అను పుణ్యకాలము. ఈ పుణ్యకాలము నందు స్నాన, దాన, కర్మ, ధర్మ, జపాదులు చేయతగియున్నవి. ఈ మాసమున తులామాసము అనియు, ఆల్పిశి మాసము అనియు వ్యవహరించుచున్నారు.

## 126. తులాకావేరీ స్నానం:

ఈ తులామాసమున కావేరీ మహానదియందు సనియమముగా స్నానమాచరించి శ్రీ మహావిష్ణువు నారాధించినవారలకు చతుర్విధ పురుషార్థములు లభించును.

## 127. శ్రీ కపిలేశ్వరస్వామి సన్నిధానమున అన్నాభిషేకోత్సవము:

ఈ తులామాసమునందుగల పూర్ణిమయందు శ్రీకపిలేశ్వర స్వామివారికి అన్నాభిషేకోత్సవము అతి వైభవముగా జరుగును.

## 128. సువర్ణముఖరీతీర్థ ముక్కోటి - రుద్రపాదాలు:

తులామాసమునందలి పూర్ణిమాదిసమున ఈ సువర్ణముఖరీ తీర్థముక్కోటి జరుగును.

వివరణము:- పూర్వము పాండవులు అజ్ఞాతవాసము చేయుతరి అర్జునుడు సమయోల్లంఘన ప్రాయశ్చిత్తార్థమై తీర్థ యాత్రలు చేయుచూ సువర్ణముఖరీ నదీతీరమునగల భారద్వాజా శ్రమమునకు వచ్చి భారద్వాజ మహర్షిచే గౌరవింపబడి ఆతిథ్యమును పొందెను.

అందుచే ఆనందమును పొందిన అర్జునుడు భారద్వాజ మహర్షిని ఈ సువర్ణముఖరీ నదీచరిత్రమును తెలియజేయుమని కోరెను.

భారద్వాజ మహర్షి అర్జునున కిట్లు చెప్పెను:

పూర్వము శివుడు పర్వతరాజ పుత్రియగు పార్వతిని పరిణ యము చేసుకొనుటకు హిమవన్నివాసమగు ఓషధీ ప్రస్థమునకు వచ్చెను. శివాజ్ఞచే నచ్చటికి సకల ప్రాణిజాతము పార్వతీ పరిణయ మును దర్శించుటకు వచ్చెను. ఆ ప్రబలమైన ప్రపంచ భారముచేత భూమి ఉత్తర భాగమున పాతాళమువరకు క్రుంగిపోయెను. అందుచే సకల ప్రాణిజాతము అతిభయకంపితమై ఖేదమును పొందెను.

అంత మహేశ్వరుడు అగస్త్య మహర్షిని పిలిచి ఓ మహర్షి వర్యా! నీవు సర్వశక్తియుక్తుడవు గాన ఈ భూవైప రీత్యమును తొలగించి సమీకరణమునుచేయ సమర్థుడవు. దక్షిణ దిక్కునకు వెళ్లుము. నీవు వివాహమును చూడలేదను కొరతను తీర్చుటకు నేను నీవు ఉన్నచోట పార్వతీపాణిగ్రహణకల్యాణ భాసురమూర్తిని ప్రదర్శించగలను అని చెప్పి మహర్షిని దక్షిణ దిశకు పంపెను.

ఆ మహర్షి క్రమముగా వింధ్య పర్వతమును దాటి దక్షిణ దిగ్భాగమునకు వెళ్ళగానే భూమి పూర్వమువలే సమస్థి తికి వచ్చెను అంతట దేవ గంధర్వ కిన్నరాదులు ఆ అగస్త్య మహర్షిని బహు విధములుగా కొనియాడిరి.

ఆ మహర్షి అచ్చట అతి రమణీయమగు పర్వతమును కాంచి ఆ పర్వతాగ్రమున గల అమృతోపమేయమగు కాసా రము యొక్క ఉత్తరతటమున ఆశ్రమమును కల్పించుకుని అనుచరమగు ముని గణముతో సహా నివసించుచుండెను. అందుచే నా పర్వతమునకు అగస్త్య పర్వతము అను నామధేయము కలిగెను.

అగస్త్య మహర్షి ఒక దినమున నిత్యకర్మల నాచరించి పూజామందిరమునకు వెళ్ళి శివపూజ నారంభింప ''ఓ మునీంద్రా! ఈ ప్రదేశమున ఒక మహానదిని ప్రవహింప చేయుము. నదీ హీనమగు ప్రదేశము శోభింపనేరదు'' అని అశరీరవాక్కు వినపడెను.

అంత నా మహర్షి శివపూజను పూర్తియొనరించుకుని ఆశ్రమ వాసులగు మునులను రావించి ఈ దివ్యవాక్కును

వినిపించెను. వారందరు మహర్షి నభినందించి మహానదీ సంపాదమునకు ప్రోత్సహించిరి. అగస్త్య మహర్షియు నదీసంపత్తికై నిరాహార దీక్షతో ఘోరమగు తపస్సును చేయ జగత్తు సంక్షోభమునొందెను. దేవతలు ఈ విషయమును పద్మభవునకు నివేదించిరి. పద్మభవుడు మహర్షి పురోభాగమున ప్రత్యక్షమై ఓ మునీంద్రా! నీ తపస్సుకు సంతుష్టుడనైతిని. తపస్సును విరమించుము. వరము కోరుము అని చెప్పెను.

అంత అగస్త్య మహర్షి తన సంకల్పానుగుణముగా ఉర్వీ పావన సమర్థమగు నదీసంపత్తిని కోరెను. చతురాననుడు అందుల కంగీకరించి వియద్గంగను ఆహ్వానించెను. ఓ గంగా తీర్థరాజమా! ఈ అగస్త్య మహర్షి కోరిన ప్రదేశమున లోక పావనియగు మహానదిని నీ అంశచే ప్రవర్తింప చేయుము అని నిర్దేశించి అంతర్ధానము నొందెను.

ఆ వియద్గంగ ఓ మహర్షివర్యా! యే ప్రదేశమున మహానదిని ప్రవర్తింపచేయుట అభిమతము అని అడుగగా, ఆ మహర్షి నా వెంటరమ్ము అని చెప్పి ముందు తాను నడువ ప్రారంభించెను. వెనుక గంగ ప్రవహించుచుండెను, అది చూచి దేవతలు మహర్షులు, మహానదిని మహర్షిని కొనియాడిరి.

ఆ సమయమున పద్మయోనిచే నిర్దేశించబడిన వాయువు ఆ పుణ్యనదికి దేవతలు అందరు వినుచుండగా ''సువర్ణముఖరీ'' అని నామకరణము చేసెను. సువర్ణమువలె లోకములకు మహాభాగధేయముగా ముఖరీకృత దిఙ్ముఖములు కలదై అవతరించినదిగాన అన్వర్థనామధేయము కలదాయెను.

ఈ సువర్ణముఖరీ మహానది అగస్త్య శైలమున అవతరించినదై

అగస్త్య మహర్షిచే భూభాగమునందు ప్రవర్తింపచేయబడి ప్రశస్త తీర్థౌఘ విరాజమానమగుచూ దక్షిణ వారిరాశిని చేరెను.

ఇట్టి సర్వశ్రేయస్సాధన సలిల సంపూరిత సువర్ణముఖరీ మహానదికి తులామాసమునందు పూర్ణిమా దినమున తీర్థము క్కోటిని నిశ్చయించి శివభాగవతులు సువర్ణముఖరీ మహానదీ స్నానమును దానములను జపములను రుద్రపాద పూజనములను చేయుచూ కృతార్థులగుచున్నారు.

లోకైక పావనియగు ఈ సువర్ణముఖరీ తీరమున అగస్త్య తీర్థము కలదు. ఆ తీర్థ తీరమునకు ఉత్తర భాగమున అగస్త్యేశ్వరుని మందిరము కలదు. ఆ మందిరమున కుంభ సంభవుడగు అగస్త్యమహర్షిచే ప్రతిష్ఠింపబడిన లోకానంద సంధాయకుడగు పార్వతీపతి అగస్త్యేశ్వర నామముతో ప్రకాశించుచున్నాడు.

మకర సంక్రమణ పుణ్యకాలమున సువర్ణముఖరీ మహానది స్నానము, అగస్త్య తీర్థస్నానము, అగస్త్యేశ్వర దర్శ నము అనంతకోటి పుణ్యఫలప్రదము అనియు ఈ సువర్ణముఖరీ మహానదీ తీరమున అగస్త్యోదయ పుణ్యకాలమునందు అగస్త్య సువర్ణ ప్రతిమాదానము, బ్రహ్మపదప్రాప్తి సాధనము అనియు ఇటుల అనేక పుణ్యఫలములను స్కాందపురాణము ప్రబోధించు చున్నది.

## 129. శ్రీతిరుమలనంబివారి శాత్తుమొర:

వీరికి తులామాసమునందు అనూరాధా నక్షత్రమున శాత్తుమొర నిర్ణయించి ఆ దినముతో కూడిన పదవదినము

నందు ముందుగా ఉత్సవమును ప్రారంభించి చేయుచు పదవ దినమున శాత్తుమొర చేయుచున్నారు.

నిత్యానుసంధానమునందు

''శ్రీమల్లక్ష్మణయోగీంద్ర శ్రీరామాయణ దేశికం।
శ్రీశైలపూర్ణం వృషభస్వాతీ సజ్జాతమాశ్రయే॥''

అని శ్రీ తిరుమలనంబిగారికి వృషభమాసములో స్వాతీ నక్షత్రము జన్మనక్షత్రముగా పేర్కొనబడుచున్నది. ఏ కారణము చేతనో తులామాసమున అనూరాధా నక్షత్రము జన్మ నక్షత్రముగా నిర్ణయించి ఆ దినమున వారికి శాత్తుమొర జరుపుచున్నారు.

## 130. శ్రీమణవాళ మహామునులవారి శాత్తుమొర:

''తులాయా మతులే మూలే పాండ్యే తు కురుకాపురే।
శ్రీశేషాంశోద్భవం వన్దే రమ్యజామాతరం మునిమ్॥''

ఈ మహామునుల వారు పాండ్యదేశమునందు కురుకాపురమను తులామాసములో మూలానక్షత్రమునందు శేషాంశము వలన అవతరించిరి గాన తులామాసమున మూలానక్షత్రము నందు శాత్తుమొర సంకల్పించి ఆ దినముతో కూడిన పదవ దినమునందు ముందుగా ఉత్సవము ప్రారంభించి ఉత్సవములు జరుపుచూ పదవదినమున శాత్తుమొర జరుపుచున్నారు.

## 131. శ్రీ సేనై మొదలియార్ వారి వర్ష తిరునక్షత్రం:

"తులాం గతే దినకరే పూర్వాషాఢా సముద్భవం।
పద్మాపదాంబుజాసక్తం సేనాధిప మహం భజే॥"

ఈ సేనాధిపతివారు తులామాసమున పూర్వాషాఢా నక్షత్రము నందు అవతరించిరి గాన వీరికి తులామాసమునందు పూర్వాషాఢా నక్షత్రమున వర్షతిరునక్షత్రము జరుగును.

## 132. శ్రీ వేదాన్తదేశికులవారి శాత్తుమొర:

శ్రీ నిగమాన్త మహాదేశికులవారికి తులామాసమునందు శ్రవణనక్షత్రమున శాత్తుమొర సంకల్పించి ఆ దినముతో కూడిన పదవదినమునందు ముందుగా ఉత్సవము ప్రారంభించి ఉత్సవములు చేయుచూ పదవదినము శాత్తుమొర జరుపు చున్నారు.

"కన్యా శ్రవణ సంభూతం ఘంటాంశం వేంకటేశితుః।
శ్రీమద్వేంకటనాథార్యం వందే వేదాన్తదేశికమ్॥"

వీరు కలియుగమున 4371వ సంవత్సరమగు శుక్లవత్స రమున కన్యామాసములోని శుద్ధ దశమీ బుధవారము నాడు శ్రవణ నక్షత్రమునందు యజుశ్శాఖాధ్యాయులును, అపస్తంబ సూత్రులును, విశ్వామిత్ర గోత్రోద్భవులునగు అనంత సూరికి తోతారమ్మ గర్భమునందు పండ్రెండు సంవత్సరములు నివసించి తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఘంటాంశముగా కాంచీపురమునందు హిమోపవనమున (క్రీస్తు 1270వ సం॥) అవతరించిరి.

అందుచే కన్యామాసములోని శ్రవణనక్షత్రమునందు వారికి తిరునక్షత్రము జరుగవలసియున్నను యే కారణముచేతనో తులామాసములోని శ్రవణనక్షత్రమునందు జరుగుచున్నది.

## 133. శ్రీపిళ్లై లోకాచార్యులవారి వర్షతిరునక్షత్రం:

''తులాయాం శ్రవణే జాతం లోకార్య మహ మాశ్రయే।
శ్రీకృష్ణపాదతనయం తత్పదాంబుజసంశ్రితమ్॥''

లోకాచార్యులవారు తులామాసములోని శ్రవణనక్షత్రము నందు శ్రీ కృష్ణపాదతనయులుగా అవతరించిరి. అందుచే వీరికి తులామాసములోని శ్రవణనక్షత్రమునందు వర్షతిరు నక్షత్రమును చేయుచున్నారు.

## 134. శ్రీపొయ్‌గైయాళ్వారు వర్షతిరునక్షత్రం:

''తులాయాం శ్రవణే జాతం కాంచ్యాం కాంచనవారిజాత్।
ద్వాపరే పాంచజన్యాంశం సరోయోగిన మాశ్రయే॥''

ఈ పొయ్‌గై యాళ్వారు అందరు ఆళ్వారులలోను మొదటివారు.

భూతం సరశ్చ మహదాహ్వయ భట్టనాథ
శ్రీభక్తిసార కులశేఖర యోగివాహాన్।
భక్తాంఘ్రిరేణు పరకాల యతీంద్రమిశ్రాౘ
శ్రీమత్పరాంకుశమునిం ప్రణతోஉస్మి నిత్యమ్॥

శ్రీ వైష్ణవ సంప్రదాయములో ఆళ్వారుల స్తోత్రముచేయు మార్గము.

1. భూతం
2. సరశ్చ - పొయ్‌గై యాళ్వారు
3. మహదాహ్వాయ - పేయాళ్వారు
4. భట్టనాథ - పెరియాళ్వారు
5. శ్రీభక్తిసార - తిరుమళిశై యాళ్వారు
6. కులశేఖర - కులశేఖరాళ్వారు
7. యోగివాహ - తిరుప్పాణాళ్వారు
8. భక్తాంఘ్రిరేణు - తొండరడిప్పొయాళ్వారు
9. పరకాల - తిరుమంగైయాళ్వారు
10. శ్రీమత్పరాంకుశమునిం - నమ్మాళ్వారు

ఇటుల ఆళ్వారుల పదిమంది అని ఒక సంప్రదాయము. ఈ గోష్ఠిలో ఆచార్య కోటిలోచేరిన యతీంద్రులవారిని చేర్చుట గౌరవమందే తాత్పర్యముకాని వేరుకాదు.

ఈ పొయ్‌గైయాళ్వారు ఆళ్వారులలో మొదటివారు, గాన ''భూతం సరశ్చ'' అనుచోట క్రమము వివక్షింపబడినదిగాదు.

మధురకవి యాళ్వారు, ఆండాల్ ఈ ఇరువురను ఆ పదిమంది ఆళ్వారులలో చేర్చి పన్నిద్దరు ఆళ్వారులు అని చెప్పుట మరియొక సంప్రదాయము.

ఈ పొయ్‌గై యాళ్వారు ద్వాపరయుగములో 860900 సంవత్సరములు గడచిన తరువాత (3100 సంవత్సరములు) ద్వాపరముండగా సిద్ధార్థినామ సంవత్సరమున తులామాసములో

శుక్లాష్టమీ మంగళవారమునాడు శ్రవణనక్షత్రమునందు కాంచీనగరములోని యథోక్తకారి సన్నిధికి ఉత్తరభాగమునగల సరస్సునందు బంగారు పద్మమువలన పాంచజన్యాంశచే అవతరించిరి.

అందుచే వీరికి తులామాసమున శ్రవణ నక్షత్రమునందు వర్షతిరునక్షత్రము జరుగుచున్నది. ఈ పొయ్‌గైయాళ్వారు సరోయోగి, కాసారయోగి, ఆదియోగి ఇత్యాది నామములచే వ్యవహరింపబడుచున్నారు.

## 135. శ్రీ పూదత్తాళ్వార్లువారి వర్షతిరునక్షత్రం:

''తులాశ్రవిష్ఠా సంభూతం భూతం కల్లోలమాలినః।
తీరే ఫుల్లోత్పలే మల్లాపుర్యా మీడే గదాంశజమ్॥''

ఈ పూదత్తాళ్వారు, పొయ్‌గైయాళ్వారు అవతరించిన మరుదినమున నవమీ బుధవారమునాడు ధనిష్ఠా నక్షత్రమునందు సముద్రతీరస్థమగు మల్లాపురమందలి సరస్సులోని ఉత్పలమునందు గదాంశచే నవతరించిరి.

అందుచే పూదత్తాళ్వారు వారికి తులామాసమున ధనిష్ఠా నక్షత్రమునందు వర్షతిరునక్షత్రము జరుగుచున్నది. వీరు భూతముని, ఉత్పలముని, ద్వితీయయోగి ఇత్యాది నామముల చేతను కూడా వ్యవహరింపబడుచున్నారు.

## 136. శ్రీ పేయాళ్వార్లువారి వర్షతిరునక్షత్రం:

''తులా శతభిషగ్జాతం మయూరపురి కైరవాత్।
మహాన్తం మహదాఖ్యాతం వందే శ్రీనందకాంశజమ్॥''

ఈ పేయాళ్వారు పూదత్తాళ్వారు అవతరించిన మరుదినమున దశమీగురువారం శతభిషక్ నక్షత్రమున మయూరపురమునందలి పుష్కరిణిలో కలువ యందు నందకాంశముచే అవతరించిరి.

అందుచే వీరికి తులామాసమున శతభిషక్ నక్షత్రమునందు వర్ష తిరునక్షత్రము జరుగుచున్నది. ఈ పేయాళ్వారు మహాయోగి, మయూరపురయోగి. తృతీయయోగి ఇత్యాది నామములచే వ్యవహరింపబడుచున్నారు.

## 137. కార్తికమాసము:

చాంద్రమాన సిద్ధములగు ద్వాదశ మాసములలో నెనిమిదవది యగు మాసము. కృత్తికా నక్షత్రముతో కూడిన పూర్ణిమ గల మాసమగుటచే నీ మాసమును కార్తిక మాసము అని వ్యవహరించుచున్నారు.

## 138. ఆకాశదీపము:

కార్తిక శుక్ల ప్రతిపత్ (పాడ్యమి) మొదలుగా మాసాంతము వరకు ఆకాశ దీపముండవలెను.

## 139. శ్రీవారి పుష్పయాగమహోత్సవము:

కార్తీక మాసమున శ్రవణ నక్షత్రమున తిరుమల శ్రీవారికి పుష్పయాగమహోత్సవము అతి వైభవముగ జరుగుచున్నది. పరమ వైష్ణవమంత్ర రాజములగు షడక్షర అష్టాక్షర ద్వాద శాక్షర

 ములనుచ్చరించుచు శ్రీమలయప్పస్వామివారి పాదారవిందముల

యందు రంగురంగుల పూలదోసిళ్ళ సమర్పించుచూ నారాధించె దరు. ''స్వామీ! చేతనులమై అజ్ఞానులమై సత్వరజస్తమోగుణ పేతులమై యీ సంసారసాగరమున మజ్జనోన్మజ్జనముల నూగుచు దరి గానక కొట్టుమిట్టాడుచున్న మాయీ హృదయ పుష్పాంజలుల యాగము స్వీకరించిమమ్మనుగ్రహించి నీదరి చేర్చుకొమ్మ''ని వేడు కొనుచున్నారోయని నట్లు యీ పుష్పయాగమహోత్సవము అతి వైభవోపేతముగా ప్రతివత్సరము జరుగుచున్నది.

## 140. అత్రిమహర్షి జయన్తి:

కార్తీకమాసమున శ్రవణ నక్షత్రమున పతివ్రతా తిలకమైన అనసూయా సతీమతల్లి భర్తయైన అత్రిమహర్షికి జయన్తి జరుపు చున్నారు.

## 141. ప్రబోధనైకాదశి:

కార్తిక శుద్ధైకాదశియందు శ్రీ మహావిష్ణువు యోగనిద్ర నుండి మేల్కాంచును. ''కార్తికేచ ప్రబుధ్యేత శుక్లపక్షే హరేర్దినే'' అని మత్స్యపురాణము చెప్పుచున్నది. అందుచే నీ కార్తికశుద్ధైకా దశిని ప్రబోధనైకాదశియనియు ఉత్థానైకాదశి యనియు వ్యవహ రించుచున్నారు. ఈ పర్వసమయమున శిష్టులు దేవతా మంత్ర దీక్షలను తీసుకొనెదరు. విశేషముగా దేవతావ్రతములును దేవతాపూజలను చేయుదురు.

## 142. క్షీరాబ్ధిద్వాదశి:

కార్తిక శుక్లద్వాదశి. ఈ ద్వాదశిదినమున శ్రీమహావిష్ణువు

క్షీరాబ్ధియందు నిదుర లేచియుండునుగాన విశేషముగా విష్ణు పూజలు చేసి ద్వాదశీ పారణమును చేయుదురు. ఈ ద్వాదశిని క్షీరాబ్ధిద్వాదశియని వ్యవహరించుచున్నారు.

## 143. చాతుర్మాస్యవ్రత సమాప్తి:

కార్తిక శుక్ల ద్వాదశియందు చాతుర్మాస్య వ్రతమును పూర్తి యొనరించెదరు. ఈ ద్వాదశీ పూర్వాహ్ణవ్యాప్తికలదిగా నుండవలెను. కొందరు శాస్త్రకారులు కార్తిక శుక్ల చతుర్దశి యందుగాని, పూర్ణిమయందుగాని చాతుర్మాస్య వ్రతమును సమాప్తి చేయవలెను అని చెప్పుచున్నారు.

## 144. కైశికద్వాదశి ఆస్థానం:

కార్తిక మాసమున శుక్ల ద్వాదశియందు తిరుమల శ్రీస్వామి వారి సన్నిధానమున వేంచేసియున్న ఉత్సవ శ్రీనివాస మూర్తి, ఉగ్ర శ్రీనివాసమూర్తి, సర్వాధిప శ్రీనివాసమూర్తి, లేఖక శ్రీనివాసమూర్తి-అను నలుగురు దేవదేవులలో ఉగ్రశ్రీనివాస మూర్తి వారికి అరుణోదయ కాలమున ద్వాదశ్యారాధనము, ఆస్థానము అతి వైభవముగా జరుగును. కైశిక పురాణకథనము జరుగును.

## 145. నారాయణవనం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ప్లవోత్సవము (తెప్ప ఉత్సవము):

కార్తిక శుద్ధైకాదశిదినమున ప్రారంభించి కార్తిక పూర్ణిమ వరకు పంచాహ్నికముగా జరుగును.

వివరణము

1వ దినము శ్రీ కోదండరామస్వామివారికి

2వ దినము శ్రీ కృష్ణస్వామివారికి, ఆండాళమ్మవారికి

3వ దినము శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారికి

4వ దినము శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారికి

5వ దినము శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారికి

కార్తిక పూర్ణిమ దినముతో పూర్తి అగును.

## 146. విష్ణ్వాలయములయందు కార్తికపర్వ దీపోత్సవము:

కార్తిక పూర్ణిమాదినమున కృత్తికానక్షత్రమున్నను లేకున్నను దేవాలయములయందు పర్వదీపోత్సవము జరుగవలెను.

## 147. వృశ్చిక సంక్రమణము:

సూర్యుడు మేషాదిద్వాదశరాశులలో అష్టమ రాశియగు వృశ్చికరాశియందు ప్రవేశించు సమయము. ఈ సమయమునకు పూర్వము 16 ఘడియల కాలము అనగా (6-24 నిమిష ముల) కాలము ''విష్ణుపదము'' అను పుణ్యకాలము. ఈ పుణ్యకాలము నందు స్నాన, దాన, కర్మ, ధర్మాదులు చేయవ లసియున్నది. ఈ మాసమును వృశ్చికమాసము అనియు కార్తిక నెల అనియు వ్యవహరిస్తున్నారు.

## 148. తిరుచానూరు శ్రీపద్మావతీతాయార్లవారి బ్రహ్మోత్సవము:

పాంచరాత్రశాస్త్ర ప్రకారము నవాహ్నికముగా జరుగును.

వృశ్చికమాసమునందు శుక్ల పంచమీ దినమున అవభృథమును సంకల్పించి ఆ దినముతో కూడిన తొమ్మిది దినములు ముందుగా ధ్వజారోహణము జరుగును. అందులకు పూర్వదినమున అంకురార్పణము జరుగును. అంకురార్పణ దినముతో పది దినములు బ్రహ్మోత్సవము జరుగును.

శ్రీపద్మావతీ తాయార్లవారు కార్తిక శుక్లపక్షమునందు పంచమీ శుక్రవారమున ఉత్తరాషాఢా నక్షత్రముతో కూడిన అభిజిల్లగ్నము నందు శుకపురములోని పద్మసరోవరములో అవతరించిరి. అందుచే శ్రీ తాయార్లవారి అవతారదినము పంచమీ తిథి గాన తిథిప్రాధాన్యము ననుసరించి ''పంచమీతీర్థము'' అను పేరుతో అవభృథము జరుగుచున్నది. ఉత్తరాషాఢానక్షత్రము పంచమితో యేమాత్రము కూడినను ముఖ్యముగా భావించవలసియున్నది. పంచమీతిథి సంగవకాలవ్యాప్తి కలదై యుండవలయును.

## బ్రహ్మోత్సవ వివరణము

| పగలు | రాత్రి |
|---|---|
| 1వ దినము | సేనాధిపతి ఉత్సవము, అంకురార్పణము |
| 2వ దినము తిరుచ్చి ఉత్సవము ధ్వజారోహణము | చిన్న శేష వాహనము |
| 3వ దినము టాంజాన్ ఉత్సవము | హంస వాహనము |
| 4వ దినము ముత్యపుపందిరి వాహనము | సింహ వాహనము |

5వ దినము కల్పవృక్ష వాహనము - హనుమద్వాహనము

6వ దినము పల్లకీలో ఉత్సవము
సాయంకాలం: వసంతోత్సవము ] - గజ వాహనము

7వ దినము సర్వభూపాల వాహనము - గరుడోత్సవము

8వ దినము సూర్యప్రభవాహనము - చంద్రప్రభ వాహనము

9వ దినము రథోత్సవము - అశ్వ వాహనము

10వ దినము పల్లకీ ఉత్సవము
తిరుచ్చి ఉత్సవము
అవభృథోత్సవము (తీర్థవారి) ] తిరుచ్చిలో ఉత్సవము
ధ్వజావరోహణము

ఇట్లుగా శ్రీ తాయార్లవారి బ్రహ్మోత్సవము పూర్తియగును.

## 149. శ్రీకపిలేశ్వరస్వామివారి సన్నిధానమున స్కందషష్ఠ్యుత్సవము:

వృశ్చిక మాసమునందు శుక్లషష్ఠీదినమున స్కందస్వామి ఉత్సవము జరుగును. పంచమీతోకూడిన షష్ఠి ముఖ్యముగా గ్రహించవలయును.

## 150. చక్రతీర్థ ముక్కోటి:

తులామాసమునందు శుక్ల ద్వాదశీ దినమున జరుగును.

## 151. శ్రీఆళ్వారుతీర్థముక్కోటి (కపిలతీర్థముక్కోటి):

వృశ్చికమాసమున పూర్ణిమాదినమునందు జరుగును.

## 152. శ్రీకపిలేశ్వరస్వామివారి సన్నిధానమున కృత్తికాదీపోత్సవం:

వృశ్చికమాసమునందు కృత్తికా నక్షత్రమున పర్వదీపోత్సవము జరుగును. కృత్తికానక్షత్రము సాయంసంధ్యాకాల వ్యాప్తి కలదిగా యుండవలయును.

## 153. శ్రీతిరుమంగై యాళ్వార్లవారి శాత్తుమొర:

''వృశ్చికే కృత్తికాజాతం చతుష్కవి శిఖామణిమ్।
షట్ప్రబంధకృతం శార్ఙ్గమూర్తిం కలిహ మాశ్రయే॥''

వీరు చోళదేశమునందు తిరుక్కోయిలూరు అను గ్రామములో మ్లేచ్ఛకులమున వృశ్చికమాసములో కృత్తికానక్షత్రమునందు శార్ఙ్గాంశముచే అవతరించిరి.

అందుచే వృశ్చికమాసమున కృత్తికా నక్షత్రమునందు శాత్తుమొరను నిర్ణయించి ఆ దినముతోకూడిన పదియవదినమునందు ముందుగా ఉత్సవము ప్రారంభించి ఉత్సవములు చేయుచూ కృత్తికానక్షత్రమున శాత్తుమొర జరుపుచున్నారు. వీరు పరకాల యోగి శార్ఙ్గాంశయోగి, కలిహయోగి ఇత్యాది నామములచే కూడా వ్యవహరింపబడుచున్నారు.

## 154. శ్రీ తిరుప్పాణాళ్వారు వర్షతిరునక్షత్రం:

''వృశ్చికే రోహిణీజాతం శ్రీపాణం నిచుళాపురే।
శ్రీవత్సాంశం గాయకేంద్రం మునివాహన మాశ్రయే॥''

ఈ తిరుప్పాణాళ్వారు శ్రీరంగమునకు క్రోశ

మాత్రములో నిచుళాపురమను అపరనామధేయముగల ఉరయూరు దివ్యదేశమునందు వృశ్చికమాసమున రోహిణీ నక్షత్రమునందు శ్రీవత్సాంశముచే వరికంకిలో అయోనిజులుగా అవతరించిరి.

అందుచే వీరికి వృశ్చికమాసమున రోహిణీ నక్షత్రము నందు వర్షతిరునక్షత్రము జరుగును. వీరు మునివాహనయోగి. శ్రీవత్సాంశయోగి, గాయకయోగి ఇత్యాది నామములచే వ్యవహరింపబడుచున్నారు.

## 155. తిరుపతి శ్రీగోవిందరాజస్వామివారు తిరువడి సన్నిధి కి వేంచేయుట:

వృశ్చిక మాసమునందు అంత్యమైన ఆదివారము వేంచే యుదురు.

## 156. శ్రీకపిలేశ్వరస్వామివారి సన్నిధానమున కార్తిక సోమవారాభిషేకము:

వృశ్చికమాసమున అమావాస్యాపర్వ పూర్వమగు సోమవారము నందు అభిషేకము జరుగును.

## 157. మార్గశీర్షమాసము:

చాంద్రమాన సిద్ధములగు ద్వాదశ మాసములలో తొమ్మిదవదియగు మాసము. మృగశీర్ష నక్షత్రముతో కూడిన పూర్ణిమగల మాసమగుటచే నీ మాసమును మార్గశీర్షమాసమని వ్యవహరించుచున్నారు.

## 158. దత్తాత్రేయ జయన్తి:

మార్గశీర్ష మాసమున పూర్ణిమా దినమున అనసూయా అత్రి మహర్షి పుణ్యదంపతుల పుత్రరత్నము శ్రీ దత్తాత్రేయ స్వామి వార్ల జయన్తిని జరుపుచున్నారు. ఈ పూర్ణిమ ప్రదోష వ్యాపినిగా నుండవలయును.

## 159. హూణ సంవత్సరాది:

ప్రతి సంవత్సరం జనవరి 1 ఒకటవ తారీఖున జరుగును.

## 160. శ్రీ గోవిందరాజస్వామివారు రామచంద్రతీర్థకట్టమీదికి వేంచేయుట:

ప్రతి సంవత్సరం జనవరి 5 అయిదవ తారీఖున జరుగును.

## 161. ధనుస్సంక్రమణము:

సూర్యుడు మేషాది ద్వాదశరాశులలో నవమరాశియగు ధనూరాశియందు ప్రవేశించు సమయము. ఈ సమయమునకు పరమునందు 16 ఘడియలు (అనగా గం. 6.ని.24) షడశీతిపుణ్యకాలము ఈ పుణ్యకాలమునందు స్నాన, దాన, జప, కర్మ, ధర్మములు చేయతగియున్నవి.

ఈ మాసమును ధనుర్మాసము అనియు, మార్గళి మాసము అనియు వ్యవహరించుచున్నారు.

## 162. ధనుర్మాస పూజారంభము:

ఈ ధనుస్సంక్రమణ సమయమున తిరుమల శ్రీవారి సన్నిధానమున ధనుర్మాసపూజలు ప్రారంభించెదరు. ఈ ధనుర్మాస పూజాజ్ఞాపకముగా శ్రీ వేంకటేశ్వరస్వామివారి వక్షఃస్థలమున వేంచేసియున్న శ్రీదేవీపార్శ్వమున సువర్ణశుక్ర ప్రతిమారాజము సాక్షాత్కరించును.

## 163. శ్రీ తొండరడిప్పొడియాళ్వార్ వర్షతిరునక్షత్రము:

''కోదండే జ్యేష్ఠనక్షత్రే మండంగుడిపురోద్భవమ్।
చోళోర్వ్యాం వనమాలాంశం భక్తపద్రేణు మాశ్రయే॥''

ఈ తొండరడిప్పొడియాళ్వార్ చోళదేశమునందు మండంగుడి పురమున ధనుర్మాసములోని జ్యేష్ఠనక్షత్రమునందు వనమాలాంశమువలన జనన మొందిరి. అందుచే వీరికి ధనుర్మాసమున జ్యేష్ఠనక్షత్రమునందు వర్షతిరునక్షత్రము జరుగును.

వీరు విప్రనారాయణ, వనమాలాంశయోగి, మండంగుడి ముని ఇత్యాది నామములచేతను కూడా వ్యవహరింపబడుచున్నారు.

## 164. శ్రీ కపిలేశ్వరస్వామివారి సన్నిధానమున ప్లవోత్సవము (తెప్ప ఉత్సవము):

ధనుర్మాసమున ఆర్ద్రా దర్శనోత్సవమునకు ముందుగా మూడుదినములు తెప్ప ఉత్సవములు జరుగును.

వివరణము:

1వ దినము శ్రీ విఘ్నేశ్వరస్వామి, చంద్రశేఖరస్వామివారలకు

2వ దినము శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి

3వ దినము శ్రీ కపిలేశ్వరస్వామివారికి

ఇటుల మూడు దినములయందు తెప్ప ఉత్సవములు పూర్తియగును.

## 165. శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆర్ద్రా దర్శన మహోత్సవము:

ధనుర్మాసమున ఆర్ద్రా నక్షత్రమునందు భక్తులు కపిల తీర్థమున స్నానముచేసి నిత్యకర్మల నాచరించి శ్రీకపిలేశ్వరస్వామి వారిని విశేషభక్తితో దర్శనము చేయుచుందురు. ఈ ఆర్ద్రా నక్షత్రము సంగవకాలవ్యాప్తి కలదిగా యుండవలెను.

## 166. తిరుమల శ్రీవారి సన్నిధానమున అధ్యయనోత్స వారంభము:

ధనుర్మాసమునందు శుక్లైకాదశి (వైకుంఠ ఏకాదశి) కి 11 దినములు ముందుగా శ్రీవారి సన్నిధానమున పగల్‌పత్తు తొడక్కం జరిగి దివ్యప్రబంధాధ్యయనము జరుగుచుండును.

## 167. చిన్నశాత్తుమొర:

నాలాయిర దివ్యప్రబంధములోని మొదలాయిరము. ''తిరుమొళి'' అను రెండవ ఆయిరము. ''ఇయర్పా'' అను మూడవ ఆయిరము. సంప్రదాయానుగుణముగా పది

దినములలో అధ్యయనము పూర్తి చేసి ఈ 11వ దినమున చిన్నశాత్తుమొర చేయుదురు.

## 168. శ్రీ వైకుంఠ ఏకాదశి:

ధనుర్మాసమునందు శుక్ల పక్షమునగల ఏకాదశి.

ఈ దినమున శ్రీవారి సన్నిధానమున రాపత్తుతొడక్కం జరిగి, శ్రీనమ్మాళ్వారు సాయించిన భగవద్విషయము అను అపరనామధేయముకల తిరువాయి మొళి అనగా దివ్యప్రబంధము లోని నాల్గవ ఆయిరము అధ్యయనము ప్రారంభమగును. వేదపారాయణతొడక్కం జరిగి వేదపారాయణము ప్రారంభమగును. ఈ వైకుంఠైకాదశీ దినమునందు తిరుమల శ్రీవారి దేవస్థానము చుట్టుగల చూళికయొక్క ద్వారములు తెరువబడును. భక్తులు ఆ చూళికనుంచి ప్రదక్షిణములను చేయుదురు.

## 169. శ్రీస్వామి పుష్కరిణీతీర్థముక్కోటి:

ధనుర్మాసమునందు శ్రీవైకుంఠైకాదశీ పరదినమగు ద్వాదశీ దినము యొక్క అరుణోదయకాలమునందు త్రైలోక్య ప్రసిద్ధములగు మూడుకోట్ల యేబది లక్షల పుణ్యతీర్థములు శ్రీస్వామి పుష్కరిణియందు సాన్నిధ్యమును చేయునుగాన స్వామి పుష్కరిణీ తీర్థముక్కోటి జరుగును.

ఈ దినము శ్రీస్వామివారికి ప్రాతఃకాలారాధనము, నివేదనము జరిగి శాత్తుమొర లేకనే శ్రీచక్రత్తాళ్వారు ఒక కొయ్య తిరుచ్చిలో వేంచేసి మహాప్రదక్షిణముగా శ్రీస్వామి పుష్కరిణీ స్నానమునకుగాను శ్రీ వరాహస్వామివారి సన్నిధానమునగల

ముఖమండపమున వేంచేయుదురు. అచ్చట చక్రత్తాళ్వారువారికి అభిషేకము జరిగి స్వామిపుష్కరిణీ స్నానము జరుగును. ఆ సమయమున వేలాది ప్రజలు స్వామిపుష్కరిణీ స్నానము చేయుదురు.

పిమ్మట శ్రీచక్రత్తాళ్వారువారికి పుష్పాలంకారము, నివేదనము, హారతి మామూలుమేరకు అన్నియు జరిగి శ్రీవారి సన్నిధానమునకు వేంచేయుదురు.

## 170. ప్రణయకలహోత్సవము:

రాపత్తులో ఆరవ దినమున శ్రీస్వామివారికి శ్రీభూదేవులకు ప్రణయకలహోత్సవము జరుగును.

ఈ దినమున సాయంకాలము శ్రీమలయప్ప స్వామివారు తిరుచ్చిలో మహాప్రదక్షిణముగా తిరువీథుల ఉత్సవమునకు వేంచేసి ఈశాన్యభాగమునకు రాగా, శ్రీభూదేవులు వేరొక తిరుచ్చినధిష్ఠించి మంగళ వాద్యములతో శ్రీవారికి ఎదురుగా వేంచేయుదురు.

ఆ సమయమున ప్రణయకలహ విషయకమగు పురాణమును పఠించెదరు. వేడుక జరుగును. పిమ్మట శ్రీమలయప్ప స్వామి వారు పట్టమహిషులగు శ్రీభూదేవులతో సహా శ్రీవారి సన్నిధికి వేంచేయుదురు.

## 171. పెద్దశాత్తుమొర:

శ్రీ స్వామివారి సన్నిధానమున శ్రీవైకుంఠైకాదశి

దినముతో కూడిన పదవదినమునందు దివ్యప్రబంధాధ్యయనము పూర్తి అయి ప్రబంధ శాత్తుమొర (పెద్దశాత్తుమొర) జరుగును. వేదపారాయణము పూర్తి అయి వేదశాత్తు మొర జరుగును.

## 172. శ్రీవారిసన్నిధానమున అధ్యయనోత్సవము పూర్తి:

| | | |
|---|---|---|
| వివరణము - పగల్పత్తు | 11 | దినములు |
| రాపత్తు | 10 | దినములు |
| | 21 | దినములు |
| కణ్ణినుణ్ శిరుత్తాంబు | 22వ | దినము |
| రామానుజ నూట్రందాది | 23వ | దినము |
| శ్రీవరాహస్వామి శాత్తుమొర | 24వ | దినము |
| తన్నీరముదు | 25వ | దినము |

ఇటుల తిరుమలలో అధ్యయనోత్సవము 25 దినములలో పూర్తియగుచుండును.

## 173. శ్రీ ఆండాళ్ నీరాట్టోత్సవము:

మకరసంక్రమణమునకు పూర్వదినమగు భోగిపండుగకు యేడు దినములముందుగా తిరుపతిలో ఈ నీరాట్టం ఉత్సవము ప్రారంభమగును.

వివరణము:- ఆండాళ్ అను నామాంతరముగల శ్రీగోదా అమ్మవారు పాండ్యదేశాధిపతియగు పెరియాళ్వారు అను నామాంతరముగల విష్ణుచిత్తునియొక్క తులసీకాననమందు

భూతలమువలన అవతరించి విష్ణుచిత్తునకు ప్రేమపుత్రికగా యేర్పడినది. ఈమె శ్రీకృష్ణపరమాత్మను పతినిగా బడయగోరి హేమన్తమున గోపకన్యకలు వ్రతమాచరించిన పగిది ధనుర్మాస వ్రతమాచరించెను. ఆ వ్రతజ్ఞాపకముగా ధనుర్మాసమున భోగిపం డుగకు యేడు దినములు ముందుగా ఈ ఆండాళ్ నీరాట్టం ఉత్సవము ప్రారంభమగుచున్నది. ప్రారంభదినము సామాన్య ముగా జనవరి 6వ తారీఖు అగుచుండును.

ఆ దినమున శ్రీగోదాఅమ్మవారు ధనుర్మాసపూజానన్త రము పల్లకీ నధిష్ఠించి నియతమైన తిరువీథులలో ఉత్సవముగా రామచంద్రతీర్థము కట్టమీద గల నీరాట్టమండపమునకు వేంచేయుదురు. అచ్చట శ్రీదేవీవారు నీరాట్టం (అభిషేకం), నివేదనం, శాత్తుమొర, ఆస్థానము అయి సాయంకాలమువరకు వేంచేసియుందురు. సాయంకాలము శ్రీగోదా అమ్మవారు పుష్పా లంకారభూషితయై తిరుచ్చినధిష్ఠించి మామూలు ప్రకారం తిరువీథుల ఉత్సవముగా కోవెలకు వేంచేయుదురు. ఇటుల యేడుదినములు ఉత్సవములు జరిగి, నీరాట్టం ఉత్సవము పూర్తియగును.

## 174. భోగిపండుగ - భోగితేరు:

8వ దినమున అనగా మకరసంక్రాన్తి పూర్వదినమగు భోగిపండుగ దినమునందు శ్రీ ఆండాళ్ అమ్మవారు శ్రీ కృష్ణ స్వామివారితోసహా - భోగి తేరు నధిష్ఠించి సాయంకాలము తిరువీథుల ఉత్సవము జరిగి సన్నిధికి వేంచేయుదురు. ఇతర దివ్యదేశములలో నీరాట్టం ఉత్సవము తొమ్మిది దినములుగా

జరుగును. భోగిపండుగ దినమునందు శ్రీ గోదాపరిణయమును, శ్రీకృష్ణస్వామితోసహా గోదా అమ్మవారికి వేడుకలును జరుగును. ఇది ఆచారము.

## 175. పౌషమాసము:

చాంద్రమానసిద్ధములగు చైత్రాదిద్వాదశ మాసములలో పదవ మాసము. పుష్యనక్షత్రముతో కూడిన పూర్ణిమకలది యగుటచే నీ మాసమును పౌషమాసము అనియు, పుష్యమాసము అనియు వ్యవహరించుచున్నారు.

## 176. మకరసంక్రమణము -ఉత్తరాయణపుణ్యకాలము:

సూర్యుడు మేషాదిద్వాదశ రాశులలో పదవరాశియగు మకరరాశియందు ప్రవేశించు సమయము. ప్రవేశించినదాదిగ పరమునందు నలుబది ఘడియల కాలము ఉత్తరాయణ పుణ్యకాలము. అనగా ప్రవేశించిన నిమిషము మొదలు పరమునందు 16 ఘంటల కాలవు పుణ్యకాలవు. పరవునందు 8 ఘంటలకాలమే పుణ్యకాలము అని కొందరుచెప్పుచున్నారు.

సూర్యుడు ఉత్తరముగా గమనము చేయుటకు ప్రారంభ సమయము కాన ఉత్తరాయణము అనుచున్నారు. ఇది సంక్రాన్తి పండుగయని హిందువులు వాడుకొనుచున్నారు. అనేకములైన వేడుకలు చేయుచున్నారు. ఈ పుణ్యసమయమున స్నాన, దాన, జప, ధర్మములు మొదలగు పుణ్యకార్యములను చేయుచున్నారు.

ఈ మకరసంక్రమణము పగలు జరిగిన సంక్రమణము నకు పరమునందు నలుబది ఘడియలు పుణ్యకాలము. పగలు

రెండు ఘడియలు మిగిలియుండగా సంక్రమణము జరిగిన ఆసన్న పూర్వకాలము పుణ్యకాలము. రాత్రి పూర్వభాగమునందుగాని, ఉత్తరభాగమునందుగాని, నిశీథమునందుగాని సంక్రమణము జరిగిన పరదినము పుణ్యకాలము. అందును ఆ పరదిన పూర్వార్థము పుణ్యతరము. అందును సూర్యోదయానంతరము అయిదు ఘడియలకాలము పుణ్యతమముగా తెలియదగియున్నది. ప్రతి సంక్రమణమునందును సంక్రమణ సన్నిహిత కాలము పుణ్యతమము.

సూర్యాస్తమయానంతరము మూడు ఘడియలకాలము సంధ్యాకాలము. ఆ సంధ్యాకాలమునందు మకరసంక్రమణము జరిగిన పూర్వదినము పుణ్యదినము అని జ్యోతిశ్శాస్త్రవేత్తలు అభిప్రాయపడుచున్నారు. ఈ మాసమును మకరమాసము అనియు, తైనెల అనియు వ్యవహరించుచున్నారు.

## 177. కనుమ పండుగ:

మకరసంక్రమణమునకు పరదినమును కనుమపండుగ అని వ్యవహరించుచున్నారు. ఈ దినమున తిరుపతిలో శ్రీగోదాపరిణయోత్సవము జరుగును. శ్రీ గోదా పరిణయమును గూర్చి పురాణమును పఠించెదరు. ఇది ఆచారము.

తిరుమలలో శ్రీస్వామివారు తాళ్ళపాకంవారి పారువేట మండపములోనికి వేంచేయుదురు. ఈ దినమును పశువుల పండుగ యనుచున్నారు.

## 178. శ్రీగోదా పరిణయోత్సవము:

మకర సంక్రమణ దినమునకు పరదినమున కనుమనాడు తిరుపతిలో శ్రీగోదా పరిణయోత్సవము జరుగును.

శ్రీ గోదాదేవి విష్ణుచిత్తుని కుమార్తె దైవాంశసంభూతు రాలు మన్నారునాథుని సేవించి తరించిన మహాతల్లి. కన్నడ రాయడగు శ్రీకృష్ణదేవరాయలవారు ఈమెను గురించి 'ఆముక్త మాల్యద' అను తెలుగున ప్రబంధమును రచించెను.

## 179. తిరుమల శ్రీవారు పార్వేట మంటపమునకు వేంచేయుట:

తిరుమలలో శ్రీస్వామివారు తాళ్ళపాకంవారి పారువేట మండపములోనికి వేంచేయుదురు. ఈ దినమున పశువులపండుగ యనుచున్నారు.

## 180. శ్రీ కపిలేశ్వరస్వామివారి సన్నిధానమున శ్రీ కామాక్షీదేవికి చందనాభిషేకము:

మకర మాసమునందు పూర్ణిమా పర్వమునకు పూర్వ మగు శుక్రవారమున శ్రీ కామాక్షీదేవికి చందనాభిషేకము అతి వైభవముగా జరుగును.

## 181. శ్రీరామకృష్ణ తీర్థముక్కోటి:

మకరమాసమునందు పుష్యమీ నక్షత్రముతోకూడిన పూర్ణిమా పర్వదినమున త్రైలోక్య విశ్రుతములగు మూడుకోట్ల యేబది లక్షల పుణ్యతీర్థములు ఈ రామకృష్ణ తీర్థమునందు

సాన్నిధ్యము చేయును గాన అచ్చట శ్రీరామకృష్ణ తీర్థముకోటి అను పేరుతో భక్తులు ఆ తీర్థమున స్నాన, దాన, జపాదులు చేసివచ్చి శ్రీ వేంకటేశ్వరస్వామివారిని సేవించుదురు.

## 182. శ్రీతిరుమళిశై యాళ్వార్లవారి వర్షతిరునక్షత్రము:

''మఘాయాం మకరే మాసే చక్రాంశం భార్గవోద్భవమ్।
మహీసారపురాధీశం భక్తిసార మహం భజే॥''

వీరు మహీసారపురము (తిరుమళిశై) అను గ్రామము నందు భార్గవోత్తముని వలన మకరమాసమునందు మఘానక్షత్ర మున చక్రాంశచే అవతరించిరి.

అందుచే వీరికి మకర మాసమునందు మఘనక్షత్రమున తిరునక్షత్రము చేయుచున్నారు. ఈ తిరుమళిశై యాళ్వారు భక్తి సారయోగి, భక్తిసారముని, చక్రాంశయోగి ఇత్యాది నామములచే వ్యవహరింపబడుచున్నారు.

## 183. శ్రీకూరత్తాళ్వార్లవారి వర్షతిరునక్షత్రము:

''మకరే హస్తనక్షత్రే సర్వనేత్రంశ సంభవమ్।
శ్రీమత్కూరకులాధీశం శ్రీవత్సాంక ముపాస్మహే॥''

వీరు మకరమాసమునందు హస్త నక్షత్రమున శ్రీఅనంతభట్టాచార్యుల వలన మహాదేవియందు (రామాంశము) (లక్ష్మణాంశము)చే అవతరించిరి.

అందుచే వీరికి మకరమాసమున హస్తనక్షత్రమునందు వర్షతిరునక్షత్రము జరుగుచున్నది.

ఈ కూరత్తాళ్వార్ శ్రీకూరేశులు, శ్రీ వత్సచిహ్న మిశ్రులు ఇత్యాది నామములచే వ్యవహరింపబడుచున్నారు.

## 184. తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి సన్నిధానమున అధ్యయనోత్సవ ప్రారంభము:

మకరమాసమునందు శుక్లైకాదశికి పూర్వము 11వ దినమునందు శ్రీ స్వామివారి సన్నిధానమున నాలాయిర దివ్య ప్రబంధాధ్యయనమునకుపగల్ పత్తు తొడక్కం జరిగి ప్రతిదినము దివ్య ప్రబంధాధ్యయనము జరుగుచుండును.

## 185. చిన్నశాత్తుమొర:

ప్రారంభదినము మొదలు పదిదినములలో నాలాయిర దివ్య ప్రబంధమునందు మొదటి ఆయిరము, తిరుమొళి అను రెండవ ఆయిరము, ఇయర్పా అను మూడవ ఆయిరము సంప్రదాయానుగుణముగా అధ్యయనము జరిగి 11వ దినమునందు చిన్నశాత్తుమొర జరుగుచుండును.

## 186. మకరశుక్లైకాదశీ:

ఈ మకరశుక్లైకాదశీ దినమునందు తిరుపతి శ్రీస్వామివారి సన్నిధానమున దివ్యప్రబంధాధ్యయనమునకు రాపత్తు తొడక్కం జరిగి నాల్గవ ఆయిరమగు శ్రీ నమ్మాళ్వారు సాయించిన భగవద్విషయము అను అపరనామధేయముకల తిరువాయి మొళి దివ్య ప్రబంధము యొక్క అధ్యయనము, వేదపారాయణ తొడక్కం జరిగి వేదపారాయణము ప్రతిదినము జరుగుచుండును.

## 187. ప్రణయకలహోత్సవము:

రాపత్తులో దివ్యప్రబంధములోని నాల్గవ ఆయిరము అధ్యయనము జరుగుచుండ ఆరవ దినమున శ్రీ స్వామివారికి శ్రీ భూదేవులకు ప్రణయకలహోత్సవము జరుగును. ఈ దినమున సాయంకాలము శ్రీ గోవిందరాజస్వామివారు తిరుచ్చానధిష్ఠించి తిరువీధులలో ఉత్సవమునకు వేంచేయుదురు. రెండు గోపురముల మధ్యగల చతుస్తంభమండపము వద్దకు వచ్చెదరు. అప్పుడు శ్రీభూదేవులు వేరొక తిరుచ్చినధిష్ఠించి దేవాలయము నుంచి మంగళవాద్యములతో శ్రీవారికి ఎదురుగా ఆ చతుస్తంభ మండపమువద్దకు వేంచేసెదరు. అచ్చట ప్రణయకలహ విషయకమగు పురాణమును పఠించెదరు. వేడుక జరుగును. పిమ్మట శ్రీగోవిందరాజస్వామివారు శ్రీభూదేవులతో కలిసి ఉత్సవముతో సన్నిధి కి వేంచేయుదురు.

## 188. పెద్దశాత్తుమొర:

మకరశుక్లైకాదశితో కూడిన పదవదినమునందు తిరుపతి శ్రీవారిసన్నిధానమున రాపత్తులో నాల్గవ ఆయిరమగు తిరువాయి మొజి దివ్యప్రబంధాధ్యయనమును పూర్తిచేసి, ప్రబంధశాత్తుమొర చేయుదురు. వేదపారాయణము పూర్తి చేసి వేదశాత్తుమొర చేయుదురు. ఈ దినమును పెద్దశాత్తుమొర అని వ్యవహరించుచున్నారు.

## 189. తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి సన్నిధానమున అధ్యయనోత్సవముపూర్తి:

వివరణము- పగల్పత్తు 11 దినములు

| | |
|---|---|
| రాపత్తు | 10 దినములు |
| | 21 దినములు |
| కణ్ణినుణ్ శిరుత్తాంబు | 22వ దినము |
| రామానుజనూత్రందాది | 23వ దినము |
| తన్నీరముదు | 24వ దినము |

ఇట్లుగా తిరుపతిలో దివ్యప్రబంధాధ్యయనోత్సవము 24 దినములలో పూర్తి అగును. ఈ అధ్యయనోత్సవము శ్రీ గోవింద రాజస్వామివారి సన్నిధానమున ధనుర్మాసమున చేయవలసినదైనను, యేకారణముచేతనో మకరమాసములో చేయుచున్నారు.

## 190. మాఘమాసము:

చాంద్రమానసిద్ధములగు ద్వాదశమాసములలో (11) పదనొకండవ మాసము. ''మ ఘా నక్షత్రేణయుక్తా పూర్ణిమా మాఘీసాఽస్మిన్నితిమాఘః'' మ ఘనక్షత్రముతోకూడిన పూర్ణిమ కల మాసమగుటచేత మాఘమాసమని వ్యవహరించుచున్నారు. మరియు ''మా = అవిద్యమానం, అఘం = పాపం, అస్మిన్నితి మాఘః = పాపములేని మాసమగుటచేతనుకూడ మాఘ మాసమని వ్యవహరించుచున్నారు.

## 191. అర్ధోదయము – మహోదయము:

అమాఽర్కపాత శ్రవణై ర్యుక్తాచేత్ పౌషమాఘయోః ।
అర్ధోదయ స్స విజ్ఞేయః కోటిసూర్యగ్రహై స్సమః ॥
కించిన్న్యూనం మహోదయః ।

తా॥ పౌషమాసమునకు మాఘమాసమునకు మధ్యవర్తిని యగు అమావాస్య ఆదిత్యవారముతోను, వ్యతీపాతయోగము తోను, శ్రవణనక్షత్రముతోను కూడిన అర్ధోదయయోగము. ఈ యోగము కోటిసూర్య గ్రహణములతో సమానమైనది మహాపుణ్యకాలము.

ఈ యోగమునకు కొంచెము తక్కువగాయున్న మహోదయయోగము అగును. ఇదియు మహాపుణ్యకాలము.

పౌష, మాఘమధ్యవర్తినియగు అమావాస్య అనగా, పుష్యమాసము అమాన్తమాసమగునప్పుడు మాఘమాసము పూర్ణిమాన్తమాసము అగునప్పుడు, పౌషమాఘమాసములకు మధ్యవర్తినియగు అమావాస్య అని అర్థము.

ఫలితార్థము: పౌషపూర్ణిమకు పరమునందుగల అమావాస్య నిరుక్త వార, పాత, నక్షత్రములతో కూడిన అర్ధోదయయోగమనియు కొంచెము తక్కువగాయున్న మహోదయయోగమనియు, మహాపుణ్యకాలమనియు యేర్పడుచున్నవి. కోటి సూర్యగ్రహణసమమగు నీ అర్ధోదయమందుగాని, మహోదయ మందుగాని, సముద్రస్నానము, గంగా నదీస్నానము, దానము, జపము, కోటిగుణితములై ఫలదాయకములగుచున్నవి. ఈ సమయమున జలమంతయు గంగాసమానము, యత్కించిద్దానమైనను మేరుదానసమానము అని శాస్త్రములు, శిష్టులు చెప్పుచున్నారు.

## 192. రథసప్తమి:

మాఘమాసమున శుక్లపక్షమునందుగల సప్తమి.

ఇది అరుణోదయవ్యాప్తికలదిగా నుండవలెను. ఈ సప్తమి దినద్వయమునందు అరుణోదయవ్యాప్తికలదేని పూర్వదినమును గ్రహించవలయును. ఇదియే వైవస్వతమన్వాది.

## 193. భీష్మాష్టమి:

మాఘమాసమున శుక్ల పక్షమునందుగల అష్టమి.

ఈ దినమున భీష్మునకు శ్రాద్ధము, తర్పణము చేయతగియున్నది. శ్రాద్ధమాచరించినవారు సంతానవంతులగుదురు. తర్పణమాచరించినవారు పాపక్షయముకలవారగుదురుఅని ధర్మశాస్త్రము చెప్పుచున్నది.

## 194. మధ్వనవమి:

మాఘమాసమున శుక్ల పక్షమునగల నవమి.

ఈ దినమున మధ్వసంప్రదాయస్థులు ద్వైత భాష్యకర్తలగు శ్రీ ఆనందతీర్థులవారిని ఆరాధింఎదరు.

## 195. భీష్మైకాదశి:

మాఘమాసమున శుక్లపక్షమునందుగల ఏకాదశి.

## 196. శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివార్ల బ్రహ్మోత్సవము శ్రీనివాసమంగాపురం:

మాఘమాసమున శ్రవణ నక్షత్రమున వీరికి అవభృథము సంకల్పించి ఆ దినముతో కూడిన తొమ్మిది రోజుల ముందు

ధ్వజారోహణము చేసి బ్రహ్మోత్సవము జరుపుచున్నారు. దానికి ముందు రోజున అంకురార్పణము జరుపుచున్నారు.

## ఉత్సవ వివరణము

| వగలు | రాత్రి |
|---|---|
| 1వ దినము | సేనాధిపతి ఉత్సవము<br>అంకురారోపణము |
| 2వ దినము తిరుచ్చి ఉత్సవము<br>ధ్వజారోహణము | పెద్ద శేషవాహనము |
| 3వ దినము చిన్న శేష వాహనము | హంస వాహనము |
| 4వ దినము సింహ వాహనము | ముత్యపువందిరి వాహనము |
| 5వ దినము కల్పవృక్ష వాహనము | సర్వభూపాల వాహనము |
| 6వ దినము పల్లకిలో మోహినీ<br>అవతారోత్సవము | గరుడ వాహనము |
| 7వ దినము హనుమద్వాహనము<br>సాయంకాలము<br>వసంతోత్సవము | గజ వాహనము |
| 8వ దినము సూర్యప్రభ వాహనము | చంద్రప్రభవాహనము |
| 9వ దినము రథోత్సవము | అశ్వ వాహనము<br>కళ్యాణోత్సవము |
| 10వ దినము చూర్ణోత్సవము<br>అవభృథోత్సవము (తీర్థవారి)<br>ద్వాదశారాధనము చక్రస్నానము | ధ్వజావరోహణము<br>ఏకాంతోత్సవము |

ఇటుల బ్రహ్మోత్సవము పూర్తి అగును.

## 197. తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి తెప్ప (ప్లవ) ఉత్సవములు:

మాఘశుద్ధైకాదశీ దినమున ప్రారంభమై మాఘపూర్ణిమతో పంచాహ్నికముగా పూర్తి అగును.

వివరణము

1వ దినము – శ్రీ కోదండరామస్వామివారికి

2వ దినము – శ్రీ కృష్ణస్వామివారికి, ఆండాళ్ అమ్మవారికి

3వ దినము – శ్రీ గోవిందరాజస్వామివారికి

4వ దినము – శ్రీ గోవిందరాజస్వామివారికి

5వ దినము – శ్రీ గోవిందరాజస్వామివారికి

ఇట్లుగా అయిదు దినములు తెప్ప ఉత్సవములు జరుగును.

## 198. మహాశివరాత్రి:

మాఘబహుళ చతుర్దశీ దినమున శివరాత్రి వ్రతము. ఈ చతుర్దశి నిశీథవ్యాప్తి కలదిగా నుండవలెను. నిశీథము అనగా రాత్రి యొక్క 8వ ముహూర్తము (ముహూర్తము అనగా రెండు ఘడియలకాలము) చతుర్దశీతిథి పూర్వదినము నందు నిశీథవ్యాప్తికల్గిన పూర్వదినమును, పరదినమందు నిశీథ వ్యాప్తి కల్గిన పరదినమును గ్రహించవలయును. రెండుదినముల యందు నిశీథవ్యాప్తి లేకున్నయెడల ప్రదోషవ్యాప్తిగల పరదిన మును గ్రహించవలయును. దినద్వయమునందు నిశీథమున పూర్ణ వ్యాప్తి కలిగియున్నను, ఏకదేశవ్యాప్తి కలిగియున్నను పూర్వ

దినమే గ్రాహ్యమని కౌస్తుభాదిమతము. పరదినమే గ్రాహ్యము అని మాధవాదిమతము. యథాచారముగా వ్యవస్థను చేసుకొనవలయును.

ఈ మాఘ బహుళ చతుర్దశియందు ఆదివారముగాని, మంగళవారముగాని లభించినయెడల శివరాత్రి వ్రతము ఉత్తమోత్తమము అని స్కందపురాణము చెప్పుచున్నది.

## 199. శ్రీ కపిలేశ్వరస్వామివారి నందివాహనోత్సవము:

ఈ మహాశివరాత్రిదినమున నందివాహనోత్సవము అతి వైభవముగా జరుగును.

తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారికి మాఘబహుళమున పంచాహ్నికముగ భౌతికోత్సవము జరుపుచున్నారు.

1వ రోజు అంకురార్పణ

2వ రోజు ధ్వజారోహణము

3వ రోజు నందివాహోనోత్సవము (మహాశివరాత్రిదినమున)

4వ రోజు కల్యాణోత్సవము

5వ రోజు ఊంజల్ సేవ

6వ రోజు త్రిశూలస్నానము ధ్వజావరోహణము

ఈ విధముగా శ్రీ స్వామివారికి ఉత్సవములు అతి వైభవముగా జరుగుచున్నవి.

## 200. కుంభసంక్రమణము:

సూర్యుడు మేషాధి ద్వాదశరాశులలో పదనొకండవ

రాశియగు కుంభరాశియందు ప్రవేశించు సమయము. ఈ సమయమునకు పూర్వమునందు 16 ఘడియలకాలము అనగా గం. 6.24 ని. కాలము విష్ణుపదము ను పుణ్యకాలము - ఈ పుణ్యకాలమునందు స్నాన, దాన, జప ధర్మములు చేయతగి యున్నవి. ఈ మాసమును కుంభమాసము అనియు మాసి నెల అనియు వ్యవహరించుచున్నారు.

## 201. కుమారధారాతీర్థ ముక్కోటి:

కుంభమాసమున మఖానక్షత్రముతో కూడిన పూర్ణిమా దినమున త్రైలోక్యవిశ్రుతములగు మూడుకోట్ల యేబదిలక్షల పుణ్య తీర్థములన్నియు ఈ కుమారధారా తీర్థమునందు సాన్ని ధ్యమును చేయునుగాన అచ్చట కుమారధారా తీర్థముక్కోటి జరుగును. ఆ తీర్థమున స్నానములుచేసి దాన, ధర్మములను పూర్తి యొనరించుకొని భక్తులు తిరుమల శ్రీవారి సన్నిధానము నకు వచ్చి శ్రీవారిని దర్శించి తీర్థప్రసాదములు తీసుకొని వెళ్ళుచుందురు.

## 202. శ్రీ తిరుక్కచ్చినంబివారి శాత్తుమొర:

''కుంభే మృగశిరోజాతం శ్రీకాంచీపూర్ణ మాశ్రయే।
షట్వాక్తిం యతిరాజాయ యన్ముఖా ద్వరదోఽవదత్॥''

వీరు కుంభమాసమునందు మృగశీర్ష నక్షత్రమున జనన మొందిరి.

అందుచే వీరికి కుంభమాసమునందు మృగశీర్ష నక్షత్రమున శాత్తుమొర నిర్ణయించి ఆ దినముతో కూడిన

పదిదినములకు ముందుగా ఉత్సవములు ప్రారంభించి ఉత్సవములు చేయుచు పదవదినమున మృగశీర్షయందు శాత్తుమొర జరుపుచున్నారు. ఈ తిరుక్కచ్చినంబిగారు కాంచీపూర్ణులని వ్యవహరింపబడుచున్నారు.

## 203. శ్రీ కులశేఖరాళ్వార్లవారి వర్ష తిరునక్షత్రము:

''కుంభే పునర్వసౌ జాతం కేరళే చోళపట్టణే।
కౌస్తుభాంశం ధరాధీశం కులశేఖర మాశ్రయే॥''

ఈ కులశేఖరాళ్వారు కేరళ దేశమునందు చోళపట్టణమున కుంభమాసములో పునర్వసు నక్షత్రమునందు కౌస్తుభాంశవలన అవతరించిరి.

అందుచే వీరికి కుంభమాసములో పునర్వసునక్షత్రమునందు వర్షతిరునక్షత్రము జరుగుచున్నది. ఈ కులశేఖరాళ్వారు కేరళయోగి, కౌస్తుభాంశయోగి ఇత్యాదినామములచే వ్యవహరింపబడుచున్నారు.

## 204. ఫాల్గుణమాసము:

చాంద్రమానసిద్ధములగు చైత్రాది ద్వాదశ మాసములలో పండ్రెండవ మాసము. ''ఫల్గునీనక్షత్రేణయుక్తా పౌర్ణమాసీ ఫాల్గునీ సాఽస్మిన్నితి ఫాల్గునః'' అను వ్యుత్పత్తి వలన ఈ మాసమున ఉత్తరఫల్గునీ నక్షత్రముతోకూడిన పూర్ణిమగల మాసమగుటచే ఫాల్గున మాసమని వ్యవహరించుచున్నారు.

## 205. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ప్లవోత్సవము (తెప్పఉత్సవము):

ఫాల్గున శుద్ధైకాదశీదినమున ప్రారంభించి ఫాల్గున పూర్ణిమ వరకు పంచాహ్నికముగా జరుగును.

వివరణము

1వ దినము– శ్రీ కోదండరామస్వామివారికి

2వ దినము– శ్రీ కృష్ణస్వామివారికి

3వ దినము– శ్రీ వేంకటేశ్వరస్వామివారికి

4వ దినము– శ్రీ వేంకటేశ్వరస్వామివారికి

5వ దినము– శ్రీ వేంకటేశ్వరస్వామివారికి

ఇటుల అయిదుదినములు తెప్పఉత్సవములు జరుగును.

## 206. హోలికాపండుగ:

ఫాల్గునపూర్ణిమయందు జరుగును. ఈ పూర్ణిమ ప్రదోష వ్యాప్తి కలదిగాను భద్ర(విష్టి)లేనిదిగాను యుండవలెను. పూర్ణిమ దినద్వయమందును ప్రదోషవ్యాప్తి కలదేని పూర్వదినమునందు భద్రదోషముండును గాన పరదినమే గ్రహించవలయును.

## 207. చంద్రగ్రహణము:

శుక్ల పక్షాన్తిమ దినమగు పూర్ణిమాపర్వమునకు కృష్ణపక్షాదిమదినమగు ప్రతిపత్తునకు సంధి కాలమున జరుగుచుండును.

"పర్వ ప్రతిపత్సంధ్యుపజీవనేన ప్రవృత్తత్వా ద్గ్రహణస్య" అని విద్యారణ్య మాధవాచార్యులవారు చెప్పుచున్నారు.

ఇది రాహుగ్రస్తముగాను కేతుగ్రస్తముగాను యుండును.

"చంద్రగ్రహే తు యామాం స్త్రీన్ బాల వృద్ధాతురై ర్వినా" అని ధర్మశాస్త్రము. చంద్రగ్రహణమునందు మానవుడు చంద్ర గ్రహణయామమునకు పూర్వము మూడు యామములు భోజనము చేయరాదు. (యామము అనగా మూడుగంటల కాలము) అట్లు భోజనముచేసిన మానవుడు ప్రాయశ్చిత్తార్హుడగు చున్నాడు. బాలురకు, వృద్ధులకు, ఆతురులకు (రోగ గ్రస్తులకు) ఈ నియమములేదు అని తాత్పర్యము.

బాల, వృద్ధాఽతురుల విషయములో గ్రహణయామము నకు పూర్వయామము భోజనము చేయరాదని కొందరు సార్ధ యామము (ఒకటిన్నరఝాము) భోజనముచేయరాదని కొందరు త్రిముహూర్తకాలము (ఆరు ఘడియలకాలము) భోజనము చేయరాదని కొందరు ధర్మశాస్త్రకారులు విభేదముగా చెప్పుచున్నారు.

చంద్రగ్రహణము: గ్రస్తాస్తమయమగు సమయములో, మానవుడు రాత్రిందివములు భోజనము చేయరాదు. పరదినము నందు శుద్ధమగు చంద్రబింబమును దర్శించి భోజనము చేయ వలెను. గ్రస్తోదయమగు సమయములో పగలు భోజనము చేయరాదు. గ్రహణపుణ్యకాలమునందు స్నాన, దానాదులు చేయ వలసియున్నవి.

విశేషవిషయములు సూర్యగ్రహణమునందు చూడవలయును.

## 208. సూర్యగ్రహణము:

కృష్ణపక్షాన్తిమదినమగు అమావాస్యాపర్వమునకు శుక్లపక్షాదిమదినమగు ప్రతిపత్తునకు సంధి కాలమునందు జరుగుచుండును. ఇదియు చంద్రగ్రహణమువలె పర్వప్రతిపత్తులయొక్క సంధ్యుపజీవనము చేతనే ప్రవర్తించును. అనగా పర్వాన్తిమభాగమున స్పర్శయు, ప్రతిపదాదిమభాగమున మోక్షమును జరుగుచుండును ఇదియు రాహుగ్రస్తముగాను, కేతుగ్రస్తముగాను యుండును.

''సూర్యగ్రహే తు నాశ్నీయా త్పూర్వం యామచతుష్టయమ్'' ఇత్యాది ధర్మశాస్త్రము. సూర్యగ్రహణమునందు మానవుడు సూర్యగ్రహణ యామమునకు పూర్వము నాలుగుయా-మములు భోజనము చేయరాదు. అట్లు భోజనముచేసిన మానవుడు ప్రాయశ్చితార్హుడగుచున్నాడు - అని చెప్పుచున్నది.

బాలవృద్ధాతురుల విషయములో చంద్రగ్రహణమునందు వలెనే తెలియదగియున్నవి.

త్రిముహూర్త వాదులు: గ్రహణము సాయాహ్నమున జరుగునెడల అపరాహ్ణమున భోజనము చేయరాదు, అపరాహ్ణమున జరుగునెడల మధ్యాహ్నమున భోజనము చేయరాదు. మధ్యాహ్నమున జరుగు నెడల సంగవకాలమున భోజనము చేయరాదు. సంగవకాలమున జరుగు నెడల ప్రాతఃకాలమున భోజనము చేయరాదు - అని స్పష్టముగా చెప్పుచున్నారు.

సూర్యగ్రహణము: గ్రస్తాస్తమయమగు నెడల మానవుడు దివారాత్రములు భోజనము చేయరాదు. పరదినమునందు

శుద్ధమగు సూర్యబింబమును దర్శించి భోజనము చేయవలెను.

గ్రస్తోదయమగు నెడల పూర్వదినముయొక్క రాత్రి యందు భోజనము చేయరాదు.

గ్రహణపుణ్యకాలమునందు స్నానదానాదులు చేయవలెను.

చంద్రగ్రహణమందుగాని, సూర్యగ్రహణమందుగాని స్పర్శము మొదలు ముక్త్యంతమువరకు ''గ్రహణము'' అని చెప్పబడుచున్నది.

పుణ్యకాలమనగా: సంక్రమణములయందు, సంక్రమణ మునకు పూర్వమునందును, పరమునందును పుణ్యకాలముం డును. కాని గ్రహణములయం దట్లు ఉండనేరదు.

యావాన్ కాలః పర్వణోఽన్తే తావాన్ ప్రతిపదాదిమః।
రవీందుగ్రహణాఽనేహాః సపుణ్యో మిశ్రణాద్భవేత్॥ ఇత్యాది

బ్రహ్మసిద్ధాన్త వచనములు: పర్వములయొక్క అంతిమ భాగము స్పర్శకాలము, ప్రతిపత్తులయొక్క ఆదిమభాగము మోక్ష కాలము అనియు, యెంతకాలము స్పర్శకాలమో అంతకాలము మోక్షకాలము అనియు, స్పర్శము మొదలు ముక్త్యన్తమువరకు గల గ్రహణదర్శనకాలము పుణ్యకాలము అనియు చెప్పుచున్నవి.

అట్టి గ్రహణ పుణ్యకాలమునందు ప్రారంభమున స్నాన మును, మధ్యకాలమున జపమును, హోమమును, దేవతార్చన మును, ముక్తిమూలమున దానమును, శ్రాద్ధాదులను, ముక్త్యంత మున సచేలస్నానమును చేయవలెను.

 గ్రహణములయందు ఆదికాలమున విహితములగు

కృత్యములకు లక్షగుణితము ఫలము అనియు, మధ్యకాలమున విహితములగు కృత్యములకు కోటిగుణితమగు ఫలము అనియు, ముక్తి మూలమున విహితములగు కృత్యములకు అనంతమగు ఫలము అనియు పురాణములు చెప్పుచున్నవి.

ఆశౌచం జాయతే నృణాం గ్రహణే చంద్రసూర్యయోః।
రాహుస్పర్శే తతస్స్నాత్వా దానాదౌ కల్పతే నరః॥

అని శాస్త్రములు చెప్పుటచేత చంద్రసూర్య గ్రహణములయందు మానవులకు ఆశౌచము సంభవించును. సంభవించినను స్నానముచేసి సద్యశ్శుద్ధికలవారలై దానాదుల కర్తలగుచున్నారు.

గ్రహణకాలమునందుచేయు శ్రాద్ధము హిరణ్యశ్రాద్ధముగా తెలియతగియున్నది.

అన్నాభావే ద్విజాభావే ప్రవాసే పుత్రజన్మని।
హేమశ్రాద్ధం ప్రకుర్వీత చంద్రసూర్యగ్రహే తథా॥

తా॥ అన్నము లభించనప్పుడుగాని, బ్రాహ్మణుడు లభించనప్పుడుగాని, ప్రవాసమందుగాని (పరదేశవాసమందుగాని), పుత్రజననమందుగాని, చంద్ర సూర్యగ్రహణములయందుగాని హిరణ్యశ్రాద్ధము చేయనగును. హిరణ్యశ్రాద్ధము యథాలాభముగా ఆమశ్రాద్ధమువలె వేయవలయును.

గ్రహణకాలమునందు నిదురపోరాదు. భోజనముచేయరాదు. గ్రహణమునకు పూర్వము పక్వమైన అన్నము సూతకాన్నమగుటచేత గ్రహణానన్తరము ఆ అన్నమును భుజించరాదు. ఉష్ణోదకస్నానము చేయరాదు. పగటిభాగమున చంద్రగ్రహణములు

కలుగుచున్నను, రాత్రిభాగమున సూర్యగ్రహణములు కలుగుచున్నను ఆ గ్రహణకాలములయందు స్నాన, దాన, జపాదికములు చేయనవసరములేదు.

చంద్ర సూర్యగ్రహణములు మేఘములచేత ఆవరింపబడి చాక్షుషదర్శనయోగ్యములు కానప్పుడు శాస్త్రములచేత గ్రహణములయందుస్పర్శకాలములను, ముక్త్యస్తకాలములను తెలుసుకొని ఆపుణ్యకాలములందు యథావిధిగా స్నాన, జప, హోమ, సురార్చన, దాన, శ్రాద్ధాదికముల నాచరించవలయును.

గ్రహణములు: గ్రస్తాస్తమయమగు తరి చంద్రగ్రహణమునందుకాని, సూర్యగ్రహణమునందుకాని చాక్షుషదర్శన యోగ్యకాలమే పుణ్యకాలముగా భావించి ఆ పుణ్యకాలముననే పుణ్యకాలకృత్యములను చేయవలెను. చాక్షుషదర్శన యోగ్యముకాని కాలము పుణ్యకాలము కానేరదు.

చంద్రగ్రహణమునందుగల క్షణముకాని, సూర్యగ్రహణమునందుగల క్షణముకాని, వ్యతీపాతయోగక్షణమగు నెడల ఆ సమయము ''గజచ్ఛాయా'' అను పుణ్యకాలమగుచున్నది. ఆ గజచ్ఛాయయందు పితృదేవతలకు దత్తమగునది అక్షయమై పితృదేవతలను పరితృప్తులను చేయుచున్నది.

సోమవారము చంద్రగ్రహణముగాని, ఆదిత్యవారము సూర్యగ్రహణముగాని జరిగిన యెడల అది ''చూడామణి'' యోగమగుచున్నది. ఆ చూడామణియోగమునందు చేసిన స్నాన, దాన, శ్రాద్ధాదులు ఇతర వారములలో జరిగిన చంద్ర సూర్యగ్రహణాదులయందు చేసిన స్నాన, దాన, శ్రాద్ధాదులవలన లభించు ఫలములకు కోటిగుణితములగు ఫలములను

కలుగజేయుచున్నవి అని వ్యాసులవారు చెప్పుచున్నారు.

దేవాలయ విషయములో ఈ ఉపరాగాదులను దుర్నిమిత్తములలోచేర్చి, ఆగమశాస్త్రములు శాన్తులను చేయవలయునని చెప్పుచున్నవి.

వివరణము: మానవుల యొక్క పాపబాహుళ్యము వలనను అపరాధబాహుళ్యమువలనను దేవతలు అద్భుతములను సృజించెదరు.

అద్భుతములు: దివ్యములు, అంతరిక్షములు, భౌమములు అని మూడు తెరంగులుగానున్నవి.

సర్వగ్రాసోపరాగము (అనగా పూర్ణ చంద్రగ్రహణము, పూర్ణ సూర్యగ్రహణము) అనావృష్టి, అతివృష్టి, అకాలవృష్టి మొదలగునవి. దివ్యములగు అద్భుతములు. ప్రతిసూర్య, ప్రతి చంద్ర, ప్రతినక్షత్రాదులు అంతరిక్షములగు అద్భుతములు. ఈ దివ్యాద్భుతములకు, అంతరిక్షాద్భుతములకు చికిత్స యేమియు లేదు. అద్భుతశాన్తి మొదలగు శాన్తులు చేయవలసియున్నవి.

అద్భుతశాన్తి: అనగా దేవాలయాభిముఖమునందు యజ్ఞశాలను, అందు నవకుండములను నిర్మించి కుంభసంస్కారము చేసి నవగ్రహహోమములు, బిల్వపత్రసహస్రహోమములు, అష్టాక్షరసహస్రహోమములు మొదలగు శాన్తిహోమములను సప్తాహము ప్రతినిత్యము చేయుట.

ఇట్లుగా దుర్నిమిత్తముల ననుసరించి శాన్తులను, శీతకుంభాదులను చేయవలెను.

పూర్ణసూర్యగ్రహణమునందును, పూర్ణచంద్రగ్రహణము

నందును ఇతరములగు అల్పగ్రాస, అర్ధగ్రాస, పాదగ్రాస, త్రిపాదగ్రాసాది గ్రహణములయందును గ్రహణప్రయుక్త దోషముతోకూడిన యామములయందు దేవాలయముయొక్క కవాటబంధము చేయవలయును. గ్రహణానన్తరము దేవాలయము శుద్ధి, శ్రీస్వామివారికి పంచామృతాభిషేకాదులు చేయవలెను.

అన్ని దేవాలయములయందు గ్రహణప్రయుక్త దోషముతో కూడిన యామములయందు దేవాలయములయొక్క కవాట బంధమువేయుటయు, గ్రహణానంతరము దేవాలయ శుద్ధిచేయు టయు, శ్రీస్వామివారికి అచ్చటి సంప్రదాయానుసారముగా అభిషేకములను చేయుటయు ఆచారముగా యున్నది.

## 209. శ్రీలక్ష్మీజయన్తి:

ఫాల్గునమాసమున ఉత్తరఫల్గునీ నక్షత్రమునందు లోకాను గ్రహార్థమై శ్రీలక్ష్మీదేవి పాదుర్భావము నొందెను.

అందుచే ఆ ఉత్తరఫల్గునీ నక్షత్రమునందు బ్రహ్మశ్రీకాము లైనవారు, రాజశ్రీకాములైనవారు శ్రీలక్ష్మీజయన్తి అనుపేరుతో శ్రీదేవిని చతుర్విధమగు సమారాధనముచే నారాధించుచున్నారు. ఈ పూజను ఉత్తరఫల్గునీపూజయనికూడ వ్యవహరించుచున్నారు.

వివరణము:-

సమారాధనము - జపము, హుతము, అర్చనము, ధ్యానము అని నాలుగు విధములుగా నున్నది.

పద్మనాభప్రియయగు శ్రీదేవియొక్క ధ్యేయస్వరూపము ''పద్మాలయా, పద్మాసనా, పద్మాననా, పద్మనయనా,

పద్మప్రియా, పద్మహస్తా, పద్మపాదా, పద్మవర్ణా, పద్మమాలా ధరా, పద్మప్రభా, పద్మగంధినీ, పద్మినీ, పద్మసుందరీ, సుకేశీ, సుభ్రూలతా, సుదంతోష్ఠీ, సువర్ణకుంభస్తనీ, సుప్రభా భాసమానా, సువర్ణప్రాకారా, సర్వాభరణభూషితా, శుక్లాంబర ధరా'' ఈ విధముగా నుండునని సంహితలు, పురాణములు చెప్పుచున్నవి.

శ్రీకాములైనవారు నియమానుష్ఠానపరులై ఇట్లు శ్రీధ్యేయ స్వరూపమును బుద్ధిస్థముగా చేసుకుని శ్రీదేవిని చతుర్విధమగు సమారాధనముచే నారాధించవలయును.

1. జపము- శ్రీసూక్తమును, ఏకాక్షర, చతురక్షరాది మహామంత్రములను యథాభిరుచి లక్షసంఖ్యాకముగా జపమును చేయవలయును.

2. హుతము - శ్రీసూక్తముచేతను, ఏకాక్షర, చతురక్షరాది మహామంత్రములచేతను యథాభిరుచి కమలములను, బిల్వఫలములను పౌండరీకాగ్నియందు లక్షసంఖ్యాకముగా హోమమును చేయవలయును.

3. అర్చనము - ధ్యేయస్వరూపముతో ప్రకాశించుచు ప్రతిమా రూపముగాయున్న శ్రీదేవిని, శ్రీసూక్తముచేతను, ఏకాక్షర,చతురక్షరాది మహామంత్రములచేతను యథాభిరుచి కమలములచేతను, బిల్వదళములచేతను లక్షసంఖ్యాకముగా పూజను చేయవలయును.

బ్రహ్మశ్రీకాములైనవారు కమలములచేతను, రాజశ్రీకాములైనవారు బిల్వఫలములచేతను, బిల్వదళములచేతను హోమ పూజనములను చేయవలయును.

4. ధ్యానము - ధ్యేయస్వరూపమును తదేకతానతతో ధ్యానించుచూ యథాశక్తి ఆ ధ్యానములో నిమగ్నులైయుండవలయును. తదేకతానత అనగా (విజాతీయ ప్రత్యయాన్తరిత సజాతీయ ప్రత్యయ ప్రవాహము), ఇతర విషయముల కవకాశమివ్వక ధ్యేయస్వరూపమును మాత్రమే విషయీకరించుచున్న స్మృతిప్రవాహము - అని తాత్పర్యము.

ఇటుల చతుర్విధమగు సమారాధనమును చేయుటవలన కరుణాయత్తచిత్తయై జగన్మాతయగు శ్రీదేవి బ్రహ్మశ్రీకాములైన వారలకు సర్వక్రతుసిద్ధిని అణిమాద్యష్టైశ్వర్యసిద్ధిని, రాజశ్రీకాములైనవారలకు ధనధాన్యరాజ్యాదిసర్వసంపదలను కలుగజేయును.

అధిక విషయములు సంహితలయందు తెలియనగును.

## 210. మీన సంక్రమణము:

సూర్యుడు మేషాది ద్వాదశరాశులలో పండ్రెండవదియగు మీనరాశియందు ప్రవేశించుసమయము. ఈ సమయమునకు పరమునందు 16 ఘడియలకాలము అనగా గం 6-24 నిమిషముల కాలము. షడశీతి పుణ్యకాలము. ఈ పుణ్యకాలమున స్నాన, దాన, ధర్మములు చేయతగియున్నవి.

ఈ మాసమును మీనమాసమనియు, పంగుని నెల అనియు వ్యవహరించుచున్నారు.

## 211. మహానదీపుష్కరములు:

గురువు మేషాది ద్వాదశరాశులలో ఒక్కొక్కరాశిలో

ప్రవేశించుసమయమున ద్వాదశ మహానదులలో ఒక్కొక్క మహా నదికి పుష్కరము ప్రారంభమగును.

ఆ పుష్కరసమయమున త్రైలోక్యవిశ్రుతములగు మూడుకోట్ల యేబదిలక్షల పుణ్యతీర్థములు ఆ నదియందు సాన్నిధ్యమును చేయును.

అందుచే కర్మఠులైనవారు పుణ్యాభిలాషకలవారు అందరు ఆ నదీతీరమునకు వచ్చి నదీస్నానములు, శ్రాద్ధములు, దానములు, ధర్మములు చేయుచుందురు.

గురువు ఆ రాశియందున్న కాలము ఆ నదీపుష్కరమై నను ప్రవేశించినదాదిగా ఆదిపుష్కరమని పండ్రెండుదినములు, చివర భాగమున అంత్యపుష్కరమని పండ్రెండుదినములు విశేష ముగా ఆ నదీతీరమున కర్మలను, ధర్మములను, దానములను ఆచరించెదరు.

## మహానదీ పుష్కర వివరణము

గురువు–మేషరాశియందుండగా గంగామహానదీ పుష్కరము

గురువు వృషభరాశియందుండగా నర్మదామహానదీ పుష్కరము

గురువు మిథునరాశియందుండగా సరస్వతీమహానదీ పుష్కరము

గురువు కటకరాశియందుండగా యమునామహానదీ పుష్కరము

గురువు సింహరాశియందుండగా గోదావరీ మహానదీ పుష్కరము

గురువు కన్యారాశియందుండగా కృష్ణామహానదీ పుష్కరము

గురువు తులారాశియందుండగా కావేరీ మహానదీ పుష్కరము

గురువు వృశ్చికరాశియందుండగా భీమరథీ మహానదీ పుష్కరము

గురువు ధనూరాశియందుండగా పుష్కరవాహినీ మహానదీ పుష్కరము

గురువు మకరరాశియందుండగా తుంగభద్రా మహానదీ పుష్కరము

గురువు కుంభరాశియందుండగా సింధుమహానదీ పుష్కరము

గురువు మీనరాశియందుండగా ప్రణీతామహానదీ పుష్కరము.

ఇట్లు గురుసంచారముచే మహానదీపుష్కరము లేర్పడును.

## 212. తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవము:

శ్రీ వైఖానసశాస్త్రప్రకారము నవాహ్నికముగా జరుగును.

మీనమాసమునందు మృగశీర్షనక్షత్రమున శ్రీవారి అవభృథమును నిశ్చయించి ఆ దినముతో గూడిన తొమ్మిదవ దినమునందు పూర్వముగా ధ్వజారోహణము జరుగును. అందులకు పూర్వ దినమున అంకురార్పణము జరుగును.

### బ్రహ్మోత్సవ వివరణము

| | వగలు | రాత్రి |
|---|---|---|
| 1వ దినము | | సేనాధిపతి ఉత్సవము<br>అంకురారోపణము |
| 2వ దినము | తిరుచ్చి ఉత్సవము<br>ధ్వజారోహణము | పెద్ద శేష వాహనము |
| 3వ దినము | చిన్న శేష వాహనము | హంస వాహనము |

4వ దినము సింహ వాహనము - ముత్యపుపందిరి వాహనము

5వ దినము కల్పవృక్ష వాహనము - సర్వభూపాల వాహనము

6వ దినము పల్లకిలో మోహినీ అవతారోత్సవము — గరుడ వాహనము

7వ దినము హనుమద్వాహనము సాయంకాలము వసంతోత్సవము — గజ వాహనము

8వ దినము సూర్యప్రభ వాహనము - చంద్రప్రభ వాహనము

9వ దినము రథోత్సవము — అశ్వ వాహనము కల్యాణోత్సవము

10వ దినము చూర్ణోత్సవము అవభృథోత్సవము (తీర్థవారి) చక్రస్నానము — తిరుచ్చిలో ధ్వజావరోహణము ఉత్సవము

ఇటుల తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవము అతివైభవముగా జరుగును.

## 213. తుంబురుతీర్థముక్కోటి:

మీనమాసమునందు ఉత్తరఫల్గునీ నక్షత్రముతో కూడిన పూర్ణిమాపర్వమున అపరాహ్ణసమయమునందు త్రైలోక్యప్రసిద్ధము లగు మూడు కోట్ల యేబదిలక్షల పుణ్యతీర్థములు ఈ తుంబురుతీర్థమునందు సాన్నిధ్యమును చేయగలవు.

అందుచే నచ్చట తుంబురు తీర్థ ముక్కోటి అను

పేరుతో పుణ్యాభిలాషులు తీర్థస్నానములు, దానములు, ధర్మములుచేసి తిరుమల శ్రీవారిని దర్శించి తీర్థప్రసాదములు స్వీకరించి వెళ్ళుచుందురు.

## 214. శ్రీ గోవిందరాజస్వామివారి పంగున్యుత్తరం శాత్తు మొర:

''ఫాల్గునే మాసి పూర్ణాయాం ఉత్తరర్క్షేందువాసరే।
గోవిందరాజో భగవాన్ ప్రాదురాసీ న్మహామునే॥''

శ్రీగోవిందరాజస్వామివారు మీన మాసమున ఉత్తరఫల్గునీ నక్షత్రముతో కూడిన సోమవారమునందు అవతరించుటచే పంగున్యుత్తరమున శాత్తుమొర జరుగును.

ఈ దినమున శ్రీ గోవిందరాజస్వామివారు ప్రాతఃకాలారాధనము అయిన తరువాత పంగున్యుత్తరమున అవతరించిన శ్రీశాలనాచ్చియార్‌వారి సన్నిధానమునకు తిరుచ్చిలో వేంచేసెదరు. అచ్చట తాయార్లవారికి శ్రీ గోవిందరాజస్వామి వారికి అభిషేకము, నివేదనము, శాత్తుమొర, ఆస్థానము జరుగును. సాయంకాలమువరకు అచ్చటనే వేంచేసియుండెదరు. సాయంకాలము అలంకారము, నివేదనము, శాత్తుమొర, వేడుక ఆస్థానము జరిగి శ్రీగోవిందరాజస్వామివారు తాయార్లవారిని అచ్చటనే వదలి తిరుచ్చిలో సన్నిధికి వేంచేసెదరు.

పిమ్మట మామూలు మేరకు నిత్యకైంకర్యములు జరుగును.

## 215. శ్రీశాలనాచ్చియార్ శాత్తుమొర:

''ఫాల్గునే చోత్తరఫల్గున్యాం సంభూతాం శ్రియ మాశ్రయే।
విష్ణో ర్దివ్యపదాంభోజ ఘటకాం తత్పదాశ్రితామ్॥''

ఈ తాయార్లవారు మీనమాసమునందు ఉత్తర ఫల్గునీ నక్షత్రమున అవతరించిరి గాన, మీనమాసమునందు ఉత్తరఫల్గునీ నక్షత్రమున శాత్తుమొర నిశ్చయించి అందులకు యేడు దినములు ముందుగా ఉత్సవము ప్రారంభించి ప్రతిదినము ఉత్సవము చేయుచు యేడవ దినమున ఉత్తరఫల్గునీ నక్షత్రమున శాత్తుమొర జరుపుదురు.

విశేషమేమన - దేవదేవుడైన శ్రీగోవిందరాజస్వామివారు శ్రీశాలనాచ్చియార్లవారు పంగునిమాసమున ఉత్తరఫల్గునీ నక్షత్రమునందు అవతారమునొందుటచే శ్రీగోవిందరాజ స్వామివారు శ్రీశాలనాచ్చియార్లవారి సన్నిధానమునకు వేంచేసెదరు.

అచ్చట పురాణదంపతులైన శ్రీపుండరీకవల్లీ, శ్రీగోవింద రాజ దివ్యదంపతులకు అభిషేకము, అలంకారము, నివేదనము, శాత్తుమొర, ఉత్సవము, వేడుకలు, ఆస్థానము అతివైభవముగా జరుగును.

శ్రీగోవిందరాజస్వామివారు, శ్రీపుండరీకవల్లీతాయార్లవారు ఫాల్గుణమాసమునందు ఉత్తరఫల్గునీ నక్షత్రమున అవతరించిరని ప్రమాణములు చెప్పుచున్నవి. సౌరమాన ప్రకారము మీన మాసమునందు ఉత్తరఫల్గునీ నక్షత్రమున పంగున్యుత్తరం అను పేరుతో శాత్తుమొరలు చేయుచున్నారు.

## 216. నాగులాపురం శ్రీవేదనారాయణస్వామివారి సన్నిధానమున సూర్యసేవామహోత్సవము, ప్లవ (తెప్ప) ఉత్సవము:

మీన మాసమునందు 12, 13, 14 తేదీలలో

సాయంకాలము 5 గంటలకుపైన సహస్రకరుడగు సూర్యుడు శ్రీ స్వామివారిని పూజించును. సూర్యపూజానన్తరము శ్రీవారు ప్లవోత్సవమునకుగాను పద్మాకరమునకు వేంచేయుదురు. తెప్ప ఉత్సవములు మూడు దినములు జరుగును.

శ్రీసూర్యసేవా వివరణము:-

అఖిల జగత్ప్రభువై వేదవేద్యుడగు శ్రీమన్నారాయణుడు, అస్మదాదుల నుద్ధరించుటకు నిత్యవిభూతిలోని శ్రీవైకుంఠము నందలి శేషశయ్యనువీడి ఈ లీలావిభూతిలోని (శేషపురము నందు) నాగులపురమునందు వేదనారాయణుడుగా అర్చా రూపమున అవతరించెను.

ఇది ఐతిహ్యవేత్త లెరుగని విషయము కానేరదు.

సర్వ నియన్తయగు నా విశ్వప్రభువుచే బ్రహ్మాండ ప్రకాశమునకు నియమింపబడిన సూర్యుడు "భీషోదేతి సూర్యః" అను శ్రుతి శాసనప్రకారము భయకంపితుడై ప్రతిదినము ఉదయించి బ్రహ్మాండమును ప్రకాశింపచేయుచున్నాడు.

ఆ సూర్య దేవత సంవత్సరాన్తమగు మీనమాసమునందు 12, 13, 14 తేదీలలో లోకప్రకాశ మొనరింప నుదయించి తనకు నియన్తయై లోక పర్యవేక్షణమునకు వేంచేసియున్న శ్రీవేదనారాయణ మహాప్రభువును సేవింప ప్రతిదినము సాయంకాలము 5 గం.పైగా తొమ్మిది ద్వారములనుదాటి శ్రీవారి గర్భాలయమును ప్రవేశించును.

మొదటిదినమున తన సహస్రకరములచే శ్రీవారి పాదారవిందములను భక్తితో స్పృశించు(ప్రణమిల్లు)చున్నాడు.

రెండవదినమున శ్రీవారి నాభికమల ప్రకాశన కైంకర్యము చేయుచున్నాడు.

మూడవదినమున శ్రీవారి ముఖారవింద సౌందర్యమును సేవించి కృతార్థుడై తనకు నియమితమగు లోకాన్తర ప్రకాశనమునకు వెళ్లుచున్నాడు.

ఇటుల జగద్వందనీయుడగు సూర్యదేవత శ్రీవారికి చేయు సేవాసమయముల దర్శనమును మహాపుణ్యకోటికి పేటికలుగా భావించి భక్తకోటులు తండోపతండములుగా ఆలయప్రాంగణము నావరించుచున్నారు.

దర్శనకాంక్షులగు వారలకు వాత్సల్యాతిరేకముచే నిరాబాధముగా దర్శనమీయ తలంచి తమ ఆలయప్రాంగణ పురోభాగమునగల పుష్కరిణియందు ఆనందసామ్రాజ్యానుభవ నిదానమగు జలవిహారమునకు పట్టమహిషులతో శ్రీ వేదనారాయణ స్వామివారు ప్లవా(తెప్ప)ధిరూఢులగుచున్నారు ఆశ్చర్యము.

అఖిలజగత్ప్రభువు నిత్యవిభూతిలోని ఐరమ్మద సరోవిహారమును వదలి ఈ లీలావిభూతిలోని శేషపురమున (నాగుల పురమున) గల పుష్కరిణిలోని జలవిహారమును ప్రేమించుట అస్మదాదుల అనేక పూర్వజన్మ సహస్రసమార్జిత పుణ్య పరంపరల అమేయ రాశి యనక తప్పదు.

ఇటుల సూర్యదేవత శ్రీవారిని సేవించు సమయమున భక్తజన సమూహములు తమ పుత్రమిత్రాది పరివారములతో వచ్చి శేషపురాధీశులగు శ్రీ వేదనారాయణస్వామివారి జల విహార మహావైభవమును, అతివిస్మయనీయమగు సహస్రకర

కైంకర్యమును కరువుతీర కన్నులారకాంచి పుణ్యపరంపరా పేటి కల నార్జించి శ్రీవారి కృపాపాత్రులగుచున్నారు.

## 217. తిరుపతి శ్రీకోదండరామస్వామివారికి పూలంగి ఉత్సవము:

ప్రతిమాసము అమావాస్య పర్వదినమునందు స్థానకములో వేంచేసియున్న శ్రీ సీతారామలక్ష్మణులకు అతి వైభవముగా పూలంగి మహోత్సవము జరుగును.

## 218. తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారికి పూలంగి ఉత్సవము:

మీనమాసమునందుగల పూర్ణిమాపర్వదినమున శయనబే-రముగా వేంచేసియున్న శ్రీ గోవిందరాజస్వామివారికి పూలంగి ఉత్సవము అతివైభవముగా జరుగును.

## 219. శ్రీకృష్ణస్వామివారికి రోహిణీనక్షత్రాస్థానము:

ప్రతి రోహిణీనక్షత్రమునందును సాయంకాలము శ్రీ రుక్మిణీ దేవీసమేతుడైన శ్రీకృష్ణస్వామివారికి (తిరుమలలో) చతుర్వీథులయందును ఉత్సవము జరిగి శ్రీవారి బంగారు వాకిలి ముందు గల ఆస్థానమండపమునందు ఆస్థానము జరుగును.

## 220. శ్రీస్వామివారికి ఆర్ద్రా నక్షత్రాస్థానము:

ప్రతి ఆర్ద్రా నక్షత్రమునందును సాయంకాలము శ్రీభూదేవీ సమేతుడైన శ్రీ మలయప్పస్వామివారికి, ఆర్ద్రా

నక్షత్రసంభూతులగు శ్రీ భాష్యకారులవారితోసహా చతుర్వీథుల యందు ఉత్సవము జరిగి శ్రీభాష్యకారులవారి ముఖమండపమున ఆస్థానముజరుగును.

## 221. శ్రీరామస్వామివారికి పునర్వసు నక్షత్రాస్థానము:

ప్రతి పునర్వసు నక్షత్రమునందును సాయంకాలము శ్రీ సీతాలక్ష్మణసమేతుడైన శ్రీ కోదండరామస్వామివారికి, వారికి ప్రేమ పాత్రమగు శ్రీ ఆంజనేయస్వామి వారితో సహా చతుర్వీథులయందు ఉత్సవము జరిగి శ్రీవారి బంగారువాకిలి ముందు గల ఆస్థానమండపమునందు ఆస్థానము జరుగును.

## 222. శ్రీ స్వామివారికి శ్రవణనక్షత్రాస్థానము:

ప్రతి శ్రవణనక్షత్రమునందును సాయంకాలము పట్ట మహిషులగు శ్రీభూదేవులతోసహా శ్రీమలయప్పస్వామివారికి బంగారు తిరుచ్చిలో చతుర్వీథులయందు ఉత్సవముజరిగి శ్రీవారి బంగారు వాకిలిముందు గల ఆస్థానమండపమునందు అతివైభవముగా ఆస్థానము జరుగును.

## 223. తిరుమల శ్రీస్వామివారికి ప్లవ (తెప్ప) ఉత్సవము:

(ప్రతి మంగళవారము జరుగును)

శ్రీస్వామివారికి పంచాహ్నికమగు ప్లవోత్సవము వార్షికముగా జరుగుచున్నను ప్రతి మంగళవారము కూడా ప్లవోత్సవము జరుగుట నూతనముగా ఏర్పాటుచేయబడినది.

ఆ దినమున శ్రీ మలయప్పస్వామివారు సాయంకాలము పట్టమహిషులతోసహా డోలావిహారము పూర్తి అయిన పిమ్మట డోలా విహారసంజనిత శ్రమాపనోదనార్థమో యనునటుల పుణ్యజల పరిపూర్ణమగు శ్రీస్వామి పుష్కరిణియందు వివిధ వర్ణ విభూషితమై విద్యుద్దీపశతవిభాసితమై విచిత్రసంనివేశముకల ప్లవమును (తెప్పను) అధిష్ఠించెదరు.

అంత "భీషాఽస్మాద్వాతః పవతే" అను వేదశాసన ప్రకారము శ్రీస్వామి సేవాభయకంపితుడైన వాయువు మందశీత వాతపోతరూపముగా విసరుచుండ, వేదములు వైభవమును స్తుతించుచుండ, మృదుల మధుర వాదన గానములు శ్రవణపేయములగుచుండ శ్రీ స్వామివారు పట్టమహిషులగు శ్రీభూదేవులతో ఆ పుష్కరిణియందు శాంతిపాఠమువలె మూడు పర్యాయములు ప్లవముతో (తెప్పతో) విహరించెదరు.

అంతట శ్రమకు శాన్తి చెప్పెదరు. విహారము పూర్తి అగును. అర్చకులు ప్లవవిహారసంతుష్టులగు శ్రీభూదేవులకు శ్రీస్వామి వారికి యథోచితములగు ఉపచారములనర్పించి మధుర పదార్థనివేదనముచేసి హారతి మొదలగు కైంకర్యములను చేయుదురు.

యజమానునకు శఠారి, ప్రసాదము, వస్త్రబహుమానము జరుగును. శ్రీస్వామివారు ఆ యజమానునకు తమ సువర్ణ ప్రతిమను అనుగ్రహించెదరు. యజమానుడు తన అమేయాదృష్టరాశిని స్మరించుకొనును.

శ్రీలక్ష్మీవేంకటేశ దివ్యదంపతుల సువర్ణప్రతిమా పూజాభిలాషగల భక్తులకు ఈ మహోత్సవము కూడా అనంత

ఫలసాధకమై యజమానుని కృతార్థుని చేయును.

పిమ్మట శ్రీస్వామివారు పట్టమహిషులతోసహా బంగారు తిరుచ్చి నధిష్ఠించి మహారాజమర్యాదలతో సన్నిధికి వేంచేయుదురు.

భక్తుల కపూర్వసందర్శన లాభమును, అపూర్వానంద లాభమును కలుగును.

## 224. శ్రీస్వామివారికి పూలంగి ఉత్సవము:

(ప్రతి గురువారము జరుగును.)

శ్రీవేంకటేశ్వరస్వామివారు ఆ దినమున సాయంకాలారాధనమునందు చిత్తహరములగు విచిత్రములైన వివిధపుష్పమాలల చేత పూలంగిని ధరించి, జగదేకనియన్తృతా స్ఫోరకమగు సూర్యకటారిని వామహస్తముచే పరిగ్రహించి, అఖిలభువనైక చక్రవర్తిగా అదృష్టవంతులకు దర్శనమిచ్చెదరు.

భక్తులు జగన్నియన్తృతాస్వరూపమును ప్రత్యక్షీకరించుకొనుచూ ఆనందసముద్రములో మునుగుచూ తేలుచూ యుందురు.

## 225. శ్రీస్వామివారికి అభిషేకమహోత్సవము:

(ప్రతి శుక్రవారము జరుగును.)

ఆ దినమున శ్రీ వేంకటేశ్వరస్వామివారికి ప్రాతఃకాలారాధనము పూర్తి అయిన పిమ్మట జన్మాన్తరసహస్రములయందు ఆర్జించిన పుణ్యపరిపూర్ణ పేటికలుకల భక్తకోటికి శరణ్య

దంపతులగు శ్రీలక్ష్మీవేంకటేశ దివ్యదంపతుల దివ్యస్వరూపసందర్శన లాభమును కలుగజేసెడు అభిషేకమహోత్సవము అతివైభవముగా జరుగును. అట్టి అదృష్టవంతులు కన్నులకరువుతీర పురాణదంపతులను దర్శించెదరు.

## 226. శ్రీస్వామివారికి ప్రభుత్వోత్సవము:

(ప్రతిదినము జరుగును.)

ప్రతిదినవము ప్రాతఃకాలారాధన సమయములో (కొలువు) శ్రీనివాసస్వామివారు సువర్ణఛత్రచామరాది మహారాజమర్యాదలతో సర్వపరివారసమలంకృతమై ఆర్త, ప్రపన్నజనముతో క్రిక్కిరిసియున్న ఆస్థానమండపమునకు వేంచేసి సింహాసనము నధిష్ఠించెదరు.

అంతట శ్రీనివాసమహాప్రభువు మాత్రాదానమును, చతుర్వేద శ్రవణమును, పురాణేతిహాసాది శ్రవణమును, పంచాంగశ్రవణమును, ఆదాయ, వ్యయ శ్రవణమును చేసెదరు. పిమ్మట శ్రీస్వామివారు తమ విశ్వపతిత్వమును, ఆత్మేశ్వరత్వమును భక్తులు సాక్షాత్కరించుకొనుచుండ సన్నిధికి వేంచేయుదురు.

## 227. శ్రీస్వామివారికి కళ్యాణోత్సవము:

(ప్రతిదినము జరుగును.)

శ్రీ స్వామివారికి ప్రతిదినము మాధ్యాహ్నికారాధనమైన పిమ్మట శ్రీమలయప్పస్వామివారు పట్టమహిషులగు శ్రీభూదేవులతోసహా బంగారుతిరుచ్చి నధిష్ఠించి మహారాజమర్యాదలతో

మంగళవాద్యములతో నిత్యకల్యాణమండపముగా భాసిల్లు రంగ మండపమునకు వేంచేయుదురు.

అచ్చట శ్రీ స్వామివారు లోకకల్యాణార్థమై తాము కల్యాణమును స్వీకరించి కల్యాణభాసురమూర్తులుగానై భక్త కోటికి దర్శనమిచ్చెదరు. భక్తులా కల్యాణసమయములో కల్యాణదంపతులగు పురాణదంపతులను దర్శించి అనేక కల్యాణములను (శుభములను) పొందకలుగుచున్నారు.

## 228. శ్రీ స్వామివారికి దర్పణభవనములో (అద్దముల మహల్‌లో) డోలోత్సవము (ఊంజలిసేవ):

(ప్రతిదినము జరుగును.)

శ్రీస్వామివారికి వార్షికమగు నవాహ్నిక బ్రహ్మోత్సవములో అవకాశముగల దినములయందు డోలోత్సవము జరుగుచున్నను దర్పణభవనములో ప్రతిదినము కూడా డోలోత్సవము జరుగుట నూతనముగా యేర్పాటుచేయబడినది.

ప్రతిదినము సాయంకాలము శ్రీమలయప్పస్వామివారు పట్టమహిషులతోసహా విలాసముగా డోలావిహారము చేయుటకు రంగమండపమునుంచి బంగారు తిరుచ్చినధిష్ఠించి మహారాజ మర్యాదలతో దర్పణభవనమునకు వేంచేయుదురు.

తనలో ప్రవేశించిన వారలను వారల ప్రతిబింబ సహస్రప్రదర్శనముచేసి విభ్రాన్త చిత్తులనుగాచేయుచూ విద్యుద్దీపసహస్రములచే ప్రకాశించు నాదర్పణభవనమందుకల డోలామండపములో సన్నద్ధమైయున్న బంగారుడోల (ఉయ్యాల) నధిష్ఠించెదరు.

వేదపఠనములు, దివ్యప్రబంధగానములు శ్రవణాతిథ్యము నొందుచుండ పట్టమహిషులతో శ్రీస్వామివారు డోలా విహార మును చేయుదురు. లక్ష్మీవినోదముతో డోలావిహారము పూర్తి అగును. పిమ్మట బంగారుతిరుచ్చి నధిష్ఠించి మహారాజమర్యాద లతో సన్నిధికి వేంచేయుదురు. భక్తులనేకవిధములగు ఆనందముల ననుభవించుచు మైమరచియుందురు.

అధిక విషయములు ఉత్సవభాగములో చూడవలెను.

## 229. శ్రీ స్వామివారికి ఏకాంతోత్సవము:

(ప్రతిదినము జరుగును.)

ప్రతిదినము శ్రీ స్వామివారికి సాయంకాలారాధనాన్తము నందు శ్రీభోగశ్రీనివాసస్వామివారు వివిధమధురభోగ్యఫలాదుల నారగించి చందనచర్చితులై ముఖవాసమును (తాంబూలమును) స్వీకరించి ముఖభవనములో సన్నద్ధపరచిన బంగారు మంచము నందలి మృదులశయ్యయందు వేంచేయుదురు.

సువాసనలు ఘుమ్ముఘుమ్మని ఘ్రాణతర్పణము చేయు చుండ మృదులమధురవీణాది గానములు శ్రవణముల కాతిథ్యమునిచ్చుచుండ దివాసంజనిత శ్రమాపనోదనార్థము శ్రీస్వామివారు ఏకాన్తముగా శయనించెదరు. భక్తులకు కించిత్కాలము దర్శనమిచ్చెదరు.

## 230. శరణ్యదంపతులగు శ్రీలక్ష్మీ వేంకటేశ్వర దివ్యదంపతులకు నామమంత్ర పూజా:

(ప్రతిదినము త్రికాలములయందు జరుగును.)

వివరణము:- సర్వబ్రహ్మాండనియన్తయై సర్వరక్షకుడైన శ్రీ వేంకటేశ్వరస్వామివారిని సురజ్యేష్ఠుడగు బ్రహ్మదేవుడు శ్రద్ధా భక్తియుక్తుడై సహస్రనామములచేత, కమలములతో పూజించెను. అని బ్రహ్మాండపురాణము చెప్పుచున్నది.

ప్రణవ నమస్సంపుటీకృతములై బ్రహ్మాండపురాణోక్తము లగు ఆ దివ్యసహస్ర నామ మంత్రములచేత శ్రీవేంకటేశ్వర స్వామివారికి పుష్పములతో ప్రతిప్రాతఃకాలమునందును పూజజరు గును.

అపార కృపాసముద్రుడగు శ్రీవేంకటేశ్వరస్వామివారిని లోకపితామహుడగు బ్రహ్మదేవుడు స్వర్గనదీసంభూతములగు సువర్ణ పద్మములతో శ్రీ వేంకటేశపదాంకితములగు అష్టోత్తరశతనా మములచేత పూజించెను. అని వరాహపురాణము చెప్పుచున్నది.

ప్రణవ నమస్సంపుటీకృతములై వరాహపురాణోక్తములగు శ్రీవేంకటేశపదాంకితములైన ఆ అష్టోత్తరశత దివ్యనామమంత్రము లచేత శ్రీవేంకటేశ్వరస్వామివారికి ప్రతిమధ్యాహ్నకాలమునందును పుష్పములతో పూజ జరుగును.

అశేష లోక శరణ్యుడగు శ్రీ వేంకటేశ్వరస్వామివారికి మధ్యాహ్నకాలమునందువలె అష్టోత్తరశత దివ్యనామమంత్రములచేత పుష్పములతో ప్రతిసాయంకాలము పూజ జరుగును.

అఖిలజగన్మాతయై దేవదేవదివ్యమహిషియై అశరణ్యశరణ్య యగు శ్రీదేవిని ఇంద్రాది దేవతలెల్లరు కృతాంజలిపుటులై గాయత్ర్యర్ధసమసంఖ్యాకములగు చతుర్వింశతినామములచేత స్తుతించిరి - అని వరాహపురాణము చెప్పుచున్నది.

ప్రణవ నమస్సంపుటీకృతములై వరాహపురాణోక్తములగు ఆ చతుర్వింశతి దివ్యనామమంత్రములచేత శ్రీస్వామివారి దివ్య పాదారవిందములయందు పూజింపబడియున్న పుష్పములతో శ్రీలక్ష్మి అమ్మవారికి త్రికాలములయందును పూజ జరుగును.

''శ్రియఃకాన్తాయ కల్యాణనిధయే నిధయేఽర్థినామ్।
శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్॥''

ఓమ్

# శ్రీ వేంకటేశ్వర వైభవము

★

# 5

తిరుమల

శ్రీ వేంకటేశ్వరస్వామివారి

## ఆర్జితములు

శ్రీయైనమః

శ్రీ శ్రీనివాసాయనమః

# శ్రీస్వామివారి ఆర్జితములు

## ఉపోద్ఘాతము:

ఓమ్॥ మాంగల్య సూత్ర వస్త్రాది సంరక్షతి యథా వధూః।

తథా ప్రపన్న శ్శాస్త్రీయ పతికైంకర్య పద్ధతిమ్॥

శ్రియఃపతియై జగత్స్వామియై పరమశేషియై చేతనసమూహముల నుజ్జీవింపచేయుటకు శేషపర్వతమునందు అర్చావతారమున వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారికి చేతనసమూహములన్నియు దాసభూతులుగాను, శేషభూతులుగాను తెలుసుకొనవలసియున్నది. తెలుసుకొనుటయే కాక తమ తాపత్రయనివృత్తికై శ్రీస్వామివారికి కైంకర్యములు చేయవలసియున్నది.

అనంతుడు సర్వేశ్వరునకు కైంకర్యమునుచేసి శేషత్వమును సంపాదించుకొని ''శేషః'' అని సర్వాతిశాయియగు బిరుదనామగౌరవముతో ప్రకాశించుచున్నాడు.

ఈనాడు కూడా సర్వేశ్వరుని కైంకర్యమును వదలకనే అర్చావతారమున వేంచేయబోవు పరమేశ్వరుని సంకల్పమును తెలుసుకొని ముందుగా నిచ్చట శేషపర్వతముగా తయారు అయి పీఠరూపముగా నా అర్చావతారమున వేంచేసియున్న పరమేశ్వరునకు కైంకర్యమును చేయుచున్నాడు.

''శ్రీవైకుంఠమునందు శ్రీస్వామివారికి నివాసముగాను, శయనముగాను, సింహాసనముగాను, పాదుకలుగాను, తలగడగాను, ఛత్రముగాను అయి సర్వదా కైంకర్యమును చేయుచున్నాడు. అటుల శేషత్వమును పొందుటచేతనే ''శేషః'' అని జనులచేత పిలువబడుచున్నాడు అని శ్రీయామునాచార్యులవారు అనంతుని స్తుతించుచున్నాడు'' అందుచే చేతనులు శ్రీస్వామివారియొక్క శేషత్వమును సంపాదించుకొనుట అవసరమైయున్నది.

జైమినిమహర్షి ''శేషః పరార్థత్వాత్'' అని సూత్రించి శేషత్వమనగా పారార్థ్యము అని చెప్పుచున్నాడు. అనగా పరునికొరకై ఉండుట అని తాత్పర్యము. అది ''నా కించిత్కుర్వత శ్శేషత్వం'' అను సిద్ధాన్తముచే కించిత్కారములేక లభించనేరదు. ఆ కించిత్కారము ఆర్జితరూపముగా శ్రీస్వామివారి కైంకర్యమును చేయించుచున్నది గాన నిచ్చట ఆర్జితము బద్ధచేతనులకు పరమ పురుషార్థ ప్రయోజకమగుచున్నది.

అందుచే ప్రతిమానవుడు ఉజ్జీవింపదలచి అచ్చటి నుండి మన కొరకు ఇచ్చటకు వేంచేసియున్న శ్రీ స్వామివారికి సౌలభ్యముగా నార్జితముల నర్పించి కైంకర్యములను చేయించిగాని, నిష్కామముగా

నార్జితముల నర్పించిగాని, కైంకర్యములను చేసిగాని, శేషత్వమును సంపాదించుకొని కృతార్థత నొందవలసియున్నది.

అట్లు కృతార్థతాప్రయోజకములగు ఆర్జితముల వివరములు ఈ క్రింద ఇవ్వబడినవి.

## ప్రత్యేక దర్శనము:

1. సుప్రభాతము: ప్రతిరోజూ ఉదయాన్నే సుప్రభాతముతో శ్రీవారి ఆలయములో నిత్యపూజాదికములు ప్రారంభింతురు. సుప్ర భాతం వేదపండితులు పఠింతురు.

2. తోమాలసేవ: సుప్రభాతము అనంతరము ప్రతిరోజూ తోమాలసేవ జరుగుచుండును.

3. అర్చన: తోమాలసేవానంతరము ప్రతిరోజూ అర్చన జరుగుచుండును.

4. ఏకాంతసేవ: సర్వదర్శనము అయిన తరువాత ప్రతిరోజూ రాత్రి ఏకాంతసేవ జరుగుచుండును.

5. నిజపాద దర్శనము: ప్రతి శుక్రవారము అభిషేకానంతరము స్వామివారి పాదములను దర్శించుకోవచ్చును.

## సేవలు

1. అభిషేకము: వక్షస్థలముపై లక్ష్మీదేవితో ఉన్న మూల విరాట్టుకు శుక్రవారము నాడు పలు సుగంధ ద్రవ్యములతో అభిషేకము వైభవోపేతముగా జరుగుతుంది. పునుగు, జవ్వాది,

కస్తూరి మొదలైన సుగంధ ద్రవ్యము లుంచిన పాత్రను భక్తులు హస్తములతో స్పర్శించిన అనంతరము అభిషేకము జరుగుచుండును.

2. వస్త్రాలంకారసేవ: ప్రతిశుక్రవారములో జరుగు అభిషేకము తరువాత స్వామివారికి వస్త్రాలంకారము జరుగుచుండును.

3. సహస్ర కలశాభిషేకము: ప్రతిబుధవారము ఉదయము సహస్రకలశములతో అభిషేకము జరుగుచుండును.

4. తిరుప్పావడ: ప్రతిగురువారము ఉదయము జరిగే ప్రత్యేక సేవ ఇది. అన్నప్రసాదములు స్వామివారికి నివేదన జరుపబడుతాయి.

5. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనము: ఇది ప్రతి సంవత్సరము ఉగాది, ఆణివార ఆస్థానము, బ్రహ్మోత్సవము, వైకుంఠఏకాదశి రోజులకు ముందుగా వచ్చే మంగళవారములలో ఉదయాన్నే జరుగుతుంది. గర్భగుడిని శుద్ధిచేసే ప్రకియ ఇది.

6. వసంతోత్సవము: ఏడాదికి ఒకమారు చైత్రమాసములో మూడు రోజులు జరుగుచుండును.

7. పవిత్రోత్సవము: శ్రీవారి నిత్యపూజానివేదనాదులలో తెలిసీతెలియక జరిగే దోషాల పరిహారార్థం జరిపే పవిత్రీకరణ. ఇది మూడు రోజులపాటు జరుగుతుంది. సాధారణముగా ఆగస్టు మాసంలో జరుపుదురు.

8. పుష్పయాగము: ప్రతిఏటా బ్రహ్మోత్సవము తరువాత వచ్చే శ్రవణనక్షత్రము రోజున పుష్పయాగము జరుగుతుంది. ఇది శ్రీవారికి పలురకాల పుష్పాలతో జరిపే అర్చన.

9. తెప్పోత్సవము: ప్రతి సంవత్సరము ఫిబ్రవరి, మార్చి నెలలో స్వామివారి పుష్కరిణిలో తెప్పోత్సవం జరుపుతారు. ఇది ఐదురోజులు జరిగే ఉత్సవము.

10. అభిధేయక అభిషేకము: జ్యేష్ఠమాసములో మూడు రోజులు జరిగే ఉత్సవము.

11. పద్మావతీపరిణయము: ఇది వైశాఖ శుక్ల నవమి, దశమి, ఏకాదశి రోజులలో జరిగే మూడురోజుల కల్యాణోత్సవము.

12. పుష్పపల్లకి: జూలైనెలలో జరిగే ఆణివారఆస్థానము రోజున సాయంత్రము శ్రీవారిని, అమ్మవారిని పుష్పపల్లకిలో ఊరేగించే ఉత్సవము.

13. కల్యాణోత్సవము: స్వామివారికి, అమ్మవారికి ప్రతిరోజూ (బ్రహ్మోత్సవము, పవిత్రోత్సవము, గ్రహణాది సమయాలలో తప్ప) భక్తులు జరిపించే ఉత్సవము కల్యాణోత్సవము.

14. బ్రహ్మోత్సవము: శ్రీనివాసుని ఉత్సవమూర్తి అనగా మలయప్పస్వామివారికి పూజ జరిపి వేదమంత్రాలతో 3 వాహనాలపై (పెద్ద శేష, గరుడ, హనుమంత) ఊరేగిస్తారు. ఇది సంక్షిప్తంగా జరిగే బ్రహ్మోత్సవం. కల్యాణోత్సవం తరువాత దీన్ని నిర్వహిస్తారు. శ్రీనివాసుని మూడు వాహనసేవలను విడివిడిగా కూడా చేయించవచ్చును.

15. డోలోత్సవము (ఊంజల్ సేవ): శ్రీదేవి, భూదేవి సమేతముగా మలయప్పస్వామివారిని అద్దాల మహలులో ఉన్న ఊయలపై వేంచేపుచేసి మంగళ వాద్యములతో వేదపారాయణముతో ఊయల ఊగించే ఉత్సవము.

16. సహస్రకలశాభిషేకము: ఐహిక, ఆముష్మిక అభ్యున్నతికై శ్రీనివాసునికి భక్తులు జరిపించే ప్రత్యేక ఆర్జిత సేవ. ఇది ఉదయకాలంలో జరిగే సేవ.

## ఇటుల పంచాంశములతో కూడిన శ్రీ వేంకటేశ్వర వైభవ ఫలితార్థము

అఖిల బ్రహ్మాణ్డకోటినియన్తయై ఆశ్రితకల్పవృక్షమై అపార కృపాసాగరుడగు శ్రీవేంకటేశ్వరస్వామివారు సర్వపురుషార్థముల నిచ్చుటకు అచలరూపుడగు శేషభూతుడైన శేషునియందు స్థానకముగా వేంచేసి యున్నారు.

శ్రీస్వామివారి వలన కామితార్థముల నందుకొనుటకై సంసార మరుకాన్తారపాంథులగు మానవులు పుణ్యశాలులైనవారు కుటుంబములతో దివ్యదేశయాత్రికులుగా తిరుమల చేరవలయును.

అచ్చట అశేషదోషనివారణసమర్థములగు శ్రీస్వామివారి పుణ్యతీర్థములయందు స్నానమాచరింపవలయును.

శ్రీస్వామివారి సందర్శన సంపాదకములగు శ్రీస్వామివారి సేవా సమయములను గుర్తించవలయును.

శ్రీస్వామివారి కైంకర్యలాభ ప్రయోజకములగు ఆర్జితములను (కానుకలను) శ్రద్ధతో శ్రీ స్వామివారికి సమర్పింపవలయును.

శ్రీస్వామివారియందు భక్తివివర్ధకములగు శ్రీవారి ఆరాధన కైంకర్యములను కన్నులారా కాంచవలయును.

శ్రీస్వామివారి ఉత్సవసమయములయందు పరమానందసంధాయకములగు ఉత్సవములను చేయించవలయును; లేదా దర్శింపవలయును.

ఇటుల పరమాదృష్టపరిపూర్ణులైన భక్తిసారులగు యాత్రికులు చతుర్విధపురుషార్థప్రదాతయై, చతుర్భుజుడై దయాసముద్రుడగు శ్రీ వేంకటేశ్వరస్వామివారిని ఆశ్రయించుటకు శ్రీ వేంకటాద్రిని చేరినది మొదలు సర్వదేశములయందు, సర్వకాలములయందు, సర్వావస్థలయందు అత్యుచితమగు అత్యన్త శేషభావమును కోరుచూ దినములను ఫలవత్తరములనుగా చేయవలయును.

ఇటుల వాసుదేవతరుచ్ఛాయలయందు విశ్రాన్తినిపొంది కృతార్థులైన యాత్రికులు నిరవధి కానంద సాగరతరంగముల నోలలాడుదురు గాక.

శ్రీస్వామివారివలన అభిమతములగు కామితముల నందుకొనుదురు గాక.

శ్రీస్వామివారి సన్నిధానమున నిత్యానందము ననుభవించుదురు గాక.

వినా వేంకటేశం న నాథో న నాథః
సదా వేంకటేశం స్మరామి స్మరామి।
హరే! వేంకటేశ! ప్రసీద ప్రసీద
ప్రియం వేంకటేశ! ప్రయచ్ఛ ప్రయచ్ఛ॥

శ్రీ లక్ష్మీ వేంకటేశార్పణమస్తు

ఓం తత్ సత్

సమాప్తము.

T.T.D. Religious Publications Series No. 229
Price Rs. 65/-

శ్రీ వేంకటేశ్వరస్వామివారి
వైభవ విశేషాలను
1. నిత్యారాధనము 2. ఉత్సవములు
3. పుణ్యతీర్థములు 4. ఉత్సవాది సమయములు
5. ఆర్జితములు అనే ఐదు అధ్యాయాల్లో
విశదీకరిస్తూవున్న విశిష్టమైన రచన ఇది!

శ్రుతి, స్మృతి, ఆగమం, పురాణం, ఇతిహాసం,
స్థలమాహాత్మ్యం, పురాతనమైన క్షేత్ర
సంప్రదాయం -- మొదలగు ఆధారాలను
చక్కగా సమన్వయించి, తి.తి.దే. ఆస్థానపండితులు,
అనుభవజ్ఞులు ఐన జగన్నాథాచార్యులవారు
మనోజ్ఞమైన శైలిలో ఈ గ్రంథాన్ని వెలయించారు!

ఈ గ్రంథం శ్రీనివాస అవతార
మహిమను వెల్లడించే " అక్షరదీపిక! "



Published by K.V. Ramanachary, I.A.S., Executive Officer,
Tirumala Tirupati Devasthanams, Tirupati and
Printed at Students Offset, Tirupati on behalf of T.T.D.